UNIVERSAL LIBRARY
OU_204152
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82 562 EK Accession No. T42217

Author శివశంకర శాస్త్రి

Title ఏకాంకికలు

This book should be returned on or before the date last marked below.

నవ్య సాహిత్య మాల

ఏకాంకికలు

గౌరవ సంపాదకులు:

శ్రీ తల్లావఝ్ఝల శివ శంకర శాస్త్రి

శ్రీ దేవులపల్లి కృష్ణ శాస్త్రి

గౌరవ సహాయ సంపాదకుడు:

శ్రీ జనమంచి కామేశ్వర రావు

సంపాదకుడు:

శ్రీ బాలాంత్రపు సత్యనారాయణ రావు

ఏకాంకికలు

శ్రీ శివశంకర శాస్త్రి

సంకలిత సంపాదితము

౧

ఆంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజార్, హైదరాబాదు

ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్
రాజమహేంద్రవరము

కాపీరైట్ సంకలితము

తొలి కూర్పు : నవంబరు ౧౯౪౩

సుజన రంజని ముద్రాశాల

రాజమహేంద్రవరము

అం కి త ము

శ్రీ నోరి నరసింహ శాస్త్రికి

కృతజ్ఞత

ఆంధ్రప్రచారిణీ పక్షమున ఆధునికకవుల పద్యములు, నాటికలు, కథలు సంకలనము చేసి క్రమంగా సంపుటాలరూపంలో ప్రకటించవలె ననే కుతూహలము సమారమి సంవత్సరము క్రిందట కలిగింది. కార్యస్థానము రామచంద్రపురమునుంచి రాజమహేంద్రవరము మార్చడములో కొన్ని మాసములు గడచిపోయినవి. సెప్టెంబరులో శ్రీ శివ శంకర శాస్త్రి గారు మాకు గౌరవసంపాదకులుగా అభ్యర్థైనప్పుడు వారితో ఈప్రస్తావన చేసినాము. శాస్త్రి గారు నెలరోజులలో పైగ్రంథములు సమకూర్చి సంస్కరించి మాకు ఇచ్చినారు.

నాటికలు నాలుగు సంపుటములుగా ప్రకటించవలె నని మాసంకల్పము. వీటిలో ఉత్తమరచనలు ౫౦ ముద్రించగల మని ఆశ.

అయిదారు సంవత్సరముల క్రిందట మదరాసునుంచి సమ్మాళ్వార్స కంపెనీవారు వివిధరచయితల నాటికాసంపుటము శ్రీ శివ శంకర శాస్త్రి గారి సంపాదకత్వమున ప్రచురిస్తా మని ప్రకటించారు. కారణాంతరాల చేత సమ్మాళ్వార్స ఆవని నెరవేర్చడానికి అవకాశం కలగ లేదు.

నవ్య సాహిత్య పరిషత్తు వారు ఇట్టిగ్రంథజాలము ప్రకటించవలె నని చాలారోజులనుంచి ఉద్దేశించి ఉన్నారు. కొన్ని అవాంతరాలచేత పరిషత్తు వారు పని ప్రారంభించ లేదు. నవ్య సాహిత్య పరిషత్ స్థాపకులలో ప్రధానులైన శ్రీ శివ శంకర శాస్త్రి గారు మాయందు అనురాగముచేతను, సాహిత్య దోహదానికి ఉపకరిస్తుం దనే ఉద్దేశముచేతను మేము ప్రకటించ డానికి అవకాశ మిచ్చినారు.

ఓ

కృతజ్ఞత

సామాన్యంగా వినోదార్థం పాఠశాలలలో ప్రదర్శనలు చేసేవారు, ప్రతాపరుద్రీయంలోనుంచో, బొబ్బిలియుద్ధంలోనుంచో, కన్యాశుల్కములో నుంచో కొన్ని రంగాలు ప్రదర్శించటం పరిపాటి. పెద్దనాటక సమాజాల వారుకూడా అప్పుడప్పుడు చాచా ప్రదర్శనములు చేసేవారు. అటువంటివి అతుకు లతుకులుగానే ఉంటవి. కళాదృష్టితో రచించిన ఏకాంకికలు ఆడితే కలిగే ఆనందం పైవాటివల్ల కలగదు.

ఇది ప్రథమసంపుటి. ఇందులో నాటికలన్నీ ప్రదర్శనయోగ్యములు. సందర్భాన్నిబట్టి రంగస్థలములో భిన్నమార్పులు చేస్తూ వస్తే, ప్రేక్షకులకు ప్రీతి కలగక పోదు.

కళాశాలలలో గాని, జల్సాలలో గాని, ఉత్సవసమయాలలో గాని, ఉత్సాహములో నాటికలు ప్రదర్శించ దలచుకొన్నవారికి ఈసంపుటి ఉపకరిస్తుం దని మావిశ్వాసము.

స్త్రీల రచనలు ప్రత్యేకసంపుటిగా ప్రచురించ దలచినాము.

మాకోర్కెమీద తమగిల నాటికను ఈసంపుటిలో చేర్చి, పీఠికాదులతో మాకిచ్చిన శ్రీ శివ శంకర శాస్త్రి గారికి మా వందనము.

ఈసంపుటిలో ప్రకటించడానికి అవకాశము కలిగించి తమనాటికలు మాకు దయచేసిన ఇందలి నాటికాకర్తల కందరికీ ఆంధ్ర ప్రచారిణీ వారి కృతజ్ఞతా పూర్వక వందనములు.

పైడిమర్రి సత్యనారాయణ మూర్తి
మేనేజింగు డైరెక్టరు

ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్
నవంబరు ౧౯౪౩

అనుక్రమణిక

కృతజ్ఞత			పుట ౭
పరిచయము			౧౦
పీఠిక			౧౩
సముద్ర తీరము	...	శ్రీ నూతక్కి రామ శేషయ్య	౧
మాయ పెళ్ళి	...	శ్రీ కొడవటిగంటి వెంకట సుబ్బయ్య	౬
గజ్జెల మొలతాడు	...	శ్రీ నోరి నరసింహ శాస్త్రి	౩౯
పరివర్తనము	...	శ్రీ శ్రీనివాస శిరోమణి	౪౬
శ్రీ కృష్ణుడు	...	శ్రీ చింతా దీక్షితులు	౬౯
అపవాదు	...	శ్రీ ముద్దు కృష్ణ	౮౦
ప్రభు వాక్యము	...	శ్రీ శివ శంకర శాస్త్రి	౧౧౧
సౌందర్యోపాసి	...	శ్రీ తల్లావఝల కృత్తివాస తీర్థులు	౧౨౩
గ్రీష్మ ఋతువు	...	శ్రీ బాలాంత్రపు రజనీ కాంత రావు	౧౩౧
మొక్కుబడి	...	శ్రీ మొక్కపాటి నరసింహ శాస్త్రి	౧౪౬
శిల్ప నిద్ర	...	శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి	౧౬౯
మధుర ప్రియ	...	శ్రీ వావిలాల సోమయాజులు	౧౭౭

పరిచయము

నూతక్కి రామ శేషయ్య: జననము ౧౮౯౭, చిలువూరు గ్రామము, గుంటూరు జిల్లా. ౧౯౨౩ లో బి. యల్. ౧౯౨౪ నుంచి అడ్వొకేటు. ౧౯౨౬-౩౦ లలో బెజవాడ తాలూకా బోర్డు ప్రెసిడెంటు. ౧౯౩౦ మధ్య నుంచి జయపురసంస్థానంలో అసిస్టెంటు దివాన్. నాటికలు, ఖండ కావ్యములు రచించినాడు. చాలా వ్యుత్పన్నుడు.

కొడవటిగంటి సుబ్బయ్య: జననము ౧౮౯౮ గుంటూరు మండలములో. కొంతకాలం ఓవర్ సియర్. ౧౯౨౧-౨౨ లలో తెనాలి రామవిలాస సభకు దర్శకత్రయములో వాడు. నటుడు, చిత్రకారుడు. ఖండ కావ్యములు, కథలు అనేకములు రచించినాడు. యోగసాధకుడు.

నోరి నరసింహ శాస్త్రి: జననము ౧౯౦౦, గుంటూరు నగరములో. ౧౯౨౫లో బి. ఎల్. రేపల్లెలో న్యాయవాదవృత్తి. మంత్ర తంత్రశాస్త్రము లలో నిధి. సనాతన ధర్మపరాయణుడు. బహుఖండకావ్యములు, నాటికలు, కథలు, వ్యాసములు రచించినాడు. ఆంధ్రసారస్వతములో సుప్రసిద్ధ భావుకుడు.

శ్రీనివాస శిరోమణి: జననము గుంటూరు మండలములో. జ్యోతి శ్శాస్త్రములో నిధి. వచనరచనలలో అందె వేసినచెయ్యి. పత్రికా సంపా దకుడు. సినిమా వ్యాపారములో నిష్ణాతుడు. వ్యవసాయములో పరిశో ధకుడు. కథలు, నాటికలు, వ్యాసములు అనేకము రచించినాడు.

చింతా దీక్షితులు: జననము ౧౮౯౧, తూర్పు గోదావరిమండలములో. ప్రభుత్వవిద్యాశాఖలో ఉన్నతోద్యోగి. సారస్వతములో సుప్రసిద్ధుడు. బహుగ్రంథనిర్మాత. "శబరి" మొదలైన నాటకములు, నాటికలు, వ్యాసములు కథలు — అనేకము రచించినాడు. భక్తుడు.

ముద్దకృష్ణ: జననము ౧౮౯౯ రాజమహేంద్రవరములో. ౧౯౨౪ లో బి. ఎల్. "జ్వాల" పత్రికా సంపాదకుడు. అనార్కలీ, అశోకము, టీకప్పులో తుపాను మొదలైన నాటికలు, "ఎకిడికి—" అనే కథా సంపుటి ముద్రితములు. నాటకనిర్వహణములో ప్రవీణుడు. వ్యాసరచయిత.

శివశంకర శాస్త్రి: జననము ౧౮౯౨ కాజగ్రామము, గుంటూరు మండలమున. తెనాలి రామవిలాససభ దర్శకత్రయములో వాడు. అనేక గద్య పద్య గీతికా నాటికలు, కావ్యములు రచించినాడు.

తల్లావజ్ఝల కృత్తివాస తీర్థులు: జననము ౧౯౧౮ లో, గుంటూరు నగరమున. బి ఎ., బి. ఇడి. అనేక గద్య గేయ నాటికలు, రేడియో నాటికలు, సారస్వతవ్యాసములు, నాటకములు రచించినాడు. ఆంగ్లభాష నుంచి కొన్ని నాటకములు, సంస్కృతమునుంచి కథాసరిత్సాగరము, హిందీ నుంచి కొన్నిపుస్తకములు తెలిగించినాడు. అలంకార వేదాంతశాస్త్రములలో అభినివిష్టుడు.

బాలాంత్రపు రజనీకాంత రావు: జననము ౧౯౨౦, నిడదవోలు పశ్చిమ గోదావరిజిల్లాలో. ౧౯౩౯ లో ఎమ్. ఏ. అనేక రేడియోనాటికలు. గేయములు రచించినాడు. గాయకుడు.

మొక్కపాటి నరసింహ శాస్త్రి: జననము ౧౮౯౨, తూర్పుగోదావరి మండలము, గంద్రేడుగ్రామమున. ఎడింబ్రోలో వ్యవసాయశాస్త్రాభ్యాసము

చేసినాడు. శక్తి, కళ పత్రికలకు సంపాదకుడు. బ్యారిష్టరు పార్వతీశము మొదలైన గ్రంథములు రచించినాడు. రేడియో ప్రసంగములు అనేకము చేసినాడు. మహానటసభ స్థాపించి, నాటికలు వ్రాసి అభినయించినాడు. సినిమా రచనలో సిద్ధహస్తుడు.

పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి: ౧౯౨౦ లో చావలి గ్రామము, గుంటూరు మండలములో జననము. సంస్కృతము, ఇంగ్లీషు, తెలుగులలో ఎం. ఏ. M. Litt. Diploma in German. వేదవిషయ వ్యాసములు సారస్వత వ్యాసములు, కథలు, ఖండ కావ్యములు, గేయములు — అనేకము రచించినాడు. ఆధునిక విధానములో సదార్థ ప్రవీణుడు.

వావిలాల సోమయాజులు: జననము ౧౯౧౮, వి ప్రులపల్లె, గుంటూరు మండలములో. ౧౯౩౮ లో బి. ఏ. ౧౯౩౯ నుంచి గుంటూరు శారదానికేతన కలాశాలాధ్యక్షుడు. దక్షిణదేశ ఆంధ్రవాఙ్మయము, నాయకురాలు (నాటకము) మొదలైన గ్రంథములు, అసంఖ్యాక ఖండ కావ్య, గేయ నాటికా, సారస్వత వ్యాసములు రచించినాడు. వక్త.

పీ ఠి క

౧

అంకరూపక మనే శబ్దము అలంకారశాస్త్రములో కన బడుతుంది. ప్రాచీనరూపకాలలో అంకవిభజనే కాని రంగ విభజన లేదు. విష్కంభము, మిశ్రవిష్కంభము, చూళిక, అంతర్నాటిక- ఇత్యాది ఘట్టాలు విభాగరూపముగా ఉన్నవి. రూపము ఆరోపణ చేసుకోవడంవల్ల రూపక మనీ, నటించడము చేత నాటక మనీ నామములు ప్రసిద్ధి కెక్కినవి. అల్పార్థములో రూపిక అనీ, నాటిక అనీ ఆధునికవ్యవహారము. అంకరూపకము అనడానికి బదులుగా ఏకాంకిక అని ప్రతీతి కలిగింది.

నాటికకు పూర్వరూపము వాకోవాక్యము. దానికి పూర్వరూపము స్వగతము. స్వగతములో ఏకపాత్రోపన్యాసము ఉంటుంది. వచనముకన్న పాట, పద్యము ముందు పుట్టడంచేత స్వగతము మొదట తాళబద్ధము, తరువాత ఛందోబద్ధము అవుతుంది. విశ్వసాహిత్యములో విశేషప్రాచీన మైనఋగ్వేద సంహితా భాగములో ఇంచుమించుగా ఇరవై స్వగతాలు గాని, వాకోవాక్యాలు గాని ఉన్నవి. వాకోవాక్యము అంటే ఉక్తిప్రత్యుక్తులు గాని, ప్రశ్న సమాధానాలు కాని, సంవాద

ములు కాని కావచ్చు. ఇంద్రమరుత్తుల వివాదము, ఇంద్ర వరుణుల సంవాదము, భార్యాపుత్రులతో అగస్త్యుని సంభాషణ, కుమారునితో వసిష్ఠుని సంభాషణ, నేమాభార్గవునికి ఇంద్రుని సమాధానము, వృషాకపినిగురించి ఇంద్రఇంద్రాణుల సంవాదము, ఊర్వశీ పురూరవుల సంభాషణ, సరమా పణిసంవాదము, మత్తెక్కి ఇంద్రుడు చేసినస్వగతము, అపాల, గోతముకు మొదలగువారి వాక్యములు గోచరిస్తవి. అథర్వవేదములో సుపర్ణాధ్యాయములో అథర్వాణుడు చేసిన దైవప్రార్థన కనిపిస్తుంది. ఇక వచనములో ఐతరేయ బ్రాహ్మణములో కవషుని కథ వంటివి రూపకప్రాయములు. బ్రాహ్మణాలలో వచనరూపముగా అనేకసంవాదములు నాటకలక్షణాలతో స్ఫుటముగా గోచరిస్తవి.

యజ్ఞయాగాది సమయములలో బ్రాహ్మణులు వేషధారణము చేసి ఇంద్ర, అగ్ని, వరుణ, బ్రహ్మణస్పతులు మొదలైనదేవతలవలె నటించేవారని నాటక చరిత్రలో పాశ్చాత్యులు వ్రాసినారు. పవిత్రసమయాలలో పాత్రధారణ చేసి పదిమందిఎదుట ప్రవర్తిస్తారా అని సంశయము కలగవచ్చు. సామాన్యుల వేషము ధరించడముకన్న పురుషశ్రేష్ఠులవలె కాని, పురుషోత్తమునివలె కాని, రూపారోపణము చేసుకొనడమువల్ల లోపము లేదు. లోకానికి అతిలోకవిషయముమీద ఆసక్తి ఉండడము సహజము, సమ్మతము, ప్రజలు ఉన్నదాని

కన్న అధికముగా కనపడవలె నని కాంక్షిస్తారు. అందుచేతనే రూపకానికి ఆవశ్యకత కలిగింది. ఇప్పటికీ మనదేశములో సామాన్యవిషయాలకన్న ఉదాత్తవిషయాలమీదనే ఉత్సుకత ఎక్కువ. అందుచేతనే రామాయణ మహాభారతఘట్టాలు, పురాణాలలో ఉపాఖ్యానాలు, రంగస్థలముమీద ప్రదర్శిస్తే ప్రజలు ఆసక్తితో చూస్తారు.

లౌకికసంస్కృత భాషలోకూడా ప్రాచీనకాలములోనే నాటికలు, నాటకములు కొంచెకొంచెముగా గోచరిస్తవి. అష్టాధ్యాయి రచించిన పాణిని మహర్షి, భాష్యకారుడయిన పతంజలి మహర్షి నాటకాలు రచించినట్టు ప్రతీతి. క్రీ. పూ. ౩౫౦ ప్రాంతాలలో ఉన్న పతంజలి దృశ్యకావ్యాలనూ, నటులనూ, నాటకరంగాలనూ పేర్కొన్నాడు. నాట్యశాస్త్రప్రణేత అయిన భరతమునికి దృశ్యకావ్యభేదాలు బాగా తెలుసును. క్రీ. పూ. ప్రథమశతాబ్దిలో ఉన్న భాసుడు ఏకాంకికలు రచించినాడు భాసనాటకచక్రములో దూతఘటోత్కచ, కర్ణభార, మధ్యమ వ్యాయోగ ఊరుభంగాదులు నాటికాప్రాయములు. క్రీ. పూ. ౭౫ మొదలు క్రీ. త. ౧౫౦ వరకూ బౌద్ధులు సంస్కృతనాటకాలు రచించారు. క్రమక్రమముగా రూపక ఉపరూపకాలు బయలుదేరినవి. సంస్కృతభాషలో వేలకొద్ది దృశ్యకావ్యాలు ఉండేవనీ, కాలక్రమేణ అనేకము లోపించి నశించిన వనీ విజ్ఞులు లిఖించారు.

౨

పాశ్చాత్యదేశాలలో చిన్ననాటిక చిరకాలమునుంచీ వ్యాప్తిలో ఉన్నది. దాని ఆకారప్రకారాలు వివిధవిధాలుగా ఉండేవి, ప్రాచీనగ్రీసు దేశములోనూ, ఇటలీదేశములోనూ నాటిక విశేషముగా ప్రహసనప్రాయముగా ఉండేది. ఇంగ్లాండులో మధ్యయుగములో ఉండే **Mystery Plays, Miracle Plays, Interludes**- నాటికాప్రాయములే. ౧౬౪౨ సంవత్సరములో శాసనప్రకారము నాటకశాలలు మూసివేసిన తర్వాత Travelling actors Drolls అనేవి ఆడుతూ ఉండేవారు. ౧౮, ౧౯ శతాబ్దులలో curtain-raisers, after pieces, sketches for Amateurs, అప్పుడప్పుడు ప్రదర్శించేవారు. ఇవి అన్నీ ఇంచుమించుగా ప్రహసనాలే. వీటికి గౌరవము ఉండేది కాదు.

ఆధునిక నాటిక ౨౦ శతాబ్దిలోనే ఉద్భవించిం దని చాలామంది విమర్శకుల మతము. గతశతాబ్దిలోనే కొందరు ప్రారంభించినా, ప్రస్ఫుటరూపము ఈశతాబ్దినుంచే ఏర్పడ్డ దని అభియుక్తుల అభిప్రాయము. ముఖ్యముగా ఇంగ్లాండు అమెరికా సంయుక్తరాష్ట్రాలలో ప్రబలి, ప్రదర్శనయోగ్యమై రంగస్థలముమీదికి ఎక్కి రంజన చేస్తున్న దట.

3

ప్రాచీనాంధ్ర సారస్వతములో నాటికలు లేవు. సంస్కృత నాటకములవంటివి కూడా లేవు. ప్రబోధచంద్రోదయ నాటకము సంస్కృతమునుంచి ఆంధ్రీకరించినవారు శ్రవ్యకావ్యము చేశారు! వసంతవిలాసము అనేగీతినాటిక ఉన్నట్టు వ్యాఖ్యానము. గేయ మొకటి ఎందులోనో ఉదాహృతమై ఇప్పటికీ లభిస్తున్నది. దానిని బట్టి గ్రంథస్వరూపము నిర్ణయించడానికి వీలులేదు. క్రీడాభి రామము దృశ్యకావ్యధోరణిలో నడచినా, నాటిక అనడానికి వీలు లేదు. ఇద్దరు ప్రధానపాత్రలు. Cinema విధానములో చిత్తరువులవలె కొన్ని కొన్నిదృశ్యాలు ఊహించవచ్చును. అందులో ఇద్దరు పాత్రలే కాని వస్తువు ప్రధానం కాలేదు. ఓరుగల్లునగరములో అప్పటి ఆచారవ్యవహారాలు, వినోదాలు, విచిత్రమైన్ని వేశాలు కొద్దిగా గోచరిస్తవి. శ్రీనాథవి రచిత మని ప్రతీతి కల వీథినాటకము చిన్నదైనా నాటిక కాదు. అందులో నాయకునికి అందముగా కనిపించిన ఆడువారలవర్ణనమాత్రమే అతి ప్రధానము. కృష్ణదేవరాయలకాలములో నాటకములు ఆడినట్టు బాగా తెలుస్తుంది. అవి ఎటువంటివో, ఏవిధంగా ప్రదర్శించేవారో డాక్టరు నేలటూరి వేంకట రమణయ్య వంటి వారు విశదీకరించాలి. రాయలు విద్వత్ప్రభువు కావడంచేత, అన్నిటికీ పండితామోదమే ప్రధానం కావడంవల్ల సంస్కృత నాటకలక్షణాలను కొంతవరకైనా అనుసరించిన దృశ్యకావ్యాలే ప్రదర్శించేవారని భావించవచ్చును. తంజావూరులోను, తదితర

ఆస్థానాలలోను కాలక్రమేణా నాటకములు రచించడము, ప్రదర్శించడము జరిగినట్లు స్పష్టము.

ప్రభువులకు, పండితులకు, ప్రజాసామాన్యానికే ప్రమోదము కలగడానికీ, ప్రదర్శనయోగ్యము కావడానికీ వీధిభాగవతము, యక్షగానాలు బయలుదేరినవి. ప్రతికథలోనూ వస్తుగౌరవము ఉండేది. సంగీతప్రియుల ఆమోదానికి అక్కడక్కడ గీతికలు, పాటలూ, ప్రౌఢులకోసము మధ్య మధ్య పద్యములూ, విద్వాంసుల వినోదానికి సంస్కృతగుంఫనలు శ్లోకములూ, అందరి ఉల్లాసానికీ హాస్యము నిబద్ధము చేసేవారు. ప్రత్యేకించి యక్షకుటుంబాలు కృషిచేసి పాడుతూ ప్రదర్శించే యక్షగానాలలక్షణము బాగా విశదమే. సుగ్రీవవిజయము మొదలైన యక్షగానములు సహస్రాధికముగా లభ్యమౌతవి. వాగ్గేయకారుడైన త్యాగరాజు అంతటివాడు కూడా యక్షగానధోరణిగా నౌకావిహారము, ప్రహ్లాదచరిత్ర రచించినాడు. ప్రజానీకము మోజుకోసము తోలుబొమ్మలాటలు కొంతనాటకసరణిలో వ్యాపించినవి. జగద్విఖ్యాతమైన రామాయణ మహాభారతాది గ్రంథఘట్టాలు తీసుకొని నాటకసరళిలో నడిపేవారు. అందులో సంభాషణ, గానము, వర్ణన మొదలైనవి ప్రస్ఫుటములు. మానవుడు పాత్రధారణ చేసి రంగస్థలముమీద ఆడడముకన్న ప్రాణము లేనితోలుబొమ్మలను తెరమీద ఆడించడమే నాటకకళకు పరమావధి అని ఒకానొక జర్మన్ రసికతత్త్వవేత్త నిర్వచించినాడు.

చిన్న నాటకములు ఆరోజులలో ఉండడానికి వీలే లేదు. రాత్రి భోజనాలు చేసి ప్రథమయామము కాగానే ప్రేక్షకులు సిద్ధ మయ్యేవారు. ఇంచుమించుగా సూర్యోదయ మయ్యేవరకూ చూస్తే గాని వారికి తృప్తి ఉండేది కాదు. ఈరోజులలో వలె ప్రతిరాత్రి ప్రదర్శనానికి ఆకాలములో అవకాశము లేదు. పంటకారు అయిన తర్వాత పనిపాటులు తగ్గి ఆకాశము నిర్మేఘమై ప్రజలకు విశ్రాంతి దొరికినప్పుడు కుశీలవులు బయలుదేరి పెద్దగ్రామములలో నాటక ప్రదర్శనము చేసేవారు. తరుచుగా లేక ఎప్పుడో లభ్య మయ్యే ప్రదర్శనము ఇట్టే అయిపోతే తృప్తి ఉండదు. అందుచేత మూడుజాములు ఆట ఆడించేవారు. అటువంటిసందర్భములో చిన్ననాటికకు తావు ఏలాగున ఉంటుంది?

ఇప్పటికీ ఇటువంటిప్రదర్శనములు అక్కడక్కడ సుదీర్ఘముగానే జరుగుతున్నవి. జనసామాన్యానికి వీటిమీద విశేష ప్రీతి ఉన్నట్టు స్పష్టము.

౮

నాటికారచన గతశతాబ్దిలోనే ఒకవిధముగా ప్రారంభమయినది. అన్నివిషయాలలో ముందడుగు వెయ్యడానికి ప్రయత్నించిన వీరేశలింగము పంతులు ప్రహసనములు ప్రారంభించినాడు. సంస్కృతఉపరూపకాలలో అన్యతమ మైనప్రహసనము ఆయనను ఆకర్షించినది. సాహిత్యదృష్టికన్న సంఘసంస్కరణదృష్టే ప్రధానముగా ఉన్నపంతులు లోకముపద

మన్నెత్తుకై ప్రహసననిర్మాణము చేసినాడు. ఆయన దురాచారములు, అప్రవర్తనములు అనుకొన్నవి యథాతథముగా ప్రదర్శించడానికి ప్రయత్నించడముచేత అరచటలు ఉత్తమసాహిత్యశ్రేణిలోకి ఎక్క లేక పోయినవి. వివిధగ్రంథకారుడైన రాజా భుజంగరావు ప్రహసనములు తాత్కాలికచమత్కారము కలిగించి వెలసినవి. హాస్యరసవర్షిని కర్త పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులు హాస్యవల్లరి అనేశీర్షికతో ఇంచుమించుగా ఇరువది ప్రహసనములు రచించినారు. సామాన్యసాంసారిక వినోదాలు వాటిలో ప్రధానవిషయాలు. శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహా కవి ప్రహసనాలలో చమత్కారరేఖ గోచరిస్తుంది. ఏదయితే అందరికీ ప్రహసనరచనే ప్రమోదావహము కానడము చిత్రము. సామాన్యవిషయాలను సాహిత్యశ్రేణిలోకి ఎత్తి సంస్కారదృష్టి ప్రధానముగా ఉంచుకొని పరిహాసమే లక్ష్యముగా ఎంచి నిర్మించడముచేత కళాసంపద కనబడడము లేదు. ఎంత ప్రతిభావంతుడైన వ్యక్తికీ మనస్సు మతమయినప్పుడు రచన పరాకాష్ఠకు పోవడము కష్టము.

ఇంకా కొందరు రచయితలు చిన్ననాటకాలు చేసినారు.

౫

సాహితీ సమితివారు రంగస్థలములో ప్రవేశించినతరువాతనే ఏకాంకికకు కళారేఖ ఏర్పడినది. సమితివారు సంస్కారము కాని, ప్రచారము కాని ప్రధానముగా పెట్టుకోక కళ లక్ష్యములో ఉంచుకొనడముచేత నవనవసాహిత్యసృష్టి చేయగలిగి

సముద్రతీరము

శ్రీ నూతక్కి రామశేషయ్య

౧

కొడుకు: నాకొక కల వచ్చింది.

తండ్రి: ఇంత ప్రొద్దెక్కి లేచినా వేమి?

కొడుకు: కలలో నేను సముద్రపు ఒడ్డుకు వెళ్ళినాను. అప్పుడు మన పెద్దగడియారము ౧౨ కొట్టింది.

తండ్రి: అంత ఎండలో సముద్రానికి వెళ్ళకూడదు.

కొడుకు: కలలోకూడా వెళ్ళకూడదా? అయినా అక్కడ అంత ఎండ లేదు నాన్నా! సూర్యుడు సముద్రము దగ్గర చల్లగా ఉంటాడు. నీవూ అంతే. ఎంత కోపము ఉన్నా నన్ను చూచేసరికి నవ్వుతూ ముచ్చటగా ఉంటావు. నన్ను చూస్తే నీ కంత సంతోష మెందుకు నాన్నా?

తండ్రి: నీవు మంచిబిడ్డవు—అందుకని.

కొడుకు: నేను మంచివాడనా? అయితే సముద్రముకూడా మంచిదన్న మాటేనా? అందుకనే నన్ను చూచి నవ్వింది. అక్కయ్య నవ్వినట్లుగానే సముద్రము నవ్వినప్పుడుకూడా వెన్నెల కాచినట్లుంటుంది. సముద్రములో ఏ ముంటవి నాన్నా?

తండ్రి: సముద్రములో రత్నాలూ, ముత్యాలూ ఉంటవి.

కొడుకు: ముత్యాలా? అందుకే నాన్నా, సముద్రము నవ్వితే అంత తెల్లురు వస్తుంది! ఇందాక సముద్రము నన్ను చూచి నవ్వింది. రత్నాలు కూడా ఉంటవి కాదూ? నీవు చెప్పేకథలలో రాజకుమార్తె లెప్పుడూ రత్నాలతో అచ్చనగాయ లాడుకొంటారు. నేను సముద్రానికి వెళ్ళి

రత్నాలు తీసుకొని వస్తాను. రత్నాలతో అక్కడయ్య అచ్చనగాయలాడు కొంటుంది.

తండ్రి: రాముడూ! నీవు సముద్రానికి వెళ్ళగూడదు.

కొడుకు: అక్కడ ఎంతో హాయిగా ఉన్నది. నాన్నా! చల్లగాలి నా ఒంటిని తాకుతూ పోతూ వుంటే అమ్మ ఒళ్ళు నిమిరి ముద్దు పెట్టుకొన్నట్టుగా ఉన్నది. అమ్మ సముద్రముమీద గాలిలో ఉంటుందా?

తండ్రి: ఉండదు.

కొడుకు: అయితే, ఇంకెవరి చేతులు అంత చల్లగా మెత్తగా ఉంటవి? ఇంకెవరి ముద్దు అంత సుఖముగా ఉంటుంది? నీకు తెలియదు నాన్నా, అమ్మ సముద్రపు ఒడ్డునే ఉంటుంది. నేను కూడా వెళ్తా.

తండ్రి: నీవు సముద్రానికి వెళ్ళగూడదు.

కొడుకు: అయ్యో, అక్కడ హాయిగా ఉంటుంది నాన్నా! నేనక్కడ నిలుచున్నప్పుడు కనబడని సీటితుంపరలు మెల్లగా కురిసినవి. అప్పుడు నేను బిగ్గరగా నవ్వినాను మరి నాన్నా! ఎవ్వరూ లేకుండా నవ్వితే, పిచ్చివాడంటారా?

తండ్రి: అవును. పిచ్చివాళ్ళలాగే నవ్వుతారు.

కొడుకు: అయితే పిచ్చివాళ్ళకు దేవుడెంత సుఖము పెట్టాడో! నేను నవ్వినప్పుడు నాకెంతో హాయిగా ఉన్నది. అప్పుడు ఎవ్వరూ లేరు. అమ్మ మాత్రము కనబడకుండా అక్కడనే ఉన్నది. నన్ను ముద్దు పెట్టుకున్నది. ఆ ముద్దు నాన్న ముద్దుకంటె సుఖముగా ఉన్నది. అది ఇప్పటికీ నాకను రెప్పలమీద తేలియాడుతూ ఉన్నది. [కళ్ళులు సగము మూసి నవ్వుకొంటాడు.]

తండ్రి: రాముడూ, ఏమిటది?

కొడుకు: అమ్మ అమ్మ దగ్గరకు వెళ్ళి రాకద్దూ నాన్నా? అక్కడ ఎంతో హాయిగా ఉంటుంది. నేనక్కడ నిలుచుంటే సముద్రము నాకై

పుకు చేతులు చాచి నన్ను పిలిచింది. నాకు రత్నాలు ఇస్తుంది. నేను తెచ్చుకో వద్దు నాన్నా?

తండ్రి: నీవు వెళ్ళకూడదు. అక్కడ పెద్దచేపలు ఉంటవి.

కొడుకు: పెద్దచేపలా? అవి ఎట్లా ఉంటవి నాన్నా! నేను వాటిని చూడ వద్దూ!

తండ్రి: అవి మనమే దంగ ఉంటవి. నీవు వెళ్ళ వద్దు. వెళ్ళితే నాకు కోపము వస్తుంది...[బయటికి వెళ్ళుతాడు]

కొడుకు: నాన్నకు నామీద కోపము రాదు. కోపములోకూడా నేను నవ్వితే నవ్వుతాడు. సముద్రములో ఇల్లంత చేపలు ఉంటవి. ముత్యాలు, రత్నాలు కూడా ఉంటవి. అమ్మ అక్కడే గాలిలో తిరుగుతూ ఉంటుంది. నేను వెళ్ళగానే నిమిరి ముద్దు పెట్టుకుంటుంది. అప్పుడు సముద్రము బలమైన తనచేతులు చాచి నన్ను కౌగిలించుకుంటుంది. చేపలను చూపిస్తుంది. ముత్యాలు, రత్నాలు ఇస్తుంది. అవి అక్కయ్య కిస్తాను. [నవ్వు తుంటాడు] నాకు ఒంటరిగా ఉంటేకూడా నవ్వు వస్తుంది. నాన్న చూస్తే పిచ్చివాడంటాడు. [వెళ్ళి పోతాడు].

౨

[రాముడు మంచముమీద పరున్నాడు.. జ్వరము తీవ్రముగా వున్నది. ప్రక్క కుర్చీలపైన డాక్టరు, తండ్రీ కూర్చున్నారు.]

తండ్రి: అబ్బాయి ఎక్కువగా మాట్లాడుతున్నాడు. కొంచెము నిద్ర మం దిస్తే?

డాక్టరు: జ్వరతీవ్రతచేత మాట్లాడుతున్నాడు. జ్వరము కొంచెము దిగినతర్వాత ఇస్తాను. ఎక్కువ ప్రమాదమైన దెబ్బ తగుల లేదు. ముందుకు పడగొట్టి అలలు లోపలి కీడ్వడంచేత ఇసుక గీసుకుపోయింది.

రాముడు: ఇసుక కాదు బాబూ? సముద్రములోపలి రత్నాలమీదుగా పోర్లాడుతూ, పోతూ అలలబరువుచేత బోర్లబడ్డాను. రత్నాలు గీసుకు పోయినవి.

తండ్రి: నాన్నా, సముద్రానికి వద్దంటే ఎందుకు వెళ్ళావు?

రాముడు: రత్నాలకోసము. అవిగో రత్నాలు! [లేవ బోతాడు.]

తండ్రి: అయ్యో, లేవబోకు, నీవు కదలకుండా పండుకో.

రాముడు: రత్నాలు! సముద్రము రత్నాలు తెస్తూ ఉన్నది. అదుగో, నల్లని రయిడారి! అలలపైమీద తేలుతూ, ఆడుతూ ఉన్నది. అది నల్లమబ్బు మీద మెరుపు ... తెలిసి ది! ఆ! సముద్రము నవ్వుతూ ఉన్నది. సముద్రానికి పిచ్చి యెక్కింది. నాన్నా! ఒంటరిగా ఎగిరిపడుతూ గంతులు వేస్తే పిచ్చి ఎక్కినట్టు కాదూ?

తండ్రి: బాబూ! మాట్లాడబోకు, డాక్టరుగారికి కోపము వస్తుంది.

రాముడు: డాక్టరుగారూ! మీకు కోపమా? మా నాన్నకు కోపము లేదు. నన్ను చూస్తే నవ్వుతాడు. సముద్రానికి కోపము లేదు. అదుగో, సముద్రము నల్లగా అపారంగా ఉన్నది. దానికి ఒకటే ఒడ్డు. అవతల ఒడ్డు లేదు. ఒడ్డున చాలామంది ఉన్నారు. అందరూ స్నానానికి వచ్చినవారేనా? ఆ దూరంగా చూడండి. డాక్టరుగారూ! ఆకాశము వంగి సముద్రాన్ని ఎంతసేపు ముద్దు పెట్టుకుంటూ ఉన్నదో! అవి ఏమిటో రహస్యముగా చెప్పుకొంటూ ఉన్నవి. మీకు వినబడడము లేదు. అయ్యో నాకు స్పష్టముగా వినబడుతూ ఉన్నదే!

తండ్రి: అబ్బాయిస్థితి చూచినకొద్దీ నాకు భయము వేస్తున్నదండీ!

డాక్టరు: అబ్బాయికేమీ ఫరవా లేదు. కొంచెము మంచుగడ్డ తలకు కట్టండి. జ్వరము తగ్గుతుంది.

రాముడు: అదుగో వెల్తురు! సముద్రములో వెన్నెల కాస్తూ ఉన్నది. సముద్రములో అన్నివస్తువులూ కనబడుతూ ఉన్నవి. కాని అవతలి ఒడ్డు కనుపించదు. భూమికంటె సముద్రమే పెద్దది. సముద్రములో ఎన్ని భూములున్నవో చూడు. అన్నీ లంకలు. అవిగో రత్నాలు, ముత్యాలు, చేపలు! పెద్ద పెద్దచేపలు, వాటిని ఏలుతున్న కన్నెలో! ఆ లంకలో ఎవరు ఉంటున్నారు. అదుగో... [లేవ బోతాడు]

తండ్రి: నాయనా! లేవబోకు. [చేతులు పట్టుకొంటాడు]

రాముడు: [అట్టె కన్ను లురిమి చూస్తూ] నీ వెవరు?

తండ్రి: [కన్నీరు కారుస్తాడు]

రాముడు: ఇంకా ఏడుస్తున్నాడు! [పండుకొంటాడు.] అదిగో అమ్మ! ఎన్నాళ్ళకు కనబడినావమ్మా! ఇందాకా కనబడకుండా నన్ను ముద్దు పెట్టుకున్నావు. ఇప్పుడు రమ్మని చేతులు చాస్తున్నావు. నేను వస్తున్నా! ... అయ్యో, ఎవరో నా చేతులు బంధించారు. మామిడిచిగురు వంటి మెత్తని చేతులు ఎలా కందినవో చూడు! ... అమ్మా వెళ్ళుతున్నావా? నేనుకూడా వస్తున్నానమ్మా! వస్తున్నానమ్మా! అమ్మా, అమ్మా! ... [నిశ్శబ్దము.]

౧౯౨౧

మాయ పెళ్ళి

శ్రీ కొడవటిగంటి వెంకట సుబ్బయ్య

హనుమాన్ దాసు	షాహుకారు
గోపీ చందు	అతని గుమాస్తా
చబిల్ దాసు	గోపీచందు స్నేహితుడు
రామానందు	ఒకానొక గృహస్థు
తారా బాయి	రామానందు కొమార్తె
లక్ష్మి	అతని పెంపుడు బిడ్డ

౧

[హనుమాన్ దాసు అఫీసుగదిలో గోపీచందు చేతులలో మొగము పెట్టుకుని కూర్చుని ఉండగా చబిల్ దాస్ ప్రవేశము]

చబిల్ దాసు: క్యా హై, గోపీచంద్! మొగం వాలేశావు?

గోపీ చందు: ఎవరు, చబిల్ దాసా? రా భాయి, కూర్చో.

చబిల్ దాసు: ఏమంత దిగాలుపడి ఉన్నావేం?

గోపీ చందు: [అటు ఇటు చూచి] ఏమీ లేదు. మా మేనేజరు పెళ్ళి, నాచావు ఒక్కసారే అయ్యేటట్టున్నాయి.

చబిల్ దాసు: అవును, నేనూ విన్నాను. రామానందుకూతుర్ని చేస్తారట కాదూ? చక్కనిపిల్లటరా! ఇంత ముసలిముండా కొడుక్కు ఎలా ఇస్తారు! కాని, నీకు చావెందుకు?

గోపీ చందు: ముసలివాడేమిటి– కోటి! ఇక్కడి కైదు అయినాయి. ఇది ఆరోది. పోనీ, చేసుకుంటే చేసుకున్నాడు. నాకర్మం కాలితే, అదే [illegible]!

చబిల్ దాసు: నీకు దిగు లెందుకు? ఏదో శాస్త్రం చెప్పినట్టుంది!

గోపీచందు: చబిల్! నా క్షేమైనా సలహా చెప్పవదూ! ఇక్కడి కేడాది నుంచీ మాకిద్దరికీ స్నేహము. నే నాపిల్లను చేసుకోవా లంటున్నాను. తారా బాయి నాకు దక్కకపోతే నేను బతకడం ఉత్తదే!

చబిల్ దాసు: ఓస్సి! ఈకబుర్ల కేం లే! తారాబాయి కాకపోతే దాని తాతమ్మ చంద్రాబాయి వస్తుంది. దిగులు పడకు!

గోపీచందు: అలా కాదు. నామనను నీకు తెలియడం లేదు.

చబిల్ దాసు: నిజంగా నా రేమిటి రా!

గోపీ చందు: రెండు రోజులనుంచీ చురకత్తి బేర మాడుతున్నాను.

చబిల్ దాసు: [కొంచె మాలోచించి] పెళ్ళి నిశ్చయ మైందా ఏమిటి?

గోపీ చందు: ఇంకా కాలేదు. ఇవాళో రేపో! వీడి మనస్సు విరచా అని యత్నప్రయత్నం చేస్తున్నాను. ఏమీ సాగలేదు. నట్టి తాపేలు ముండాకొడుకు! దానితం డ్రి కేం పోయే:— అదుగో వస్తున్నాడు. నువ్వు పో!

చబిల్ దాసు: నే నాలోచించి చెపుతాలే. ఫర్వా లేదు. చురకత్తి కొనేవు సుమా! [నిష్క్రమణం]

హనుమాన్ దాసు: [ప్రవేశించి] ఏమిరా గోపీ! రామానందజీ ఎప్పుడు వస్తా నన్నాడు?

గోపీ చందు: ఏమో, నాకు తెలియదు.

హనుమాన్ దాసు: మొన్న నీ వుండగా నేగా చెప్పిపోయింది?

గోపీ చందు: నేను విన్నా నా రేమిటి! నాకిదేపని!

హనుమాన్ దాసు: ఏమిరా నేను పెళ్ళిచేసికోవడం నీ కేం ఇష్టం లే వల్లే వుందే!

గోపీ చందు: నే నొకమాట చెప్పనా మీకు కోపం వస్తుందేమో కాని? ఇంతయీడు వచ్చి ఈముసలితనంలో మీరు పెళ్ళి చేసుకోటం విని— నా మాట కేమి— నాస్నేహితు లందరూ ఎగతాళి చేస్తున్నారు.

హనుమాన్ దాసు: వాళ్ళతాడు తెగిరి! వాళ్ళ కేం తెలుసు? ఇప్పుడు పుట్టి బొట్టికాయలకు ముసలితనం గాని, పూర్వకాలపువాణ్ణి నాకు ముసలితనం ఏమిటి?

గోపీ చందు: పైగా, ఆపిల్ల ఏమీ మంచిది కాదట.

హనుమాన్ దాసు: ఏమిటి?

గోపీ చందు: పిల్ల వట్టి అనాకారి దట.

హనుమాన్ దాసు: ఎవడ్రా చెప్పింది! [డ్రాయరులోనుంచి ఫోటో తీసి] ఇటు చూడు! ఈ కళ ఎవతె మొహానికైనా ఉందీ?

గోపీచందు: ఏం కళ? వట్టి వంకర ముక్కు—!

హనుమాన్ దాసు: ఊఁ, అవును అయినా ఎంత వంకర లే!

గోపీ చందు: కంట్లో పెల్లకూడా ఉంది.

హనుమాన్ దాసు: ఎబ్బే! లేదు రా.

గోపీ చందు: అదేం, స్పష్టంగా కనబడుతూంటే! మీకు చత్వారం. అయినా, నా కెందుకు లెండి!

హనుమాన్ దాసు: అయితే అది మెల్లే నంటావూ? పోనీలే, మెల్లమేలు తెస్తుంది.

గోపీ చందు: పెదవులు చూశారా? ఎంత ముద్దగా ఉన్నాయో. నోరు మూసుకున్నది గాని ఒకపన్ను గొగ్గిట.

హనుమాన్ దాసు: ఛా! ముద్దపెదవు అంటే ఇంకా ఒప్పుకోవచ్చు గాని గొగ్గిపన్నా? ఇంత చిన్నతనంలో పళ్ళకు గొగ్గి ఉంటుందా? ఒక వేళ ఉంటేమాత్రం ఏమిరా! నాకు నాలుగు పళ్ళు గొగ్గి. మాయిద్దరికీ కలిసి అయి దవుతాయి పోనీలే!

గోపీ చందు: మీ యిష్టం లెండి. నే నైతేమాత్రం చస్తే ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకోను. అసలీఫోటో ఆ అమ్మాయిదేనా అని అనుమానం.

హనుమాన్ దాసు: నీ కేం రా అబ్బాయి! నీ కెవరైనా పిల్లనిస్తారు. నా కెవ రిస్తారు?

గోపీ చందు: అత్యాధికారులు, మీ కేమిటండి! ఒక్క నెల ఆగండి. ఫస్టుక్లాసు సంబంధం కుదురుస్తాను.

హానుమాన్ దాసు: ఎక్కడైనా ఉందా యేమిటి? చివరగా వస్తే పోనీ చూతాం.

గోపీ చందు: సంబంధాల కేం, కావలసి నన్ని దొరుకుతాయి, కొంచెం ఓపిక పట్టండి.

హానుమాన్ దాసు: సరేలే! ఇక్కడికి అయిదేళ్ళనుంచి ప్రయత్నం. ఆ వచ్చే దెవరు? రామానందు కాదూ?

గోపీ చందు: [మెల్లిగా] ఆ! ఆదౌర్భాగ్యుడే. ఇంతకూ నాకు కని యేడింట ఉన్నాడు!

రామానందు: [ప్రవేశించి] ఏ నండీ, ఏమి నిశ్చయించారు?

హానుమాన్ దాసు: ఏమో నయ్యా! నా కేం నచ్చ లేదు.

గోపీ చందు: ధర చాలా యెక్కువ చెప్పాడు రామానందజీ!

హానుమాన్ దాసు: అవును. ఆపిల్లకి పన్నెండు వే లేమిటి? ఎవరైనా నవ్వుతారు.

రామానందు: మాపిల్ల కే మండోయ్! లక్ష్మీవిగ్రహం! పెద్దదానికి ౧౮. వేలు ఇచ్చారు. మీ కేరుగరు కాబోలు!

హానుమాన్ దాసు: ఏమి లక్ష్మీవిగ్రహం! వట్టి వంకరముక్కు!

రామానందు: [ఆశ్చర్యముతో] వంకరముక్కా!

హానుమాన్ దాసు: మెల్లకన్ను కూడా.

రామానందు: మెల్లకన్నా?

హానుమాన్ దాసు: ముద్ద పెదవులు.

గోపీ చందు: గొగ్గి పన్ను.

రామానందు: [నిర్ఘాంతపోయి, ఒకరి తరవాత ఒకరిని చూస్తూ] మీ కళ్ళమయినా కాయలు కాచాయా ఏమిటి! ఫోటోగ్రాఫు ఇస్తినే!

హనుమాన్ దాసు: అది దొంగ ఫోటోగ్రాఫు. ఎవరిదో తెచ్చి ఇచ్చాను. ఈటక్కు ఎవరికీ తెలియదు!

రామానందు: అయ్యా, ఈ వేషాలు మా దగ్గిర లేవు. కావలిస్తే నాలుగు డబ్బులు ఎక్కువ పుచ్చుకుంటాము. కాని ఇలాంటి పనులు మా చేత గావు. మా పిల్ల సంగతి ఎవరినైనా అడగవచ్చు. ఏమయినా అపలక్షణంగా ఉన్న దంటే మీరు చేసుకోవద్దు.

హనుమాన్ దాసు: ఇదంతా ఎందుకు? నేను మీ యింటికి వస్తాను పిల్లదాన్ని చూపిస్తావా?

రామానందు: [కొంచెం ఆలోచించి] రండి.

హనుమాన్ దాసు: ఏమి రా, గోపీ, వెళ్ళుదామా?

రామానందు: అతనుకూడా ఎందుకు?

హనుమాన్ దాసు: నాకు చత్వారం. వాడు బాగున్న దంటే నేను ఉంటాను.

రామానందు: ఇదేమి సబబ్ సేట్‌జీ! ఈడు వచ్చిన పిల్లను పరాయి వాళ్ళకు చూపుతామా! మీ రంటే—

హనుమాన్ దాసు: చూశావురా గోపీ! ఆ!

గోపీ చందు: నేను చెప్ప లేదూ?

రామానందు: [లేచి] అయ్యా, నేను వెళుతున్నాను. ఆఖరు మాట ఏమంటారు?

హనుమాన్ దాసు: ఏ అనాకారిదో అనాకారిది. ఎనిమిదివేలిస్తాను. ఇష్టమయితే ఫయిసల్ చెయ్యండి.

రామానందు: మా పిల్ల మీకు కుదరదు లెండి! [నిష్క్రమణ]

హనుమాన్ దాసు: ఏమిరా గోపీ, ఇలా అయింది?

గోపీ చందు: పోనిత్తురూ! మీకు నేను వేరే సంబంధం చూస్తాను. ఉండండి.

హనుమాన్ దాసు: నీ కేం చేత నవుతుంది? పైగా ఎక్కడ చూసినా ఈరోజుల్లో పిల్లలు తగని ప్రియం. మాట కన్నానే గాని పన్నెండు వేలు ఎంత చవక! ఇది దాటి పోయిందా, ఇక ఉత్తదే.

గోపీ చందు: ఆమాట నేను నమ్మను. పోనీ, పిల్ల అయినా చక్కని దైతే అనుకోవచ్చు.

హనుమాన్ దాసు: పిల్ల కేం ఫర్వా లేదురా! చిన్నతనంలో ఎప్పుడో చూచిన జ్ఞాపకం. బాగానే ఉండేది. [ఫొటో తీసి] ఇదే మొహం అను కుంటాను ఒరే అప్పడు రా, ఇదే రా చూడు, నీవు వెళ్ళి రామానందుకు ఒకసారి పిలుచుకురా.

గోపీ చందు: నామాట వింటే ఈసంబంధం మానెయ్యండి. మొదట నుంచీ ఇదంటే నాకేమో అనుమానం పట్టుకుంది. మీ సుఖానికి రాలేదు.

హనుమాన్ దాసు: కానులే. నీవు పిలుచుకురా. లేకపోతే ఒకపని చెయ్యి. నన్ను మాస్తే వాడి కాళ్ళ ఎక్కువవుతుంది. నీవే మాటాడు. తొమ్మిదివేలు చెప్పు. కాదు కూడదంటే — పది.

గోపీ చందు: నామాట వినరుగా?

హనుమాన్ దాసు: పోనీ నీవూ వద్దులే. మా బావమరిదిని పంపుతా. నీవు నీపని చూడుకో.

గోపీ చందు: ఎందుకూ, నేను వెళ్ళి వస్తానులెండి. నా కేం కష్టం? మీ మేలు కోరేవాణ్ణి గనక నాకు తోచింది చెప్పాను. ఏమంటారు?

హనుమాన్ దాసు: పోయిరా.

గోపీ చందు: పోవలసిందేనా?

హనుమాన్ దాసు: ఫరవా లేదు, పోయిరా. ఆఖరుమాట పదివేలు. మరచిపోయేవు! పైన చిల్లిగవ్వ అయినా పెట్టవద్దు. దాని ముండ మోసిన సంబంధం! [నిష్క్రమణ]

గోపీ చందు: ఆదైవం దలచవల్ల ముందుగానే ముండ మోస్తే బాగుం టును! [నిష్క్రమణ]

౨

[రామానందు గృహము. గోపీచందు ప్రవేశించి తలుపు తట్టుతాడు.]

గోపీ చందు: లక్ష్మి, లక్ష్మీ!

లక్ష్మి: [లోపలినుంచి] ఎవరూ?

గోపీ చందు: నేను.

లక్ష్మి: నేనంటే?

గోపీ చందు: నేను గోపీచందును.

లక్ష్మి: ఎందుకూ?

గోపీ చందు: ఎందుకని అడుగుతున్నావా? నేను గోపీచందును.

లక్ష్మి: ఏమయితే? [బిగ్గరగా] ఎందుకు వచ్చావూ?

గోపీ చందు: [ఏమీ తోచక] రామానందజీ ఇంట్లో ఉన్నారా?

లక్ష్మి: లేరు, పో.

గోపీ చందు: లక్ష్మీ!

లక్ష్మి: అః! ఏమిటి సొద?

గోపీ చందు: ఒకసారి ఇలా రా: మాట.

లక్ష్మి: [వచ్చి] ఏమిటి మాట?

గోపీ చందు: ఇంత కటికదాన వయినా వేం? తార యెక్కడ?

లక్ష్మి: పట్టపగటి వేళ, ఇపు డేం తార? నీ కేమయినా మతి పోయిందా! పో, పో.

గోపీ చందు: అబ్బ, చెపుదూ! తారాబాయి యేది?

లక్ష్మి: ఏవూరు వీది? ఎవరు నీవు? తారాబాయితో నీ కేం పని?

గోపీ చందు: ఇదేమి లక్ష్మీ! ఇవాళ ఇలా మాటాడుతున్నావు! నన్ను ఎరగనే ఎరగవా?

లక్ష్మి: ఆ, బాగా ఎరుగుదును! నీవు చచ్చిపోయి వారం రోజు లయిందన్నారు. ఎలా బతికి వచ్చావని ఆశ్చర్య పడుతున్నా.

తారా బాయి: [ప్రవేశించి] హరి హరి! ఎంతమాట అన్నావే పాపాత్మురాలా! నీకు నో రెలా వచ్చిందే!

లక్ష్మి: నీవుకూడా ఆయన పక్షమే పలుకుతున్నావా! ఛీ ఛీ! మీ మొంగాలు చూడ కూడదు! [నిష్క్రమణ]

గోపీ చందు: [క్షణము నిశ్శబ్దంగా ఉంది] తారా, నీతో ఒక పెద్ద సంగతి చెప్పడానికి వచ్చాను.

తారా బాయి: అవును. అక్కర లేదు లెండి!

గోపీ చందు: ఏమి! నీకూ పనికి రాకపోయినానా! ఆహా! నా బతుకు ఎంత వ్యర్థ మయింది!

తారా బాయి: [అతని ముఖం వంక చూడకుండా అతనికోసం చెయ్యి చాపుతుంది.]

గోపీ చందు: ఎందు కావిముఖత?

తారా బాయి: వారం రోజులనుంచీ కనబడడం లేదని లక్ష్మికి కోపం వచ్చింది.

గోపీ చందు: నీకుగూడా వని తోస్తుంది.

తారా బాయి: లేదు- అదే- వచ్చింది- కాని, మిమ్మల్ని చూడగానే పోయింది.

గోపీ చందు: పుట్టి నప్పటినుంచీ ప్రేమ ఎలాటిదో, సుఖము ఎలాటిదో ఎరగను! నీకుకూడా నామీద మనసు తప్పిపోతే—

తారా బాయి: మీ రామాటలు మాటాడ వద్దు. నాకు కష్టంగా ఉంటుంది!

గోపీ చందు: లేదు. అయితే, ఎనిమిది రోజాలనుంచీ నిన్ను. చూడకపోవడానికి ఎంతకారణ మున్నదో నీ కేమి తెలుసు కున్నావు? మిన్ను విరిగి మీద పడేటంతపని అయింది! పడుతుంది కూడాను — మనం తప్పుకోకపోతే.

తారా బాయి: అంత ప్రమాద మేమి వచ్చింది?

గోపీ చందు: మీ నాయన — నీకు — సంబంధం — కుదిర్చాడు.

తారా బాయి: [కొంచెం ఉండి] ఎవరికి?

గోపీ చందు: తారా, ఇన్నాళ్ళనుంచీ మన మిద్దరం స్నేహంగా ఉన్నాము. నీకు పెళ్ళి అయి మహాదశలో ఉంటే, పేదవాడు గోపీచందు ఎప్పుడైనా జ్ఞాపకం వస్తాడా?

తారా బాయి: సంబంధం కుదిర్చిం దెవరికి?

గోపీ చందు: మా సేటుకు — హనుమాన్ దాసుకు. తారా! నీ పేరైనా అనుకో గాని మీ నాయనవంటి దుర్మార్గుడు లేడు! నిన్ను పన్నెండు వేలకు అమ్ముకొంటున్నాడు.

తారా బాయి: ఇది చెప్పడానికేనా నీ విక్కడికి వచ్చింది? అయితే, గోపీచంద్, నీ విక వెళ్ళిపోవచ్చును.

గోపీ చందు: కాదు, కాదు. అసలుసంగతి అట్టే ఉన్నది. ఇలా రా. [తారను దగ్గిరికి తీసుకుని చెవిలో ఏమో చెపుతాడు.] ఏమంటావు?

తారా బాయి: బాగానే ఉన్నది. కాని నెరవేరే దాకా చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈఉపన్యాస మెలా తోచింది మీకు?

గోపీ చందు: చబీల్ దాసు సలహా చెప్పాడు తారా! నా ప్రాణాలు తిరిగి నిలబెట్టావు! నీవు ఒప్పుకోకపోతే—

లక్ష్మి: [ప్రవేశించి] అమ్మా. తారాబాయి! నీ కింత సిగ్గులే దేమమ్మా! ఈ ఉదయం నీవు చేసినప్రతిజ్ఞ ఏమిటి? ఇప్పుడీపాషండుడితో నీవు జరిపే చర్య లేమిటి!

తారా బాయి: [కోపముతో] లక్ష్మి!

గోపీ చందు: ఇదుగో తారాబాయి, ఇటు చూడు, నీవు నాభార్యను కోప్పడితే నే నూరుకునేది లేను. ఆమె ఏమన్నా పడేవాణ్ణి నే నుండగా నీ కెందుకు?

తారా బాయి: [నవ్వుతూ] అప్పుడే నాభార్య అంటున్నారు. లక్ష్మి మిమ్మల్ని పెళ్ళాడుతుందో లేదో!

గోపీ చందు: ఏదో కాళ్ళా వేళ్ళా బడి వేడుకుంటాను.

తారా బాయి: పట్టి గయ్యాళిది సుమా — ముందుగా చెప్తున్నాను ఆలోచించి సరీ నిశ్చయించుకోండి.

లక్ష్మి: [మొగము చిట్లించి] ఇదేమిటి, ఈ కొత్త వికారం?

గోపీ చందు: లక్ష్మి, నేను అరవైయేళ్ళ ముసలివాణ్ణి. కాని వేలకువేలు ఆస్తి ఉన్నది. నన్ను పెళ్ళిచేసుకుంటావా?

లక్ష్మి: నీవు ముసలివాడవైతే ఇందాక జుట్టు పట్టుకొని వీధిలోకి లాగెయ్యక పోయినానూ! పడుచువాడివి కాబట్టి బతికిపోయినావు!

గోపీ చందు: నవ్వులాట కాదు లక్ష్మి, నిజంగా అడుగుతున్నాను.

లక్ష్మి: అయితే నవ్వకుండా చెప్పుతా. నేనసలు పెళ్ళి చేసికో దలచుకోలేదు. నాజీవన మంతా మా తారాబాయితో గడపదలసిందే!

తారాబాయి: అది కాదు లక్ష్మి! నీవు పెళ్ళి చేసుకుంటే నేను సంతోషిస్తాను.

లక్ష్మి: నీకు తప్పక సంతోషం కలుగుతుందా?

తారా బాయి: చాలా సంతోషము.

లక్ష్మి: అలా గయితే నేను కోతిని పెళ్ళాడమన్నా పెళ్ళాడుతా! ఒకవిధంగా నీసంబంధం బాగున్నది. గోపీచందూ, పడుచువాళ్ళతో వేగలేము. ముసలివాడయితే మాటలకు లొంగక పోయినా, చీపురుకట్ట చేత పట్టేటప్పటికి దయ్యం పారిపోతుంది.

తారా బాయి: [లక్ష్మిని కౌగిలించుకొని] లక్ష్మి, నీ వీపెళ్ళి కొప్పుకుంటే నాప్రాణం తప్ప ఏదైనా ఇస్తానే!

లక్ష్మి: అదికూడా ఎందు కియ్యరాదు?

తారాబాయి: [గోపీచందువంక చూస్తూ] అది యీవరకే ఇంకొకరి అధీనమైపోయింది!

లక్ష్మి: పోనీ లే. అయితే మీ పన్నాగమేమిటి?

తారాబాయి: నీకు తీరికగా చెప్తాతా ... అమ్మయ్యో! నాన్నొస్తున్నాడు! రా, రా, రా [లక్ష్మిని లాగుతుంది, నిష్క్రమణము]

లక్ష్మి: ఆ, పోదూ. ఏమయితే? అయితే గోపీచందూ, ఎప్పుడు మళ్ళీ దర్శనం?

గోపీ చందు: ఈసాయంకాలమే తోటలో. పో పో!

లక్ష్మి: రాకపో, చెవుతా [నిష్క్రమిస్తుంది]

[గోపీచందు కుర్చీలో కూర్చుని తదేకధ్యానముతో వార్తాపత్రిక తిరగ వేస్తూ ఉంటాడు. రామానందు ప్రవేశము]

గోపీ చందు: [లేచి] రాం రాం!

రామానందు: ఓహో గోపీచందా! రాం రాం! ఏం పనిమీద వచ్చావు?

గోపీ చందు: కొంచెం పనిమీదనే వచ్చాను. సావకాశంగా వింటే—

రామానందు: వస్తా, లక్ష్మీ, లక్ష్మీ!

లక్ష్మి: ఓయి!

రామానందు: ఏం చేస్తున్నావు?

లక్ష్మి: చెల్లెలికి తలంటుతున్నా. ఎందుకూ?

రామానందు: సరే, ఏమీ లేదులే. [కూర్చుని] అయితే గోపీచంద్, ఏమిటోయి నీపని?

గోపీ చందు: మీవద్ద దిక్కులేనిపిల్ల ఒకతె పెరుగుతూందని విన్నాను. ఆ అమ్మాయి విషయమై మాటాడటానికి వచ్చాను.

రామానందు: ఎవరు—లక్ష్మీబాయి సంగతా!

గోపీ చందు: పేరు నాకు తెలియదు. అమే కాబోలు!

రామానందు: ఏమిటి దానివిషయము? ముసలాడి దృష్టి దానిమీదికి తిరి

గిందా యేం? మనం చూడం! చస్తే ఆలా సంబంధం మార్చి చేస్తానా?

గోపీ చందు: కాదు కాదు, రామానందజీ! మా సేటు విషయ మేమీ లేదు ఇందులో.

రామానందు: మ రేమిటి?

గోపీ చందు: నాకోసమే అడగడానికి వచ్చాను.

రామానందు: నీకోసమా! నా రే వా! నీవు పెళ్ళి చేసుకుంటావా దాన్ని!

గోపీ చందు; అవును సేట్‌జీ!

రామానందు: ఊహూ, బాగానే వుంది. కాని నాకు మీతో వ్యవహారాలు కుదరవు. మీ సేటు పెళ్ళి అయింది — ఇక నీ దవుతుంది! నాకు నమ్మకం లేదు.

గోపీ చందు: అన్నీ కుదురుతయి మీరు కొంచెం సరసంగా ఆలోచిస్తే. అయినా మా సేటు పెళ్ళిలాటిది కాదుగా నావ్యవహారం?

రామానందు: ఏమి?

గోపీ చందు: అహా! మీకు తెలియని దే మున్నది? నే నడిగేది మీస్వంత కుమార్తె కాదుగా!

రామానందు: కాకపోతే మాత్రం? ఇంట్లో పెరిగిన పిల్లను పదిరేటవ్వాడు చేతులు ఖాళీ చేసుకు వదలుతామా, గోపీచందూ! మర్యాద లేదూ?

గోపీ చందు: అవును లెండి. నేను మాత్రం అలా కోరుతానా, ఏదో లాభం చూపించకుండా? అహా, దానమ్మకడుపు కాల! అంతేనా?

రామానందు: సరె సరె. అయితే ఏమి చెప్తావో కానీ.

గోపీ చందు: మీరే ఏదో శాస్త్ర తేల్చిగా సెల వివ్వండి.

రామానందు: సరే, అమ్మాయికి పన్నెండుగదా — అక్కీనికి నాలుగు ఇప్పించు. ఏం, నవ్వుతా వేమి?

గోపీ చందు: ఏం చెయ్యను? మా సేటుదగ్గిర చెప్పినట్టే చెప్తితే ఎలా నాదగ్గిరకూడా! మనలో మనకు—

రామానందు: ఏమి టోయి, అలా అంటావు? పెద్దమ్మాయికి ౧౮ వేలు పుచ్చుకున్నాను.

గోపీ చందు: అవును లెండి. అరహస్యం మనకు తెలియదూ, తొమ్మిది వేలకేగా బేరం ఖయిన లయింది?

రామానందు: ఎవరు చెప్పారు?

గోపీ చందు: ఆహా, మనలో మాట.

రామానందు: ఊ, అయితే ఏ మంటావు?

గోపీ చందు: ఏమీ లేదు. ఎనిమిదంటున్నాడా, తొమ్మిది చేయిస్తాను. రెండు పెళ్ళిళ్ళూ ఏర్పాటు చెయ్యండి.

రామానందు: చాలు చాల్లే, పద పద! ఇలాటి బేర మైతే ఎక్కడ కుదురుతుంది?

గోపీ చందు: ఒకమాట వినండి సేటజీ! ఇంతకన్న మన కెక్కడ వస్తుందా?

రామానందు: దాని కేమిలే. పదిసంబంధాలు తిరిగిపోతున్నాయి.

గోపీ చందు: నాకు గంతలు కడతారా? గణపతిదాసు ఒక్కడు. వా డైనా ఆరువేలేగా.

రామానందు: ఎక్కడివాడ వోయి నీవు!

గోపీ చందు. ఆహాఁ, మనలో మాట.

రామానందు: సరే, సరే, ఏ మంటావు? ఏదో తేల్చు.

గోపీ చందు: పోనీ లెండి. ఏదో విధంగా మామగారు కాబోతున్నారు. మంచి అంకె పది అందామా? అలా చెయ్యండి. మాసేట్ ఇస్తాడు. మీకు తెలియని దే ముంది? అరహస్యం అలా ఉంచండి. మరి ఎప్పుడు ముహూర్తాలు?

రామానందు: ఆప నంతా నీదే!

గోపీ చందు: సరే రేపు ఉదయం వస్తాను.

రామానందు: ఏమిటో చాలా దవగ్గా కొట్టేశావోయి!

[గోపీ చందు నిష్క్రమిస్తాడు]

3

[రామానందు గృహము. రామానందు, చబిల్ దాసు ప్రవేశము.]

చబిల్ దాసు: మొత్తానికి బాగా జరిగించారు పెళ్ళిళ్లు.

రామానందు: ఏదో మీ అందరి దయ ఉండబట్టి. కాని మాఅల్లుడి గను పోకటి లేకుండా ఉంటే చాలా సంతోషించేవాణ్ణి.

చబిల్ దాసు: ఏ అల్లుడు?

రామానందు: ఎవ రున్నారు— పెద్దాయనే.

చబిల్ దాసు: అప్పాడే ఏ మయింది లెండి!

రామానందు: ఏ మన్నారు?

చబిల్ దాసు: ఎప్పుడూ ఉండేదే గదా అంటాను. ముసలివాళ్ళకు తృప్తి లేదు రామానందజీ!

రామానందు: ఈయనగారికి అసలు లేదు. ఏదో కక్కుర్తి పడ్డాను గాని బంగారం వంటిపిల్లను ఇలాటి వాడికా ఇయ్యావలసింది!

చబిల్ దాసు: గోపీచందు కయితే ఈడు జోడుగా ఉండేదేమో!

రామానందు: ఉండేదే కాని [నోరు చప్పరించి] డబ్బు లేదయ్యా!

చబిల్ దాసు: డబ్బుచూదుకొని పిల్లదానిసుఖం చెడగొట్టుతారా సేట్ జీ?

రామానందు: ఆ! సుఖాని కేం లెద్దురూ! ఎక్కడ భాగ్యం ఉంటే అక్కడే సుఖం. పేదవాణ్ణి కట్టుకుని ఏం సుఖపడుతుంది ఆడది?

చబిల్ దాసు: అ దేమి మాట! పరస్పరప్రేమవల్ల సుఖం కలగవలె గాని ధనం ఎప్పుడూ సుఖం ఇయ్యా లేదు.

రామానందు: చిన్నవాళ్ళకు తెలియవు లెండి ఈగొడవలు.

చలిల్ దాసు: ఇంతకూ మీకు— అరుగో దంపతులు వస్తున్నారు.
[లక్ష్మీ హనుమాన్ దాసులు ముందు, వారివెంబడి తారా గోపీచందులు ప్రవేశించి రామానందుకు నమస్కరిస్తారు. లక్ష్మీ తారాబాయివలెను, తారాబాయి లక్ష్మివలెను వేషాలు ధరించి మేలిముసుగులతో ఉంటారు.]

రామానందు: [లక్ష్మీ, హనుమాన్ దాసులను] సర్వైశ్వర్యాభివృద్ధి రస్తు! [తారా గోపీచందులను] శీఘ్రమేవ సుపుత్రప్రాప్తి రస్తు.

హనుమాన్ దాసు: ఏడనివట్టే ఉంది దీవన!

గోపీచందు: [మెల్లిగా] చాలా బాగా దీవించారు.

రామానందు: హనుమాన్ దాసుగారూ! మీరు నాకన్న పెద్దవారయినా—

హనుమాన్ దాసు: అదుగో మాటాడితే నన్ను ముసలివాడంటావు. నావయసు సంగతి నీ కెందుకు?

రామానందు: పోనీ, నాకంటె మీరు చిన్నవారు కాబట్టి—

హనుమాన్ దాసు: అదుగో, మళ్ళీ వయసుమాట!

రామానందు: లేదు లెండి బాబూ! మాఅమ్మాయి తల్లి లేనిపిల్ల— వట్టి అమాయకురాలని చెప్పవచ్చాను.

హనుమాన్ దాసు: [గొణుగుకొంటూ] ఏమి అమాయకురాలో— ఇందాక చీందెలో ఉంగరం తీయబోతే చెయ్యంతా తెగ గిచ్చింది.

రామానందు: ఏమిటో అన్నారు— వినిపించ లేదు.

హనుమాన్ దాసు: నీమాట కాదులే.

రామానందు: ఏదో ఇన్నాళ్ళు పెంచి మీ చేతుల్లో పెట్టాను. ఎన్నడూ కష్టం అన్నమాట ఎరుగదు. ఎలా ఏలుకుంటారో.

హనుమాన్ దాసు: హనుమాను చెప్పాలా? [మెల్లిగా] ఇది ఆరోది.

రామానందు: అమ్మాయీ, తారా! ఇలా రా అమ్మా. ఊరుకో— ఇది శుభసమయము. కంట నీరు పెట్టరాదు. నీభర్త చాలా పెద్ద— అదే మర్యాదస్థుడు. జాగ్రతగా మసలి పరువు ప్రతిష్ఠలు సంపాదించుకో.

[లక్ష్మి రామానందుని విడిచి భర్తకు నమస్కరిస్తుంది.]

హనుమాన్ దాసు: [మందంగా] అహా, చాలా బుద్ధిమంతురా లల్లే ఉన్న దయ్యో యిది- ఏమో అనుకున్నా.

రామానందు: గోపీచందూ, మా లక్ష్మి వట్టి అజ్ఞానురాలు సుమా! నీవు చిన్నవాడవు—

హనుమాన్ దాసు: అమ్మగో! మళ్ళీ నన్నవమానిస్తున్నావు.

రామానందు: లేదు లెండి, లేదు లెండి. [మెల్లిగా] వీడి కాదు లెగ! వీ డెక్కడ దొరికాడురా మాకు! [బిగ్గరగా] గోపీచందూ, నీవూ అజ్ఞానుడవే. అన్నిగా సంసారం నిలబెట్టుకోండి. నీవు బుద్ధిమంతుడవే అయినా హనుమాన్ దాసుగారిని చూసి లక్ష్మిని నీకిచ్చాను.

[తార తండ్రిని కౌగిలించుకొని దుఃఖిస్తుంది.]

రామానందు: ఊరుకో తల్లీ, ఊరుకో!

గోపీ చందు: [హనుమాన్ దాసును సమీపించి] సేట్ జీ! మీ ఋణం ఈజన్మలో తీర్చుకోలేను. మీరు తెలిసుకుండా నాకు మహోపకారం చేశారు. ఈ పెళ్ళి ఎలా అవుతుందా అని ఎన్నాళ్ళనుంచో ఆదుర్దా పడ్డాను. మీదయ వల్ల మీవివాహము మధ్య రావడమువల్ల నాకోరిక నెరవేరింది. నేను ఆశించిన పిల్ల నాకు లభించింది. నాసౌఖ్యానికి అంతకూ మీరే కారకులు. జన్మాంతమువరకూ భార్యాభర్తల మిద్దరమూ మిమ్మల్ని తలుచుకుంటూ ఉంటాము.

హనుమాన్ దాసు: మంచివాడవురా, నాయనా! సుఖంగా ఉండు.

రామానందు: అమ్మాయి, ఇక మనం వెళ్ళదాము [నిష్క్రమిస్తాడు. తార తండ్రితో నిష్క్రమిస్తుంది]

[చబిల్, గోపీచందులు ఇవతలికి వచ్చి జనాంతికము]

చబిల్ దాసు: ఏమిరా గోపీ, నీకోరిక నెరవేరింది కదా!

గోపీ చందు: నీమేలు మరచిపోలేను చబిల్!

చబిల్ దాసు: మనము పెళ్ళికూతుళ్ళను మార్చినసంగతి ఇంకా మీసేటుకు తెలియనట్లే ఉంది.

గోపీచందు: ఇదుగో ఇకను—

చబిల్ దాసు: తెలియగానే నిప్పులు తొక్కిన కోతివలె ఎగిరిపడతాడు.

గోపీ చందు: కొత్త మన మాతమాషా చూడాలి.

హనుమాన్ దాసు: [మెల్లిగా] ఏమి టావైభవ గుసగుస! ఎంతసేపటికీ పోలేం?

చబిల్ దాసు: మీసేటుదగ్గిర ఫోటో ఏం చేశావు?

గోపీ చందు: మార్చేశాను.

చబిల్ దాసు: సరే. నే వెళ్ళుతా.

గోపీ చందు: నేనూ వస్తా. [సేటును సమీపించి] సేట్ జీ! సెలవు తీసుకుంటాను. మళ్ళీ కనబడతాను.

హనుమాన్ దాసు: పోయి రా.

[గోపీచంద్ నమస్కరించి చబిల్ తో వెళ్ళుతాడు.]

హనుమాన్ దాసు: [భార్యను, సమీపించబోయి ఆగి, గొణుగుతూ] దీని దుంపతెగ! ఎన్నిసార్లు అనుభవ మయినా కొత్తపెళ్ళికూతురు దగ్గరకు వెళ్ళేటప్పటికి వణుకు పుట్టుకొస్తుంటుంది. [మెల్లిగా దగ్గరికి పోయి] ఓసే, ఇదుగో, ఎవరూ లేరులే. నేనేగా. ఇదుగో ఇటు చూడు, ఏదీ మొహం మేదీ! కొత్త అను కుంటున్నావు! ఏది ఒక్కముద్దు! అంత సిగ్గెందుకు? నేనేగా, ఎవరూ లేరులే. ఏది!

లక్ష్మి: ఏమని మొగం చూపించేది! ఒక సొమ్ము పెట్టారనా, ఒకచీర ఇచ్చారనా?

హనుమాన్ దాసు: నేను భయపడుతునే ఉన్నా. వీళ్ళకు మాటాడితే సొమ్ము. ఎప్పుడూ ఉండేదే ఇది! [బిగ్గరగా] సొమ్ముకేం భాగ్యం! నాసొమ్మంతా నీదే, నీసొమ్మంతా నాదే. పెళ్ళికి ఇరవైవేలు ఖర్చామరి! అప్పుడే ఎక్కడనుంచి వస్తుంది? నాలుగే ళ్ళాగితే—

లక్ష్మి: వాళ్ళందరికీ పెళ్ళప్పుడే చేయించి పెట్టారటగా!

హనుమాన్ దాసు: వాళ్ళు కా పెళ్ళివాడు కాదు గదా, నూరేళ్ళు బతికినా చిల్లిగవ్వయినా మెళ్ళో వేసేవాణ్ణేనా?

లక్ష్మి: ఆహా! అయితే నాకూ అలాగే?

హనుమాన్ దాసు: అహాహాహా! నీ కలా కాదు. నీసంగతి వేరు. చూస్తుండు.

లక్ష్మి: అవును, నాలుగేళ్ళు ముక్కుల్లో వేళ్ళు పెట్టుకు కూర్చోవలె!

హనుమాన్ దాసు: పోనీ, ముందటేటి కేమైనా చూస్తాలే.

లక్ష్మి: ఏడాది దాకానా? నా కక్కర లేదు.

హనుమాన్ దాసు: వచ్చే నెలలో ఒక ఉంగరమో, ఏదో చేయించనా?

లక్ష్మి: ఇంటికి వచ్చేమట్టం, పోయేమట్టం. పెళ్ళి చేసుకుని పెద్దమ్మ వారి లాగు అందరి యెదట తిరుగుతానా? నా కే మక్కర లేదు.

హనుమాన్ దాసు: పోనీ, ఒక వారంరోజు లాగు.

లక్ష్మి: వారంరోజులే! అప్పటికి పెళ్ళికూతురుతన మంతా పోతుంది.

హనుమాన్ దాసు: వారంరోజు లాగవూ?

లక్ష్మి: రే పుదయం కంసాలిని పిలిచి, నాగరం, కాసులపేరు, కంఠె, మెడలో పట్టెడ, నడుముకు వడ్డాణం— ఇవన్నీ చేయిస్తానంటే సరే! లేకపోతే ఇక్కడ ఒక్కక్షణం ముండను. ఈతాళిబొట్టుకూడా మీరే తీసుకోండి. నేను పోతా.

హనుమాన్ దాసు: [మెల్లిగా] నాకొంప దివాలాకే వచ్చింది. [ప్రకాశముగా] ఓహో! బాగున్న దే! చిన్న పిల్లవుకదా అని ఏదో సౌఖ్యంతో చింది చేయింతామనుకొన్నా. ఇలాంటి మారాములు నాదగ్గిర సాగవు. బాగానే ఉంది పెంకితనానికి!

లక్ష్మి: [దుఃఖముతో] అయ్యో! నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు? నన్ను పెళ్ళి చేసుకోకపోతే మీడబ్బంతా మీదగ్గరే ఉండేదిగా! అయ్యో! ఈతిట్లు తినడానికే కాబోలు మానాన్న నాకు పెళ్ళిచేశాడు.

హనుమాన్ దాసు: లేదులే. ఎరక్కపోయి అన్నా! ఊరుకో, ఊరుకో. ఎవరైనా వింటారు, ఊరుకో.

లక్ష్మి: మీరు తిట్టడం బాగానే ఉంది, నాకు దుఃఖము వస్తే తప్పా!

హనుమాన్ దాసు: లేదులే. నిన్ను తిట్టానా?

లక్ష్మి: ఇష్టం వచ్చినట్టు తిట్టి, పైగా తిట్టలే దనడం కూడానా!

హనుమాన్ దాసు: లేదులే ఊరుకో. నీవు దుఃఖిస్తే నేను చూడగలనా? ఆ ముఖ మంతా ఎంత వాడిపోతుంది! ఆ కమలముల వంటి కన్నులూ, ఆ దొండపండు వంటి అధరోష్ఠమూ, ఎంత మలిన మైపోతవి! ఏదీ, ఒక్క సారి నీముఖము చూడనీ! నీఫోటో చూచుకొని ఎంత మురుస్తూ ఉండే వాణ్ణి! ఏదీ?

[హనుమాన్ దాసు మెల్లిగా లక్ష్మి మేలిముసుగు తొలగిస్తాడు. లక్ష్మి నవ్వుమొగముతో కనబడుతుంది. హనుమాన్ దాసు చూచి, కన్నులు నులుముకొని మళ్ళీ చూచి నిర్ఘాంతపోయి నాలుగు దిక్కులా చూస్తాడు.]

లక్ష్మి: ఎందుకలా చూస్తారు?

హనుమాన్ దాసు: నీ వెవరు?

లక్ష్మి: నే నెవరా? అప్పుడే అందాకా వచ్చిందా!

హనుమాన్ దాసు: రామానందు కూతురు నీవేనా?

లక్ష్మి: అయ్యో! నేను మానాన్నకూతుర్నే కదా! అయ్యో, నా బ్రతుకు చెడ! ఇంత మాట అనిపించుకోవడానికా భగవంతుడు నన్ను సృష్టించాడు? అయ్యో! నాన్నా! నీకూ నాకూ సంబంధం తెగిపోయింది. నేను నీకూతుర్నే కాదట! అయ్యో—

హనుమాన్ దాసు: [పెట్టెలోనుంచి ఫోటో తీసి చూచి] అంతా ఇదే పోలికగా ఉన్నదే! నా కేమైనా మతిభ్రమ కలుగుతున్నదా యేమిటి!

లక్ష్మి: [సమీపించి ఫోటో చూచి] అది నా ఫోటోయే. నాపోలిక గాక ఇంకా ఎలా ఉంటుంది? మీకు నిజంగా మతిపోయింది!

హనుమాన్ దాసు: [దడబిడలాడుతూ] నా కేదో హైరు చేశారు. నాకొంప తీశారు. ఈఫోటో ఇదివర కిలా లేదు. నాకళ్ళకు గంతలు కట్టారు. అయ్యో! గోపీచందూ, నీమాట వినకపోతినిరా! నన్ను కామానందు నట్టేట్లో ముంచాడురా! [గోల పెట్టుతాడు]

గోపీచందు: [తత్తరముతో ప్రవేశించి] ఏమిటి సేటుజీ ఏమిటి, ఏమిటి?

లక్ష్మి: [చటుక్కున మేలిముసుగు వేసుకుంటుంది]

హనుమాన్ దాసు: చూడు, చూడు. ఈఫోటో చూడు నాకొంప ముంచారురా, చూడు!

గోపీ చందు: ఏమి సేటుజీ! ఈఫోటో కేమి? మన మిదివరకు చూచిందేగా!

హనుమాన్ దాసు: ఇదివరకు చూచినదేనా!, నీవెవరు గోపీచందువేనా?

గోపీ చందు: అ దేమి సేట్ జీ, అలా అడుగుతారు?

హనుమాన్ దాసు: ప్రపంచ మంతా ఎప్పటిమోస్తరుగా కనబడుతుంటే ఈఫోటో ఒక్కటే మారిపోయిం దేమిటిరా! తిన్నగా చూడు.

గోపీ చందు: లేదు సేట్ జీ, ఫోటో ఎప్పటిలాగానే ఉన్నది.

హనుమాన్ దాసు: గోపి, మన ఇద్దరిలో ఎవరికిరా గుడ్డి; నీకా నాకా?

గోపీ చందు: మీకు కొంచెం చత్వార మన్నమాట వాస్తవమే కాని, ఆమాత్రానికే గుడ్డితన మంటామా?

హనుమాన్ దాసు: నీచత్వారం చట్టుబండలు గాను! ఇలా స్పష్టంగా కనబడుతుంటే చత్వార మేమిటిరా?

గోపీ చందు: అదే తమాషా! చత్వారంలో ఉండే కిటుకే అది, అన్నీ కనబడుతున్నట్టే ఉంటయి.

హనుమాన్ దాసు: అయితే ఇదే అఫోటో అంటావు?

గోపీచందు: అచ్చంగా అదే మీకు జ్ఞాపకం లేదూ? నాకు చూపిస్తూ ముక్కు కొంచెం వంకరగా ఉంది, కంట్లో కాస్త పెల్లకూడా ఉన్న దన్నారు.

హనుమాన్ దాసు: నేనా అన్నది! నువ్వు కాదట్రా?

గోపీ చందు: కాదు. మీరే ముద్దపెదవు అని కూడా అన్నారు. ఇంకా జ్ఞాపకం తెచ్చుకోండి. నేను కాదంటే క్రోధించారు కూడా.

హనుమాన్ దాసు: లోకమంతా తారుమారై పోతున్నది! అయితే ఇప్పుడిది వంకరముక్కు కాదంటావు?

గోపీ చందు: ఎబ్బే! వంక రెక్కడ? పెన్సిలు ముల్లులాగా సాపుగా ఉంటే.

హనుమాన్ దాసు: అలా కాదు. ఊరదు. అసలు ముక్కు చూచి చెప్పాదువు గాని వంకర ఉందో లేదో, ఆ ముసుగు తియ్యావే! ఎందుకు వచ్చిన ముసుగూ!

గోపీ చందు: అమ్మా! మీకు బిడ్డలాంటివాణ్ణి. ఫరవా లేదు, తీయండి. బాబుగారేదో ఆందోళనలో పడ్డారు. వారి అనుమానం తీరితేనే తప్ప మీకూ మాకూ సుఖం లేదు.

లక్ష్మి: [తలవంచి ముసుగు తీస్తుంది]

గోపీ చందు: చూడండి; సేటుజీ! ఎక్కడైనా వంకర ఉన్నదేమో. అచ్చంగా ఫోటోలో ఉన్నట్లున్నది.

హనుమాన్ దాసు: ఆమాటమాత్రం నిజమే.

గోపీ చందు: ఆహా! ఆ కళ్ళేమిటి, ఆ పెదవు లేమిటి!—నా భార్య మొహాన ఇందులో సగం కళ ఉంటేనా—

హనుమాన్ దాసు: సరే, సరే, చాల్లేవే! ముసుగు వెయ్యి, ముసుగు వెయ్యి అమ్మాయి, గోపీ. ఇక నీవు వెళ్లు. ఏదో పైత్యవికారంగా ఉండి అలా మాటాడానులే.

గోపీ చందు: నేను మొదటే చెప్పితినిగా—పైత్యంతప్ప మరేమీ లేదు. మీ భార్య కేమి సేటుజీ—

హనుమాన్ దాసు: సరే, సరే, పోయిరా.

గోపీ చందు: శెలవు! [వెళ్ళిపోతాడు]

హనుమాన్ దాసు: [కూలబడి] ఊ, ఎవరిని చూడబోయినా ఇలా ఉంది లోకం! ఎవరితోనన్నా చెప్పకుంటే సిగ్గుచాటు. వాడు మొదటే చెప్పాడు- నాసుఖానికి రాలేదని ఓసీ, ఇ దేమి చేవు!

లక్ష్మి: [వెనుకగా వచ్చి, హనుమాన్‌దాసు జుట్టు కొంచెం లాగి విడిచి] అయితే, ఏమిటయ్యా, పెళ్ళి పుస్తె కట్టానుగదా అని పదిమందిలో పరీక్ష చేసి, నాకు పరాభవం చేస్తారా? నాది వంకర ముక్కా? మెల్లకన్నా? మీరు బాగున్నారుకదా—నాచక్కదనంతో మీ కేంపని? ఇంత అవమానం జరిగి, మీకు అంత పనికిరాక పోయినాక నాబతు కెందుకు? ఇదిగో, మీతాళిబొట్టు తీసుకోండి. నే నేదైనా గొయ్యి చూచుకుంటాను. [పోబోతుంది].

హనుమాన్ దాసు: [అడ్డుపడి కాళ్ళు పట్టుకుని] వద్దు వద్దు. కోపం వద్దు. నాబంగారు గాని నాచిలక గా, నాపండు గా! నీవు పోతే ఇం కేముంది! ఎరక్కపోయి అన్నా!

లక్ష్మి: [కన్నీరు పెట్టుకొంటూ] మీరన్న మాటల కింకొకతె అయితేనా-

హనుమాన్ దాసు: లేదు లేదు. నీవు బుద్ధిమంతురాలవు ఆసంగతి మరచిపో.

లక్ష్మి: ఎలా మరచిపోతా నేమిటి? మీకు నామీద ఇంతైనా ప్రేమ లేకపోయిన తర్వాత! మీ సంబాధం కుదిర్చా నని నాన్న వచ్చి చెప్పితే సంతోషం పట్టలేక. ఎగి రెగిరి గంతులు వేశాను. తీరా పెళ్ళి అయినాక ఇలా అయింది నాగతి!

హనుమాన్ దాసు: ఎంతమాట! ఎంతమాట! నీమీద నాకు ప్రేమ లేదూ? చూడు ఏదీ ముద్దు! [ముద్దు పెట్టుకుని మెల్లిగా] హు, ఈ కాకి వది వేల రూపాయిలా? ఏనాటి ఋణానో చెవులు మెలేసి లాగాడు రామా నందు! [బిగ్గరగా] లోపలికి వెళ్ళదామా?

లక్ష్మి: నా నగలమాటేం చెప్పారు?

హనుమాన్ దాసు: [మెల్లిగా] ఇంకా అసల్ ఫాయిదా అంతా తేల్లేదు. [బిగ్గరగా] ఇదుగో చెప్పానుగా రా. [ఇద్దరు వెళ్ళుతారు. గోపీచందు గంతులువేస్తూ ప్రవేశించి] లక్ష్మి, లక్ష్మి.

తారాబాయి: [మేలిముసుగుతో ప్రవేశించి] ఆ పేరున పిలిస్తే నేను పలకను!

గోపీ చందు: ఓసీ అప్పుడే మరచిపోయినావా? ఆ పేరు అడ్డం రాక పోతే మనమీపాటికి ఎలా ఉండేవాళ్ళమో! సరే, ఇక నీ ముఖం చూతాము [హనుమాన్ దాసును అనుకరిస్తూ] ఏది, ఏది, ఎవరూ లేరుగా నేనేగా ఏది ఏది [ఇద్దరూ నవ్వుతుంటారు.]

గోపీ చందు: [తారాబాయి మేలిముసుగు తొలగించి, భుజాలపైన చేతు లుంచి చూచి] తారా, నాకన్న అదృష్టవంతు లున్నారా?

తారాబాయి: ఆ.

గోపీ చందు: ఎవరు?

తారా బాయి: నేను! [ఆలింగనము.]

గజ్జల మొలతాడు

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

*

అంకితము

పద్మావతికి

*

పాత్రలు

భార్య : భర్త

భర్త-అత్తగారు

భర్త-మామగారు

స్థలము: భర్త ఇల్లు. ఈనాటిక ఒకనాటి సాయంకాలం ప్రారంభమై మర్నాడు సాయంకాలానికి సమాప్తి అవుతుంది. సుమారు ౨౪ గంటలు మొత్తంమీద జరిగి ఉంటుంది.

మొదటి రంగము

భర్త కోమల స్వరూపుడు: బక్కపలచగా పొడుగుగా ఉంటాడు. కోలముఖము, పచ్చనిదేహము భార్య కొంచెము లావుగానూ పొట్టిగానూ ఉంటుంది. ఆమెది గుండ్రని ముఖము. కళ్ళల్లో వెర్రిచూపు అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటుంది. ముక్కు కొంచెము విశాలమైనది. చామనిఛాయ మనిషి. సామాన్యంగా తెలుగుదేశంలోని స్త్రీలవలె సుకుమారముగా ఉండవలె ననే ప్రయత్నముకూడా చేయదు.

భర్త చదువుకునే గదిలో కుర్చీలో కూర్చున్నాడు. ఆ గదిలోనుంచి పక్కనున్న హాలులోకి పోయే ద్వారమువద్ద భార్య మొదట నిలుచుని ఉంటుంది. సంభాషణ కొంత సాగిన తర్వాత ఆమె అక్కడనే గడపమీద

కూర్చుంటుంది. హాలులో ఉయ్యాలమంచములో పిల్లవాడు నిద్రపోతున్నాడు. ఏమాత్రమైనా శబ్దమున్నప్పుడల్లా భార్య ఉయ్యాల తొట్టివంక అదుర్దాతో చూస్తూ ఉంటుంది.

భార్య: మీ కామాట అంటే పిచ్చిలా వెర్రిలా పుడతవేం?

భర్త: దుర్మార్గురాలా, స్త్రీలు కోమలస్వభావం కలవాళ్ళని వెర్రివాళ్ళు అంటారే కాని మన పూర్వు లన్నదే నిజం. రామాయణంలో అగస్త్యుడు స్త్రీల సంగతి ఏమన్నాడో తెలుసునా? వాళ్ళు—

భార్య: ఏమో, మీకవిత్వా లన్నీ నాకు తెలియవు. ఆరు నూరు అయ్యేది, నూరు ఆరయ్యేది, పిల్లవాడికి ఆ మొలతాడు పెట్టనియ్యను.

భర్త: [విచారముతో] పిచ్చిదానా, అంత భయ మెందుకూ?

భార్య: ఏమో నండీ, అది చూస్తేనే నాకు పామును చూసినట్లుంటుంది.

భర్త: సొమ్ములో ఏ మున్నదే?

భార్య: ఏమో! ఉన్నా ఉండకపోయినా అది నేను వద్దంటున్నా గదా! మన కది జరిపిస్తే దరిద్రము రాదు. ఐనా సొమ్ములో ఏమీ లేకపోతే మీకు మాత్ర మా పట్టుదల ఎందుకు?

భర్త: [చిరాకుతో] నీపెత్తన మేమిటి? నేను అగ్గల మొలతాడు పిల్లవాడికి పెట్టి తీరుతాను. ఏం చేస్తా వేం?

భార్య: చెప్తుంటే మీకు మరీ ఆగడంగా ఉన్నదే! మనకైనా పిల్లవాణ్ణి ఒక్కసారి దగ్గిరికి తీసుకోటానికి ముట్టరు గాని ఇందుకు మాత్రము వాడిమీద ఎక్కడలేని ప్రేమా వచ్చింది కాబోలు!

భర్త: అవును మరి! దాసరివాణ్ణి పెంచుతున్నట్లుగా ఒంటినిండా తెల్లపూసల పేరులు వేసి మెడలో బిళ్ళలు కట్టి వాణ్ణి పెంచుతూ ఉంటే ఎట్లా దగ్గిరికి తియ్యబుద్ధి పుడుతుంది!

భార్య: [మూతి పొడుగు చేసి] అబ్బో!

భర్త: ఇంత చక్కని పిల్లవాణ్ణి కంటివి మరి!

భార్య: ఏమిటి, అట్లా మాటిమాటికీ అనాకారివాణ్ని కన్నానని చెప్తారు! చక్కనివాడో అనాకారివాడో; కాకిపిల్ల కాకికి ముద్దు. అట్లాగే దిగంబరుడి వల్లే బతకనిద్దురూ!

భర్త: సొమ్ములు పెడితేనే పిల్లలు బచ్చిపోతారా ఏం!

భార్య: ఏమయిందీ మన 'వాణి'కి? ఈగజ్జెల మొలతాడేగా నాకొంప తీసింది! అమాదిరిది వద్దో మొర్రో అంటూంటే నాకు వ్యతిరేకంగా చేయించారు. అది బొమ్మలో, ఇట్లాంటిది, అని చూపినప్పుడే నాకు పాములాగా కనబడ్డది! అది వంటిన పెట్టిన రోజేగా, వాణికి జబ్బు చేసింది!

భర్త: ఇంత కటువుగా ఎట్లా మాట్లాడుతావే? వాణికి పేరుగా దాన్ని పిల్లవాడికి పెడదామంటే రాక్షసివలె అడ్డుపడతావేం?

భార్య: వంశము నిలిపే పిల్లవాడు పుడితే వాణ్ణి ఎన్నడైనా ఎత్తుకున్నపాపానన్నా పోలేదు, కాని ఎన్నాళ్ళనాడో పోయిన అపముండ సొమ్మంటే దానిమీద మీకంత వ్యామోహ మెందుకు?

భర్త: కటికిదానా, వీణ్ణి అంతా నీ ఇష్టం వచ్చినట్లే కన్నావుగా! ఇదన్నా నా ఇష్టప్రకారము జరగనీయవా?

భార్య: అయ్యో, ఏమిటండి మీకీ పిచ్చి!

భర్త: అవును మరి! సిగ్గన్నా లేకుండా బాగులు చేయించుకొని అంజనేయ ప్రదక్షిణాలు చేసి మన్మథుణ్ణి కన్నావుగా!

భార్య: ఏమంత ఎత్తి పొడుస్తారు! మన్మథుడో, ఎలికలవాడో! వాడు ఏ పిచ్చి వాడి వల్లనో నాలుగు కాలాల పాటు బతికి ఉంటే నాకదే చాలు. చక్కనివాడైతే మనకు ఒరిగించే దేమన్నా ఉన్నదా ఏం?

భర్త: ఎలికలవాళ్ళే నయం నీకొడుకుకంటె! వాళ్ళు మనుష్యులవలె నైనా ఉంటారు. నీవో, ఒక్క కోతికే లేదు కాని, కోతిని కన్నావు!

భార్య: [తనచేయి నోటిమీద పెట్టుకొని] అయ్యో! ఏమిటండీ ఆ మాటలు! అట్లా అనరాదండీ!

భర్త: అనవచ్చు నేమిటి, అనగూడ దేమిటి! కోతులకు మొక్కితే కోతులు పుట్టక ఏం చేస్తాయి? తనకే లేం అందము దేవుడు భక్తులకు మాత్రము ఎల్లా ఇస్తాడు? ఆయన ధర్మాన ఆ లోకమాత్రం ఇంకా ఇయ్యడం లేదు!

భార్య: ఏం పాప మండీ ఇది! అట్లా దేవుణ్ణి తిడతా రేం? [కళ్ళు మూసుకొని చెంపలు వేసుకుంటుంది.]

భర్త: అంత మనసుగా ఉంటే నేనుకూడా చెంపలు వాయిస్తా పట్టు! దేవుడు కాడు, మన దేశంలో ఉన్న కాస్త సౌందర్యాన్ని చంపుతున్న దయ్యా మీ హనుమంతుడు!

భార్య: అయ్యో! వద్దన్నకొద్దీ అట్లా మాట్లాడు తారే! ఇదేం పాప కర్మమండీ!

భర్త: పోనీ. హనుమంతుణ్ణి కొలవపోతే ఇంకా కాస్త చక్కని దేవుణ్ణి కొలవరాదూ? ఇక వినాయకుణ్ణికూడా ఇంట్లో కులదైవంగా పెట్టినావా అంటే, మనవంశంలో అందం పూర్తి అవుతుంది!

భార్య: ఊరికే దేవుళ్ళ నట్లా తిడతారు గాని, పుట్టిన పిల్లలంతా అట్లా పోతుంటే మరేం చేస్తాను, చెప్పండి? పోనీ, ఏదో కర్మం లేకపోతే, పుట్టిన నలుగురిలో ఒక్కరైనా బతకరాదూ? అయ్యో! చెప్పితేకూడా వినరేమండీ! వినకతె ననిబుద్ధి పుట్టదా ఏమిటి?

భర్త: ఏమో, నాకదంతా తెలియదు. ఇప్పటిదాకా నీ ఇష్టము వచ్చినట్లు చేయనిచ్చాను. ఈ మొలతాడు మాత్రము పిల్లవాడికి నన్ను పెట్టనీ. వాడికి పెడితే నాకు 'వాణి' మళ్ళీ బతికి వచ్చినట్లే ఉంటుంది!

భార్య: ఎప్పుడో చచ్చిపోయిన దానిమీద మీకు ఇంత వ్యామోహం ఎందు కండీ? మును పెప్పుడూ లేని ఈ మొండితనము మీ కిప్పు డెవరు నేర్పినారండీ?

భర్త: 'వాణి' లేని దుఃఖమే నా కీపట్టుకల నేర్పింది. ఆ మొలతాడు చూస్తే 'వాణి' మళ్ళీ చూచినట్లే ఉంటుంది. అది కదిలిన శబ్ద మవుతుంటే 'వాణి' ఇంట్లో తిరుగుతున్నట్లే ఉంటుంది. దాని గజ్జెలు ఘల్లు మంటే 'వాణి' మళ్ళీ నవ్వినట్లే ఉంటుంది. నాఒళ్ళు ఝల్లు మంటుంది!

భార్య: [కన్నీళ్ళతో] ఐతే మాత్రము అది బతికి వస్తుంది టండీ? అనుమానం మనస్సులో ఉంటే గిలిగా ఉండి బాధిస్తుంది. ఆ మొలతాడు ఇంట్లో ఉంటే మీకు అట్లాగే కష్టంగా ఉంటుంది కాని, చెరిపించి నాకు నానుతాడు చేయించండి! ధాన్ని చూస్తేనే నాకు భయ మండీ!

భర్త: [వికృత స్వరముతో] దుఃఖ మున్నదానికి చెల్లదు గాని కన్నీళ్లు వస్తవి! 'వాణి' సొమ్ము పెట్టుకొని కులకవలె నని ఉన్నదేం నీకు?

భార్య: అయ్యో, నా కిప్పుడు సొమ్ములకే కొదవగా ఉన్నది. నా అందానికి తక్కువైన దని! ఏదో, పోయిన వాళ్ళ వస్తువు ఇంట్లో కనబడుతూ ఉంటే మనస్సుకు కష్టంగా ఉంటుం దని నే నంటే, దాని కింత రాద్ధాంత మెందుకు?

భర్త: [యథావిధిగా శాంతముతో ఆదరముతో] సరే. ఆ దంతా ఇప్పు డెందుకు గాని, పిల్లవాడికి ఆ మొలతాడు కడదాం. కృష్ణుడి వల్లే ముద్దు వస్తూ ఉంటాడు. అది పెట్టనిస్తే వాణ్ణి దగ్గరికి తీస్తా!

భార్య: వాణ్ణి మీరు దగ్గరికి తీస్తే తీశారు, లేకపోతే లేదు. కాని మొలతాడు మాత్రము వాడికి కట్ట వద్దు. మొలతాడు చేయించుకొని వస్తిరి, పెట్టే పెట్టడంతోటే పిల్ల ఉలిక్కి పడెను, ఆ రాత్రికే జ్వరం వచ్చి, ఆ జ్వరంతోనే పోయిం దాయెను!— చేయించిన వస్తువు అచ్చి రాక పోతే అనుమానంగా ఉండ దండీ మరి!

భర్త: అనుమానం ఏమిటి! ఈ సొమ్ము దానిని చంపిందా ఏం? నేను ఎంతో మనసుపడి ముద్దుకొద్దీ బోలెడు కూలి పెట్టి పట్నంలో ఇంగ్లీషు కంపెనీలో చేయించి తెప్పిస్తే అది పెట్టిన తరువాత దాని ఆయుష్షు చెల్లి

దానిదో వస్తువు అక్కడ పోయింది. [ఆ అనుమానం పెట్టుకొని అది పిల్లవాడికి చక్కగా కడదామంటే పెట్టనియ్యవు: ఇదా దొక్కుడి ప్రేమ!

భార్య: ఏమో; నాకు దానిమీద అనుమానం!

భర్త: నీకు అనుమానం లేనిది దేనిమీద? చీకటిలో ఏ దస్తా వస్తువు కనబడితే అది నీకు దయ్యమాయెను! ఇంట్లోకి ఖర్మం చాలక పెద్ద పురుగు వస్తే దాన్ని చంపేదాకా వణుకుడా నాయెను! నీకు అనుమానం లేని దేమున్నది?

భార్య: ఏమో, నాకు భయమండీ!

భర్త: నామాట విని ముచ్చటగా పిల్లవాడికి ఈసొమ్ము పెట్టనీ. అది పెట్టినస్తే 'వాణి' బతికివచ్చినట్లు ఉంటుంది నాకు.

భార్య: మీకే పిచ్చి ఎందుకు? అనుమానమండీ!

భర్త: ఇంకా అనుమానమేమిటి? మీవాళ్ళ ఇంటికి వెళ్ళి బాగులు చేయించుకుంటివి, నీ ఇష్టదైవానికి ప్రదక్షిణాలు చేస్తివి, నీ ఇలవేలుపును పోలినంత చక్కని పిల్లవాణ్ణి కంటివి కూడా నాయెను! ఇంకా అనుమానమెందుకు?

భార్య: ఏమో పిచ్చిదాన్నండీ; నన్ను ఆటలు పట్టిస్తారు! చక్కనివాడో అనాకారివాడో, ఎవరైతే మన కేం? పిల్లవాడు కాడా? మా నాయన, హనుమంతమూర్తి కటాక్షించవలె నాకు! [వడివడిగా మధ్య మధ్య బిగ్గరగా వినబడేట్లు తనలో తాను చదువుకొంటుంది] "శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం, ప్రభాదివ్యకాయం, ప్రకీర్తి ప్రదాయం, ప్రశస్తాత్మకాయం, ... భజే వాలగాత్రం ... నీరూపు వర్ణించి ... నీసుందరం తెంచి ... దాసానుదాసుండనై ... ఎప్పుడున్ దప్పకన్ నిన్ను చేగొల్చెదన్ ... నీవే సమస్తంబు ... శాకినీ ఢాకినీ గాలిదయ్యంబులన్ నీదు వాలంబునం జుట్టి నేలం బడం గొట్టి నీ ముష్టిఘాతంబులం బ్రుంచి ... నమస్తే నమస్తే నమః! [భార్య దండకం చదువుతున్నంతసేపూ భర్త శాంతముగా చిరునవ్వు

నవ్వుతూ ఆమెవైపు చూస్తూ ఉంటాడు.] మీరు చక్కదనమో అని ఎన్నుతూ అంటారు కాని చక్కని పిల్లలు పుడితే మన కేమైనా ఒరుగుతుందా! అది గాక, మగవాళ్ళు ఎట్లా ఉంటే నేం, పెళ్ళి కాకపోతుం దని దిగు లుండదు గదా!

భర్త: అవును లే- హనుమంతుణ్ణి కొలిచేవాళ్ళకు ఇంత కంటె మంచి అభిప్రాయాలు ఎలా ఉంటవి? కాని మీ ప్రభాదివ్యకాయుడు నీకు ప్రత్యక్షంగా! ఇక మొలతాడు పిల్లవానికి పెడితే మాత్రం ఏమి భయం? ఇది ఒక్కటీ నాగరిక ప్రకారం జరగనియ్య రాదా?

భార్య: ఏమిటో నండీ, నన్ను పిచ్చిదాన్ని చేసి ఆడిస్తారు. నా కేమీ తెలియదు! మీకు అంత పట్టుదల అయితే పెట్టుకోండి! నాకు మాత్రం అది ఇష్టం లేదు. మా నాయన హనుమన్న దయ ఉంటేచాలును. [మళ్ళీ భక్తితో] “ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యకాయం...”

భర్త: [భార్యను సగంలో నే ఆపి, సంతోషంతో స్వభావసిద్ధమైన మార్దవంతో నవ్వుతూ] దానితో ఇదికూడా కలిపి పాడుకో!

“ఓ బొజ్జ గణపయ్యా,
నీ బంటు నే నయ్యా,
ఉండ్రాళ్ళ మీదికి
దండు పంపు!.’

భార్య: ఆ మొలతాడు పెట్టవద్దు నంటే మీకు అంత బ్రహ్మానంద మేం? ఎంత వెర్రి వా రండీ మీరు! [భర్త నవ్వుతూ కుర్చీలోనుంచి లేస్తాడు.]

రెండో రంగము

[భర్త అత్తగారూ మామగారూ అప్పుడే వచ్చినారు. మామగారు కాళ్ళు కడుక్కోడానికి వాకిట్లోకి వెళ్ళినారు. అత్తగారు కాళ్ళు కడుక్కో-

కండ్లకు అద్దాలతో కూతురు దగ్గరకు వచ్చింది. స్థలము పాతదే, ఉయ్యాల తొట్టెలో పిల్లవాడు లేడు. మొదటిరంగములో గదివంటిదే ఇంకోగది కాలుకు రెండోవైపున ఉన్నది.]

అత్తగారు: మళ్ళీ ఈకర్మ మేమిటే?

భార్య: నారాత అట్లా ఉన్నది! [ఇద్దరూ కన్నీళ్లు పెట్టుకుంటారు.]

అత్తగారు: ఎప్పటినుంచి జబ్బు మొదలు?

భార్య: నేనీ ఇంట్లో నోరెత్తటందుకు కూడా వీలు లేకుండా ఉన్నదే!

అత్తగారు: ఏమిటే అది! అవస్థ వచ్చినప్పుడు కాస్త ఓర్చుకోవలె నమ్మా!

భార్య: వాటంతట అవి వచ్చిన అవస్థలైతే ఎట్లాగైనా ఓర్చుకోవచ్చు! చేతులారా కొత్తిన తెచ్చిపెట్టుకొన్న వాటికో!

అత్తగారు: అయ్యో, పిల్లవాడు పండల్లే ఉన్నాడు గాదటే! ఏమైనా ఆ ఆంజన్న దయవల్ల బాగున్నా డనుకుంటే ఇట్లా వచ్చిందేమి!

భార్య: నీకూ నాకూ పండల్లేనే ఉన్నాడు. అందరికీ అట్లా ఉండ వద్దూ? వాడు అనాకారివా డట. కోతిని కన్నా నని నన్ను తిట్టిపొయ్యని రోజు లేదు. దాసరివాణ్ణి పెంచినట్లుగా పెంచుతున్నా నట! ఎరికలవాళ్ళన్నా నయమట! కోతివల్లే—

అత్తగారు: మీ ఆయన దేనా ఈసరాగ మంతా! అట్లా పిల్లలను అన గూడదు కూడాను! దాసరివాడి వల్లెనో ఎరికలవాడి వల్లెనో దీర్ఘాయుర్దాయంలో ఉంటే అదే చాలు! పుట్టక పుట్టక మగబిడ్డ పుడితే ఈ అల్లరి కూడానా? లేని వాళ్ళ మంతా మగ నలుసు కనబడితేనే చాలు నని, కన వడ్డ పుట్టకూ చెట్టుకూ మొక్కుతూ ఉంటే దైవము ఇచ్చిన బిడ్డకు మీ కింత గోలా?

భార్య: నే నేం చేస్తాను! ఆయననోరు కట్టిపెట్టే దెట్లా? కోతి ప్రదక్షిణాలు చేసినా నంటారు!

అత్తగారు: బాగానే ఉన్నది! ఇదెక్కడా చూడలేదే! దేవుణ్ణి అట్లా అంటే కళ్ళుకూడా పోతవి.

భార్య: మరి ఎట్లా అయనతో బతికేది? వద్దన్నకొద్దీ మరింత అంటారని రెండునక్కెళ్ళూ గట్టిగా ఒత్తుకొని ఊరుకోవలె! అనేది ఒక్కమాటా! నానామాటలూ అంటారే!

అత్తగారు: ఉన్నన్నాళ్ళూ ఆయన గారాబంగా ఉండేవాడుగా! ఇదెప్పటినుంచీ! ఈ మొగవాళ్ళ మనస్సులు క్షణానికి ఒకవిధంగా మారుతూ ఉంటవి కాబోలు!

భార్య: ఏమోనే అమ్మా, తలుచుకుంటే ఏడుపుకూడా వస్తుంది! ఈ నలుసు పుట్టినప్పటి నుంచీ ఆయనకు ఒకటే విసుగు. ఎప్పుడో వచ్చి రెండు రోజు లుండి చూసి పొయ్యే వాళ్ళకు మీకేం తెలుస్తుంది? కొన్నాళ్ళకు కాకపోతే కొన్నాళ్ళకైనా మనస్సు మారకపోతుందా అని అంతా లోపల లోపలనే మింగుతున్నా. కాని ఇక దుర్భరమై పోయింది. పిల్లవాడు పుట్టినతర్వాత ఒక్కసారైనా ఎత్తుకున్న పాపాన పోయినారా! మళ్ళీ ఆమాయధారి 'వాణి'ని మాత్రము తలుచుకొని విచారపడని రోజు లేదు.

అత్తగారు: బతికి ఉన్న నిక్షేపమంటి మగపిల్లవాడిమీద ఏమీ లేదు కాని ఎప్పుడో పోయిన పోకతల దానిమీదనా, ఆయన మమకార మంతాను? సరే!

భార్య: అవునే, ఆయనకారి ఆయనది! జ్ఞాపకం లా, దానికి చేయించిన మొలతాడు!

అత్తగారు: తెలీకేం? అది మరచి పోగలమా? అదేగా 'వాణి' ప్రాణం తీసింది! అది పెట్టినప్పుడేగా ఉలిక్కి పడ్డది! నేనూ దగ్గరే ఉండి కళ్ళారా చూస్తినిగా! బొమ్మల్లే ఉండేదిగా వాణి!— అది ఇంకా చెరిపించలా?

భార్య: అయ్యో, అభాగ్యం పడితే ఇంకా ఏం! నేనెన్నివిధాల ప్రయత్నం చేసినా పడనిస్తేగా! మొదట బొమ్మలో చూస్తేనే నాకేం

భయం వేసింది. తయారై వచ్చినప్పుడు చూడగానే నాకు పాముపట్లే ఉన్నదన్నాను, జ్ఞాపకం లేదుటే!

అత్తగారు: అవునే, ఒక్కొక్క సొమ్ము చేయించిన వేళా విశేషమది! పాపం, చాలా ఖర్చుపడి చేయించినట్లున్నారు. ఐతేమాత్రమేం? ఘటాలు కాగుండే డబ్బు శాశ్వతమా?

భార్య: అది ఇంట్లో ఉంటేనే అంత అనుమానంగా ఉంటుందా! అది వాడికి పెట్టనిచ్చేదాకా నన్ను బతకనియ్యలేదే. అగజ్జెలు ఘల్లు మంటే 'వాణి' నవ్వినట్లుంటుం దట.

అత్తగారు: ఇంకా అది పిల్లవాడి ఒంటనే ఉందా? ఎప్పుడో పోయిన ఆడముండకోసము ఇంత వెర్రి ఎక్కడా వినలేదే!

భార్య: అంతా వినవేం మరి? ఆ గజ్జల మొలతాడు కడితేతప్ప పిల్లవాణ్ణి తాక నన్నారు. నాకు చెప్పడానికూడా అకవిత్యాలు రావు. ఎప్పుడూ వద్దంటే వద్దని రాక్షసిరలె అడ్డు పడేదాన్ని! ఆవేళటికి ఏమి దుర్బుద్ధి పుట్టిందో నేనూ మెత్తబడ్డాను. పాడువేళకి అట్లా దైవము బుద్ధి పుట్టిస్తూ ఉంటాడు కాబోలు! ఆంజనేయస్వామి మీదనే భార మంతా వేసి, సరే, మెళ్లో కట్టమన్నాను. నే నామాట అనేదే వ్యవధానంగా చివాలున కుర్చీలోనుంచి లేచి సంతోషంతో చంకలు కొట్టుకుంటూ వారే పోయి వాడి మొలన అది కట్టినారే!— ఇంకా ఏముంది! పిల్లవాడు కెవ్వున కేక వేసినాడు. ఆయనకూడా మొదట తెల్లబోయినారు. నాకో, ఒళ్ళు గలదరించింది. ఇప్పుడన్నా తీసి పారేయండి అన్నాను. కాని నామాట వింటేగా! మళ్ళీ ఆ 'వాణి'కి వచ్చినట్లే పీడికే తెరలు! నిన్న మధ్యాహ్నం మీ పాటికి చిలకల్లే పిల్లవాడు ఆడుకుంటున్నాడే! పిల్లవాడి మొలను ఆ మొలతాడు చూస్తే నాగుబాము పెనవేసుకొని ఉన్నట్టే నా కళ్ళకు కనబడుతుందే! ఏమీ చేయడానికి తోచదు నువ్వు వస్తే చెప్పుకొని బావురు మని ఏడుద్దామనుకున్నాను మళ్ళీ వాడు వైద్యంలో ఏమైనా

లోపం చేస్తున్నారా! ఎన్ని మందులైనా యిప్పిస్తున్నాను. వారికి రాత్రంతా నిద్ర లేదు. కాని అది రోగమైతేగా! [కన్నీళ్ళు ఏకధారగా విడుస్తుంది.]

అత్తగారు: [ఉద్రేకములో] ఐతే ఇంకా అది పిల్లవాడి మొలనే ఉన్నదా ఏమిటి?

భార్య: తియ్యనిస్తే నేనా? మీ రన్నా చెపితే కాస్త వింటా రేమో నని, నాకు సహాయం కావలెననే వంక పెట్టి ఇవ్వాళ పొద్దున్నే మీకు తంతి ఇప్పించినాను.

అత్తగారు: [మరింత ఉద్రేకంతో] ముందు పిల్లవాడు ఎక్కడ ఉన్నాడో చెప్పు! అది తీసి పారేద్దాం! ఆ గదిలోనేగా! [పక్కనున్న గది వైపుకు వెళ్ళబోతుంది.]

భార్య: [తల్లిని ఆపి] అయ్యో, కాస్త ఆగు! అది తీసివేస్తె నీకూ నాకూ కూడా ఈ ఇంట్లో నిలవ ఆధరువు ఉండదు!

అత్తగారు: తిడతారనీ చీవాట్లు పెడతారనీ పిల్లవాడికి అంత రోగము వస్తేకూడా చూస్తూ ఊరుకుంటారటే! అట్లా చూస్తావేం? పద, అది తీసి పారేద్దాం. అంతగా మీ ఆయన చీవాట్లు పెడితే అన్నీ నే భరిస్తాలే!

భార్య: అబ్బా, నీ కేం, చెపుతావు! తర్వాత అనుభవించేదాన్ని నేను! నాన్నచేత చెప్పించి చూద్దాం! పిలుస్తా నుండు! నాన్నా!

మామగారు: [భర్త చదువుకునే గదిలోంచి వచ్చి] మీసంభాషణ వింటూనే ఉన్నాము. ఏమయ్యా అని అడిగితే ''మీఇష్టం'' అని విసుక్కుంటూ బైటికి వెళ్ళిపోయినాడు.

భార్య: మా నాయనగా! [అంటూ ఒక్క గంతులో కన్నీళ్ళలో పిల్లవాడున్న పక్కగదిలోకి వెళ్ళుతుంది. అత్తగారు కూడా మూతి విరుస్తూ గదిలోకి కూతురువెంట వెళ్ళబోతూ ఉంటుంది.]

[గదిలోనుంచి భార్య స్వరము]

అయ్యో, అట్లా రైలులో వచ్చిన పాడుగుడ్డలతో రానాకే! కాళ్ళనా

వడుకొట్టాని గదిలోకి రా! [అత్తగారు కొట్టు వడుకొట్టాని గదిలోకి వెళ్ళుతుంది, మామగారుకూడా నెమ్మదిగా వెళ్ళతాడు. గదిలోనుంచి గజ్జల మొలతాడు విప్పి అవతల పారవేసిన ధ్వని వినవస్తుంది. తర్వాత ఉల్లాస వంతమైన స్వరంతో.]

"శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యకాయం... భజే వాయుపుత్రం... భజే హం పవిత్రం..."

[అని వినవస్తుంది. అది ఇద్దరు ముగ్గురి గొంతులు కలిసిన స్వరము.]

మూడవ రంగము

[మొదటి రంగములోని గది. భర్త అప్పుడే ఇంటికి వచ్చి ఉత్తరీయము తీసి వంకెన వేయబోతున్నాడు. ముఖము కొంత భీషణముగా ఉన్నది. భార్య సంతోషముతో హాల్లోనుంచి గదిలోకి వచ్చింది.]

భార్య: చూశారూ, నే నేది చెప్పినా పెడచెవిని బెట్టి వేళాకోళమూ చేస్తారు, కాని ఏమయిందో చూశారా? నే నేది చెప్పినా ఎప్పుడూ వృథా కాదు.

భర్త: [నిశ్చలంగా] ఏమి టా జరిగిన బ్రహ్మకార్యం?

భార్య: [ఉత్సాహం కొంత తగ్గి] పిల్లవాడి కంత జబ్బుగా ఉండగా ఎప్పు డనగానో బయటికి వెళ్ళి మళ్ళీ ఇప్పుడు వచ్చారు! వాడికి ఎట్లా ఉన్నదో ఐనా విచారించక పోవడాని మీకు మనస్సు ఒప్పిందండీ? పైగా నేను సంతోషంగా మాట్లాడ వస్తే మీ కంత విసుగా?

భర్త: నాకు ఊరికే కొత్త పేరిమలు చెప్పి విసిగించక ఏమి జరిగిందో చెప్పి అవతలికి వెళ్ళు!

భార్య: ఆముదరష్టపు మొలతాడు తీసి వేయగానే పిల్లవాడికి రోగ

మంతా చేతితో తీసివేసి నట్లుగా నయ మయింది. తెరలు ఆగిపోయినవి. మాతండ్రి ముఖాన ఎప్పటిమల్లే చిరునవ్వు తాండవ మాడుతున్నది.

భర్త: సంతోషమే!

భార్య: ఇప్పుడు పిల్లవాడు మబ్బు విరిసిన చంద్రుడువల్లే ఉన్నాడు. అప్పుడే విచ్చిన మల్లెపువ్వు వలె ముద్దు వస్తున్నాడు.

భర్త: నా కెప్పుడూ కవిత్వాలు అనేదానివి నీవే కవిత్వం మాట్లాడుతున్నావే!

భార్య: ఏమో, కాబోలు. ముందు వచ్చి పిల్లవాడెట్లా ఆడుకొంటున్నాడో చూసి పోండి!

భర్త: వస్తాలే పద!

భార్య: మీ కెంత శాంత మండి? రాత్రి పొద్దునా మీరు పడ్డ ఆదుర్దా అంతా ఇప్పుడే నైపోయిందీ? నన్ను కటిక దానివి అంటారే? పిల్లవానికి రోగం నయం కావడం మీ కిష్టం లేదా ఏమిటి?

భర్త: ఏమిటే నీ గొడవ! నామీద దేవత లంతా కట్టు కట్టినారు! వాళ్ళను నేను వదిలినా వాళ్ళు నన్ను వదిలేట్లు లేరు!

భార్య: [కొంచెము భయముతో] అట్లా అసందర్భంగా మాట్లాడుతారేం? మతి ఏమన్నా చెడి పోయిందా ఏమిటి? అట్లా చూస్తారేమండీ!— ఏమిటండీ అది; నాకు భయం వేస్తున్నది! మాట్లాడరేం?

భర్త: అబ్బా, ఊరికే గోల పెట్టక అవతలికి వెళ్ళు! దేవత లంతా దయ్యాలలో కూడా కలిసి నామీద కత్తి కట్టినట్లున్నారు!

భార్య. [భయము పోయినప్పటికీ ఇంకా పోని ఆశ్చర్యముతో] ఏమిటీ ఆమాటలు! మన పిల్లవాడికి జబ్బు నయం చేయడమా, దేవతలు చేసిన అపకారము! అట్లాంటి అనరాని మాట లనడానికి మీకు బుద్ధి ఎట్లా పుడుతుందండీ?

భర్త: నీ వొక పెద్ద రాక్షసివి! నాపాలిటి బ్రహ్మరాక్షసివి! నా బాధ నీ కేం తెలుస్తుంది?

భార్య: నన్నెన్ని తిట్టినా పడతాను గాని! — లేకపోతే ఏమిటో చెప్పండి! దేవతలంతా మనమీద కసి టండీ? వాళ్ళను నమ్మిన వాళ్ళను ఎన్నటికీ చెరపరు. ఈమాట మీరు బ్రహ్మ వాక్యంగా నమ్మండి! వాళ్లు మన పిల్లవాడి జబ్బు నయం చేస్తే కక్ష కట్టి నారంటా రేమండీ!

భర్త: నీవు నామాటలు అర్థం చేసుకోగలదానవైతే ఇట్లా మాట్లాడి నామనస్సును మరింత ఎందుకు నొప్పిస్తావు!

భార్య: పిచ్చిదాన్ని ఏదో నోరూరుకోక వాగుతుంటాను కానండీ! నా మాటలు మనస్సుకు పట్టించుకోకండి. ఐనా ఒకటిమాత్ర మడుగుతాను గాని మీకు కోపం రాకుండా ఉంటుందీ? ఈ ఒక్క సారీ కొంత శాంతిచిం జవాబు చెప్పండి. మీ రంతా తెలిసినవారు కదా! అంతా చదువుకున్న వారే కాని, నేను పట్టి తెలివి తక్కువ మొద్దునే కాని, నాకు తోచినంత వరకు ఆలోచిస్తే మనుష్య మాత్రుల మైన మనకు దేవుళ్ళమీద కోపము పనికి రా దనీ, వాళ్ళను తిట్టడమూ హేళన చేయడమూ మనకు శ్రేయస్కరము కా దనీ, అనిపిస్తుం దండీ!

భర్త: అయిందా నీ ప్రశ్న?

భార్య: అది కాదు, మీరు కోపపడనంటే అడుగుతాను.

భర్త: తెలివి తక్కువగా ముందుగా వాగ్దత్తం చేసేందుకు నేను హరిశ్చంద్రుణ్ణి గాను.

భార్య: అదుగో! ఆమాట లెందు కండీ మీకు? ఈ చిన్న ప్రశ్నకు మీకు కోపం రాదు గదా?

భర్త: అయితే రాదులే, అడుగు!

భార్య: 'వాణి'ని చూస్తే అంత ప్రాణంగా ఉండేవారే, [illegible]

మగపిల్లవాడు పుడితే ఇంత నిర్లక్ష్యం చేస్తారేం? దీనికి కాస్త శాంతించి జవాబు చెప్పండి.

భర్త: దీనికి జవాబు చెప్ప నుంటవా? ముందు నే నడిగే కొన్ని ప్రశ్నలకు కూడా శాంతంగా జవాబు చెప్పు!

భార్య: నే నెప్పుడూ శాంతంగానే ఉంటాను. మీ రెన్ని ప్రశ్న లైనా అడగండి, జవాబు చెప్పుతాను.

భర్త: ఐతే 'వాణి' ఎవరి పిల్ల? [భార్య నిశ్చేష్ట పోతుంది.] ఆరంభం లోనే అట్లా జంకితే ఎట్లా?

భార్య: ఏమి టాపెయ్యండి ప్రశ్న! దానికీ మనకూ ఋణం లేదు. పోయిన దని అనుకొని ఏం లాభము!

భర్త: అయ్యో! నే నడిగిన ప్రశ్నకు జవాబు చెప్పవేం?

భార్య: [మళ్ళీ నిశ్చేష్టపోయి] మన పిల్ల!

భర్త: అందువల్లనే నాకు దానిమీద అంత ప్రేమ! ఇప్పుడు తెలిసిందా? అందు వల్లనే అది మనను విడిచిపోయినా దాన్ని నేను మరవ లేకుండా ఉన్నాను.

భార్య: [ఎఱ్ఱబడ్డ ముఖంతో] అయితే మన పిల్లవాడు?

భర్త: ఆ ప్రశ్నే నిన్నిప్పుడు అడగబోతున్నాను. దానికి నువ్వే జవాబు చెప్పవలెను.

భార్య: వీడూ అంతే!

భర్త: అదే కాదు! అందు వల్లనే వీ డంటే నాకు ప్రేమ లేదు. వీడి పే రేమిటి?

భార్య: ఏమి టండీ, వేళంగా ఉన్నదే! మనవాడి పేరు 'ఆంజనేయులు' అనే సంగతే మీకు తెలియదా ఏమి? మరీ సోద్యంగా ఉన్నదే!

భర్త: ఊరికే ఉపన్యాసా లియ్యక, నీ ప్రశ్నకు జవాబు కావలె నంటే, నే నడిగే ప్రశ్నలకు జవాబు చెప్పు! పిల్లవాడికి ఆ పేరు ఎవరు పెట్టినారు?

భార్య: ఎవర్ని పెట్టేదే మున్నది? వెనకటి సారి అట్లా అయింది కదా అని అనుమానం చేత మనస్సు ఒప్పక భారసాల చేసుకోక పోతే మాత్రము, వాడికి పేరు లేదా ఏమిటి? వాడు కడుపున పడ్డప్పుడే నా ప్రసన్నాంజనేయ స్వామి తన పేరు పెట్టుకున్నాడు.

భర్త: అదీ! పిల్లవాడికి పేరు పెట్టేది తండ్రి! నీ ప్రసన్నాంజనేయ స్వామికుమారుడిమీద నా కెట్లా ప్రేమ ఉంటుందీ? పెంపుడు కొడుకును చూసినట్లుగా చూస్తున్నాను. అదీ, బలవంతాన చేసుకున్న పెంపుడు!

భార్య: పెంపుడు కొడు కేమిటండీ? మీ మాటలు నా కేమీ అర్థం కావడం లేదు!

భర్త: అర్థం చేసుకోలే వని మొదటనే చెప్పినాను కాదూ!

భార్య: నే నెంత తెలివి తక్కువ మొద్దు నైతే మాత్రము, నాకు కన్న కొడు కంటే ఎవరో, పెంపుడు కొడు కంటే ఎవరో తెలియదు టండీ? మీ వేదాంతాలన్నీ కట్టి పెట్టి, పిల్లవాడు ఖులాసాగా ఆడు కుంటున్నాడు కాని, వచ్చి చూసి ముద్దు పెట్టుకు పోండి!

భర్త: వస్తా గాని, పద! ముందు ఆ మొలతాడు మాత్రము నా కిచ్చి పో!

భార్య: ఏమిటీ, మీకు మొలతాడు పిచ్చి ఎత్తిన ట్లున్నదే!

భర్త: అధిక ప్రసంగము చేయక ముందర ఆ మొలతాడు ఇలా ఇచ్చి పో!

భార్య: ఇంకా ఏం మొలతాడు?

భర్త: [కొంచెము ఆదుర్దాతో] ఏమయింది? ముం దది తీసుకు రా!

భార్య: ఇంకా మొలతా డెక్కడ ఉన్నదీ! అది ఉన్నన్నాళ్ళూ మీకీ వ్యామోహం వదల దని మా నాన్న చేత దాన్ని చెరిపించడానికి పంపినాను. ఈపాటికి ఆయన తిరిగి వస్తూ ఉండాలి.

భర్త: [సంభ్రమముతో] ఏమీ! నా 'వాణి' మొలతాడు కరిగించడానికి మీ నాన్నను పంపినావా?

['అమ్మాయీ!' అని వీధిలోనుంచి మామగారి గొంతు వినబడు తుంది]

భార్య: అదుగో, మా నాన్న కేక వేస్తున్నాడు, వెళతా!

భర్త: [నిర్జీవుడై] అయ్యో!— మీ ప్రేమ ఏమి ప్రేమ! కత్తులు పెట్టి కోసే ప్రేమ! ఆ పసిపిల్ల నిన్నేం చేసిందే? అరటి కొండ వల్లే ఉండే 'వాణి' మీ కేం అపకారం చేసిందే?— అయ్యో! ఇంతమంది కలిసి నే నింట్లో లేని వేళ దాన్ని చంపివేసినారు కాదటే! రాక్షసుల కన్నా కొంత దయ ఉంటుందే; కన్న తల్లికి నీ కన్నా అంతమాత్రము జాలి లేకపోయిందా? నీ వసలు వ్యాఘ్రివి!—

[అంటూ చేతుల్లో ముఖము పెట్టుకొని కన్నీళ్ళు కారుస్తూ నిస్సారముగా పడక కుర్చీలో వంగుకుంటాడు. భార్య నివ్వెర పోయి ఆపాదమస్తకము కంపిస్తూ ఉండగా, వీధిలోనుంచి "అమ్మాయీ, అమ్మాయీ, తలుపు తీయి!" అనే పిలుపులు నిరంతరంగా వస్తున్నా, నెమ్మదిగా అడుగులు పెట్టుకుంటూ తండ్రికి తలుపు తియ్యడానికి వెళ్ళుతుంది.]

పరివర్తనము

శ్రీ శ్రీనివాస శిరోమణి

*

అంకితము

శ్రీ వజ్ఝ బాబు రావుకు

*

ఒకటో రంగము

[సూర్యాస్తమయము కాబోతున్నది. అంతఃపురములో అలంకార మందిరములో నిలువుటద్దాల యెదుట అశోక చక్రవర్తి నిలుచుని ఉన్నాడు. నల్లటివాడు. ఉంగరాలు తిరిగిన బిరుసు వెంట్రుకలు, మిడిగుడ్లు. ఆకళ్ళలో ఎర్రని జీరలుకూడా ఉన్నవి. గుబురుమీసాలు. పొట్టివాడు.

అర్ధనగ్నలు అయిన ముగ్గురు పరిచారికలు. ఒకతె చైనాదేశపుది - ఆమె వింజామర వీస్తున్నది. ఇంకొక పరిచారిక చందనచర్చ చేస్తున్నది. మరొకతె తిలకము ముఖాన దిద్ది పుష్పమాల మెడలో వేసి అందముగా ఉండేటట్లు సవరిస్తున్నది.

అలంకారమంతా అయిపోతున్న సమయములో ఒకపరిచారిక సవినయముగా ప్రవేశించి మొక్కి నిలుచున్నది. ఆమెవంక చక్రవర్తి సాలోచనముగా చూచినాడు.]

పరిచారిక: రాధాగుప్తులవారు వచ్చి ఉన్నారు.

అశోకుడు: వెంటనే లోపలికి పంపించు.

[వింజామర వీస్తున్న పరిచారిక తప్ప అందరూ వెళ్ళిపోయినారు. అశోకుడు సుఖాసనాసీనుడయినాడు. రాధాగుప్తుడు ప్రవేశించినాడు.

వృద్ధముఖములో గాంభీర్యము ఉట్టిపడు తున్నది. ప్రశాంత మయిన నేత్రములు. దీర్ఘకాయుడు.]

అశోకుడు: [లేచి నమస్కారము చేసి రాధాగుప్తుడు కూర్చున్న తరువాత కూర్చుని] ఏదో విశేష మున్న దనుకొంటాను. లేకపోతే మీరిప్పు డెందుకు వస్తారు?

రాధాగుప్తుడు: అవును. ఇది సమయము కాదని తెలుసును. అయినా, రాక తప్పింది కాదు.

అశోకుడు: [వ్యగ్రభావముతో] చిత్తము. అప్పుడే చీకటి పడిపోయింది. మిమ్మిలను విశేషము సేపు కూర్చుండ బెట్టను.

రాధాగుప్తుడు: మీ రేదో పనిమీద ఎక్కడికో వెళ్ళబోతున్నా రనుకొంటాను.

అశోకుడు: అవును. మాళవ రాజకన్యను చూసి ఇప్పటికి సంవత్సరమయి పోయినది. ఆమె నావిరహమును భరించ లేక కృశించిపోయి ఉన్నదట. విరక్తివల్ల ఒక్క అభరణ మయినా ధరించడము లేదట.

రాధాగుప్తుడు: [సాలోచనముగానూ, సాభిప్రాయముగానూ,] అది మీవిరహదుఃఖమో - కాక పితృసోదర వియోగదుఃఖమో - యోచించినారా రాజా!

అశోకుడు: తలిదండ్రులను గురించిన దుఃఖమయితే ఒకనెల, కాకపోతే రెండు నెలలు. కాని ఇంత కాలము దుఃఖించదు. అది కేవలము విరహమే. ఇప్పుడు ఉన్మాదినిగా ఉంద దని తెలుస్తున్నది. ఆమె విరహములో అంత్యావస్థకు తయా రవుతున్నది. ఎందువల్ల నంటే, నేను రాజధానిలోకి వచ్చికూడా ఆమెను చూడలేదు.

రాధాగుప్తుడు: అయితే మీ కిప్పుడు శకునము ఏమీ బాగా లేదు. శుభము అంటూ బయలుదేరబోతూ ఉంటే ఒంటిబ్రాహ్మణుడను ఎదురుగుండా వచ్చాను.

అశోకుడు: ఇంకా బయలుదేర లేదుగా నేను!

రాధాగుప్తుడు: మీరు బయలుదేరి వస్తే లెక్క.

అశోకుడు: అయితే మీరు వచ్చినపని ఏదో సెలవిస్తారా?

రాధాగుప్తుడు: చిత్తము. బ్రహ్మానందము కలిగించే వర్తమానము చెప్పడానికే వచ్చాను. ఉపగుప్తాచార్యులను ఎరుగుదురు కదా!

అశోకుడు: ఉపగుప్తుడా! బౌద్ధభిక్షువు కాదూ?

రాధాగుప్తుడు: అవును. మీ అన్నగారు సుషీముడి పక్షమువాడు. వాణ్ణి ఈమధ్యాహ్నమే పాతాళగృహములో ప్రవేశపెట్టినాము.

అశోకుడు: [విషాదముతో కూడుకొన్న ఆశ్చర్యముతో] చంపివేసినారా?

రాధాగుప్తుడు: ఈపాటికి యమధామానికి చేరి ఉండేవాడే. అయితే మీతో కొంచెముసేపు మాట్లాడిన తరువాత అన్నీ చంపమని ప్రార్థించినందున—

అశోకుడు: వాడితో ఏమి మాట్లాడతాడో?

రాధాగుప్తుడు: మిమ్ములను తూలనాడుతాడు.

అశోకుడు: [కోపముతోనూ ఆశ్చర్యముతోనూ] ఆ! తూలనాడుతాడా! అయితే నేనే వాణ్ణి యమరాజ్య పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను!

రాధాగుప్తుడు: అయితే వాణ్ణి ప్రవేశపెడతాను.

అశోకుడు: వాణ్ణి తీసుకొని రావడానికి ఎంతసేపు పడుతుంది?

రాధాగుప్తుడు: వెంట తీసుకొని వచ్చినాను. వాణ్ణి ప్రవేశపెట్టి వెళ్ళిపోతాను.

అశోకుడు: [ఏదో ఆలోచిస్తూ] చిత్తము.

[రాధాగుప్తుడు వెళ్ళిపోతాడు. ఉపగుప్తాచార్యులు ప్రవేశిస్తారు. దీర్ఘకాయుడు, ప్రశాంత నేత్రములు, గంభీర మయిన వదనము. కాషాయాంబరధారి. నిశ్చలముగా తల వాల్చి నిలుచుంటారు. అతన్ని చూస్తూనే

అశోకుడి ఒళ్లు కంపించిపోతుంది. మహాకోపం వస్తుంది. భస్మీభూతమయిపోయ్యేటంత కోపముతో అతని వంక అశోకుడు చూస్తాడు. అతనినిశ్చలతకు ఆశ్చర్యము కూడా కలుగుతుంది.]

అశోకుడు: ద్రోహీ, ఎంత నిశ్చలముగా ఉన్నావు! నీది ఏదేశము?

ఉపగుప్తాచార్యులు: నేను ద్రోహిని కాను. ఈభూమి అంతా నా దేశమే.

అశోకుడు: ఆఁ ఆఁ!

ఉపగుప్తాచార్యులు: నీదేశానికి పరిమితి ఉంది; హద్దులున్నవి; నాదేశానికి పరిమితి లేదు; నాలుగుదిక్కులూ నాదేశానికి హద్దులు-

అశోకుడు: నీకు మతి పోయినట్టుంది!

ఉపగుప్తాచార్యులు: [నవ్వుతూ] కొంత కొంత మంటిముద్దల కోసము పోట్లాడుకొనె నీబోటిరాజులకు మతిపోయింది. నాకేమీ మతి పోలేదు. ఈ విషయము హెచ్చరించి పోవడానికే నీదర్శనము కోసరము ప్రార్థించాను.

అశోకుడు: ఏమిటి?

ఉపగుప్తాచార్యులు: దేశదేశాలను జయించడ మెందుకు రాజా!

అశోకుడు: ఏ మంటున్నావూ?

ఉపగుప్తాచార్యులు: ఏ మంటున్నానా? దేశదేశాలమీదికి దండెత్తి పోయి రాజ్యాలనూ, జనాన్నీ నాశము చేస్తున్నావే! ఎక్కడయినా కొంత జనము ఉంటే వారిహృదయాలలో చిచ్చు పెడుతున్నావే! ఇదంతా ఎందుకోయి! సరే, పోనీ, రాజులూ జనుల సంగతి అలా ఉండు. నీకోరికి భోజ్యానికి రాని వన్యమృగాలను వేటాడి చంపడ మెందుకు! అవి ఘాతుక మృగము లంటావు! అయితే నీవు పాలిస్తూ పొడవడ మయినా తెలియని గోవులు- శరత్కాల స్వాదునది జలము తాగనీయకుండా రక్తాన్ని ప్రవహింపచేస్తున్నావే! అంతా నిశ్శేష మయిపోయిన తరువాత ఎక్కడ ఎవరిని పరిపాలించదలచుకొన్నావు రాజా! చెప్పు చూతాము. కళింగదేశ

ములో పురుష డనేవాడు లేకుండా చేశావే! ఇక నీవు పాలించేది ఆ దేశములో ఉన్న వితంతువులనా?

అశోకుడు: అనవసర ప్రసంగం చేయకు.

ఉపగుప్తాచార్యులు: సుఖదుఃఖాలూ, ఆదరానాదరాలూ, ప్రేమాప్రేమలు, ఆలోచనానాలోచనలు లేని నేను విశేషము మాట్లాడేట్లయితే శిలాగానే మారిపోతాను. విశేషము నీతో నేను మాట్లాడ దలచుకోన లేదు.

అశోకుడు: అయితే ఎందుకు వచ్చావు ఇక్కడికి?

ఉపగుప్తాచార్యులు: నీ ప్రతిబింబాన్ని నీకు చూపించి పోవడానికి వచ్చాను.

అశోకుడు: [విసుగుతో] ఏమి టా ప్రతిబింబము?

ఉపగుప్తాచార్యులు: మనుష్యాకారములో ఉన్న జంతు వేమో అనిపిస్తున్నావు నీవు! లోకసంహారము చేస్తున్నావు. నీ పనులు లోకకంటకములుగా ఉన్నవి. నీకు సుఖము ఇందులో ఉన్నదా అని ప్రశ్న. లేదేమో నని తోస్తున్నది. ఎందువల్ల నంటే, దేశ దేశాంగనలను తీసుకొని వస్తున్నావు. విశ్రాంతి కొంచెము చిక్కినప్పుడల్లా సారాసారములు విచారించకుండా కేవలము మాంసగ్రంధు లయిన స్తనాల కోసము— శ్లేష్మాగార మయిన వదనము కోసరము మూత్రము స్రవించే జఘనపీఠము కోసరము [కళ్లు మూసుకొని] ఆహా, సౌందర్యం నింద్యమ్ [కొంచెము సేపు ఊరుకొని] సర్వం దుఃఖం సర్వం దుఃఖమ్. [కళ్ళు తెరిచి] నేను చెప్పదలచుకొన్న దంతా చెప్పినాను. ఇంక నన్ను చంపవేయడానికి అనుజ్ఞ ఇయ్యి.

అశోకుడు: నిన్ను చంపకుండా వదిలివేస్తే సంతోషిస్తావా?

ఉపగుప్తాచార్యులు: నాకు సంతోషమూ లేదు, దుఃఖమూ లేదు.

అశోకుడు: అయితే నా కెందుకు నీ వంత అపకారము చేయడము?

ఉపగుప్తాచార్యులు: నే నొకరికి అపకారము చేయను. నీకు చేయనూ లేదు.

అశోకుడు: చేయలేదా?

ఉపగుప్తాచార్యులు: లేదు.

అశోకుడు: నీవు నాశత్రువులతో ఎందుకు చేరినావు?

ఉపగుప్తాచార్యులు: నీశత్రువులతో గానీ నీ మిత్రులతో గానీ నాకు ప్రసక్తి లేదు.

అశోకుడు: నీవు మాఅన్న సుషీముడితో చేరి నన్ను చంపదలచిన వారిలో ఒకడవు కావా?

ఉపగుప్తాచార్యులు: నీకు రాజ్యాధికారము లేదన్నాను. అది ధర్మము. కాని నిన్ను చంపదలచినవారిని వద్దని వారించినది నేనే.

అశోకుడు: [వినయముతో] మీ మాటలు నేను విశ్వసిస్తున్నాను.

ఉపగుప్తాచార్యులు: నీవిశ్వాసా విశ్వాసములతో నాకు నిమిత్తము లేదు.

[పరిచారిక ప్రవేశించి నమస్కారము చేసి నిలుచుంటుంది].

అశోకుడు: [రూక్షముగా] ఏమిటి?

పరిచారిక: మాళవ రాకుమారి దేవర దర్శనార్థము క్షణ మొక యుగముగా గడుపుతున్నట్లు వర్తమానము వచ్చింది.

అశోకుడు: [మహానందముతో] ఆఁ ఆఁ సంతోషము! ఓసీ, ఈహారము నీకు బహుమానము. [ఆమూల్యాభరణము తీసి యిస్తాడు.] పో. భిక్షుకుడా, మా కత్యంత మోదావహ మయిన సమయములో వచ్చావు. చాలా అదృష్ట వంతుడవు. నిన్ను చంపము. పొ మ్మావలకు!

రెండో రంగము

[పాటలీపుత్రనగరము వెలుపలి మైదానము. రాత్రి పదిన్నర గంటలు కావచ్చింది. గాఢాంధకారము. అశోక చక్రవర్తి పుష్పమాలాలంకృతుడయి ఉత్తరీయము జారి పోతూ వేగముగా నడుస్తూ ప్రవేశిస్తాడు. ఎవరి

గుండా ఒక వృద్ధుడు ముసుగు పెట్టుకొని వస్తూ ఉంటాడు. అశోకుడా వ్యక్తిని చూసి ఆగిపోతాడు.]

అశోకుడు: ఎవరా మనిషి?

రాధాగుప్తుడు: నేను [అంటూ ముసుగు తీసి నిలుచుంటాడు.]

అశోకుడు: మంత్రివరేణ్యులా! అభివాదము. ఒంటరిగా ఎక్కడికి వెళుతున్నారో తెలుసుకోవచ్చునా?

రాధాగుప్తుడు: దేవరవారెక్కడికి ఒంటరిగా వెళుతున్నారో నేను తెలుసుకోవచ్చునా?

అశోకుడు: నేను బాహ్యోద్యానాంతఃపురానికి వెళుతున్నాను. సంవత్సరమునుంచీ ఏ కాంతా స్వయంగ్రాహము కోసరము సంతపిస్తున్నానో ఆ కాంత సందేశ మంపింది.

రాధాగుప్తుడు: ఏమని?

అశోకుడు: అస్మద్గాఢ పరిష్వంగము కోసరము క్షణ మొకయుగముగా గడుపుతున్నట్టు.

రాధాగుప్తుడు: ఇవ్వాళ అమావాస్య.

అశోకుడు: అయితే కావచ్చును.

రాధాగుప్తుడు: [గట్టిగా] ఇవ్వాళ అమావాస్య.

అశోకుడు: [చిరునవ్వుతో] మన్మథుడికి వారాలు వర్జ్యాలూ లేవు. పోనియ్యండి.

రాధాగుప్తుడు: కాదు. రాజా, ఒక్కసారి నిలవండి.

అశోకుడు: ఎందుకు?

రాధాగుప్తుడు: మీ నియమాలను మీరే తిరస్కరిస్తే ఇక మీ నియమాలను ఇతరులు ఎలా అనుసరిస్తారు?

అశోకుడు: అసలు విషయ మేమిటో చప్పున చెప్పండి. హృదయము సహించుకోం పోతున్నది. ఇంక నేను నిలవలేను.

రాధాగుప్తుడు: తాము మారువేషముతో రాత్రిసమయములో నగరపర్యటనం చేసేది ఈ రోజునే.

అశోకుడు: అబ్బ, శుభమా అని వెళ్ళబోతుంటే అన్నీ అంతరాయాలే!

రాధాగుప్తుడు: సంకల్పాలకు వికల్పాలు లేకపోతే స్వారస్య ముండదు.

అశోకుడు: పోనీ, ఈ రాత్రికి మానివేసి రేపురాత్రి నగరసంచారము చేస్తాను లెండి.

రాధాగుప్తుడు: జ్ఞాపకము తెచ్చుకోండి. రేపురాత్రి తమరు మరొక విషయములో నిమగ్నులయి ఉంటారు.

అశోకుడు: అబ్బ, అబ్బ!— నేను మీతో ఈ విషయమే చెప్పలేకపోతే!

రాధాగుప్తుడు: మీ రెక్కడికి వెళ్ళుతున్నదీ నాకు తెలియక పోతేగా! అందుకోసరమనే వెతుక్కుంటూ వచ్చాను

అశోకుడు: మరి ఆ యువతీ దర్శనము చేయకుండా నేను జీవించజాలను. పోనీయుండి, నా సంగతి అలా ఉంచండి. ఆయువతి మాత్రము ఇక జీవించడము దుర్ఘటము!

రాధాగుప్తుడు: రాజా, పోనీయండి బతకకపోతే మరొకతె —

అశోకుడు: పెద్దలు- మీ నోటిలోనుంచి అశ్లీలములు రానీయకండి. అమ్మయ్యా, అంతమాట ఎలా అనగలిగినారు? ఆమెను ఒక సంవత్సరము నుంచీ పరివాసములో ఉంచినాను.

రాధాగుప్తుడు: సంవత్సరమునుంచీ బతికి ఉన్నమనిషి ఇప్పుడు ఈ మాత్రానికే చచ్చిపోతే ఏం చేస్తాము!

అశోకుడు: ఎందుకిదంతా — అలాగే నగరపర్యటనము చేస్తానులెండి.

రాధాగుప్తుడు: మీరు అనృతము లాడరనుకొంటాను.

అశోకుడు: ఈ రాత్రికి క్షమించలేరా!

రాధాగుప్తుడు: మీ రా యువతి దగ్గరకు వెళ్ళకపోతే, ఏం?

అశోకుడు: అమ్మమ్మ! కాదు! ఆసౌందర్య—

రాధాగుప్తుడు: తిష్య రక్షాదేవి కన్నునా!

అశోకుడు: [చిరునవ్వుతో] చెప్పలేం మరి! తిష్యరక్ష మీ అంత వారిని ఇలాంటి పనులమీద పంపిస్తున్నదా?

రాధాగుప్తుడు: ఎంతమాత్రము కాదు. మీ రాయబారిని విసర్జించమని నా ప్రార్థన.

అశోకుడు: ఎందువల్ల?

రాధాగుప్తుడు: ఇందువల్ల అని మాత్రము చెప్పజాలను. తరువాత మీరు జన్మాంతమువరకూ దుఃఖిస్తా రని నా నమ్మకము.

అశోకుడు: ఏమి, రాయబారిని చూచిన మాత్రము చేతనే?

రాధాగుప్తుడు: ఏమో, నాకే దంతా తెలియదు. మీరు మాత్రము వెళ్ళ వద్దని నా సలహా.

అశోకుడు: ఆ రాకుమారి తండ్రినీ సోదరుణ్ణీ చంపించాననీ, అందువల్ల నన్ను వరించదేమో ననీ మీరు ఊహ చేసి సలహా ఇస్తున్నారు. కాని ఆ దుఃఖము ఆమెకు ఎంతమాత్రము లేదు. నాకు తెలిసింది. నాకోసరము ఈ మధ్య కేవలము ఆమె ఉన్మాదిని అయిపోయింది. కాముకులకు తెలిసే విషయాలు మంత్రులకు తెలియడము కష్ట మనుకొంటాను.

రాధాగుప్తుడు: సర్లే, నాకీ విషయాలతో పని లేదు. మీ రీరాత్రి నగర పర్యటనము చేయడమే నాకు కావలసిన విషయము.

అశోకుడు: మళ్ళి మొదటికి వచ్చారా?

రాధాగుప్తుడు: ఎంతదూరము చెప్పినా మీరు గ్రహించ లేకుండా ఉన్నారు. మీరు అక్కడికి వెళ్ళినట్టయితే, మీదట దుఃఖిస్తారు.

అశోకుడు: దుఃఖించను, సుఖిస్తాను.

రాధాగుప్తుడు: [గద్గద స్వరముతో] మీరు దుఃఖిస్తారు!

అశోకుడు: మీకు తెలియదు లెండి.

రాధాగుప్తుడు: కాను. నేను అనుభవజ్ఞుణ్ణి. చెప్తూవున్నాను. వినండి. మీరు నగరపర్యటనమునకు పోకండి.

[అశోకుడు తల వంచి ఆలోచిస్తూ ఉంటాడు. రాధాగుప్తుడు వెంటనే వెళ్ళిపోతాడు. అతడు తల ఎత్తి చూసేసరికి రాధాగుప్తుడు కనిపించడు. ఒక ముసలిది మూలుగుతూ కర్ర ఊతగా చేసుకొని నడుస్తూ ఏడుస్తూ కనిపిస్తుంది.]

ముసలిది: ఎవరు నాయనా, నీవు దొంగలాగా ఉన్నావు?

అశోకుడు: ఏమంటున్నావు! అశోక చక్రవర్తి రాష్ట్రములో దొంగలా?

ముసలిది: అశోకుడే పెద్దదొంగ అయితే, ఇక రాజ్యములో దొంగలకేమి తక్కువ!

అశోకుడు: [ఆశ్చర్యముతో] అశోకుడు దొంగా అన్నావా?

ముసలిది: అశోకుడు చేసే పనులు మామూలు మనుష్యులు చేస్తే బందిపోటు అంటారు. అదే అశోకుడు చేస్తూ ఉంటే, రాజాధిరాజు, చక్రవర్తి అంటారు. అట్లాంటి వాడికి చావు రాదుకదా నాయనా!

అశోకుడు: ఎందుకు పాపము, అశోకుడికి చావు? నీకేం అపకారము చేశాడు?

ముసలిది: [కోపముతో వణుకుతూ] అపకారమా- వాడినోట్లో దుమ్ముపడ! నా కొంప కూల్చాడు, నా వంశనాశము చేశాడు. వాడు శిల, వాడు చావడు!

అశోకుడు: ఆయనకు నీకొంపకూడా కావలసి వచ్చిందీ; నీవేం మహారాణివా, నీ వంశము నాశము చేయడానికి?

ముసలిది: అది కాదు బాబూ! నా పెనిమిటి కిందటి సంవత్సరము మాళవదేశ యుద్ధములో చనిపోయినాడు. ఆయన వయస్సు చెల్లినవాడు, పోయినా దం ఒక్క ఏడుపు ఏడ్చి ఊరుకొన్నాను: ఈసంవత్సరము కళింగదేశ యుద్ధములో నా కొడుకు లిద్దరూ చనిపోయినారు:

అశోకుడు: అయితే ఆ కొడుకులకు బిడ్డలు లేరా?

ముసలిది: అయ్యో, అయ్యో, బాబు- బుల్లిబాబు! [అని చతికిలబడి ఏడుస్తుంది]

అశోకుడు: [ఆమె పక్కనే నిలుచుని] ఏడవకు-ఏడవకు..

ముసలిది: [ఏడుస్తూ] ఆరోగ్య భాగ్య, నాగొంతు ఎందుకుపోతున్నది. నేనుకూడా చచ్చిపోగూడదూ! ఈకూన అయినా—

అశోకుడు: ఈకూన ఎవరు?

ముసలిది: నా మనమడు: కొడుకులు పోయినా ఈ పసికందు బ్రతుకగూడదూ?

అశోకుడు: ఈ పసిబిడ్డ చసిపోయినాడా?

ముసలిది: ఆ, ఈరోజుదయమే. అశోకుడు - వాడిదుంప తెగ! ఈచనిపోయిన కూనమీద కూడా వాడికి ద్వేషమెందుకో?

అశోకుడు: ఏం చేశాడు, ఏం చేశాడు?

ముసలిది: ఈరోజుదయము ఈపసికందును పాతిపెడదామని వల్లకాటికి పోతే, రాజుగారికి సుంకము చెల్లించండి రాజభటులు పాతిపెట్ట నీయలేదు.

అశోకుడు: పాపము, నీదగ్గిర డబ్బు లేదు కాబోలు. రాజుగారు సిపాయీల కుటుంబాలకు పింఛన ఇస్తున్నాడే!

ముసలిది: వాడి డబ్బూ వాడూ ఊడ్చుకుపోను! వాడిడబ్బు నాకక్కర లేదు. అందుకెన్నో సిఫార్సులు కావాలి. అయినా బందిపోటుదొంగ డబ్బు నాకక్కర లేదు.

అశోకుడు: మరి నీ విప్పు డెక్కడికి వెళ్లుతున్నావు?

ముసలిది: శవాన్ని ఎక్కడో జుకంటే ఇంట్లో అట్టె పెట్టుకో గూడదని ఆపాదముండాకొడుకు శాసనము. ఊరిబయట ఏగోతిలోనైనా పారవేసి నేనూ ఏగోతిలోనైనా పడుదామని బయలుదేరినాను.

అశోకుడు: అంత అవస్థ పడవలసిన అవసరము లేదు. శ్మశానములో రాజభటులంతా మావాళ్ళే. నేనుకూడా నీవెంట - కాదు కాదు, నాకు పని ఉంది. నావేలి ఉంగరము ఇస్తాను. ఈ ఉంగరము చూపిస్తే వాళ్లు నీకు కావలసిన సహాయమంతా చేస్తారు.

ముసలిది: నీ వెవరో ఈరాజ్యములో చాలా మంచి వాడివి లాగా ఉన్నావు. అయితే ఉంగరము వాళ్ళ కిచ్చివేసేదా?

అశోకుడు: నీ ఇష్టము—పోనీ నీవు అమ్ముకొని డబ్బు తీసుకో.

ముసలిది: నా కెందుకు నాయనా నీడబ్బు?

అశోకుడు: అయితే వాళ్ళకిచ్చి వెయ్యి.

ముసలిది: అయితే అబ్బాయీ, సరే కాని నాకు రాజదర్శనము కావలె నంటే ఏం చెయ్యాలో చెప్పగలవూ?

అశోకుడు: ఎందుకు?

ముసలిది: ఒక్కసంగతి అడుగుదా మని- ఆసంగతి అడగగానే అక్కడి భటులు నన్ను ఎట్లాగూ తంతారు. నేను చచ్చిపోతాను. నేనుకూడా వాడి చేతులో చచ్చిపోదా మను ఉంది.

అశోకుడు: ఏమిటి అవ్వా ఆసంగతి?

ముసలిది: ఇట్లా అడుగుదా మని: "ఓరి అశోకుడా, మాకొంపలో ఒక రిద్దరు చచ్చిపోతే మే మిట్లా ఏడుస్తాము. నీ రాజ్యములో- రాజ్యమంటే కుటుంబము కాదా- నీకుటుంబములో ఇంతమంది చచ్చిపోయినా ఇంతహాయిగా నిశ్చింతగా ఎట్లా ఉంటావు? ఆసంగతి ఏమిటో నాకు కూడా కాస్త చెప్పు. అయినా ఆ కళింగ దేశములో మగపురుగు లేకుండా చేశావుట. ఇక రాజ్యము చేసేది వెధవముండలనూ, ముసలి ముండలనా?" అని అడగగానే అక్కడ ఉండే వాళ్ళు నన్ను చావ దంతారు, సరిపోతుంది!

అశోకుడు: నేను మహారాజు గారితో చెప్తానులే.

ముసలిది: నీ వాయన ఆప్తులలో ఉన్నావా ఏం? అయితే నీకు చెప్ప వలెనని మనసులో ఉన్నా, చెప్పజాలవు. ఎట్లాగైనా నాకు దర్శన మిప్పించూ.

అశోకుడు: రాజుగారి దర్శనము కావడము దుర్ఘటము ముసలమ్మా! నేను వెళ్ళిపోవాలి. వెళ్ళొయ్యి.

ముసలిది: నాయనా, నీ వెవరో గుర్తు పట్టలేను. వెయ్యేళ్ళు వర్ధిల్లు! నీ మేలు మరిచిపోను. నీవు సిపాయివా బాబూ? మా అబ్బాయికి స్నేహితుడవా?

అశోకుడు: ఆc అవును లే. వెళ్ళుతున్నాను. వెళ్ళవలెను. [అంటూ అశోకుడు వేగముగా వెళ్ళిపోతాడు. ముసలమ్మకూడా వెళ్ళిపోతుంది.]

మూడో రంగము

[తెల్లవార వస్తున్నది. అప్పుడప్పుడు పిట్టలు కిలాకిలా కూస్తున్నవి. మర్రిపొదల వల్ల పొదరిల్లుగా ఉన్న ప్రదేశములో చలువరాతి అరుగు. ఒకపక్కన మాళవ రాకుమారి నిలుచుని ఉంది. మరొకపక్కన అశోక చక్రవర్తి నిలుచుని ఉన్నాడు.

ఆమె సన్నగా పొడుగుగా తీగలాగ ఉంది. రామచిలుక ముక్కులాంటి ముక్కు, వాలుగన్నులు. ఆమె ఒక్క ఆభరణమైనా ధరించలేదు. ముఖాన బొట్టు అయినా పెట్టుకో లేదు. చాలా కోపముతో ఉన్నట్టు కనబడుతున్నది.

అప్పుడప్పుడు అశోకునివంక మిర్రిమిర్రి చూస్తూ వెంటనే తల వంచుకొంటూ ఉన్నది.]

అశోకుడు: కార్యాంతరములలో పడిపోయి ఈ దాసజనుడు ఇంత కాలమువరకూ నీ దర్శనము చేయలేక పోయినాను; అన్యథా అనుకో వద్దు [చేయి పట్టుకో బోతాడు.]

రాకుమారి: [చెయ్యి పట్టుకోకుండా తప్పించుకొని ఓరకంటితో అతి తీవ్రముగా చూసి ఊరుకొంటుంది.]

అశోకుడు: ఈ దాసాధముడిమీద ఇంతకోపము తగదు. నీవు మాట్లాడక పొయ్యేటట్లయితే నాకు చాలా కష్టము వేస్తుంది. కోకిలలాగా ఒక్క

పలుకు పలికి నాచెవులతుప్పు పోగొట్టరాదూ! అసలే తాపముతో ప్రాణాలు పోతున్నవే- నీకృపా కటాక్షములు నామీద బరపి, నాతాపము బాప రాదా? అంత కోపమా, ఎందుకు అలా పెడతావు ముఖము? నిజముగా నేను నీకోపానికి పాత్రుణ్ణో! ఇదిగో నిజముగా నీకు కోపము వచ్చినట్టయితే ఎందుకు నీవు ఆబాహువల్లరులతో నన్ను బంధించి పారవేసి, కొరికి వేయరాదు దంతాలతో?

రాకుమారి: [ప్రాణమువలెగా వెలుచుని తీవ్రముగా చూస్తూ ఊరుకొంటుంది]

అశోకుడు: [సమీపించి మోకాళ్ళపైని కూర్చుని దోసిలియొగ్గి] నీగాఢాశ్లేషముకు నేను తగనా?

రాకుమారి: [అతివినయముగా] నేను మీ ఖైదీని; నన్ను మీ రింత వేడుకో వలసిన అవసరము ఏమీ లేదే.

అశోకుడు: నా ఖైదీవా? అం అంతమాట! - ఎంతమాత్రము కాదు. నేను నీబందిని; నీకోప పాత్రుణ్ణి.

రాకుమారి: నన్ను కన్యకడికి మీరు ఖైదుగానే తీసుకొని వచ్చినారు.

అశోకుడు: కాదు, ఎంతమాత్రము కాదు. నీవు నా హృదయరాజ్ఞివి, రాణు లందరూ నాకు ఒక యెత్తు, నీవు ఒక్క-తెవు ఒక్క-యెత్తు! ఇటు వంటి హృదయ విదారక వాక్యములు నేను విన లేను.

రాకుమారి: హృదయ విదారకకృత్యములు చేసేవారికి మాటలతో పని ఏముంది? తమ రీదారభాగ్యురాలిని—

అశోకుడు: దాసుడి తప్పు క్షమించి సరి అన్నారు. ఎందుకు మాటలని నా హృదయాన్ని చీల్చివేస్తావు?

రాకుమారి: నేను మిమ్మలను ఏమీ తూలనాడడము లేదు. తమంత చక్రవర్తులు ఒక భార్యలు, అందులో ఒక స్త్రీని ఇంత బతిమాలడములో అర్థము కనబడడము లేదు.

అశోకుడు: [రాకుమారి దగ్గరికి వెళ్ళి చేయి పట్టుకొని కౌగిటిలో చేర్చుకో

పోతాడు. ఆమె తప్పించుకుంటుంది. దగ్గరదగ్గరకు వెళ్ళబోతాడు. అతడు సమీపించినకొద్దీ ఆమె దూరము జరుగుతూ ఉంటుంది] నీవు అలా "కాదు కాదు". అంటూ ఉంటే నాకర్ణ రంధ్రములలో సీసము కరిగించి పోసినట్టుగా ఉంటుంది. నీవు సామ్రాజ్యాధిష్ఠాన దేవతవు—

రాకుమారి: ఎంత ఆశ్చర్యము- ఎంత ఆశ్చర్యము? నాతండ్రి, నా అన్న మీకు పరమశత్రువు అయిపోయినారు. మీరు వారిని వధించినారు. నేను మాత్రము మీ కింత అప్తురాల నైనానా? పాము చుట్టము, పడగ మాత్రము పగ అట. అహా!

అశోకుడు: నిజమే; నీ కత్యంత సంతాపము చేకూర్చిన మాట సత్యమే. అది క్షాత్రధర్మము. క్షత్రియాంగనవు, నీ విటు వంటి వాటికి ఇంత దుఃఖించకూడ దని నామనవి.

రాకుమారి: [ఆశ్చర్యముతోనూ కోపముతోనూ] తాము క్షత్రియులా, క్షత్రియులా?

అశోకుడు: నీకు తెలియదా ఆసంగతి? నేను క్షత్రియుడను కానా?

రాకుమారి: ఎంతమాత్రము క్షత్రియులు కారు. తమతల్లి బ్రాహ్మణాంగన. తండ్రిగారు మాత్రము క్షత్రియులు.

అశోకుడు: [నవ్వుతూ] అయితే నేను- ఎంత శత్రిదానివి!

రాకుమారి: రాధాగుప్తుడు మంత్రి కాక పోయి నట్టయితే తమ కెవరో తమకే తెలిసేది.

అశోకుడు: [మందహాసముతో] రాధాగుప్తుడు ఏమి చేసినాడు?

రాకుమారి: సుక్షత్రియుడయిన తమ అన్న గారిని మోసపుచ్చి బ్రాహ్మణాభిమానము వల్ల తమకు రాజ్యము కట్టబెట్టి తమను క్షత్రియులను చేసినాడు.

అశోకుడు: మా అన్న గారి నెన్నడూ మోసము చేయలేదు. మాతండ్రే నాకే రాజ్యమిచ్చినాడు. రాధాగుప్తుడు నాకు రాజ్య మిప్పించి నా వెన్ను మాట అసత్యము.

రాకుమారి: విను. తమ వికృతాకారానికి తమ తండ్రిగారెంతో అసహ్యించుకొనేవారట. ఇటువంటి తమ్ము కన్నందుకు తమతల్లి మీదకూడా రాజుగారికి కోపము వచ్చి తరువాత ఒక్కసారి అయినా చూడలేదట. తాము మరణిస్తే సంతోషింతామనే ఉద్దేశ్యముతో శత్రుసేనలపైకి తమ్ము పంపించారట.

అశోకుడు: నాపరాక్రమము పరీక్ష చేయడానికి మాతండ్రిగారు అట్లా చేసినారు. నీకు తెలియదు. నీవు చిన్నదానివి. నాకు గిట్టనివాళ్ళెవరో ఇవన్నీ కల్పించి చెప్పినారు. అయినా నేను క్షత్రియోచిత మయిన కృత్యములను చేయడము లేదా? గుణములను బట్టే వర్ణము ఏర్పడుతది.

రాకుమారి: [నవ్వుతూ] తాము తమ ఆకారమునకు తగిన పనులు చేస్తున్నా రంటే సమంజసముగా ఉంటుంది.

అశోకుడు: అయితే నా ఆకారము క్షత్రియోచితము కాదా?

రాకుమారి: కాదు. వికారాకారము!

అశోకుడు: [నవ్వుతూ] నేను వికారుడ్నా?

రాకుమారి: అవును. ఈ రక్తపాతములు, ఈ రాజ్యధ్వంసములు, ఈ [illegible]ములు, ఏమిటివన్నీ —

అశో: [వేగముగా చేయి పట్టుకొని కౌగిటిలోకి తీసుకోబోతాడు. ఆమె తప్పించుకోడానికి ప్రయత్నము చేయబోతూ చప్పున [illegible]స్తుంది. కొంత ఆశ్చర్యము చెంది] ఇంత కోపమూ ఇంత ద్వేషమూ నాపైన వద్దు. నేను నీదాసుడ్ని. నేను తప్పు చేస్తే దండించ వలసినది నీవు, [కౌగలించుకో బోతాడు.]

రాకుమారి: [[illegible] కోపముతో చుర చుర చూస్తూ] నా ఈ దేహాన్ని ఏమి చేసినా చేయవచ్చునని ఇదివరకే మనవిచేసికొని ఉన్నాను. కాని నా హృదయము మాత్రము మీకు లభ్యము కాదు.

అశోకుడు: నీహృదయము కోసరము, నీ అంతరంగము కోసమున కాక పోతే ఈ రాజ్యాలు నేను జయించడము ఎందుకు?

రాకుమారి: నాకు మీ రాజ్యములతో పని లేదు మీ యుద్ధములతో పని లేదు. [గద్గదస్వరముతో] మీ వికృతరూపము చూస్తూ ఉంటే త్రిశంకు జ్ఞాపకము వస్తున్నాడు. అమ్మో, అమ్మో! [గజగజ వణకుతూ] దేశదేశాలను ధ్వంసము చేసే తమకు అరక్షిత అయిన స్త్రీని ధ్వంసము చేయడము ఒక లెక్కా! కానీయండి, నేను అగపోయను.

అశోకుడు: [విచారముతో] నన్ను కూలనాడ వద్దు. నీకోసరము సమస్తమూ, రాజ్యమూ పరిత్యజించి వేస్తాను. ఇక ఒక యుద్ధము చేస్తే పితృద్రోహము చేసినంత ఒట్టు.

రాకుమారి: సమస్తమూ త్యజించగలరు. రాజ్యముకూడా పరిత్యజించగలరు. కాని ఒక్క స్త్రీ కోసరము ఒక్క అశుచిభ స్త్రీక కోసరము ఎంత కావత్రయము!

అశోకుడు: [కోపముతో] నిన్ను మాత్రము పరిత్యజించలేనని అనుకొంటున్నావు కాబోలు!

రాకుమారి: ఒక్క స్త్రీకోసరము లోకాన్ని అంతా పరిత్యజించగలవారు ఇంత రాజ్యము ఏలా చేస్తారా అని ఆలోచిస్తున్నాను.

అశోకుడు: అయితే రాజ్యపరిపాలనకుకూడా అనర్హుడననే నీ అభిప్రాయము కాబోలు!

రాకుమారి: ఏమో, నాకు తెలియదు.

అశోకుడు: [విసుగుతో] కనుసైగతో సమస్తదేశములనూ జయించినాను. కాని ఒక్క స్త్రీ హృదయాన్ని మాత్రము జయించలేక పోయినాను గదా!

రాకుమారి: దేశాలను జయించినట్టే ఈ స్త్రీని జయించవచ్చును. రాజా, తాము దేశదేశాల రాజులను జయించినారు. కాని వారి హృదయాలను

మాత్రము జయించలేవు సుమా! ఆయా రాష్ట్రజనుల హృదయాలలో చిచ్చు పెట్టినారు. మీ కీవిషయము తెలియదు కాబోలు. అట్లాగే నా దేహము మీ అధీనము. నా హృదయము మాత్రము మీది కాదు. దాన్ని మీరు జయించలేరు.

అశోకుడు: నాకు హృదయము లేదా!

రాకుమారి: ఏమో నాకు తెలియదు.

అశోకుడు: భయపడ వద్దు, చెప్పు. నాకు హృదయము లేదా?

రాకుమారి: మీ ఇతరవిషయాలు నాకు తెలియవు. నా తండ్రిని చంపి నా అన్నను చంపి నా తండ్రి రాజ్యాన్ని లాక్కొని నా ఈ తుచ్ఛ దేహాన్ని ఆశించేవారికి హృదయము ఉందని నేను ఎలా అనుకొనేను?

అశోకుడు: [తేరి పార తీవ్రముగా చూస్తూ తల ఊగిస్తూ] అవును!

రాకుమారి: [కండ్లు మూసికొని] అమ్మో, అమ్మో, ఘోరనేత్రములు, మీ భీకరాకారము చూడలేను! అమ్మయ్యో, మీకు కోపము వచ్చినట్టున్నది. నన్ను ఏం చేస్తారో కదా! [గజగజ వణుకుతుంది.]

అశోకుడు: భయము లేదు, భయము లేదు నీ హృదయాన్ని జయించిన వాడే నీవు నన్ను చూడవచ్చును. [అని వెళ్ళిపోబోయి ఆమె వంక చూస్తాడు. ఆమె అట్లాగే వణుకుతూ ఉంటుంది.] దాసీ, దాసీ! [ఒక దాసి పరుగెత్తుకొని వచ్చి ప్రణామము చేసి నిలుచుంటుంది.]

అశోకుడు: ఈమెను తీసుకుపో.

[రాకుమారీ దాసీ వెళ్ళిపోతారు. అశోకుడు విచారముగా ఆలోచించుకుంటూ నిలుచుండి ఉంటాడు, తెల్లవార వస్తుంటుంది. దూరము నుంచి శ్రావ్యముగా ఈ క్రింది పద్యములు వినబడుతవి.]

జితమారారి సమరం
జ్ఞేయసాగర పారగమ్
లోకైక లోచనం బుద్ధం
వందేహం వందనారహమ్.

భవన్నవతరం తానం
తరీవకరణం సదా
శిరసా పణమే సమ్మా
ధమ్మం మోహావిద్ధం సకమ్.
కరణీయం కతం సబ్బం
పుఞ్ఞ ఖేత్త మనుత్తరమ్
అట్ఠారి యోగణం సుద్ధం
వందేహం సుగతోరసమ్.

సమ్మా సమ్మాభిసంబుద్ధం
ధమ్మం ధమ్మస్సు శాసనమ్.
సంఘం సంఘుత్తమం లోకే
వందేహం వందనారహమ్.

అశోకుడు: దాసీ, దాసీ.

దాసి: [గబగబ వచ్చి] మహాప్రసాదం.

అశోకుడు: ఎవ రా పద్యాలు పాడేది?

దాసి: ఇక్కడికి అరక్రోసుదూరములో ఉన్న బౌద్ధారామములో ఉప గుప్తులవా రున్నారు బహుశః వారు.

అశోకుడు: నీవు సత్వరము పోయి అశోక చక్రవర్తి పిలుస్తున్నా డని చెప్పి త్వరగా సూర్యోదయము కాక పూర్వమే తీసికొని రా. [కొంచెము విచారించి] కాదు కాదు. అశోకుడు తమదర్శన భాగ్యము కోసరము ప్రార్థిస్తున్నా డని ప్రార్థించి తీసుకొనిరా. పో. నీవు వచ్చేవరకు నా కేమీ తోచదు.

దాసి: చిత్తము [అని వెళ్ళిపోతుంది.]

అశోకుడు: సమ్మా సమ్మాభి సంబుద్ధం. [అనే పద్యము పాడుకొంటూ విచారముతో అటూ ఇటూ ఒకటిరెండుసార్లు పచార్లు చేసి వెళ్ళిపోతాడు.]

శ్రీకృష్ణుడు

శ్రీ చింతా దీక్షితులు

౧

శ్రీకృష్ణుడు: అమ్మా, అమ్మా, నే వచ్చేశా.

యశోద: వచ్చావా, నాయనా! నా తండ్రే, ఇప్పటిదాకా ఏం చేస్తున్నావు నాయనా?

శ్రీకృష్ణుడు: అమ్మా, మరేం, మరీ, మరీ ఆడుకుంటున్నా నమ్మా.

యశోద: అయ్యో నాయనా! ఎక్కడ దాగుకొంటున్నావు రా? ఇప్పటిదాకా ఇల్లంతా వెతికేను, నీకోసం.

శ్రీకృష్ణుడు: అమ్మా, నాకేమన్నా పెట్టవుటే, ఆడుకొంటాను.

యశోద: ఎక్కడ దాగుకొంటూన్నావు రా ఇంతసేపటినుంచీని?

శ్రీకృష్ణుడు: ఏంటే అమ్మా, నాకేమనా పెట్టవుటే?

యశోద: ఆడుకోవడం లేదు; అల్లరి చేస్తున్నావు, అవునా?

శ్రీకృష్ణుడు: లేదే, అమ్మా, ఆడుకుంటున్నానే. తువ్వాయిలూ అవీ ఉరిగెడుతూంటే చూస్తూన్నానే.

యశోద: వెన్నముద్ద పెట్టనా?

శ్రీకృష్ణుడు: ఊహుఁ.

యశోద: వెన్నెందుకు వద్దురా? నీ కిష్టమేంగా!

శ్రీకృష్ణుడు: నాకేం, నాకేం......

యశోద: పోనీ, పాలు తాగుతావా?

శ్రీకృష్ణుడు: ఊహుఁ.

యశోద: ఏమిరా నాయనా, ఏమీ వద్దంటున్నావూ; ఇలా దగ్గరగా రా; ఏదీ చూడనియ్యి నీ కడుపు.

శ్రీకృష్ణుడు: వద్దే అమ్మా, వద్దే... పోనీలే నా కేమీ కొట్టకపోతే— నేను వెళ్ళిపోయి ఆడుకొంటాను.

యశోద: నాతండ్రివిగా; దగ్గరగా రావూ; రా అమ్మా రా! ఏదీ కళ్ళు మూసుకొంటాను, ఎవ రొస్తారో, ఎవరొస్తారో!

శ్రీకృష్ణుడు: ఊఁ, ఊఁ, ఊఁ— నేను రానూ— నేను వెళ్ళిపోయి ఆడుకొంటానూ— ఊఁ, ఊఁ.

యశోద: నాతండ్రివి గావూ, ఎవ రొస్తారో ఎవ రొస్తారో; కంటె వస్తుందో కాసుల పేరు వస్తుందో; నా చిన్నికొజ్జ కృష్ణమ్మ వస్తాడో; నా బంగారుగజ్జెల కృష్ణమూర్తి వస్తాడో; ఎవ రొస్తారో, ఎవ రొస్తారో!

శ్రీకృష్ణుడు: ఊఁ, అమ్మా, నే రాను, నే రాను — నే వెళ్ళిపోతాను. నే రాను......

యశోద: రావు కాదూ. నా వరహాలమూటవు కాదూ, నాకన్న తండ్రివి కాదూ, నా ముత్యాల పేరువు గాదూ, నా నాయనవు కాదూ, రా, అమ్మా, రా. ఎవ రొస్తారో, ఎవరొస్తారో!

శ్రీకృష్ణుడు: అమ్మా, మరేం, నాన్న మొన్న తెచ్చాడు.— ఆ బొమ్మ ఇయ్యవూ? గదిలో కూచుని ఆడుకొంటాను—

యశోద: రావు కాదూ; వస్తున్నా ఉండు, పారిపోకురా, చూశావా, చూశావా, ఎలా వరుగెత్తుతున్నాడో- నా నాయన కాదూ-దా, ఇలాదా; నీకు బొమ్మ యియ్యనా?

శ్రీకృష్ణుడు: ఇయ్యి మరీ.

యశోద: నాదగ్గిరికి రా; ఒక్క ముద్దు ఇయ్యి; తరువాత బొమ్మిస్తా, ఏం!

శ్రీకృష్ణుడు: నన్ను పట్టుకొని కొడతావూ?

యశోద: కొట్టనులే, రా; రా, అమ్మా, రా. పారిపోకమ్మా! పారి

పోతన— ఆఁ, దొంగా. దొరికావు లే—

శ్రీ కృష్ణుడు: అమ్మా, నాకు మరి బొమ్మిస్తావూ?—

యశోద: ఇస్తా నమ్మా, ఇస్తాను—ఏమి రా నాయనా, కడుపు ఇంత గట్టిగా ఉంది; పొంగిన ట్లుందేమిటి?

శ్రీ కృష్ణుడు: ఏమో! మరి ముద్దు పెట్టుకొన్నావు కాదూ — బొమ్మియ్యి—

యశోద: ఇదేమిట్రా, వళ్ళంతా ఈ జిడ్డు, ఏదీ చూడనియ్యి, అయ్యో, అయ్యో, నాతండ్రీ, ఇదేమిట్రా ఈ పెదివిలమీద ఈ నెత్తురుచారలూ?

శ్రీ కృష్ణుడు: ఏం లేదు.

యశోద: అయ్యో నాతండ్రీ— ఎక్కడికేనా వెళ్ళి ఏమైనా తిన్నావా ఏమిట్రా?

శ్రీ కృష్ణుడు: ఊఁ హూఁ.

యశోద: ఎవరితోనైనా గిల్లి కజ్జాలు తెచ్చుకొన్నావా ఏమిటి?

శ్రీ కృష్ణుడు: ఊఁ హూఁ.

యశోద: నాతండ్రికి దిష్టి తగిలిం దమ్మా; దిష్టి తీస్తా నుండు.

శ్రీ కృష్ణుడు: బొమ్మిమ్మయ్యావుటే అమ్మా?

యశోద: ఉండు, దిష్టి తీస్తాను—తప్పమ్మా తప్పా, దిష్టిదీపం ఊదేకి ఆర్పెయ్యకూడదు— ఊదకు రా—

శ్రీ కృష్ణుడు: మరియ్యవుటే బొమ్మా?

యశోద: ఇస్తాను గాని, — కూడు నిజంగా చెప్పు — ఈ కడుపు ఇంత ఉబ్బరంగా ఉంది గదా — ఎక్క డేమి తిన్నావో చెప్పు—

శ్రీ కృష్ణుడు: ఊఁ.

యశోద: చెప్పవు గాదూ–చెప్పకపోతే ఏం చేస్తానో ఎరుగుదువా?—

శ్రీ కృష్ణుడు: మరి, పొద్దున్న, పాలు తాగాను కాదూ!

యశోద: ఛా, ఉట్టిది—

శ్రీకృష్ణుడు: అవునే.

యశోద: చెప్పవూ? చెప్పవూ?—

శ్రీకృష్ణుడు: ఉండు, ఉండు, చెబతా ఉండు—కొట్టకు మరి— మరేం, ఇందాకోను, మన పెద్దావుంది కాదూ—

యశోద: గబగబా చెప్పూ.

శ్రీకృష్ణుడు: తువ్వాయి దాందగ్గిర పాలు తాగి ఆడుకొంటోందే అవ్వా తేం, నేనేం, మరేం—

యశోద: ఏమి చేశావు, చెప్పూ—

శ్రీకృష్ణుడు: నేనేం, అప్పుడూ, పెద్దావుదగ్గిరికి వెళ్ళానే—వెళ్ళి, తువ్వాయి పాలు తాగుతుంది కాదూ—అలాగ—

యశోద: అలాగ, ఏమిటి?

శ్రీకృష్ణుడు: దాని కాళ్ళసందు కెళ్ళి పాలు తాగేనే—

యశోద: అయ్యో, అయ్యో, నాయనా, అది తన్నలేదు కదా!—

శ్రీకృష్ణుడు: లేదే ఆపాలు ఎంచక్క వెచ్చగా తియ్యగా ఉన్నాయే—

యశోద: ఈ నెత్తురుచారలందుకే—అది తన్నిందా ఏమిటి—

శ్రీకృష్ణుడు: లేదే పాలు తాగుతూంటే తువ్వాయిని నాకుతుంది కాదూ—అలాగే నన్నూ నాకిందే పెద్దావు.

యశోద: అయ్యో, నీ అగపం బంగారం కాను—ఇం కెప్పుడూ ఆవు కాళ్ళసందుకి వెళ్ళకేం—

శ్రీకృష్ణుడు: వెళ్ళనే అన్నా.

యశోద: మరింద బొమ్మ — ఇంద చక్క పిడతలు — అరుగుమీద కూచుని ఆడుకొంటావు కాదూ?

శ్రీకృష్ణుడు: నే నరుగుమీదకు వెళ్ళను ఇంట్లోనే నీదగ్గిర కూచుంటాను—

యశోద: అరుగుమీద కూర్చుంటే ఏం, నాయనా?—

శ్రీకృష్ణుడు: నాకు భయమేస్తుందమ్మా, నే వెళ్ళను.

యశోద: నా అల్లరితండ్రికి భయంకూడానూ! అయితే ఈ పీటమీద కూచో. నేను పాలు పితుక్కు వస్తా—

౨

గోపికలు: ఏ మమ్మా, యశోదమ్మా, తలుపు తియ్య వమ్మా ఒకమాటు.

యశోద: ఎవ రమ్మా అక్కడ?

గోపికలు: మేమమ్మా గోపికలము—ఒక్కమాటు తలుపు తియ్యవమ్మా.

యశోద: నాకృష్ణు డేడీ? ఈపీటమీద కూర్చోకుండా ఎక్కడికి వెళ్ళావురా, నాయనా?

గోపికలు: తియ్యవమ్మా తలుపు, ఓయశోదమ్మా.

యశోద: ఉండ వమ్మా వచ్చేను — నాయనా, కృష్ణా ఎక్కడున్నావురా?

శ్రీకృష్ణుడు: ఊఁ.

యశోద: ఈమూల నక్కేవేమిరా, నాయనా?

శ్రీకృష్ణుడు: ఏం లేదు—

గోపికలు: అదే మమ్మా, పలికిన్నీ తలుపు తియ్యవూ? మాకమాత్రం పనులు లే వటమ్మా, యశోదమ్మా, తలుపు తియ్యరాదుటమ్మా ఒకమారు!

యశోద: వస్తున్నా నమ్మా— అల్లా తొందర పడతా రేం? — రా, నాతండ్రీ, రా, నిన్నెత్తుకొని వెళ్ళి తలుపు తీస్తాను.

శ్రీకృష్ణుడు: నేను రానే, నాకు భయం!

యశోద: గోపికలను చూస్తే భయ మేమిటి? నీవు రోజూ వాళ్ళతో ఆడుకొంటూ ఉంటావు కావూ!—

శ్రీకృష్ణుడు: నేను రానే అమ్మా - తలుపు తియ్యకే.

గోపికలు: యశోదమ్మా! ఓ యశోదమ్మా!

యశోద: వస్తున్నా నమ్మా; తొందర పడకండి - రా అమ్మా రా, ఎత్తు కొంటాను - అప్పు దొంగా; ఎత్తుకోనా, ఎత్తుకోనా?

శ్రీ కృష్ణుడు: వద్దే.

యశోద: అలాగ కాదమ్మా-అః-ఎత్తుకున్నా నామరి- ఈమాటు తలుపు తీద్దాం, ఏం?

గోపికలు: ఇక్కడే నిలబడిపోతి మమ్మా యశోదమ్మా, తలుపు తియ్య వమ్మా—

యశోద: ఇదిగో నమ్మా తలుపు తీశాను-ఎందుకమ్మా ఇంతమంది గోపి కలు వేళ గాని వేళ మా ఇంటికి వచ్చారు?

గోపికలు: అవునమ్మా యశోదమ్మా-మీపిల్లవాడి ఆగడం మీకు ఇష్ట మయితే కావచ్చును గాని-ఊరివా రందరికీ ఇష్టమౌతుం దమ్మా?

యశోద: ఆదేమి గోపమ్మా, అంతకోప మొచ్చుమరి? - మాపిల్లవాడేమి చేశాడో చెప్పరే.

గోపిక: ఏమి చేశాడో నేను చెప్పెద నెందుకమ్మా? మీపిల్లవాడి ఆగడం మీకు తెలియ దటమ్మా?

ఇంకో గోపిక: మీపిల్లవాణ్ణి అదుపాజ్ఞలలో పెట్టుకోక - ఏమి చేశా డంటూ వేమి టమ్మా యశోదమ్మా?

మూడో గోపిక: మీకృష్ణమ్మ ఏమీ ఎరగని నంగనాచమ్మా! - నోట్లో వేలు పెడితే కరవలేడు పాపం!—

యశోద: మాపిల్లవాడు పొద్దిటినుంచీ మా ఇంట్లోనే ఉన్నాడు గా దటమ్మా.

గోపిక: అవు నమ్మా మీ ఇంట్లోనే ఉన్నాడు—

ఇంకో గోపిక: మీ ఇంట్లోనే ఉండి మా ఇళ్ళన్నీ చక్క బెట్టుతున్నాడు- కా దటమ్మా, యశోదమ్మా?

మూడో గోపిక: చంకలో నక్కి కూచుని ఎలా చూస్తున్నాడో ఏమీ

ఎరగనట్లు-నాలి ముచ్చులా అలా చూస్తున్నావుగా ఏమీ ఎరగనట్లు కృష్ణా!

యశోద: అయితే మీ రందరూ కలిసి ఏమి తప్పు చేశా డంటారు మాకృష్ణమ్మ!

గోపిక: అవునే, యశోదమ్మా, మ మెందు కడుగుతా వమ్మా, మీపిల్ల వాణ్ణే అడగ వమ్మా—

ఇంకో గోపిక: ఏమిరా, కృష్ణా, చెప్ప రా మీ అమ్మతోటి—

యశోద: ఏమి చేశావు, నాయనా, ఏమి చేశావు? - నాకు చెప్పవూ?

శ్రీకృష్ణుడు: ఏమీ చెయ్య లేదే—

గోపిక: ఏమీ చెయ్యలే దుట్రా పెంకే?

ఇంకో గోపిక: ఏమీ చేయలేదు గా-నంగనాచీ?

మూడో గోపిక: అవును, ఏమీ చెయ్యలేదు-ఏమైనా చెయ్యగలవా అల్లరి-పాపం-అవునా కొంటే?

యశోద: ఎందు కమ్మా, మా అబ్బాయిని మాట లంటారు? - ఏమి చేశాడో మీరే చెప్పరాదు టమ్మా?—

గోపిక: మే మెందుకు చెప్పా లమ్మా యశోదమ్మా?

యశోద: చెప్పకపోతే ఎట్లా తెలిసే నమ్మా, గోపమ్మా?

గోపిక: తెలియ దంటా వేమి టమ్మా? — అంతా విడ్డూరం!—మీ అబ్బాయివళ్ళు చూశావు టమ్మా?

ఇంకో గోపిక: ఆ జిడ్డంతా ఒంటికి ఎందుకు వచ్చిందో అడగరాదు టమ్మా ఆ దొంగకృష్ణుణ్ణి?—

యశోద: ఏమిరా, నాయనా, ఒంటికి జిడ్డు ఎందుకు వచ్చిం దంటావురా? చెప్పమ్మా?

గోపిక: ఆ పెదవిమీద చార లేమిటో అడగవే మమ్మా, యశోదమ్మా!

శ్రీకృష్ణుడు: అమ్మా, వాళ్ళని వెళ్ళిపొమ్మనవే, భయం వేస్తోంది—

యశోద: అ దేమి టమ్మా అందరూ కలిసి మాకృష్ణమ్మను బెదర

గొడుతున్నారు—వెళ్లం డమ్మా, మీ ఇళ్ళకు మీరు వెళ్ళండి — ఎవళ్ళని చూచి ఎవ రనుకొన్నారో—

గోపిక: ఎంత చిత్రంగా మాట్లాడతా వమ్మా—మీ కృష్ణమూర్తిని మే మెరగమూ కాబోలు!

ఇంకో గోపిక: మా కెప్పుడూ కనిపించకుండానే ఉంటున్నాడు కాబోలు కొత్తక రోజా!—

యశోద: అయ్యో ఎంత ఖర్మం వచ్చిం దమ్మా! మా నాయన ఏమీ చెయ్యలే దంటూంటే ఏమీ అల్లరి చేశా డని అంటున్నారు కాబోలు— ఆ అల్లరి ఏమిటో చెప్పరాదు టమ్మా!—

గోపిక: పిల్ల అని అదమాయించుకోకుండా మే మేమీ అన్నా మంటా వెందు కమ్మా?—మీ అబ్బాయినే అడగ వమ్మా! మాటలు రావా ఏమిటి పాపం మీ వాడికి!

యశోద: చెప్పు, నాయనా, ఏమి చేశావో చెప్పు.

శ్రీ కృష్ణుడు: నే నేమీ చెయ్యలేదే అమ్మా.

యశోద: మా కృష్ణమ్మ ఏమీ చెయ్యలే దంటున్నా డమ్మా.

గోపిక: అంటా డమ్మా, అంటాడు—అనడు మరి?—మీ వాడు బుద్ధి మంతుడు—చూ డమ్మా, నువ్వే చూడు—దీని పెదవి ఎలా కొరికి వేశాడో చూడు—చూపవేమే గోపీ, పెదవి చూపు— అల్లా సిగ్గు పడతా వేం?

శ్రీ కృష్ణుడు: ఉత్తిదే అమ్మా!

ఇంకో గోపిక: చూడ వమ్మా, మీ బుద్ధిమంతుడు మా చెల్లెలి పెదవి కూడా రక్తా లొచ్చేటందుకు ఎలా కొరికేశాడో!

శ్రీ కృష్ణుడు: ఊఁ—నే కొరికేనా?

ఇంకో గోపిక: చూ డమ్మా యశోదా, చూడు ఈ పిల్ల బుగ్గ—వట్టి ఎలాగ దిగారో- మా పిల్లలుమాత్రం పిల్లలు కా రటమ్మా?

శ్రీ కృష్ణుడు: నాకు వెన్న ముద్ద ఇస్తానని ఆశ పెట్టి—

యశోద: అయితే నిజంగా కొరికేవుట్రా—ఊరు ని న్నేం చేస్తానో! ఏమి చేశావో నిజంగా చెప్పు.

శ్రీ కృష్ణుడు: కొట్టకే అమ్మా! మరి చెబుతాను—

యశోద: చెప్పు మరి—

శ్రీ కృష్ణుడు. మరేం, ఈపిల్ల నాకు వెన్నముద్ద పెడతా నందే—

యశోద: ఎప్పుడూ?

గోపిక: ఎప్పు డేమిటి ఇందాకానే.

యశోద: అవునా?

శ్రీ కృష్ణుడు: "నాకు వెన్నముద్ద పెడతా నన్నా వు. పెట్టు" మంటే చేత్తో పట్టుకు ఊరించిందే "పోనీలే, పోనీలే, పెట్టవూ, పెట్టవూ" అంటే నోట్లో వదేసుకొని ఆకాశం చూపించిందే.

పిల్ల: అన్నీ అబద్ధాలే.

యశోద: నిజం చెప్పవుట్రా.

శ్రీ కృష్ణుడు: అప్పుడు నే నన్నాను గదా—మా అమ్మతో చెప్తా నుందు—అన్నాను. అంటే న న్నెత్తుకొని వెన్నముద్ద బుగ్గను పెట్టుకొని—బుగ్గ కొరికి తీసుకో మందే—అంటే నేను బుగ్గ—

యశోద: ఏ మమ్మా, మీరే మాపిల్లవాడికి అల్లరి నేర్పి మాపిల్లవాడు అల్లరి చేస్తున్నా డని ఎదురు చెప్పుతా రమ్మా!

గోపిక: మీపిల్లవాడు మహా నిజమల్లేగ చెప్పుతా డే మమ్మా!

యశోద: అయితే నిజ మేమి టమ్మా?

గోపిక: పోనీ చిన్నివాడు గదా అని ఎత్తుకొంటే "నీబుగ్గ వెన్నముద్ద లాగ ఉం" దని కొరికేడే నీకొడుకు యశోదమ్మా!

ఇంకో గోపిక: పెదివి ఎందుకు కొరికాడో అడగవమ్మా?

యశోద: నిజం చెప్పరా; నీ మూలాన్ని మాకు ఉండరాములు లేకుండా ఉన్నాయి.

శ్రీకృష్ణుడు: ఆ అమ్మాయి నన్నెత్తుకో లేదా ఏమిటి కొందట—నన్నెందు కెత్తుకోవాలి?

గోపిక: చిన్నపిల్లాడ వని ముద్దుకొద్దీ ఎత్తుకొంది—ఎత్తుకొం దని పెదివి కొరికేస్తావా!

శ్రీకృష్ణుడు: నే కొరికేనా ఏమిటి? నన్నెత్తుకొని పాట పాడింది—ఆ పాట తియ్యగా ఉందన్నాను—

యశోద: అంటే?

శ్రీకృష్ణుడు: అతీపి ఎక్కడిది దనుకొన్నావు— అంది ఆ అమ్మాయి. అంటే పెదివిల్లోంచి వస్తోం దన్నానే— అంటే పాటతీపి పెదవిలమూలాన్నే—కావలిస్తే చూడు అందే—అంటే కొరికినే.

యశోద: మీకు న్యాయమే నమ్మా? ఇటువంటి బుద్ధులు పిల్లవాడికి నేర్పుతా రుటమ్మా.

గోపిక: మీపిల్లవాడిమాటే నిజ మనుకుంటూ న్నే వమ్మా యశోదా?— మీకృష్ణుడు నట్టి మాయలాడమ్మా—ఎత్తుకొని ముద్దు పెట్టుకో మని అడిగి పెదివిలమీద ముద్దు పెట్టుకొంటూంటే గోపిక పెదివి కొరికేశా డమ్మా!

యశోద: అవునుట్రా కృష్ణా?

శ్రీకృష్ణుడు: కాదే అమ్మా!

యశోద: ఏమిరా నాయనా ఇంత అల్లరి చేస్తారురా! నిన్నేమి చెయ్యమన్నావు చెప్పు?

గోపిక: ఇంకా వినవమ్మా మామాటలు?

యశోద: ఇంకా ఏముం దమ్మా?

ఒక గోపిక: మాకూనలో వెన్నంతా తినేశాడే ఓయమ్మా!

ఇంకో గోపిక: మాపెరుగంతా దిమ్మరించేశాడే యశోదమ్మా!

ఇంకో గోపిక: మాపాలన్నీ పంచిపెట్టేశాడే ఓసెమ్మా!

గోపిక: ఏమిబుద్ధులు చెబతావో చెప్పమ్మా మీపిల్లవాడికి—మమ్మల్ని

ఇక్కడే ఉండమంటావా ఇంకో ఊరు చూసుకోమంటావో.

యశోద: ఇక్కడ కూర్చో కృష్ణా. ఇంట్లోకి వెళ్ళి తాడు తెచ్చి నిన్ను స్తంభానికి కట్టివేస్తాను.

శ్రీకృష్ణుడు: వద్దే, అమ్మా.

గోపిక: నీవు వెళ్ళి తాడు తేవమ్మా; పారిపోకుండా మేము చూస్తూ ఉంటాము.

యశోద: ఇదిగో తెస్తున్నా నమ్మా—పారిపోనివ్వకం డమ్మా.

3

ఒక గోపిక: నన్నుకూడా ఒకమారు ఎత్తుకోనియ్యవమ్మా మా చిన్ని కృష్ణుణ్ణి!

ఇంకో గోపిక: ఉండవమ్మా, నువ్వు ఎత్తుకొందువు గాని—అయితే కృష్ణా—మీ అమ్మదగ్గిర ఎందుకు చెప్పావు అన్నేసి అబద్ధాలు?

శ్రీకృష్ణుడు: మా అమ్మతో మీ రెందుకు చెప్పారేమిటి?

గోపిక: నేనుకూడా ఎత్తుకుంటాను ఒకమాటు రావూ! నా కృష్ణమ్మవు కావూ?

శ్రీకృష్ణుడు: నే రాను, మొన్న నెందుకు నన్ను కొట్టావు?

గోపిక: చూశావా, చూశావా, నేను కొట్టానా?

శ్రీకృష్ణుడు: ఊం, కొట్టలేదూ కామోసు?

గోపిక: నా రవిక చించేస్తే నే కొట్టనూ — నాదగ్గిరికి రావు కాదూ! రావు కాదూ? ఎందుకు రావో చూస్తాను—ఏం, ఏం—ఈమాటు వచ్చావా!

శ్రీకృష్ణుడు: మా అమ్మతో చెబుతా ఉండు!

గోపిక: చెబుతావా—చెబుతావా—నీబుగ్గలు చిదిమి బూర్లొండేసెయ్యనా? వండెయ్యనా!—చెప్పు కృష్ణా, చెప్పు?

శ్రీకృష్ణుడు: నా ఊపిరి సలపడం లేదు.

గోపిక: నీబొజ్జ కరిగించెయ్యనా? నీ చిన్ని బొజ్జ — ఏదీ నీ చిన్ని బొజ్జ ఏదీ?—

శ్రీకృష్ణుడు: నన్నొదిలెయ్యి.

ఇంకో గోపిక: అలాగ నలిపేస్తావే మమ్మా చిన్ని కృష్ణమ్మని?— ఇలా ఇయ్యవమ్మా— నేనుమాత్రం ఎత్తుకో వద్దటమ్మా?

గోపిక: ఇందవమ్మా, అల్లరి కృష్ణమ్మని ముద్దుగా ఎత్తుకొంటే తలంతా ఎలా లేపేశాడో—ఇం కెప్పుడూ లేపెయ్యవు గదా?—నల్లగా జీడిగింజలా ఒళ్లూ నువ్వూను!

ఇంకో గోపిక: ఏడీ? నాకృష్ణమ్మ ఏడీ? నాముద్దుమూట ఏడీ?—కృష్ణా ఏదీ నీబుగ్గ?—ముద్దు పెట్టుకో నియ్యి.—ఒకటిని కూడా ముద్దెట్టుకో నియ్యి?— ఏదీ నీవరహాలబొజ్జ?—ఇదేనా?—ముద్దు పెట్టుకోనా?

శ్రీకృష్ణుడు: నాకు కితకిత అవుతున్నాయి.—

గోపిక: ఏదీ నీగజ్జెల మొలతాడు?—ఒక్క ముద్దు పెట్టుకో నియ్యి. నీచిన్న పాదాలేవీ?—చిన్న పాదాలు—ఎర్రటి మెత్తని పాదాలు—ఒక్క ముద్దు!

ఇంకో గోపిక: అస్తమానం నువ్వు ఎత్తుకోవాలిటమ్మా? — పాపం! అక్కడ కూర్చోబెట్టవేనా కూర్చోబెట్టమ్మా—పిల్లవాడు నలిగిపోతున్నాడు.

శ్రీకృష్ణుడు: నేను కూచోను, కూచుంటే అమ్మ వచ్చి కొడుతుంది.

గోపిక: పోనీ మా ఇంటికి తీసుకుపోమా?

శ్రీకృష్ణుడు: నే రాను.

గోపిక: ఉండు, కృష్ణా—ఈచీర చెంగుతో నీ ఒంటి జిడ్డంతా తుడిచే నియ్యి—నెమలి పింఛం సరిగా పెడతా నుండు—కదలకు. పువ్వులు సరిగా పెట్టనియ్యి—అయ్యో, మా కృష్ణమ్మబొట్టు చెరిగిపోయిందమ్మా ఏమి చేశాడో గాని.

గోపిక: నీవు అలా నిలబడవమ్మా, నీబొట్టు కొంచెం తీసి కృష్ణమ్మకు పెడతాను—

శ్రీ కృష్ణుడు: ఆ మొగ్గిస్తూంది.

గోపిక: అక్కడ కూచోబెట్టవే, అక్కడే కూచోబెట్టు-మన మిక్కడే ఇదివరకులాగే నిలబడదాము.

యశోద: ఏ దమ్మా, కృష్ణుడు పారిపోలేదు గదా—ఎక్కడా వాడు తాను కనిపించడమే లేదు. ఇప్పుడే వస్తాను—చూస్తూ ఉండం డమ్మా మాపిల్లాడిని.

గోపిక: వెళ్ళ నమ్మా చూస్తూఉంటాము—మీఅమ్మ వెళ్ళిందిలే. రావూ నే నెత్తుకుంటాను, కృష్ణా రావూ!

శ్రీ కృష్ణుడు: నేను రాను.

ఇంకో గోపిక: పోనీ, నాదగ్గరికి రా.

శ్రీ కృష్ణుడు: ఊహుఁ, రాను.

ఇంకొక గోపిక: నా దగ్గరికో?

శ్రీ కృష్ణుడు: నే రాను.

గోపిక: పోనీ అమ్మా మరి నువ్వు రాకపోతే మీఅమ్మతో చెప్పి కొట్టిస్తా ఉండు.

శ్రీ కృష్ణుడు: ఊఁ—మా అమ్మతో నేను చెబుతాను—అమ్మా, అమ్మా, నేను పారిపోలేదు. నేను అల్లరి చెయ్యలేదు. మరేం, న న్నెత్తుకుంటా నంటే వెళ్ళ నన్నా నే అమ్మా—అంతేనే అమ్మా—అంటాను.

గోపిక: రావు కాదూ, రాకపోతే మొట్టికాయలు తింటావు సుమా!

ఇంకో గోపిక: ఏవేలితో మొట్టానో చెప్పు.

ఇంకో గోపిక: నే నేవేలితో మొట్టానో చెప్పు.

గోపిక: అయ్యో, పాపం మా కృష్ణమ్మని అందరూ అలాగా మొట్టికాయలు మొట్టుతా రేమి టమ్మా పాపం!—రా కృష్ణా, రా, నే నెత్తుకుంటాలే.

గోపిక: నాచీర చింపేశాడే, అయ్యో!

ఇంకో గోపిక: నా హారాలు తెంపుతావురా ఇలాగ?—

శ్రీకృష్ణుడు: నన్నెందుకు కొట్టాలి?

గోపిక: కొట్టములే—నేను ఎత్తుకున్నానా మరి—ఏది ఎక్కడ నొప్పెట్టిందిచూపించు అక్కడ ఒక్క ముద్దు పెట్టుకుంటే పోతుంది.

ఇంకో గోపిక: పాపం, నొప్పెట్టిందా ఉండు నేను ముద్దెట్టుకుని నొప్పి తీసేస్తాను—ఏం—ఈమాటు పోయిందా?

ఇంకో గోపిక: అందరినీ ఒక్కొక్కరూ ఎత్తుకోనివ్వండమ్మా—అస్తమానం ఒక్కరే ఎత్తుకుంటే ఏలాగమ్మా మా చిన్ని కృష్ణమ్మని?

గోపిక: ఇదుగో నమ్మా, నువ్వెత్తుకోవమ్మా, మా చిరిబొజ్జ కృష్ణమ్మని.

ఇంకో గోపిక: నువ్వా ఎత్తుకోవే నల్లకృష్ణమ్మని!

ఇంకో గోపిక: ఇదుగో నమ్మా కృష్ణమ్మా, పెద్ద తామర రేకుల్లా కళ్ళు వీడూను—నలిపెయ్యకుండా ఎత్తుకోండమ్మా.

ఇంకో గోపిక: ఇలా తేవే, నేనూ ఎత్తుకుంటాను.

ఇంకో గోపిక: పాపం ఊపిరి సలపదే—అంతగా మొహంమీద మొహం పెట్టి ముద్దులాడుతా రేమిటే?

గోపిక: అందరూ ఇలా గుమిగూడే రేమిటమ్మా?

యశోద: ఏదమ్మా, మా కృష్ణమ్మ!

గోపిక: ఇదుగో నమ్మా, ఒక్క మొహం వేసుకు కూచుంటే పోనీ పాపం అని ఎత్తుకున్నాము.

యశోద: అదే నమ్మా, అంతా చోద్యంగా చెప్పుతావు—ఇప్పుడే కాదటమ్మా, మా కృష్ణుడు అల్లరి చేశాడని ఆడిపోశారు?

గోపిక: అల్లరి చెయ్యక లేదంటున్నా మమ్మా ఇప్పుడు మాత్రం?

యశోద: నేను చూడ్డంలేదటమ్మా—మా కృష్ణన్ని ఎత్తుకొని అందరూ ముద్దాడడం లేదటమ్మా?

గోపిక: చిన్నపిల్లాడు గదా అని ముద్దాడితే తప్పటమ్మా?

యశోద: బుద్ధులు చెప్పమనీ, దండించమనీ ఎంతో కోపముతో చెప్పి-ఇంతట్లోకే ఎలా ముద్దాడుతున్నా రమ్మా?

గోపిక: అల్లరి చేశాడు గనక అల్లరి చేశాడన్నాము కాని-ఇంతట్లోకే పాపం, కృష్ణమ్మని తాడుతో స్తంభానికి కట్టి వెయ్యాలమ్మా?

యశోద: మీరే కాదటమ్మా మాకృష్ణమ్మమీద నేరాలు మోపారు?

గోపిక: అదేమి టమ్మా, అలా గంటావు-మేము మాత్రం కనిపెంచే-వాళ్ళము కాదు టమ్మా-అమాత్రానికి పిల్లలని తాళ్ళతో స్తంభాలకి కట్టి వేస్తారు టమ్మా?

యశోద: నే నప్పుడే అనుకొన్నాను-మాకృష్ణుడు అల్లరి చేసేవాడు కాదని-ఎందుకమ్మా ఈలాటి నీలాపనిందలు మాకృష్ణమ్మమీద వెయ్యడం?-ఇది న్యాయమేన టమ్మా?

గోపిక: ఉండ వమ్మా ఒక్కమారు కృష్ణుణ్ణి ముద్దు పెట్టుకొని వెళ్ళి పోతాము.

యశోద: అలాగ అందరూ మీదపడి నలిపేస్తా రేమమ్మా చిన్న పిల్లాడిని? నా అబ్బాయిని ఇలా ఇయ్యండమ్మా-బెదరిపోతాడు—

గోపిక: ఇదుగో నమ్మా తీసుకో నమ్మా ఇంతటి మహా మీఅబ్బాయిని మేము వెళ్ళిపోతున్నాము.

యశోద: రారా, నాయనా, రా, అమ్మా, రా, నీమీద ఎలాంటినేరాలు మోపేరో—తీరా మోపి వాళ్ళమాటలు నమ్మి నిన్ను స్తంభానికి కట్టేను కాను—ఇంకా నయం—ఎంతటివాళ్ళైనా అంటారు.

శ్రీకృష్ణుడు: అమ్మా, నాకు బువ్వెట్టవు టే?

యశోద: పెడతా నమ్మా, పెడతా భయ మన్నావు, భయ పోయిందా నాయనా.

శ్రీకృష్ణుడు: పోయిందే.

యశోద: అయినా ఇంకోమారు దిష్టి తీస్తానుండు—ఎవరికళ్ళు ఎలాంటివో.

కృష్ణుడు: అస్తమానం నాచుట్టూరా మిరపకాయలుతిప్పుతా వంటావెందుకే—నా కక్కరలే దమ్మా—నాకొద్దు.

అపవాదు

శ్రీ ముద్దుకృష్ణ

◆ ◆ ◆ ◆

రావ్ . లలిత . పంతులు

ఉమ . శ్యాం . వెంకటరావు

◆ ◆ ◆ ◆

౧

[లలిత ఇంటిలో చావడి తూర్పుగోడమూలను డ్రాయరు. దాని ముందర కుర్చీ. దక్షిణపు గోడవరసను రెండు రోజ్‌వుడ్ కుర్చీలు. తూర్పుగోడను ఆని డ్రాయరు, పక్కరెండు పడకకుర్చీలు. పడమర గోడుమీద జారే అరతులుగల ఉత్తుతెర. తెరను ఆని సోఫా, తెరఅవతల పడకగది, దాని వెనుక స్నానాలగది, వంటయిల్లు. ఉత్తరపు తెరిపి వీథి: వీథిలోనికి గుమ్మము-సాయంత్రం నాలుగు. తెర లేచిఉంది. చావడిలో రెండు స్టౌలు వెలుగుతూ ఉన్నవి. ఒకదానిమీద బాణలి, రెండవదానిమీద టీ కెటిల్ ఉన్నవి. పంతులు గరిట చేతిలో పుచ్చుకుని బాణలినిచూస్తూన్నాడు. రెండవ స్టౌవద్ద లలిత నిలుచుంది. ఉమ పడక కుర్చీలో కాళ్లు చాపి పడుకుని పత్రిక చదువుతూ ఉన్నట్టు నటిస్తూన్నాడు. రావ్ రోజ్‌వుడ్ కుర్చీలో కూర్చుని ఉన్నాడు. బాతాఖానీ సాగుతూ ఉన్నా లలితా, పంతులూ, టీ ఉపాహారాల తయారు చూస్తూనే వుంటారు.]

రావ్: లలితా, ఈదినం మీరు కప్పులూ పళ్లేలూ అందమైనపద్ధతిని సర్దటం, పైజాగ్రత్తలూ చూడండి...

లలిత: కాదు, కాదు, ఈవేళ నేనే చేస్తాను టీ.

ఉమ: రావ్! లాభం లేదు. ఈవేళ అన్నీ ఆవిడే చేయాలిట, తగినంత కారణం ఉంది. [లలిత ఘాటిగా చూస్తుంది ఉమని. ఉమ నవ్వుతూ] పంతులుగారూ, మీరుకూడా ఉన్నా ఆమె...

లలిత: [తొందరగా] పంతులుగారూ! కవీశ్వరులతో రహం గాని మాక వేసేప్పుడుమాత్రం నాతో చెప్పండి!

పంతులు: వీళ్ళమాటలతో ఏమన్నా? అంతా అమిరిస్తే అరగించను దిగుతారు స్వాములు. గరిట పుచ్చుకోవడం అంటే కలం కదపడం కాదు; కాఫీపాళ్ళు కలపడం అంటే కవిత్వం కాదు. ఆ తలకాయలు పని చెయ్యవు ఇక్కడ.

ఉమ: తలకాయ పనివిషయమై చెప్పవలసి వస్తే...

లలిత: పంతులుగారే ఫస్ట్! [అందరూ నవ్వుతారు.]

పంతులు: [వొచ్చిన ఉడుకుపోతుకన్నాన్ని నొక్కివేసి మోటుగా] మీ చమత్కారం నాతలకాయలాగే ఉంది లేండి!

రావ్: అంటేనే

లలిత: అంటే ఏమీ లేదు కాని, ఆగుండురాయి ఇలా అందుకోండి. గుండుశబ్దం పంతులుగారికి కష్టంగా ఉంటుందేమో, పోనీ అగులకరాయి ఇలాఅందుకోండి!

ఉమ: పంతులుగారూ! ఎవరిమొహం చూశారో పొద్దున్న, ఖర్చు లేకుండా తలంటు...

పంతులు: నీ శ్రీలాగ అల్లరి చేస్తుంటే ఉన్నాత్ర పాడిపోతుం దండీ!

లలిత: ఆ. అలాటి ల్లేమ. గరిట ఇలా ఇవ్వండి!

ఉమ: ఈ దినం ఏదీ చెడిపోడానికి వీ ల్లేదు లెండి!

లలిత: [గరిట పుచ్చుకొని ఉమమీదకు బెదిరింపుగా వచ్చి] ఈవేళ మీకోరు మహాచురుకుగా ఉంది. పొద్దున్న ఏమన్నా వస నమిలారా?

ఉమ: మన నమిలిన నోటి మన మీరింకా యెరగరు ప్రఖ్యాతి వల్ల గాని ఇంత కాస్మోపాలిటన్ అభ్యాసం, అసంగతులూ...

రాప్: శ్యాంసంగతి ఈమెకు తెలుసునా?

ఉమ: విస్తారం తెలియదు. తెలిస్తే...

పంతులు: ఇదిగో నమూన్ని చిక్కొక్షను తయారైంది.

లలిత: ఆలా ఉంచండి. గొలుసు కలపకండి. ఉమా టైం ఎంత యింది?

ఉమ: ఇంక పదినిమిషాలు. పాశ్చాత్యపద్ధతులవాళ్లు గడియారాలాగే నడుస్తారు.

పంతులు: ఓహో! తెలిసింది!

లలిత: ఏం తెలిసిందండి?

రాప్: చెప్పనా?

లలిత: వొద్దు, వొద్దు. నియోగిబుర్ర ఏం గ్రహించిందో చూతాం.

పంతులు: హూఁ. ఇంతా గ్రహించకపోవాలి! ఇక్కడకు పదినిమిషాలలో ఇంకొక కొత్త అపవాదు వస్తూ ఉన్న దన్న మాట.

లలిత: పంతులుగారూ, మీమాటలు బాగుండ లేదు.

రాప్: కొత్త అపవాదు లంటే పాపం పంతులుగారికి ఎంత భయమో, పాతవే అయితే ఫరవాలేదు.

పంతులు: నావల్ల ఎవరికీ అపవాదురాదు.

లలిత: ఎందుకు ఈ ఘర్షణ!

ఉమ: పంతులుగారి నియోగిబుర్ర ఈవిషయంలో సరిగ్గా పనిచెయ్యదు అనుకుంటా.

రాప్: ఏమీ అలా అంటున్నావు?

ఉమ: ఏమీ లేదు. పంతులుగారు తెల్లబడుతూవున్న మీసాలకు నల్ల రంగువేయడం మానివేసినా, అతిజాగ్రత్తగా పైస్వచ్ఛత కాపాడుకుం టూన్న ఆ కాణక్షేత్రికి పరిహాసం ఏమూలనుంచో వలువు అంటిస్తూనేవుంది.

లలిత: ఇదీ కవిత్వంగానే చెప్పాలి?

పంతులు: చాతకాలనీ, చకోరాలనీ, మేరువుపర్వతాలనీ సృష్టించే కవీశ్వరులు ఏమి సృష్టించలేరు?

రావ్: పంతులుగారు, ఏమి పాతకబుర్లు చెబుతా రండి! ఈనాటి కవిత్వంలో చాతకాలూ చకోరాలూ లేవు.

లలిత: [ఉమకేసి చూస్తూ-] పోనీ అవి కొత్తపోతే నిజం కాని ప్రేయసీ ప్రియులూ, ...ప్రేమలూ, విరహాలూ...

ఉమ: [నవ్వుతూ, తప్పించడానికి-] అయితే పంతులుగారూ! మీ విషయమై మీకు అంత పట్టినట్టుక మేనా?

పంతులు: ఓ!

రావ్: పాపం, మీసంగతి మీకే తెలియడం లేదన్నమాట.

లలిత: అన్యాయం, పంతులుగారు అంతపాళ్ళు తెలియకుండా ఉన్నారు అనడం.

పంతులు: లేంది ఉన్నట్టు సృష్టించే కవిగారు ఆయన; ఉన్నా ఉండక పోయినా ఏదో ఉన్నట్టు వ్రాస్తేనే కాని వీలు లేదు ఈ పత్రికావిలేఖరికి. వీరిమధ్యను పడినతరువాత ఏ అపవాదులూ రాకుండా ఎలా ఉంటవి లే?

ఉమ: మాంసి మాంసి నిరోగిపేచీ వేశారు పంతులుగారు.

రావ్: ఎంత లౌకికులు అయినా ప్రపంచసంగతి పూర్తిగా గ్రహించినట్టు లేరు పంతులుగారు. ప్రపంచప్రవర్తన మహావిక్రుతం. నేను నిర్దోషిని అన్నట్టుగా ఇతరుల దోషాలను ఏకరవు పెడితే నాభుజం తట్టి నాచేత ఇతరులదోషా లన్నీ పలికిస్తుంది. కాని నేను వెనుకకు తిరగగానే, అంతకన్నా అద్భుతమైనవిశేషాలు నన్నుగురించే పలికిస్తుంది.

లలిత: అయితే ఇవన్నీ అన్యోన్యసహాయ్యాన అన్నమాట. దీనిలో కవిగారి కవిత్వం ఎంతవరకూ?

పంతులు: అదీ! మీరు నిజం గ్రహించారు ఎవరు ఏ అపవాదులకు ఎంత కారణమో ఇప్పుడు తెలుస్తుంది. కవీ...

ఉమ: ఉండండి, ఓ గోల! మోటార్ సైకిల్ ... [లలిత గుమ్మందగ్గరకు తొందరగా వెళుతుంది. వీధిలో ఏచప్పుడూ లేదు. ఆమె తిరిగి వచ్చేటప్పటికి అందరూ నవ్వుతారు. ఆమెముఖం ఎర్రబడుతుంది.]

లలిత: ఉమా! ఈమాత్రం పరాభవం నీకు చేయలేకపోతానా? [పడక కుర్చీలో కూర్చుంటుంది]

పంతులు: వీళ్ళతో నేమి గాని, ఇదిగో నమ్మా, ఉప్మా తయారైందిటీ కలపనా?

లలిత: ఉండండి, ఉండండి, నేను కలుపుతాను. [లేచి కలుపుతుంది]

రావ్: అన్నీ తయారుగానే ఉన్నవి. కాని...

ఉమ: కాని!

లలిత: మీవల్ల బొత్తిగా...

[మోటార్ సైకిల్ ఆగుతుంది గుమ్మంలో లలిత గుమ్మంవేపు వెళ్ళబోయి, ఆగి, ఉప్మా పళ్ళాలలో సర్దుతూ ఊరుకుంటుంది. శ్యాం గుమ్మంలోనికి వొచ్చి ఎవ్వరూ ఆహ్వానించకపోవడం చూసి, ఆగి, దగ్గుతాడు]

ఉమ: రావేం లోపలికి? ఓహో, పాశ్చాత్యపద్ధతిని ఆహ్వానించనిదే రావు కాబోలు.

[శ్యాం లోపలకు వస్తాడు. లలిత ఉప్మా సర్దుతూ ఉన్నట్టునటిస్తూ ఇటు చూస్తుంది. ఉమ ముందు రావ్‌ని తెలియబరుస్తాడు. రావ్ నమస్కారం పెడితే, శ్యాం షేక్‌హేండ్ చేస్తాడు. తరువాత లలితను పరిచయం చేస్తాడు. శ్యాం ఆమె చేతిని మృదువుగా అన్నట్టు నటనతో పట్టుకొని వదలకుండానే]

శ్యాం: నేడు చాలాసుదినము. మిమ్ములనుగురించి నాచే వినబడదమే కాని ఇదివరలో మిమ్ములనుచూచే అదృష్టము కాకలుగలేదు.

లలిత: [చిరునవ్వు నవ్వుతూ, చేయితీసుకుని] ఇది పెద్ద అదృష్టంగా భావించవలెనా?

ఉమ: లలితా! మీరు పొరపాటుపడుతున్నారు. ఇంగ్లీషు తెనుగు అది ఆమాటకుమనం తెనుగులో ఇచ్చినంతవిలువ ఇంగ్లీషులో లేదు.

లలిత: అలాగా! క్షమించాలి. మాటకు తగినంతవిలువ ఉండవలె కాని; విలువలేనిమాటలను ఉపయోగించేమర్యాదలు అతెల్లవాళ్ళకే వొదిలిపెట్టి మనమర్యాదలనే అనుసరిస్తే...

శ్యాం: [కొంచెంపొంగి.] మీరు నావందనాలు అంగీకరించాలి. నాకు, వేల్యూబుల్- మహావిలువైన పాఠం చెప్పినారు.

లలిత: నేను హాస్యానికి అన్నమాట...[హేళనగా] మీరు ఎక్కువవిలువ పాఠంగా తీసుకొన్నారు.

శ్యాం: [తెచ్చుకున్న] నవ్వుతో చాలా ఆనందముగా ఉన్నది. మంచిహాస్యరసం ఒలికించారు.

ఉమ: ఏమిటోయ్, చంపుతున్నావ్ ఆ తెనుగు.

శ్యాం: [లలితతో] మీకు-ఎనీ నంబర్-ఎన్నయినా క్షమాపణలు! పది సంవత్సరాలు బహిర్దేశాలలో ఉండిపోవడంవల్ల తెలుగు మాట్లాడడము...

ఉమ: బహిర్దేశాలేమి టోయ్! చస్తున్నాం ఈ అపసవ్యపు మాటలతో...

శ్యాం: -ఐ ఏమ్ సారీ- నేను చాలా విచారిస్తున్నాను. నాఉద్దేశం...

లలిత: ఫరవా లేదండి. ఇంత పట్టింపు ఎందుకు కూర్చోండి.

శ్యాం: -థేంక్స్- వందనాలు. అమిత్రులు ఎవ్వరో- ఇంట్రొడ్యూస్- తెలియబడలేదు.

ఉమ: ఆయన...

లలిత: ఉండండి. అపని నేను చేస్తాను. ఈయన నారాయణరావు పంతులుగారు. మన స్నేహితులు. ఏదో కొంచెం ఉన్నవారు. అందుచేతను

నపోషణ, దేశసేవ చేస్తుంటారు. పల్లెటూళ్ళలో చదువుకోసం...

పంతులు: [పెద్ద మొహంతో] ఏదో వారు అభిమానంకొద్దీ అనేమాటలు గాని...

శ్యాం: [షేక్ హేండ్ చేస్తూ] ఓహో! మిస్టర్ డి. నారాయణరావు ఫ ఎడల్ట్ ఎడ్యుకేషన్ స్కీమ్ రెప్యుటేషన్!

రావ్: అవును. అయనే...

లలిత: పైకి సనాతనంగా కనపడినా అన్నిటా మనతో కలుస్తారు.

శ్యాం: వారు సరియైన - పొలిటీషియన్ - అన్నమాట. చాలా ఆనందం మీదర్శనసౌఖ్యం. మీకీర్తి ఇంగ్లండ్ లో ఉన్నప్పుడుకూడా చాలా సార్లు పత్రికలద్వారా వినబడినది.

లలిత: కూర్చుందురూ. ఈపొగడ్తలకన్నా బాగా కడుపు నింపే పేస్ట్రీ ఉన్నవి...

శ్యాం: లలితగారు చాలా హాస్యగర్భులు.

లలిత: పాశ్చాత్యసంపర్కంవల్ల మీలో నవీనత ఎక్కువ ఉంటుంది అనుకున్నాను. కాని మీది అంతా పురాణఫక్కీగా ఉన్నదే!

ఉమ: అతనిభాషకీ అతని భావాలకూ సంబంధం లేదు.

శ్యాం: ఓకేయ్! చంపుతున్నావు నీకవిత్వం, ఆ, అవేమిటి... ఆ శ్లేషలూ అన్నీ నామీద ధణాయించి-

ఉమ: నీభాష నీఉద్దేశాలను తెలపడంలేదని కాదోయ్! నీఅభిప్రాయాలుకూడా నవీనాలు కావేమో అన్నట్టు లలిత అంటే, నీఅభిప్రాయాలు నవీనాలే అంటున్నాను.

శ్యాం: లలితగారూ, మీరు......

లలిత: క్షమించండి గారూ అనేశబ్దం పేరుతో కలిపి వాడకండి! నాకు ఎందుకో ఆశబ్దం చెవికి ఇంపుగా ఉండదు. [శ్యాం ఆమెను మైమరచి చూస్తాడు. పంతులు రావ్ ని చూపిస్తున్నట్టు కన్ను గీటుతాడు.]

శ్యాం: మంచి - టేస్టు - రుచి, సంగీతం జీవితంగా చేసుకున్న మీకు చెవి సున్నితం, ఔను. [ఆప్యాయంగా అన్నట్టు]- లలితా, ఇంగ్లండు లోనూ, యూరప్‌లోనూ, అమెరికాలోనూ స్త్రీస్వేచ్ఛ - ఉమన్స్ ఫ్రీడమ్- అంటే ఏమిటో బాగా చూశాను. అందుకే నాహృదయం కొంత ఏనాటికైనా మన ఇండియా కూడా అంతటి-హై లెవెల్ - ఎత్తైన స్థితికి లేవ గలుగుతుందా అనిపించేది. మీవంటి 'స్వేచ్ఛావ్యక్తులు ఈ దేశంలోనూ ఉంటున్నారని కలైనా కనలేదు. కన్నుల పండువుగా, చెవుల పండు వుగా...

లలిత: మీ టీలో పంచదార సరిపోయిందో లేదో...

శ్యాం: - ఎక్స్‌క్యూస్ మీ - నన్ను క్షమించాలి. నేను టీలో చాలా, తక్కువ పంచదార వేసుకుంటాను. ఫ్రాన్స్‌లో...

ఉమ: [వంకరల్లి కన్ను గిలికించి] ఫ్రాన్సుసంగతి ఎత్తినప్పుడు కూడా టీ సంగతీ, టీలోని పంచదారసంగతీ ఎందుకు? టీకన్నా, టీలోని పంచ దారకన్నా తీయని విషయాలు, చేమకూరవారు అన్నట్టు 'తీయని పంచ దార వెనుతీయగ పల్కి...'

లలిత: ఫ్రాన్సులో మీరు ఎన్నాళ్ళున్నారు?

శ్యాం: [దర్జాగా] నేను వీలున్నన్నిసార్లు పెరీలోనే ఉండేవాణ్ణి - బై ది బై - పెరీ అంటే మనవాళ్ళు తెలియక తప్పు పలికే పేరిస్- వీకెండ్స్ - అంటే వారం చివరలను ఈ బాడీని - పెరీలో - విసరకపోతే గిలగిలా కొట్టుకునేది.

లలిత: [నవ్వుతూ] మరి ఇప్పుడు ఎట్లా ఉంటూన్నారండీ?

శ్యాం: [తెచ్చిపెట్టుకొన్న నవ్వు బిగ్గరగా నవ్వుతూ] లలితగారూ! కాదు - ఐమ్ సారీ - నేను విచారిస్తున్నాను. మీరు నన్ను క్షమించాలి. [ఆగి మొహం తమాషాగా పెట్టి] లలితా! ఇంగ్లీషులో 'సెటైర్' అంటారు. దీనికి తెలుగు ఏమిటోయ్ కవీ?

రావ్: అచ్చ తెనుగులో తాటాకులు కట్టడం అంటారు. [లలిత నవ్వు ఆపుకుంటుంది]

శ్యాం: థేంక్యూ - అదీ - జర్నలిస్ట్ - అంటే? ఇడ్యమేటిక్ భాషాంతరీకరణం చెప్పారు.

పంతులు: ఇంతకూ మీ భావం చెప్పలేదు.

శ్యాం: [పంతులుకేసి] థేంక్యూ - చక్కగా జ్ఞాపకం చేశారు. ఇంగ్లీషు గరల్స్ అంటే కన్యలకు ఉన్న - షార్ప్ విట్ - చురుకైనహాస్యం లలిత సంపాదించారు ఎలాగో!

[లలిత ఓరగా చూస్తుంది. శ్యాం పైప్ వెలిగిస్తూ వక్రచూపుగా చూస్తాడు ఆమెను. పంతులు ఉమని చూస్తాడు వికటంగా]

ఉమ: ఇంతకూ ఉత్తబాతాఖానీ రేనా, లేక ఏదైనా కార్యక్రమం ఉన్నదా?

శ్యాం: [పెద్దగా నవ్వుతూ] ఎంతకైనా కవీశ్వరుడవే నోయ్! మహా అద్భుతంగా పోయటిక్ షాక్ - కవిత్వం బాటకు దింపుతావు.
[వాచీ చూస్తూ] కమ్! ఈ సాయంత్రం - షో - ఏమిటో?
[పంతులు కండువా తీయబోతాడు]

లలిత: పంతులుగారూ, అంత భయపడనక్కరలేదు. సినిమాకు తీళ్ళవద్దులెండి. కాని...

శ్యాం: [నాటకంగా లేచి, ఆమెముందర నిలిచి] మీరు - డిసైడ్ - అంటే నిర్ణయించేసి ఆజ్ఞాపించండి. మేము - ఫాలో - అంటే అనుసరిస్తాము.

లలిత: [హేళనగా] థేంక్యూ! కాని కూర్చోండి చెబుతా. మేమందరం జట్కామీద సారంగధరుడిమెట్టకు వస్తాం. మీరు సైకిల్ మీద రండి. వెన్నెలవచ్చినతరవాత అందరం తిరిగి వచ్చేస్తాం. నేను రోజూ రెండు మైళ్ళయినా నడవాలి.

శ్యాం: గ్రాండ్ గా ఉంది!

రావ్-పంతులూ-ఉమ: [హేళనగా] ఫేమస్ గా ఉంది!

శ్యాం: అయితే నేను- ఇన్ ఎడ్వాన్స్- ముందుగా వెళ్ళి మీకు- వెల్కమ్ సుస్వాగతం ఏర్పాటు చేస్తాను. [లలిత చేయి పట్టుకుని- షేక్ హేండ్ చేసి, పైగా నమస్కారం కూడా పెట్టి, తలిమ్మాన్నవారి వైపు దొరలపద్ధతిని వంకరగా పెట్టిన తలా కళ్ళూ కదిపి వెళ్ళిపోతాడు. నలుగురూ వింతగా ఆ దారినే చూసి ఒకరి మొహాలు ఒకరు చిరునవ్వుతో చూసుకుంటారు.]

తెర

౨

[మధ్యాహ్నం మూడు. చావడి అట్లానే ఉన్నది, స్టౌవ్ లూ ఉపాహార సామగ్రి మాత్రం లేవు. లలిత సోఫాలో కూర్చుని పత్రిక చదువుతూ ఉన్నది. నిమిష మైనతరవాత పత్రికను కిందకు జారవిడిచి, అగి రెప్ప వదనికళ్ళతో ఆలో చనగా ఇంటికప్పుకేసి చూస్తూ ఉన్నది. పంతులు వీధిగుమ్మంలోనుంచి లోపలికి ఒక అడుగు వేసి, పత్రికవైపూ లలితవైపూ చూసి]

పంతులు: ఘోరాకధంతా? ఇట్లా అవుతుం దనే నేను తప్పించు కుంటా.

లలిత: ఈ వ్రాసిన వ్రాతలకు నేనేమీ బాధ పడను, భయపడను; కాని ఈ అబద్ధా లేమిటి? ఎవరండీ ఈ మహాపతివ్రత? జీతం భత్యం లేని సంఘసంరక్షకురాలు?

పంతులు: ఆఁ, ఆ దంతా టక్కరితనం! ఎవడో ధైర్యం లేనివ్వు ఆ పేరు కల్పించుకొని వ్రాశాడు.

లలిత: వీడికి మనవల్ల కలిగిన బాధ ఏ ముందని ఇన్ని అబద్ధాలు కూశాడు?

పంతులు: అసలు రహస్యం కడుపుబ్బు: ఈర్ష్య. ఏదో ధర్మసంస్థాపన కోసమూ, మీరు అన్నట్టు సంఘాన్ని ఉద్ధరించడం అనే సేవమూ. ఇంత కన్నా ఏ ముంది?

లలిత: వీడివార్తకు భయ పడిపోతాను అనుకున్నాడు కాబోలు?

పంతులు: [నవ్వుతూ] అయితే ఇ దంతా ఏమిటి మరి?

లలిత: నాకు భయం వేసి కాదు ఇట్లా అడుగుతూ ఉంటా, అసహ్యం వేసి. నిజంచెప్పి ఇష్టం వచ్చినట్టు విమర్శించ మనండి, తగిన జవాబుకూడా ఇస్తాను. నా పేరు ఎత్తి బహిరంగంగా విమర్శించనీయండి. తగాదా లేదు. అంతే కాని ఈ అసహ్యపు వ్రాతలూ, ఈ స్త్రీజాతిదూషణా, ఈ ఘోర అబద్ధాలూ, ఈ పిరికితనం ఎందుకు?

పంతులు: మీరు ఏమీ అనుకో మంటే నేను అవశ్యం పు[illegible]ని వాదిస్తాను. [లలిత తల ఊపుతుంది]

ప్రపంచానికి ఏది నిజం అనే ఆలోచన లేదు సరే గదా, అబద్ధమైనా వీది సరదాగా ఉంటే అదే కావాలి అని కోరుతుంది. మీరు ఏ బాధ పడితే నేం, కాస్సేపు గమ్మత్తుగా చెప్పుకోడానికి ఏదో ఒక కథ. మీ సుఖాన్ని పాటించడానికి అంతా మంచే యెంచడానికి ప్రపంచం తాపత్రయ పడదు.

లలిత: అంత బుద్ధీ మంచీ లేని ఆ ప్రపంచాన్ని నేను పాటించను.

పంతులు: [దెప్పగా] మీరు పాటించకపోయినా మిమ్మల్ని పాటించక మానదుగా ప్రపంచం!

లలిత: అయితే ఏడవ నీయండీ, మొరగ నీయండీ!

పంతులు: ఏ ద్వేదిప్రపంచమైనా......

లలిత: నన్ను ఉడికించకండి పంతులుగారూ!

పంతులు: ఉడికించి పోతే కాదు. నేను అనుభవంమీద చెబుతున్నా, వినండి. ప్రపంచం కపటనాటకం. దీనిలో అందరూ దొంగలే. ఎవరినిజమూ తెలియనూ తెలియను, తెలిసుకుంటూ ఉండనూ ఉండదు. సత్యంతో నిమిత్తం

ఎవరికి? నా సంగతి చెబుతాను వినండి ఇంతవరకూ మీరూ ఎరగరు. నా భార్య చనిపోయి పదిహేను సంవత్సరాలు అయింది. ఆ నాటినుంచీ సంసారమూ నా సుఖమూ అనేక విధాల సర్దుకుంటున్నాను. నేను సంపర్కం కల్పించుకోని సంస్థ లేదు. ఎందరితోనో వ్యవహరిస్తాను. అయినా నా జీవితం ఎన్ని రహస్యాలలో ఎలా జరుగుతూ ఉన్నదో ఎవరికీ తెలియదు. నామీదా అనుమానాలు లేక పోలేదు; నిర్ధారణా లేదు. వెనక గుసగుస లాడుకునే వారే ఎదుటకు రాగానే అతిమర్యాదగా ఉంటారు. నాకు కావలసిన సుఖాన్ని నేను ఎలాగైనా సరే పొందుతాను, అతిరహస్యంగా; కాని ఆ రహస్యాలు బయటకు రానీయను, వచ్చినా కాదంటాను. [గర్వంగా] తెలివి అంటే అలా ఉండాలి.

లలిత: పంతులు గారూ, నేను గుంటనక్కను కాలేనండీ!

పంతులు: [పౌరుషంతో] గుంటనక్కలు కా నక్కర లేకపోతే గాడి...ఎందుకు లెండి కాని - మరి కోరి తెచ్చుకుంటూ ఇతరుల్ని అనడ మెందుకు?

లలిత: ఈ అబద్ధాలు ఎందుకు అన్నాను కాని...

పంతులు: మీరు కష్టంగా యెంచుకో వద్దు; నేను అవసరమనీ నిర్మొహమాటంగా మాట్లాడుతాను. ఏది అబద్ధమో ఏది నిజమో ఎవరికి కావాలి? తన పద్ధతులకు వ్యతిరేకంగా నడిచేవారిని ఉపేక్షించదు సంఘం. స్త్రీ మొదట అనుమానానికి అవకాశం ఉంటే చాలు, అపవాదుగానే ఎంచుతుంది.

లలిత: ఔను. మరి స్త్రీలు లోకువగా దొరికారు. ఇంక మేము లొంగం ఈ అన్యాయాలకు. సంఘం ఉపేక్షించకపోతే చవ్వాకులు వాగేసుకొమ్మనండి, తప్పుడు కూతలు కూసుకొమ్మనండి నేను అసలు లక్ష్య పెట్టను. ఇక ముందు ఏ స్త్రీ కూడా అన్యాయానికి దమ్ముగా లొంగదు. నేను చేస్తూ ఉన్న తప్పు ఏమిటి అంటారా? ఈ సంఘానికి అణిగి ఉన్న

న్నాళ్ళూ కలిగినబాధలు చాలు. అంత అన్యాయంగా, బలవంతంగా నా ఆరోగ్యం చెడగొట్టి, పైగా నా ఆరోగ్యం చెడి రోగిష్ఠిని అయినా నని వంక కల్పించుకుని రెండో వివాహం చేసుకున్నాడు. ఈ సంఘం ఏమైనా నాకు జరిగిన అన్యాయాన్ని దిద్దిందా, ఆ వివాహానికి అడ్డు వచ్చిందా? పైగా నా పెద్దరికపల్లా అవమానాలు పడలేక, రోగాలతో మూలగలేక నేను దాటుకువస్తే ఆ నేవాళ్ళు అనేమాట లన్నీ అననే అన్నారు. పురుషుల దుర్మార్గంపక్షమై స్త్రీలను ఇంత అన్యాయం చేసే ఈ సంఘాన్ని మన్నించడం? నేను మన్నించను సరేగదా, ఇకముందు ఏ స్త్రీకూడా మన్నించదు ఇంతకూ నేను చేస్తూ ఉన్నతప్పు ఏమిటో చెప్పండి? మా నాన్న ధర్మమా అని చదివించిన చదువూ చెప్పించిన సంగీతమూ ఉన్నవి కనుక ఉద్యోగం సంపాదించుకుని నాబ్రతుకు నేను గడపుకుంటున్నాను. నాఆరోగ్యం బాగు పడడానికి డాక్టరు సలహాయిచ్చినప్రకారం రోజూ మూడునాలుగు మైళ్లు నడుస్తున్నాను. ఇదా మహాతప్పు! ఈసంఘానికిలొంగి, చావుఅయినా ఆరోగ్యంగా చావకుండా మూలకూర్చుని మూలిగి మూలిగి అలా కుళ్ళి చస్తే ఇల్లాలూ ఉత్తమురాలూ!...

పంతులు: ఆరోగ్యంకోసం షికారు వెళ్ళినందుకు కాదు. కాని...

లలిత: మీ కాని... నాకు తెలుసును. మగవాళ్ళతో కలిసి ఎందుకు వెళ్ళాలి అని.

పంతులు: అదీ!

లలిత: మొట్టమొదట నేను ఒంటరిగానే వెళ్ళేదాన్ని. కాని, అప్పుడు సంప్రాప్తమైనది ఏమిటో తెలుసునా? మామూలుగా నలుగురిలోనూ మహా పెద్దమనుష్యులం అనిపించుకునేవారే ఎదురైనప్పుడు చూసే చూపులూ, అన్యాపదేశంగా అనేమాటలూ, వారు పుట్టించినప్రకారలూ, వాటివల్లను రేగి విపరీతచర్యలకు పూనుకున్న రౌడీల దుర్మార్గాలూ భరించలేక కవిన్నీ, దావన్నీ, బ్రతిమాలుకున్నాను. మంచు నాళ్ళు ఇంకాదు. అయినా వాళ్ళ

ధర్మమా అని సరియైన న్యాయదృష్టిగల ధైర్యవంతులు గనుక వొస్తున్నారు. నేను చేస్తూ ఉన్న పనిలో ఏ తప్పూ లేదు. ఉంటే నేనే అనుభవిస్తాను. వీరి కెందుకు? కానీయండి; ఈ సంఘానికి ఏమైనాసరే భయపడను.

పంతులు: సంఘమూ భయపడదు ఈ బెదిరింపులకు. అంతే కాదు. తాను ఏ సరిహద్దులు పెట్టిందో ఆ సరిహద్దులు దాటి నడుస్తే అడుగడుగునా నిల దీసి ప్రశ్నిస్తుంది. ఆ ప్రశ్నకు జవాబు చెప్పితీరాలి...

లలిత: ప్రశ్నిస్తుందేం? ప్రశ్నించనీయండి! నా స్వాతంత్ర్యాన్ని అన్యాయంగా, అనవసరంగా ప్రశ్నించి, నాపైన అపవాదులు కల్పించే ఈ అవకతవకలకు ఈ అబద్ధపువ్రాతలకూ అడుగడుగునా జవాబు అవసర మైతే, ఇదిగో ఈ వ్రాతలకూ, వీడికీ, ఇటువంటివాళ్ళ కందరికీ, ఈ సంఘా నికీ ఇదీ నాజవాబు! [కింద పడిఉన్న పత్రికమీద కాలు తొక్కి నలిపి రాస్తుంది. పంతులు తెల్లబోయి చూస్తుంటాడు; ఇంతలో రావ్ ఉమా ప్రవేశిస్తారు]

రావ్: భేషక్! ఉమా! నీ కవిత్వందృష్టి గొప్పదోయ్!

ఉమ: లలితా! మీ ధైర్యానికి అభినందనాలు!

లలిత: కవిత్వందృష్టి ఏమిటి?

రావ్: గ్రంథాలయంలో పత్రిక ఇవ్వాడే చూశాం. అపాదుకథ మీకు బాధగా ఉంటుందేమో అన్నాను నేను. 'ఆ మెతుట్టి నీకు తెలియదు' అని ఈ సంఘాన్ని బాగా పోల్చి చెప్పాడు, కవి.

పంతులు: ఏమని?

రావ్: 'తనతో అభిప్రాయభేద మున్న వ్యక్తిని గాడిదను చేసి తోక దగ్గర అల్లరి చేసి దెవరగొట్టి పరుగెత్తించి తమాషా చూడడానికి యత్ని స్తుంది సంఘం; కాని తెలివైన గడసరి గ్రహించి నిదానంగా ఆగి వెనుకకు రానిచ్చి రెండు కాళ్ళూ విసిరి మూతి పగలదన్నుతాడు, దుమ్ముకొట్టుకుపట్టు దవడకు పట్టగానే బుద్ధి కలిగి 'మనకు ఎందుకులే' అని సర్దుకుంటుంది.

సంఘం అని పోల్చి, 'లలిత ఈమాత్రానికి బెదిరి పరిగెత్తే ఆమె కాదు, తగిన మాటవిరిగే జవాబే ఇస్తారు కాని' అని ఇప్పుడే అన్నాను. సరిగ్గా లలితా అటువంటిజవాబే ఇస్తున్నారు...

పంతులు: [నవ్వుతూ] కవిదృష్టి గొప్పదే. ఇందాక నన్ను ఈవిడ గుంట నక్క అంటే, మీరు గాడిదలు అనబోయి ఆగాను. ఇప్పుడు కవే పోల్చాడు కనుక నా మాట సరిపోయింది.

ఉమ: [తడాఖాగా] ఒక్క పోలికతోనే పోలేదే! నేను చెప్పిన జవాబు కూడా వొచ్చింది!

[పంతులు ఖండువా తీసుకొని పోబోతాడు]

లలిత: [ఇటు తిరిగి] ఆగండి మీరు అప్పుడే వెళ్ళడానికి వీలు లేదు. నక్కలతోనూ, [అటు తిరిగి] గాడిదలతోనూ ఏమీ కాని, మీరు అంత అసహ్యంగా ప్రవర్తిస్తారు అనుకో లేదు, నే నెప్పుడూ...

ఉమ: ఇంతకూ మా ప్రవర్తనలోనేనా లోపం కనబడుతూ వుంటా?

రావ్: ఇంత పక్షపాతం...

లలిత: ఊరుకోండి. ఇంకా మాటలుకూడానా? మీ మాటలను ఇంకెప్పుడూ నమ్మను. అద్భుతమైన వాడు అంటే చూశా మనుకున్నాను కాని ఆషాఢభూతిలా హడలగొడతాడు అనుకోలేదు.

ఉమ: [చిరునవ్వుతూ] తరువాతకథ చెప్పండి!

లలిత: కథా! ఔను మరి, మీకు అంతా కథగానే ఉంటుంది. [కోపంతో] పెద్దమనుష్యులు మళ్ళీ... అట్లా అసహ్యంగా విడిచిపెట్టి... నాకు ఒళ్ళు మండుతూ ఉంది!...

ఉమ: లలితా! మీకు ఇంత కష్టంగా ఉంటుంది అనుకోలేదు.

రావ్: ఎందుకంత కోపం వొచ్చింది మీకు!

లలిత: కోపంరాదూ! అపరాయివాడితో అలా ఒంటరిగా విడిచిపెట్టి మీరు చెప్పైనా చెప్పకుండా వెళ్ళిపోతారా!

ఉమ: వాడు అంత అవకతవకగా ప్రవర్తించి, మిమ్మల్ని వెగటుగా చూసి...

లలిత: అయితే, అది నా తప్పు లేకపోతే ఇటువంటి అసందర్భపు వాడని తెలిసి ఇక్కడకు రప్పించిన పెద్దమనిషి తప్పా?

ఉమ: ఇదేమిటి? నాకేం జ్యోతిషం తెలుసు ననుకున్నారా!

లలిత: మీరు ఎరగరూ అతని సంగతి? సాంఘిక చరిత్ర పొడిచేశాడు, మహాఆశయాలు ఉన్నవాడు అని ఏమేమో పొగిడి...

ఉమ: అవన్నీ నిజాలు కావా? అయినా చదువుకీ ప్రవర్తనకీ సంబంధం ఏమిటి?

లలిత: ఔను, సంబంధం లేదని ఇప్పుడుగా తెలిసివచ్చింది?

పంతులు: బాగా అన్నారు!

రావ్: ఎట్లా గ్రహించగలం? అన్ని దేశాలు తిరిగాడు, విద్యావతులైన పాశ్చాత్యస్త్రీలతో పరిచయాలు ఉన్నవి అంటాడు. ప్రవర్తన అంత అవకతవకగా ఉంటుందని ఎట్లా ముందు గ్రహించగలము?

ఉమ: ఇంతకూ మీకు ఎందుకు ఇంత కష్టం తోచిందో చెబుతారూ?

లలిత: మీరు ఎందుకు నాతో చెప్పకుండా వెళ్ళిపోయారు?

రావ్: మరి ఏమి చేయమంటారు? మీరు ముఖం చిట్లించుకుంటూ ఉన్నా లక్ష్యపెట్టక, మీతో అంత చనువు తీసుకుంటూ అసహ్యంగా ప్రవర్తిస్తూ ఉన్నప్పటికీ మీకోసమని సహించాం. కాని, మిష పెట్టి మిమ్మల్ని ఆ జీడిమామిడిచెట్టు దగ్గర అంతసేపు నిలిపి సంఘంమీద వంక పెట్టి అతను మిమ్మల్ని ఉద్దేశించి అన్నమాటలు కష్టమనిపించినవి. అయినా పది పదిహేను నిమిషాలు చూశాం. ఎంతకూ తెములకపోతే వచ్చేశాం.

లలిత: నేనేం చేయను? జీడిలా పట్టుకున్నాడు. ఒక్కనిమిషం, ఒక్క నిమిషం అని పొంకామాటం పెట్టి కదలనిచ్చాడు కాదు. పెద్దమనిషితరహా దాటకుండా తప్పించిరాగడానికి వీలు లేక యమయాతన పడ్డాను. పోనీ,

ఒత్తే వెళ్ళారు కాని ఆ జట్కా తీసుకుపోతే నేను ఎలా రాగలుగుతాను అనుకున్నారు?

ఉమ: మేము దిగి, జట్కా తిరిగి పంపించివేశాం. కాని మీరొకదారి, జట్కా ఒకదారి అయింది.

రావ్: లలితా! మీకు ఇబ్బంది కలగాలని ఉద్దేశిస్తామా?

ఉమ: వాడిని అవమానం చేసినట్టు ఔతుంది అనుకున్నాము గాని, మీకు ఇబ్బంది ఔతుంది అనుకోలేదు. ఈకాస్తకే మీరు ఇంత ధుమధుమ లాడరు.

లలిత: మీకు కాస్తవలెనే ఉంటుంది. మగవాళ్ళు మరి. వాడు నన్ను పెట్టినపాట్లు మీకు ఎట్లా తెలుస్తవి? అవైదుకారలో రమ్మని బలవంతం ప్రారంభించాడు. వెళ్ళి జట్కాబండిని పంపించి పెట్టవయ్యా అంటే వినండే. ఒంటరిగా మిమ్మల్ని చీకటిలో వొదిలి వెళ్ళను అని మూర్ఖించాడు. ఇక విధి లేక అంగీకరించాను. దానిలో ఎక్కబోతూఉంటే గభీమని అవసరం లేని సహాయానికి దండ పట్టుకున్నాడు చోరస్ఫగా. నాకు ఎంతకష్టం తోచింది!

ఉమ: ఇడియట్! ఏం ఫ్రెండ్స్ అనుకున్నాడా?

లలిత: అంతతో అయిందీ? పంతులుగారికోట పక్కనుంచి సోమాలమ్మ గుడిరోడ్డునే తొందరగా పోనీ వయ్యా అంటే, ఆరోడ్డు సరిగా లేదు, చీకటి అని కాలేజు రోడ్డు ఆర్యాపురంలోనుంచి గోదావరిగట్టు ఎక్కించాడు. ఏమి చెప్పితే ఏమి లాభం. తక్కువస్పీడ్ పెట్టి పైగా నాతో మధ్యమధ్య బాతాఖానీ ప్రయత్నాలు. ఏమి బాధ పెట్టాడు!

పంతులు: మీకు ఇంగ్లాండు వెళ్ళకుండానే...

లలిత: పంతులుగారూ! ఊరుకోండి. నాకు అసలే మాటలు సరిగ్గ వచ్చేటట్టులేవు. త్వరగా పోనియ్యవయ్యా అంటే, అయ్యో మీకు కుదుపు అని చెప్తే విన్నాడు కాదు. గట్టుమీదఉన్న జనమంతా కన్నులు మామి

దనే నిలిపి వేశారు. ఇంకొక రోడ్డున పోనిమ్మని బ్రతిమాలుకుంటే వినకుండా హిందూసమాజం ఎదరనుంచీ సినిమాముందునుంచీ పోనిచ్చాడు. అప్పుడే సమాజంలోనుంచీ సినిమాలోనుంచీ వచ్చేజనం మాఊరేగింపు వింతగా చూశారు.

తల వంచుకుని ఇంటిదగ్గర పడ్డానురా బాబూ అనుకుంటే, అంతతో అయిందీ. నేను సైడ్ కార్ తలుపు తీసుకో లేకపోయాను, చక్కగా మని సిరి బొమ్మలాగ, ఫర్కాస్ వాడివలె ఇటు తిరిగివచ్చి తలుపు తీయడంతో, పోనీయక, దొరసానిని దొర పట్టి దింపినట్టు సొంతంగా చేయి పట్టుకున్నాడు.

రావ్: ఘంతలా గున్నాడే!

లలిత: నాకు ఒళ్ళుమండింది. చేయి విదిలించుకుని, తలుపుమీదకు ఊరికే తీసుకుని లోపల పడ్డాను. మోటార్ సైకిల్ ఆగేప్పటికే ఇనుగుపోయి గంతా చోద్యం చూడ్డానికి వచ్చారు. శని విరగడయింది అనుకుని కూర్చున్నాను సోఫాలో.

పంతులు: అంతతో వదిలాడూ!

లలిత: తిన్నగావచ్చి పడకకుర్చీలో కూర్చుని మళ్ళీ...వీడి సోది తగలెయ్యా! ఫ్రాన్స్ అమెరికా అని మళ్ళీ ప్రారంభించాడు. ఇక వీడికి వొదిలేటట్టు లేదని, 'నాకు స్నానానికి వేళయింది వొచ్చేవరకూ ఉంటే మీకు ఆలస్యం అవుతుందేమో?' అన్నాను. 'నాకేమీ ఫరవాలేదు. మీరు స్నానంచేసి వచ్చేవరకూ ఉంటాను' అన్నాడు. ఇక ప్రాణం విసిగి స్త్రీనేకాని లాభం లేదనుకున్నాను. స్నానం అయిన తరువాతకూడా తెర అవతల పడుకున్నాను మాట్లాడకుండా. ఎంతసేపుచూసినా ఏమీతగాదా లేదు. ఆపడకకుర్చీలో కాళ్ళుచాపి పడుకుని, ఇంటికప్పు కేసి చూస్తూ, పైప్ మాటిమాటికీ నింపి కాలుస్తూ కూచున్నాడు.

ఇక ఇట్లా లాభంలేదనుకుని లేచివచ్చి 'మీకు భోజనానికి వేళే అయిన

టుంది' అన్నాను. 'నో నో. నాకు భోజనానికి ఒక టైం అని లేదు, మధ్యాహ్నం మీరు చేసినఉప్మా బరువుభోజనం అయింది' అన్నాడు. మొండి మళ్ళీ 'ఇంగ్లండులో మిస్ డెయిసీ అనే స్నేహితురాలు' అని ప్రారంభించాడు. అయిదునిమిషాలు ఓపిక పట్టి చూశాను. 'నాకు ఆకలి వేస్తూవుంది, భోజనానికి లేవాలి' అన్నాను. ఆ లేవాలి అన్నముక్క హఠాత్తుగా అర్థమౌతుంది అని నేను గ్రహించలేను. నా కోపం ముగిసింది. 'థేంక్యూ థేంక్యూ' అంటూ కోటువిప్పి, బొట్టుపెట్టి పిలిచినట్టు తయారయ్యాడు!

ఉమ: వీడితప్పా గొయ్యా!

లలిత: ఇక ఇది ప్రమాదమే చూశావా. ఇక సున్నితాలు పక్కికావు, మోటుతనం తప్పదు అనుకుని తొందరతొందరగా నాలుగుముద్దలు మింగి లేశా. తాను తెమలడే! ఒకటేసోది ప్రారంభించి, 'ఆదేశాలలో భోజనం గంటసేపు చేస్తారు. అదిచాలా ఆరోగ్యం' అని నాకుచెప్పాడు. నేను లేచి పోయి చేయి కడుక్కునివచ్చి మంచంమీదను పడుకున్నా. నెమ్మదిగా భోజనం ఈడ్చి, మంచందగ్గర గావచ్చి, 'ఏమి, అట్లా ఉన్నారు?' అన్నాడు. 'నాకు చాలా విచారంగా ఉన్నది, ఎందుకు చెప్పకూడదు! ఇదే ఇంగ్లిష్ గరల్స్ అయితే ఈపాటికి ఎన్నోసంగతులు తెప్పించు కునేవారు. మీరు నాకు చాలా అన్యాయం చేశారు'

పంతులు: ఓరి వీడి...మధ్య వీడికి అన్యాయమేమిటి?

లలిత: ఆ! వాడిబొంద, ఆఇంగ్లీషుపద్ధతులన్నీ మనకు దుర్గంధం- శుంఠ ... [అగి] అంటూ, ఉండండి వస్తాను... యూ ప్లీజ్ వైట్-అంటూ కోటు తొడిగి తొందరగా సైకిల్ ఎక్కాడు.

పంతులు: అమ్మో!

లలిత: ఏమి అమ్మో? అంతలో ముగిసిందిలే ఆ మహాభయంకరం. కదిలాడు అంతేచాలునని తలుపు బిగించి టికీకూడా వేసి దీపం ఆర్పివేసి పడుకున్నా. పదినిమిషాలయ్యేప్పటికి మళ్ళీ తయారైనాడు, ఇక ఏమైనాసరే

తలుపు తీయదలచుకోలేదు నేను. ముందు నాలుగయిదుసార్లు పిలిచాడు, పదినిమిషాలు ఏ చప్పుడూ లేదు. కాని, మోటార్ సైకిల్ చప్పుడూ లేదు. అందుచేత మీరు అక్కడనే ఉన్నారని అని గ్రహించా. అయిదేసి ఆరేసి నిమిషాలకు ఒక్కొక్కసారి పిలుస్తూ అరగంటో ముప్పావుగంటో అతెచ్చిన అమృతాంజనాన్ని ధరించాను. నాకు మహత్తరమైనా నేనింది, మంచిరాత్రి అయిందా?

ఉష: పిచ్చిముండావాడులా గున్నాడే!

పంతులు: [కోపంగా] ఆ. పిచ్చా, మనసా?

లలిత: అంకితితో తెమిలిందీ!

రావ్: ఏం తలుపులు ఎత్తేప్రయత్నం చేశాడా?

లలిత: వాడిపూర్వం అంతవరకూ లేదుకాని, తెల్లవారేప్పటికి మళ్ళీ తయారైనాడు. 'గుడ్ మార్నింగ్, మీకు తలనొప్పి ఎట్లాఉన్నది?' అంటూ. ఇక లాభం లేదనుకని స్నానం అయిపోయింది గనుక తాళంతీసి 'నాకు పనిఉన్నది వెళ్ళగలరె' అన్నాను. ఓ 'డజన్ట్ మేటర్-మళ్ళీ ఎప్పుడు వస్తారు!' అన్నాడు. బహుశా రాత్రికనకపోతాను. ఈ శేష ఆదివారంకదా స్నేహితులు భోజనానికి పిలిచారు' అన్నాను.

పంతులు: మాంచి ఎత్తు వేశారు!

లలిత: 'ఓ యస్ చాలా బాగుంది. ఇట్లాంటి ఫ్రెండ్స్ పార్టీస్ మీరు అంతా ఇంగ్లీషుపద్ధతుల్ని ... అని ప్రారంభించాడు. 'అయ్యో! నాకు ఇప్పటికే ఆలస్యమైంది. వాళ్ళు నన్ను చూస్తూ ఉంటారు. లేవండి' అన్నాను. 'మీకు ఫరవా లేదు. ఎక్కడో చెప్పాతే సైడ్ కారులో తీసుకవెళ్ళి డ్రాప్ చేస్తాను' అన్నాడు. 'అక్కర లేదు ఈ పక్కనే ఉన్నది, మీరు వెళ్ళండి' అని తలుపువేసి అడ్డసందులోకి తిరిగిపోయాను. వెంట పడతాడా...
[ఛట్ మంలేచి రావ్‌ని, ఉషని షేక్ హ్యాండ్ చేస్తూ కిటికీదగ్గరకు పరుగెత్తి]
మాపండి, మా మీద డీ! ఇట్లా, మీరు వినకుండా కిటికీలాటునుంచి

చూడండి! ఆకుర్రవాడు ఎవ్వరు?

రావు-ఉమ: అరె హేంగాడు!

లలిత: ఎవరు ఇతను?

ఉమ: వీడా? శ్యాంపినతండ్రికొడుకు. వీడే ఆవ్యాసం వ్రాశాడని నా, అనుమానంకూడా. కారణాలు తరవాత చెబుతా.

లలిత: అతనితమ్ముడే! వీడిసంగతి చెప్పండి?

రావ్: నేను పొద్దున్నే ఇంకొకసంగతికూడా విన్నాను, అమ్మ ఆఫీసులో. శ్యాంకీ వీడికీ ఎప్పుడూ పడదుగదా! శ్యామలరావు అన్నపేరు శ్యాం అని మారుస్తే వీడు నరసింహం అన్నపేరును హేం అని మార్చాడు పోటీగా.........

పంతులు: ఉమామహేశం ఉమ అయినట్టు.

లలిత: పంతులుగారూ, ఉండండి ఇప్పుడుకాదు హేళన!

రావ్: నిన్నరాత్రి శ్యాం ఇంటికి వెళ్ళాక వీళ్ళిద్దరూ పోట్లాడుకున్నారట ఏకారణంచేతనో. శ్యాం వీడిం చెంప పగులగొట్టి, ఇంటిలోనుంచి గెంటివేశాడట. ఆకడుపుమంటమీదనే రాత్రిరాత్రి ఈవ్యాసం వ్రాసి, తెల్లవారకుండా పత్రికఆఫీసుకు పట్టుకువెళ్ళి, ఎడిటర్‌తో మనమీద ఏవో అబద్ధాలు కల్పించిచెప్పి, ఈనాడే ఇదిపడితే అద్భుతం అని ఒప్పించి పేపరు ఆపి, అప్పటికప్పుడుకూర్చి అచ్చు వేయించినాడట.

లలిత: ఇక సందేహంలేదు, వీడే చేశాడు ఇదంతా!

ఉమ: విశదంగా చెప్పండి!

లలిత: వీడు ఇదివరకు చాలాసార్లు నన్ను కనిపెడుతూ వెన్నాడడం చూశాను. ఎప్పుడూ ఎదరకుమాత్రం రాలేదు. నిన్నరాత్రి ఆఆషాఢభూతి సైడ్ కారులోనుంచి నన్ను దింపుతూవుంటే పక్కనుంచే పోతూవీడు మమ్మల్ని ఒకచూపు చూశాడు. శ్యాం వీడిని షుట్టిగా చూశాడు. ఎందుచేతనో వీడిచూపూ, అనిమిషం వీడిమొహమూ నాకు బాగా జ్ఞాపకం వది

పోయినవి. రెండుగంటలనుంచి ఇటే తచ్చాడుతున్నాడు. రెండుమూడుసార్లు గుమ్మందగ్గరగా వచ్చి నన్ను చూస్తూ వెళ్ళాడు. ఒకసారి పలకరించబోయి నట్టు కనబడితే నేను లోపలకు తప్పుకున్నాను.

పంతులు: ఇంకో సంగతికూడా చెబుతాను. ఈపత్రిక మూలంగానే బయలుదేరి సంగతులన్నీ సి. ఐ. డీ. పనిచేసి సంగ్రహించుకొని వచ్చాను. నిన్న రాత్రి శ్యామలరావు ఇతన్ని కొట్టడానికికూడా ఈసంగతే కారణం.

లలిత: అంటే?

పంతులు: శ్యామలరావు ఇంటికి రాగానే ఈ నరసింహాన్ని పిలిచి 'ఎందుకురా, నీవు అక్కడికి వొచ్చావు, పైగా ఏమిటి అట్లా చూస్తావు? మర్యాద తెలియదా?' అన్నాడట. దానిమీద నరసింహం 'సంఘాన్ని పాడుచేస్తున్నారు ఈ ఇంగ్లండూ గింగ్లండూ తిరిగివచ్చినవాళ్ళు, ఇంగ్లీషు చదువుకొన్నవాళ్ళు' అని మాటలు మిగిలితే శ్యామలరావు చావగొట్టాడట.

లలిత: మరి ఇంత సంఘాన్ని ఉద్ధరించేపవిత్రుడు ఈమట్టూ తిరగడాలేమిటి?

రావ్: అయితే లలితా, ఇట్లా తిరగడం వీడిఉద్దేశం ఏమిటంటావు?

పంతులు: ఆఁ! అదేమిప్రశ్న?

లలిత: వాదనలు కాదుకాని......ఎట్లాగైనా వీడికి శాస్తిచేయాలి...

[ఉమ లలితచెవిలో ఏదో చెబుతూ ఉంటాడు.]

రావ్: [మాటఅని పిలిచి పంతులుచెవిలో ఏదో చెప్తాడు.

పంతులు: అబ్బో మిమ్మల్ని చూస్తే వాడు రానేరాడు. [రావ్ పంతులూ ఏకాంతం మాట్లాడుతూ ఉంటారు ఒక నిముషం. ఇంతలో ఉమ వీళ్ళవైపు వొచ్చి, లలితతో]

ఉమ: ఇంకొక్క రెండుపద్దలు మాట్లాడేసి మేము తప్పుకుంటాం. మీరు సిద్ధంకొండి తొందరగా!

[లలిత తెరవెనుకకు వెళ్ళుతుంది]

రావు: పంతులూ, ఏమిటి సంగతి?

ఉమ: మనం తప్పుకోవాలి. ఇట్లా రండి, చెబుతా! [లేస్తారు]

తెర గబగబా పడుతుంది

3

[తెర అగుతూ లేస్తుంది. వాళ్ళు ముగ్గురూ లేరు. లలిత మార్చిన చీర కుచ్చెళ్లు సర్దుకుని, అద్దం ఎదుర నిలిచి ముఖాన్ని అద్దిన పౌడర్ జాగ్రత్తగా చిన్న చేతిరుమాలుతో తుడుచుకుంటూ పాడుకుంటూ ఉన్నది]

దూరాన నా రాజు కే రాయిడౌనో,
ఈరోజు నా రాత లేరాల పాలో?

సీమ సిటు కనగానె పెదరి పోతాది మనసు
కాకమ్మనే తైన కబురంపడారా! ||దూరాన||
కళ్ళ కేటో మబ్బు కమ్మినట్టుంటాది, ||దూరాన||
నిదుర కళ్లైనా కళ్లు నీరసిస్తున్నాది! ||దూరాన||
అవు 'లంబా' యంటు అడలిపోతుంటాయి,
గుండెల్లో వుండుండి గుబులు చిగురేతాది! ||దూరాన||
తులిసెమ్మ వొరిగింది తొలివాన పెరిగింది,
మనసులో జాబిమ్మ మసక మసకేసింది! ||దూరాన||

[పాట ముగిస్తూ, గుమ్మం దగ్గరకు వెళ్ళి వీధిలోనికి చూస్తూ గడపను ఆని నిలుస్తుంది. రెండు నిమిషాలు. చిరునవ్వు నవ్వుతూ లోపలకు ఒక అడుగు వేస్తుంది. ఒకతను బలుకుతూ లోపలకు వస్తాడు]

లలిత: మీరు ఎవ్వరు!

అతడు: మాది కాకినాడ. నా పేరు ఎస్. వెంకటరావు.

లలిత: [తీవ్రంగా] ఎస్. వెంకటరావుగారా? ఎందుకు ఇట్లా వచ్చారు?

వెంకటరావు: [ఒక్క-త్రుటి తెల్లబోయి, సర్దుకుని] మరేమీ లేదు. నేను కలెక్టర్ ఆఫీసులో గుమాస్తాను. మొన్ననే ఇక్కడకు బదిలీ చేశారు. నా భార్యకు ఇంగ్లీషు చెప్పించడానికి దర్యాప్తుచేస్తే మీరు బాగా చెబుతారని ఎవ్వరో అన్నారు. అందుకని అడగడానికి వచ్చాను.

లలిత: [హేళనగా అన్నట్టు] అట్లాగా! ఎస్. వెంకటరావుగారూ, మీరు ఇంత చిన్నవయస్సులోనే ఉద్యోగంలో ప్రవేశించడమే కాకుండా ఇంత కుటుంబబాధ్యత పూనుకోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది!

వెంకటరావు: [వెలవెలబోతూ] ఆఁ, దాని కేమిటిలెండి! [ఆమెకేసి చూస్తాడు]

లలిత: [చిరునవ్వుతూ] వెంకటరావుగారూ! మీరు బొత్తిగా భయస్థులులా ఉన్నారు. ఈమాత్రానికి లోపలకు రావడానికి అంత తటపటాయించి తిరిగారు ఎందుకండి? ఈసంగతి అని తెలిస్తే నేనే పిలిచిఉందును.

వెంకటరావు: [అనుమానిస్తూ] అబ్బే! ఏమీలేదు. మీతో ఎవరైనా మాట్లాడుతున్నారేమో, అట్లా అయితే బాగుండదు కదా అని అనుమానించాను.

లలిత: ఈవిషయానికి ఇంత అనుమానం ఎందుకండి, వెంకటరావుగారూ [ఆగి] మీయిల్లు ఎక్కడండి?

వెంకటరావు: [తెల్లబోయి సర్దుకుని] ఈఊరు నాకుకొత్త. అక్కడ ఎక్కడనో పేటలో ఉన్నాము.

లలిత: ఓహో మీరు మొన్ననేగా ఈవూరువచ్చారు. ఇంకా అనవాళ్ళు తెలియవు. మీకు సంగీతంలో ఏమైనా ప్రవేశం ఉన్నదా?

వెంకటరావు: నాకు అంత అదృష్టం లేదండి.

లలిత: ఆఁ! సంగీతం పెద్దఅదృష్టమా ఏమిటి! కాని ముఖంచూస్తే పాడగలరు అనిపించింది.

వెంకటరావు: [చనువుగా] మీకు సాముద్రికం తెలుసునా?

లలిత: [నవ్వుతూ] ఇప్పుడు చెప్పను నిలకడమీద మీకే తెలుస్తుంది.

వెంకటరావు: [చేయిచాపి] అయితే దయచేసి చేయి చూడండి.

లలిత: పరిచయం అయింది కనుక ఇంకెప్పుడైనా చూస్తాను, దానికి వేళలున్నాయి. మీభార్య పాడతారా?

వెంకటరావు: ఏదో ఒకమోస్తరు.

లలిత: భర్తలు భార్యల్ని మెచ్చరులెండి. అది పొరుగింటి పుల్లకూర కాదు. పరేగాని మీకూ, మీభార్యకూ సంగీతం చెబుతాను, నేర్చుకో రాదూ?

వెంకటరావు: నా భార్యను కనుక్కొని చెబుతాను.

లలిత: నాకు చాలా సంతోషంగా ఉన్నది. పోనీ, మీరు చదువుకున్నం దుకు స్త్రీలకు ఆమాత్రం స్వాతంత్ర్యాన్ని ఇచ్చారు. మీరు సంస్కర్తల్లాగు లేరా!

వెంకటరావు: స్త్రీలకుకూడా పురుషులతో సమానమైన హక్కులు ఉండవలెనని నా అభిప్రాయం.

లలిత: స్త్రీలు పురుషులతో సమంగా ప్రవర్తించడమూ, స్త్రీలూ పురుషులూ స్నేహితులైనవారు, కలిసి షికారులు వెళ్ళడమూ మీరు ఏమంటారు?

వెంకటరావు: [ఒక్కత్రుటి అనుమానించి] తప్పకుండా వెళ్ళవలసినదే? తప్పేముంది దానిలో?

లలిత: ఈరోజు పత్రిక చూశారా?

వెంకటరావు: ఏపత్రిక?

లలిత: ఓహో! మరిచిపోయాను, మీరు కొత్తగా ఈఊరికి. ఈఊరిలో ఒక పత్రిక ఉన్నది లెండి.

వెంకటరావు: నాకు పత్రికలు చూడడం అలవాటు లేదండి.

లలిత: [అతనిని కనిపెట్టినట్టుగా] ఈరోజు పత్రికలో ఎవ్వడో గాడిద నన్ను ఉద్దేశించి అబద్ధపుకూతలు కూశాడు.

వెంకటరావు: ఎందుకు?

లలిత: స్త్రీలు పురుషులతో షికారులు బయలుదేరడం సంసారలక్షణం కాదనీ, ఇటువంటి స్త్రీలు తయారైతే చక్కని హిందూసంఘంకూడా పాశ్చాత్యసంఘాలవలె శీలంలేని స్త్రీలతో నిండిపోతుందనీ చాలా వ్రాశాడు.

వెంకటరావు: ఏడిశాడు. ఎవడో గిట్టనివాడు వ్రాసిఉంటాడు. పాశ్చాత్యం అన్నదానినంతా తిట్టేజాతి ఒకటి ఉన్నదిలెండి.

లలిత: బలవంతంగా నొక్కిపెట్టి ఉంచితే నిలిచే శీలం ఏంశీలం చెప్పండి? స్వాతంత్ర్యం ఉన్నంతమాత్రాన శీలం నిలుపుకోలేనిది ఎంత మాత్రపుశీలం?

వెంకటరావు: మహాబాగా అన్నారు.

లలిత: అట్లా షికారు వెళ్లడం తప్పు అంటారా?

వెంకటరావు: తప్పేముంది? పైగా ఆరోగ్యంకూడా.

లలిత: అయితే, ఈసాయంత్రం మీరూ షికారు వస్తారా మాతో? ఇంకా కొందరు స్నేహితులుకూడా వస్తారు లెండి.

వెంకటరావు: ఈరోజుకి క్షమించాలి. ఇంక ఎప్పుడైనా తప్పకుండా వస్తాను. కొత్త కావడంవల్ల ఇంటివద్ద పనులున్నవి. మావాళ్లు అవస్థ పడతారు.

లలిత: పోనీ మీయింటికి వెళదామా? మీభార్యను నాకు పరిచయం చేస్తురు గాని.

వెంకటరావు: నాభార్యను ఇంకా తీసుకు రాలేదండి. నేను ఒక్కణ్ణే ముందుగా వచ్చాను.

లలిత: [ఏమీ ఎరగనట్టు] మీకు భార్య అంటే ఎంతశ్రద్ధండీ! ఆమె రాకుండానే చదువుఏర్పాటులు చేసుకుంటున్నారు. మగవాళ్లంటే అలా ఉండాలి!

వెంకటరావు: దానికేమి గాని, నేను బయలుదేరి వచ్చేటప్పుడు ముందు

తన చదువు ఏర్పాటులు చేయమని మరీ మరీ చెప్పింది.

లలిత: అయినా అంతశ్రద్ధ ఉన్న భర్తలు మనలో కష్టం. మీరు హోటల్‌లో భోజనం చేస్తున్నారా?

వెంకటరావు: ఔనండి!

లలిత: పోనీ ఇవాళ రాత్రి ఇక్కడ భోజనం చేస్తురు గాని.

వెంకటరావు: సంతోషం అలాగే, మళ్లీ వస్తాను.

లలిత: ఏమీ అంత తొందర పడుతున్నారు?

వెంకటరావు: ఏమీలేదు, మీస్నేహితులు వచ్చేవేళ అయినదేమో...

లలిత: ఫరవాలేదు, వొచ్చేస్నేహితులు ఎవ్వరూలేరు. ఆయన ఎవ్వరో నిన్ననే పరిచయం అయినారు, శ్యాంఅట ఆయనపేరు, ఆయనమాత్రం తప్పకుండా వస్తారనుకుంటున్నా షికారుకి...[వెంకటరావు లేవబోతాడు] తొందరలేదు. అయనైనా ఇంకా రెండుగంటలవరకూ రారులెండి; వొచ్చినా షికారు వెళ్ళద్దలచుకోలేదు. కొంచెంసేపు ఉండండి. మీరు ఇంటికి అద్దె ఎంతఇస్తున్నారు?

వెంకటరావు: పదిహేను రూపాయలు.

లలిత: మీకు జీతంఎంత? మరిచిపోయాను.

వెంకటరావు: నలభై.

లలిత: అబ్బా, చాలాఎక్కువఅద్దె ఇస్తున్నారు ఆజీతానికి. అయినా ఈఊరిలో అద్దెలు మహా ఎక్కువలెండి. ఈభాగం చూడండి. ఈకొత్తకూ నేను పదిరూపాయలు ఇస్తున్నాను. ఇల్లు కొత్త, చూడండి, ఇట్లా రాండి! [లేచి తెరను పూర్తిగా వెనుకకు జరిపివేస్తుంది. తెరవెనక ఉత్తరపు గోడను ఆని చిన్నబల్లా దానిమీద పూలసజ్జ, దానినిఆని మంచం. కలం కారీదుప్పటి పరిచివుంటుంది. ఇరతల మూలను ఇంకొకబల్లమీద స్టౌవ్‌లు ఉంటవి. గది అంతా నీటుగా తుంగచాపలు పరిచిఉంటవి. అవతలిగోడ మధ్యను స్నానాలగది తలుపుమూసి ఉంటుంది.]

చూశారండీ ఇదీ ఇల్లంతా, రాండి లోపలికి!

[మంచందగ్గరకు వస్తాడు]

[నటనగా] అయ్యో, మరిచిపోయాను మీ మాటల్లో. కూచోండి. కాఫీ పుచ్చుకుందాం?

వెంకటరావు: నేను ఇందాకనే పుచ్చుకున్నాను. మీరు తీసుకోండి.

లలిత: ఇదేమి మర్యాదండీ? మీరు పుచ్చుకొని తీరాలి. కాఫీ నేను చాలా బాగా చేస్తాను. ఒకసారి రుచి చూస్తే కాఫీకోసమైనా మీరు నాస్నేహం ఆశించవలసి ఉంటుంది. కూర్చోండీ, ఆమంచంమీదను; ఇంకా ఇంత మొహమాట మైతే ఎలా గండీ!

[చేయి పట్టుకొని చనువుగా కూర్చో బెడుతుంది. ఆమెను వింతగా చూస్తాడు. కాఫీకప్పు అందించి తానూ అతనిని చూస్తూ తాగుతుంది.]

ఎట్లా ఉన్నదండీ కాఫీ?

వెంకటరావు: ఇంత మజా అయిన కాఫీ ఈ జన్మలో ఇంతవరకూ రుచి చూడలే దంటే నమ్మండి!

లలిత: [చిరునవ్వుతో] అయితే కాఫీకోసమైనా తరుచు ఇక్కడకు వస్తారా?

వెంకటరావు: తప్పకుండా!

లలిత: అయితే ఒట్టు వేయండి!

[చాపినచేతిలో చేయి వేస్తాడు. వెంటనే చేయి తీసి చెంపను చిట్టిదెబ్బ కొడుతుంది. చేయి పట్టుకోబోతాడు. తుర్రు మని లాగి తప్పుకుని]

లలిత: ఆగండి. తాంబూలం మరిచిపోయాను. [రెండుకిళ్ళీలు తెచ్చి ఒకటి ఇవ్వబోతుంది]

వెంకటరావు: [ఆప్యాయంగా కళ్లు కదుపుతూ] ముందు మీరు...

లలిత: ఊహూఁ! స్త్రీ స్వాతంత్ర్యాభిలాషులుగా మీరు!

[అంటూ తాను ఒకకిళ్ళీ వేసుకుంటుంది. వెంకటరావు లేచి చేయి పట్టుకో

పోతాడు.]

లలిత: ఆగండి!

[కిళ్ళీ తొందరగా ఒక బుగ్గకు తోసివేసి]

అబ్బో! మీకూ ఆగడం ఎక్కువే!

వెంకటరావు: మీకూ అంటే!

లలిత: అంటేనా, అంకను పుట్టినవన్నీ ఏ నాతవి?

వెంకటరావు: [తగిలి] నాకు అర్థంకావడం లేదు.

లలిత: లేదా? పోనీ కాని కోటు ఇంకా ఎందుకు? తీసి వేద్దురూ!

వెంకటరావు: ఎందుకు?

లలిత: ఎందుకైతే నేమి? స్నేహితురాలిని అడిగాను. [ఆప్యాయంగా] తీయండీ! [తీస్తాడు] ఇలా ఇవ్వండి! [పుచ్చుకొని మేకునకు తగిలించి నవ్వుతూ] కలెక్టరుఆఫీస్ గుమస్తా వెంకటరావు ఆకోటుతో ఆమేకున వేలాడుతున్నారు కనుక మీరు ఎవ్వరో నిజంచెప్పరూ?

వెంకటరావు: [వెలవెలబోతూ] ఇదంతా నాకు అర్థం కావడము లేదు?

లలిత: ఇంకా విప్పి చెప్పనా? నీవు వెంకటరావూ కాదు, గింకటరావూ కాదు.. సత్యాన్ని బయటపెట్టనా?

[గడ్డం పట్టి ఆడించింది] మా మరిది! [నోరు తెరిచి ఏదో అనబోతే నోటిలో కిళ్ళీ కుక్కి వేస్తుంది. చేయి పట్టుకోబోతే తప్పించుకొని, దూరంగా వెళ్ళి వేలితో ఆజ్ఞాపిస్తూ] నాకు నీవు కొన్ని వాగ్దానాలు చేయాలి హేం!

హేం: [నోటి చెమటను తుడుచుకుంటూ] అరే! నా పేరుకూడా తెలుసునా!

లలిత: నా సాముద్రికం అంటే ఏమనుకున్నావు మరి? దాని కేం గాని, నేను నీకు అర్థం కావడం లేదు? అర్థం తెలియ జేస్తాను గాని ఇప్పుడే, ఎప్పటికీ స్నేహంగానే ఉంటా నని ప్రమాణం చేయి!

హేం: అలాగే ఉంటాను.

లలిత: స్త్రీలూ పురుషులలాగే స్వతంత్రులుగా స్నేహంగా ఉండవచ్చునని నీవూ ఒప్పుకున్నావు కదా! మరి ఈ స్నేహాన్ని సంఘం అపసవ్యంగా చూసి తీరుతుంది. మనలను గురించి అదవవాగుడు వాగుతుంది, అసహ్యంగా మాటలు కూస్తుంది. లక్ష్యపెట్టకుండా ఉంటావా మరి?

హేం: ఎందుకు లక్ష్యపెట్టాలి? ఎప్పటికీ లక్ష్యపెట్టను!

లలిత: అదీ ధీరుడు అంటే! ఇంకొకటి మరి. మరి నేను ఉత్త టక్కరిని, అంతే అని నీకు ఆశాభంగ మయితే?

[హేం బిక్కచూపు చూస్తాడు దగ్గరగా వోస్తూ] అయితే గియితే, మరి ‘స్నేహంగానే ఉంటాను’ అనీ ‘స్త్రీలు స్వతంత్రంగా ఉంటే ప్రపంచం అనుమానించి తీరుతుంది! అయినా అంతమాత్రాన నేను చెడ్డగా తలంచను’ అని ప్రమాణం చెయ్యి!

హేం: [విసుకుగా] ఏమిటి ఇదంతా? పొద్దున్న పత్రికలో ఎవడో వ్రాసినవ్రాతలు ఏకరువు పెడుతున్నావు!...

లలిత: [మీదకు వెడుతూ] ఇదంతా తెలిసిందేం పాపం!

[దవడమీద చిన్నదెబ్బ కొడుతుంది. చేయి పట్టుకోబోతే జారి గిరుక్కున తిరిగి మంచం చివర గోడను ఉన్న తలుపులను ఆనుకొని నిలబడుతుంది. పరుగున వచ్చి పట్టుకోబోతున్న హేంని శాసిస్తూ]

లలిత: తొందర పడకు ఆగు మరి. ఇంకొక్కమాటమాత్రం ప్రమాణం చెయ్యి, తరువాత నీదగ్గర నేను ఏ మన్నా దాపరికం చేస్తే నేనా చూడు.

హేం: [ఆగి ఆలోచించి] సరే!

లలిత: ‘స్వాతంత్ర్యాభిలాషులమైన మనం స్వచ్ఛందంగా ప్రవర్తిస్తాము. ప్రపంచం అన్యాయంగా కారులు కూస్తే ఊరికే భయపడేవాళ్ళం కాము’ అని సత్యప్రమాణం చేసి నా చేతిలో చేయి వెయ్యి!

హేం: ఏమిటి ఇదంతా?

లలిత: ఏ దైతే నేమి? నాకు ఇచ్చిన చనువు కొద్దీ ఈ మాత్రం శాసించ

కూడదా! ఇంతేనా...

హేం: సరే అలాగే!

లలిత: అలాగే అంటే చాలదు. నేను అన్నట్టు చెప్పు! నా సత్య ప్రమాణకంగా—

హేం: నా సత్యప్రమాణకంగా—

లలిత: స్వతంత్రాన్ని అభిలషించినందుకు—

హేం: స్వతంత్రాన్ని అభిలషించినందుకు—

లలిత: సంఘం కారుకూతలు కూస్తే. [చేయి చాపుతుంది]

హేం: సంఘం కారుకూతలు కూస్తే.

లలిత: భయపడే చచ్చులం కాము.

హేం: భయపడే చచ్చులం కాము.

[అంటూ లలిత చేతిలో చేయి వేయబోతాడు. లలిత ఛట్ మని తలుపులను వీపుతో నెట్టి లోపలకు జారుతుంది. ఒక్కసారి లోపలనుంచి 'భయపడే చచ్చులం కాము' అంటూ మూడు చేతులు అతని చేతికిందకు వస్తవి. హేం తుళ్ళి గతుక్కు మని ఒక అడుగు వెనకకు వేసి వీధివైపు తిరుగుతాడు. శ్యాం అప్పుడే గుమ్మం దాటి లోపల అడుగు పెట్టి ఆగిపోయి హేంని చూసి కళ్ళు ఎర్రజేసేప్పటికి, గదిలోనుంచి పెద్దనవ్వు నవ్వుతూ రావ్, ఉమ, పంతులు, లలిత వస్తారు.]

శ్యాం: [ఇది చూసి చిత్తరపోయి] డేమిట్! [వెనుకకు తిరుగుతాడు]

[తెర పిడుగువలె పడుతుంది]

ప్రభు వాక్యము

శ్రీ శివ శంకర శాస్త్రి

~ పాత్రలు ~

ప్రతీహారి

మహామాత్యుడు

రూపాంబిక......కాంచీ రాజకుమారి

పురుషోత్తమ దేవుడు...ఉత్కల మహారాజు

ప్రథమ రంగము

చల క్షేత్రము : మహామాత్య భవనము

ప్రతీహారి:

జయము, జయము, మహామాత్యసత్తములకు! పాదదాసి
అధికభక్తితో ప్రణామమాచరించి విజ్ఞాపన
సవినయముగ చేయనున్నది!

మహామాత్యుడు :

ఇట్టు వచ్చితివేమి! ఉత్పాతమేమి?
ఆకస్మికమ్ముగా అహిత ముదయించెనా?

ప్రతీహారి:

అనుకంప వహించి మహాత్మా దాగమనము క్షమియింపుడు!
కాంచీ రాజకుమారిక గాఢశోకతప్తురాలు
దర్శనార్థ మరుగుదెంచి ద్వారముకడ నిలుచున్నది.
అనతి యొసగుదేని యామె నాహ్వానించెద లోనికి.

మహామాత్యుడు:

ఏల చెప్పగ వైతి యీమాట తొలుదొల్త?
కాంచీకుమారి, రా గదవమ్మ లోపలికి!

ప్రతీహారి:

చేయక తప్పద పెండిలి శ్రీమద్రాజకుమారికి
ఈనాడో? కొంతకాల మెట్టులైన గడచు సెవల
ప్రభునకు కనికరము గలిగి పట్టుదల త్యజించు నేమొ!

మహామాత్యుడు:

ఉత్కళేశ్వరుడు తా నొసగి యానతి తొలుత
అన్యథా చేసినా అవల వెన్నడు గాని!
కనికరమ్మె జనింప కారణం బినాడు
కలిగినా ఆకస్మికమ్ముగా నదేని!

ప్రతీహారి:

కాలము గడచిన కొలదిని కరగవచ్చు ప్రభునిమనసు;
దగ్గరవ మెలసగిన పిమ్మట దయాసైతము కలుగవచ్చు
వనమున నైనగాని, దయ చూపుట నైనగాని
ఇలీ ధవులు సమర్థులు!

మహామాత్యుడు:

పురుషోత్తమదేవ మహాభూమిపతి యాజ్ఞాతీయ
చండశాసనుండు! దానికి జనులకు సుగ్రీవాజ్ఞయే!
కాంచీనాయకులు తిరస్కారము సూచించినార
లస్మత్ప్రభునకు: కావున ఆగ్రహించినాము లేము.

గోపాంబిక:

ఒకమాట మాత్రాన ఉత్కలేశ్వరుడింత
కాఠిన్య మూనదగునా — ఎంతైన
శౌర్య మిట్టిది కంటిమా?
మాట అన్నందుకే మా రాజ్యము జయించి
సాధించి వచ్చెగాదా!— ఇకనైన
శపథమ్ము విడువ రాదా?
మా తండ్రి తన కేమొ మాట అన్నాడనుచు
నను బట్టుకొని వచ్చునా!— ఇది మీరు
న్యాయ మనుకో వచ్చునా!

మహామాత్యుడు:

ప్రభువు కఠినుడు కాడు, పరమ కారుణికుండు
సరసుండు, శరణన్న శత్రువున్ క్షమియించు
చండశాసను డయ్యె, శత్రుభీకరు డయ్యె!
మనుజనాయకు లెల్ల మాటపట్టింపుచే
ఎంత కెంతలో చేతు; రిది క్షత్రియులరీతి.
ఉత్తమక్షత్రియుం డుత్కలేశ్వరుడు నీ
మీది ప్రేముడి చేత మీ తండ్రి వర్జింప,
[illegible]

నిను సమర్పించి పాణిగ్రహణోత్సవం
బొంకింప వలె ననుట యుక్తమా నా కౌనరి?
నీతండ్రి అటు చేయునేర కుతర్కాలచేత
తృప్తి యుండే డైన సమ్రాజ్ఞకుం డనియు
తనకులమున స్వార్థ్య మని తనయ నీయ నలుగు
ఉపహాసనము సేయుట యుచితంబన వేలరి?

రూపాంబిక :

సమ్రాజ్ఞకుం డంట చాలదోషమె! కాన
అన్నమాటకు ఫలం బనుభవించెదు కాద
మాతండ్రి!
జనకుమాటకు తనూజాత నిటు శిక్షింప,
మీవంటి సజ్జనుల్ మెచ్చుకో దగినదా
పెల విందు!

మహామాత్యుడు :

పితరుల మాటకు బిడ్డలు బానలు
వకుదురు తల్లీ! ప్రపంచకములో.
అందులకే మాయవనీధవు డౌను
సమ్రాజ్ఞకునకు జాయ వగుదు వని.
ఇది న్యాయం బని యెల్లుండుము! మరి
జనపతి మాత్రియు చండశాసనుడు!

రూపాంబిక:

తనయెడ భక్తియు తాత్పర్యము గల
అబలమీద నా అగ్రహ మూనుట!
నిజముగ నాపై స్నేహ మీ మాదిరి

ఉత్కలేశ్వరున కున్న పక్షమున,
కైవస మగు మా కాంచీపురిలో
పెండ్లి యాడదా పృథివీపతి యను?

మహామాత్యుడు :

ఉండెను తల్లీ, ఉత్కలేశునకు
నీయెడ ప్రేమము నిండుగ నాఁడే.
సౌందర్యంబును సద్గుణవర్తన
మాలకించి రే డనురక్తుం డయి
నిన్ను గూర్చియే నిరతము నాతో
సంభాషించెను చాలదినంబులు.

రూపాంబిక:

అంతప్రేమ యంతలోనె అంతరించిపోయె నెట్లు!
అనురాగముకన్న నృపతి కభిమానమె ముఖ్యమాయె.

ప్రతీహారి:

ప్రభుపాదంబులపై బడి ప్రార్థించిన లాభ మేమి
మనసు కరగదా ఱేనికి మగువదీనవాక్కు విన్న?

రూపాంబిక:

కనికరమున నృపతి నన్ను కన్యగా విడుచుసేని
ఏకామ్రేశ్వరు గొల్చుచు నీజన్మము గడపుదాన!

మహామాత్యుడు :

త్వరలో అన్నాడు గాని తప్పడు రాజాజ్ఞ తల్లి!
నీ వెఱుగవు రేఁ డెంతటి నిర్బంధుఁడో మాటపట్టు.

రూపాంబిక:

కన్యగా జన్మమ్ము గడప వీలే లేదా?
నమ్రరక్షకున కేను జాయ కావలయునా!
అక్కటకటా! ఎంతయన్యాయ మన్యాయము!
మాతృమాత్యకుకూడ ఆయుధమూ లేదాయె!
కంచి కామాక్షమ్మ కరుణించవా నన్ను!
ఏకామ్రనాథునకు నేమి దయ కలుగదా!
కైలాసనాథునకు కారుణ్యమే లేద!
కాంచీకుమారి కీగతి పట్టవలసినద!

మహామాత్యుడు:

ఏడ్వ కమ్మా! ఇప్పు డేమి చేయుదు నేను?
దుఃఖ మెరుగుదు, నాకు దుహిత లున్నా రమ్మ!
ప్రభు వుంచినాడు నీ పరిణయము కావించ
ప్రబల భారమ్ము నాపైన రాజకుమారి!

రూపాంబిక:

ఈయాపదనుండి నన్ను నెట్టులైన రక్షింపుడు
తండ్రి, ఈ దీనను మీతనయనుగా భావింపుడు!
ప్రణమిల్లితి తావకీన పాదాంభోరుహములపై
అభయ మిచ్చువరకు తండ్రి, అడుగులు విడువంజాలను!
ప్రాణమానభంగపు లక్షలప్రశ్నలు మీకరగతములు!
కవికర ముదయించిన నను కాపాడుట సుకరం బగు!
ఆలోచన చేయునెడల ఆపద తప్పించుటకై
మహామంత్రులైన మీకు మార్గము దొరకక పోవునె?
దుర్గతి యాదృష్టవశమున లొంగిపోవునని లేక

ఆమరణము మీ కృతజ్ఞురాలనుగా నుందు తండ్రి!
రక్షింపుడు, రక్షింపుడు, రాజకుమారిక యొకతె
సమ్మార్జకునకు ఆరోగ్యా! బాగుగ జీవింపగలదు!

మహామాత్యుడు :

ఏడువకమ్మా! ఏడువకు!
పెద్దభారమే పెట్టితి వమ్మా!
కాని చూతము కాగల దేదో.
ఉర్వీపతి పురుషోత్తమ దేవుడు
కఠిన మానవుడు కాడు కుమారీ!
అది ధైర్యంబున కాధారం బగు.

*

దుస్సాధమే యైన తోచుచున్నది యొకటి,
నీకు ద్వేషము లేదు నృపతియెడ నంతటను.
త్రికాలములోని శ్రీమజ్జగన్నాథు
కారుణ్యమున నీకు కల్యాణ మగుగాక!

ద్వితీయ రంగము

పురుషోత్తమదేవ మహారాజు జగన్నాథాలయమ్ములో సువర్ణసమ్మార్జనితో నూడ్చుచుండును.

మహామాత్యుడు:

మహాప్రభూ, జయము జయము!

మహారాజు:

మహామాత్యా, వందనంబు!

మహామాత్యుడు:

స్వామిసేవయందు ప్రభువు చాల మగ్నులైనవారు.

మహారాజు:

ఎల్లవారు సేవకులే యీమహాప్రభునియెడల!
గౌడకో కళింగమునకో కోంచికో కుంతలమునకో
స్వల్పభాగములకు ప్రభులు చాలమంది కలరు. కాని
సర్వలోకములకు ప్రభువు జగన్నాథ దేవుడొక్కడే!

మహామాత్యుడు:

తమకు గల్గుభావ మితరధరణీపతుల కుండునేని
ఈలోకము స్వర్గముగా ఎన్నండో మారియుండును.

మహారాజు:

స్వామిసేవలోన నెంతో సౌఖ్యమున్న, దీధరణీ
పాలనమ్ముకలన నాకు ప్రతినిధినమ్మ జగన్నాథ
దేవ కైంకర్యమునకు తెరపి లేదు మహామాత్యా!

మహామాత్యుడు :

నడచు ధర్మదేవత తన నాలుగుపాదాలతోడ
ఈయుత్కళరాష్ట్రమందు నేలికగా నుండ తమరు!

మహారాజు:

పరశురామాది మహాబ్రాహ్మణవీరులు పూర్వము
పృథ్విని రొల్ల గెలిచి, మట్టిపెల్లవోలె, నిర్మములై
దాన మిచ్చి ముదముతోడ తపమునకై వెడలినారు.
ఈకలికాలప్రభావ మేమి చెప్ప! నిందుకంత
మహి నేలెడి రాజా లెంతో మహించి వర్తింతు రవుర!

మహామాత్యుడు :

కావుననే రాజన్యులు కావలె ధరణీకాంతులు.

మహారాజు:

ఏడాదికి నొక్కనాడు ఈనీలాద్రి తీర్థ
ప్రభు జగన్నాథాలయ ప్రాంగణపవిత్రభూమిని
గొప్పలజ్జగించి యున్నికులముల నారధికర్త్రి—
సర్వమును జగన్నాథ మున్న పరసన్మూర్తి కనుగుణముగ—
ప్రసాదంబు స్వీకరించి పవిత్రు లగుచున్నవారు!
ఎంత పూతవాసరంబు! ఎంత శుభదవాసరంబు!

మహామాత్యుడు :

శ్రీమజ్జగన్నాథ సేవానురక్తులౌ
దేవరవారి కీదివ్యప్రదేశాన
క్రొత్త కానుక నొసగ గొనివచ్చియున్నాను.
భూసురాశీర్వాద పూర్వకంబుగ దేవ!
శ్రీసన్నిధానాన స్వీకరింపగ వలయు.

మహారాజు:

మా వృద్ధి కాంక్షించు మంత్రివర్యులు మీరు
బ్రాహ్మణోత్తములు, మీ పల్కు లాదరముతో
శిరసా వహించి నే స్వీకరించితి కాన్క!

మహామాత్యుడు:

[నర్తకిచే సమీపించిన రూపాంబికను నిర్దేశించుచును.
ఆమె మేలిముసుగు తొలగించి వినత యగును.]

తమయెడ భక్తి తాత్పర్యముల్ కలిగి
రాణికి నుచిత వరారమణీయ సకల
శుభలక్షణాలతో శోభిలు కన్య
నాదరింపుం డుత్కలావనీరమణ!

మహారాజు:

కనకపుబొమ్మయో కానుక యనుచు
భావింపనైతిని: ప్రియమదంబు! కాని
ఇంచుక వివరింపు డెవ్వ రీకన్య?

మహామాత్యుడు:

కాంచీకుమారి యీ కన్యాలలామ
ముత్కలేశ్వర సేవనోదిత్త హృదయ.

మహారాజు:

కనుకనే మా యాజ్ఞప్తికి విపరీతముగా మీరలు
చేయదలచినారు: మిగుల చిత్రముగా నున్న దార్య!
ఈమెను సమ్రాజ్ఞగ నిచ్చి వివాహము చేయగ
వెనుక సాక్షి గొనుగగినాము: విస్మరించినారో కాని?

మహామాత్యుడు :

మహాప్రభూ, తమయానతి మరవగ నెవ్వారితరము!
ప్రభువాక్య మ్మక్షరశః పాలింపగ వచ్చినాను.
ఆడినవాక్యము లేనా డధిపశ్రేష్ఠులు తప్పరు.

మహారాజు :

అధిపతి యిచ్చినయానతి నన్యథా చేయరాదు.

మహామాత్యుడు:

చిత్తము! కావున దేవర స్వీకరించి శీరవలయు
కాంచీరాజకుమారిని, కాపాడుకొన ప్రతిజ్ఞ!
స్వర్ణదండమండితీ మహాసమ్మార్జనితో దేవర
స్వామియూడిగంబు సేయు సమయము కాదా యియ్యెడ?

మహారాజు:

[చేతులు జోడించి చిరునగవుతో]
మహనీయము భూదేవామాత్యబుద్ధి కౌశలమ్ము!

మహామాత్యుడు :

మహాప్రభువు సరసహృదియె
మహనీయము! మహనీయము!

మహారాజు :

కాంచీరాజకుమారిని గౌరవమ్ముతో సువర్ణ
పల్లకీక గొనిపోవుడు ప్రాసాదమునకు వేగమె.

[ప్రజల హర్షధ్వనులు]

మహామాత్యుడు:

శ్రీ పురుషోత్తమ దేవ
క్షితిపాలాగ్రణికి జయము!

[చేతులు జోడించి]

జగన్నాథ మహాస్వామికి
జయము, జయము, జయము, జయము!

[హర్షధ్వానములు]

౧౯౩౮

సౌందర్యోపాసి

శ్రీకృత్తివాస తీర్థులు

[౧]

[బౌద్ధమైత్రేయ ఆరామవిశాలాంగణంలో బౌద్ధసంఘము రాత్రి పదిగంటలు కొడతారు. సంఘ ద్వారం దగ్గర పారిపోతున్న యువకభిక్షువును వహారా వాడూ పట్టుకోబోతాడు. వెన్నెల్లో నిలబడి, చిరునవ్వు ముఖంలో ఉట్టిపడ, వహారావాడితో భిక్షు ప్రసంగం చేస్తాడు. భిక్షు సన్యాసముగా పొడవుగా పచ్చగా ఉంటాడు: స్ఫురద్రూపి.]

వహారా: ఎక్కడికి పోతున్నావు? భిక్షూ

భిక్షు: ఎక్కడికి పోతే నేమి?

వహారా: ఈ రాత్రివేళ మనం నవలి నగరంలోకి వెళ్ళకూడదు. ఆ వృత్తి చేసేపని సంఘధర్మాలకు, వినయానికి విరుద్ధం.

భిక్షు: ఈ వినయధర్మాలవల్ల నా జీవితాలు ఎండిపోయిన బెండుముక్కలై పోతున్నాయి. చివరకు సంఘద్వారం దగ్గర వహారావారుకూడా ధర్మమే ప్రబోధం చెయ్యడం ఆశ్చర్యం!

వహారా: ధర్మంగ కాదూ మన జీవనసారం!

భిక్షు: ఆ మాట చెప్పకు. ఆహో రాత్రాలు 'అభిధమ్మం' చేత్తో పుచ్చుకుని తదేక దీక్షతో 'తథాగతుణ్ణి' ధ్యానిస్తో కూర్చొనేను.

వహారా: ధర్మంమీద ఏమిటీ తిరుగుబాటు?

భిక్షు: అవును. అసహజంగా వున్న ధర్మంమీద తిరుగుబాటే. ఇనుప పెట్టెవంటి మఠంలో జీవితం శుష్కింపచేసుకొని, హృదయాన్ని తుంచి వేస్తున్న నేను.

పహారా: మఠాధిపతి ఎన్నిసార్లు చెప్పినా పెడచెవిని పెడతావు. ఎప్పుడూ చేతులో కుంచెలు, గైరికాది ధాతువులు, వర్ణికలూ వదిలెయ్య మంటే వదలిపెట్టవు గద.

భిక్షు: రంగులూ రూపం వదిలెయ్యను. ప్రాణాలయినా తృణప్రాయం. చేతులో కుంచెలు, వర్ణికలు వదలను. మొన్న అభిధమ్మ పిటకం తిరగేస్తూ తలనొప్పి వచ్చి ఖాళీ వున్నచోట్ల అందమైన బొమ్మలు గీశాను.

పహారా: శాంతం పాపం. శాంతం పాపం. ధర్మగ్రంథంలో చిత్రాలు చిత్రించడం పరమదూష్యం భిక్షూ!

భిక్షు: ఆకాశంలో మెరిసే రంగులూ రేఖలూ, దివ్య తూలికాకూడా దూష్యమే. చేతనయితే ఆకాశంలో చిత్రవర్ణాలు చెరిపివెయ్యి.

పహారా: అంతా కర్మ. మఠాయతనంలో చిత్రకారుడు చేరడంవల్ల ఇంతవిప్లవం వచ్చింది.

భిక్షు: మా జీవితం తిరుగుబాటే. అంధకారమయం ఈ మఠాయతనం. సాలిగూళ్ళు బాగా పెనవేసుకొన్నాయి. వెలుగంటే భరించలేదు. బూజుపట్టి వెలుతురులేని సాలిగూళ్ళల్లో మా చిత్రకారుల జీవితాలు ధూళిపాలు చెయ్యలేం! చెయ్యలేం! బలమైనసమ్మెటపోటులతో బాధాలు కొట్టి పారేస్తాం. స్వేచ్ఛ మా ప్రాణవాయువు. అలంకారం, అందం మాకు ప్రాణాలు.

పహారా: నీ మాటలు ధర్మగ్రంథాల్లో గోచరం కావు.

భిక్షు: మీకు సహజమైన నేత్రాలు లేవు: గ్రంథచక్షువులు. ఎండిపోయిన శరీరం. ఎముకలపోగులు, చీకట్లు, శూన్యం— ఇవి మీతల్ల కెక్కవి! అబ్బ ఈ మఠంలో కూర్చోలేను. నగరంలో రమణీయ ప్రాసాదోపవనాలు తిలకించాలి. నీలాకాశంలో తారలు చూడాలి. మల్లెపువ్వుల్లాంటి సొగసైన ఘాటయిన వెన్నెల అనుభవించ నియ్యరు. పన్నీటి తుషారంలా మిన్నేటితుంపురుల్లా చల్లదనం ఇచ్చే ఈ పాలవెన్నెల

మా ఆయతనంలోకి ప్రసరించనీయరు. కిటికీలు అసలే లేవు.

విహారా: ఎన్నాళ్ళుంటుంది వెన్నెల? మన జీవితాలు జగచ్చక్రంలో ఆకులు.

భిక్షు: అంతా క్షణికం. అందుకే బతికినంత కాలం అభిరుచి, ఆదర్శం పోగొట్టుకొని నీరసంగా బతకలేను. శూన్యనీరస ధర్మ ఝంఝామారుతంలో నా జీవనం జీర్ణపత్రం కాకుండా చూసుకుంటాను.

విహారా: అంత నీరసమా ధర్మం? మన బతుకు జీర్ణపత్రమా?

భిక్షు: వసంతశోభ ఉన్నంతవరకూ యౌవనం సుందరం. వసంతశ్రీలు, కోకిలల కోలాహలం తరిగిపోయి శీతువు వచ్చినా భావనలో వసంతం, యౌవన సౌందర్యం హత్తుకునే ఉంటాయి. మన మనస్సు ఆకాశంలాగ మహోజ్జ్వలమై చిత్రవర్ణ శబలితమై ఇంద్రధనస్సులాగ, నీహారంలో తడిసిన గులాబీవంటి ఉషస్సౌందర్యంతో ఉంటుంది నన్ను వదిలెయ్యి వెళ్ళిపోతాను.

విహారా: భిక్షు నేనూ నీలాగే యౌవనమదంలో వొళ్ళు తెలియక స్వేచ్ఛాజీవినై సమస్త ఘనా మణిపంక్తిలో వాలతూ పతంగం అయ్యేవాణ్ణి. నా శరీరం మిసమిసలాడుతూ పచ్చదబ్బపండులా మెరిసిపోయేది. దేహం యవ్వనశిల్పంలా ఉండేది. వినయధర్మాలు కఠినం. విధి లేక సంఘనర్మ పరశుధారకు మేకపిల్లనై తలవొంచాను. మతిగ్రంథం బూజు దులిపి చేత్తో పుచ్చుకునేసరికి, మనస్సు పాదరసంలాగ తారుణ్యం వైపు తరలిపోయేది. కళ్ళాలు తెంచుకొని గుర్రంలా పరిగెత్తేది. రూపకల్పనలో మునిసిపోయేది. కఠోర సాధనకు లొంగిపోయాక ఇప్పుడు కష్టమనిపించదు.

భిక్షు: కత్తి అంచులమీద నడవడం ఘోరం, బాధాకరం!

విహారా: బాధ లేదు. నాకు పుష్పవరాగం, వీథుల్లో ధూళి సమానం.

భిక్షు: ఎంత నీరసం!

విహారా: ఇంత చిత్రకారుడివి భావుకుడివి ఎందుకొచ్చావిక్కడికి?

భిక్షు: అర్థం లేనివాళ్ళు ఏం చేస్తాం! పొట్ట చేత్తో పట్టుకు తిరగక?

ఈనలందాల్లో శిశిరంలో మంచులో తడిసి వణికి, ఆకలితో తిరిగాను—ఎవ
డయినా కుంచెల కయినా పైసా ఇస్తాడేమో నని.

పహారా: ధనంతో వచ్చిన మర్యాదవల్ల, పొగరువల్లనో పాపకృత్యం చేస్తారా మదాంధులు? అయ్యో, ప్రపంచసరళి ఎరగని అమాయకుడవు.

భిక్షు: తిండి లేక ఆదర్శం అభిరుచి చంపుకో లేక తిరిగాను. వాడ వాడల బిచ్చగాడిలా తిరిగాను. నాకు ఎవరూ వినరు.

పహారా: ఎలా వొచ్చావు మహోత్సవంలోకి?

భిక్షు: మాపిన్ని బలవంతంగా చేర్పించింది. ఇక్కడ ఉంటే శరీరం నిలుస్తుంది, రుచిని వ్యక్తీకరించగల్గుతానని ఆశ పడ్డాను.

పహారా: నీదృష్టి మారిపోతే బాగుపడే వాడవు.

భిక్షు: బాగుపడడానికే వెళ్ళిపోతున్నాను.

పహారా: దృష్టిని అంతర్వాహిని చేసి 'తథాగతుడి' వైపు మరల్చు.

భిక్షు: ఉత్తమ చిత్రకారుల దృష్టి అంతర్ముఖం కాక మరేమిటి? అందుకే అఖండసౌందర్యం ఉపాసిస్తున్నాను.

పహారా: అయితే ఆడవాళ్ళ అనురాగాన్ని నిరాకరించడం ఎందుకు?

భిక్షు: స్త్రీ మాట తల పెట్టకూడదా?

పహారా: కూడదు. కోరిక తీర్చి తెస్తుంది, జగత్తు నిత్యమనే నూతన భ్రాంతి కల్పించి తిప్పుతుంది. అందుకే తథాగతుడు ప్రకృతికి దూరంగా ఉండమన్నాడు.

భిక్షు: స్త్రీ జగదంబ. ఇదన్నా తెలుసుకో. యువకయువతీ భిక్షుణీగణం వినయ శాసనాలవల్ల సంసారం నిస్సారం చేసుకుంటున్నారు.

పహారా: నిస్సారం! చెరుకుపిప్పి కాక మరేమిటి?

భిక్షు: పిచ్చివంటిబుద్ధి, నీరస మైన మనస్సు సారం ఏలా గ్రహిస్తుంది? అంతా పాడయిపోతున్నారు మఠాల్లో. వదిలెయ్యి, వెళ్ళిపోతాను

(టకటక పావుకోళ్ళ చప్పుడు వినవస్తుంది.)

[౨]

[మఠాయతనంలో గది. సంఘాధ్యక్షుని కాళ్ళచప్పుడు విని ఏడుపు ముఖంతో ధమ్మపదం తిరగ వేస్తూ ఉంటాడు భిక్షు. ప్రవేశం మఠాధిపతి.]

అధిపతి: భిక్షూ? ఏమిటా పుస్తకం?

భిక్షు: చిత్తం చిత్తం...ధర్మపదం.

అధిపతి: కొంప తీసి ప్రాకృత శృంగార గాథలు కావు గదా? (పుస్తకం తిరగేస్తూ) ధమ్మపదంనిండా ఈ సుందరాకృతు లెందుకు? ఏమిటీ శిల్పం? ఎందుకీ హస్త విన్యాసాలు? అబ్బబ్బ! నమోబుద్ధాయ! ఎక్కడ చూచినా అవయవస్ఫూర్తి, యౌవనశ్రీలు, అందం! ఛీ చచ్చుదేహం చిత్రిస్తున్నావా? (విసుగుదల, కోపం.)

భిక్షు: మనస్సు సరిలేనప్పుడు బొమ్మలు గీశాను.

అధిపతి: తథాగతుణ్ణి ధ్యానం చెయ్యి. ఎందుకు సరిగా వుండదు? ఈ సమయం చైత్యారాధనకి రాక ఈ పాడుపని చేస్తూ కూర్చున్నావా?

భిక్షు: (చేతులు నలుపుకుంటూ)... అవును స్వామీ!

అధిపతి: నీకు ఎన్నిసార్లు చెప్పాను? పాలిలో వున్న గ్రంథాలు చదవమని.

భిక్షు: చిత్తం.

అధిపతి: అస్తమానం పాళిబడి గ్రంథం చదువుతావు. ఎందుకీ గాథలు? అసలు మఠాయతనంలో సౌందర్య మీమాంస పనికి రాదు. పరమ నాస్తికుడివి!

భిక్షు: (ధైర్యంతో) పరమాస్తికుణ్ణి—జీవితంలో రుచి చంపుకోలేను.

అధిపతి: ఆత్మోన్నతి ధర్మం అక్కర్లేదూ?

భిక్షు: ఆత్మోన్నతి పెంచేదే అందమైన శిల్పం వస్తుంది, శరీరం తిట్టిపోశారు. తిట్టిపోస్తున్న మీరే శరీరం ధరిస్తున్నారు!

అధిపతి: దానికీ నాకూ సంబంధం లేదు. నువ్వు ఎవరో తెలుసుకో.

భిక్షు: తెలుసుకొన్నాక?

అధిపతి: అప్పుడు నీకు కుంచెలు తెప్పించి ఇస్తాను. గైరిక ధాతువులిస్తాను.

భిక్షు: అమ్మయ్యా! నా కోరిక ఫలించింది.

అధిపతి: మళ్ళీ కోరిక అనకు - అదే దుఃఖానికి మూలం. కోరికలు రెచ్చగొట్టే చిత్రాలు గీయకు.

భిక్షు: అంటే ఎలాంటి బొమ్మలు స్వామీ?

అధిపతి: శరీరం లేనివీ రూపం లేనివీ!

భిక్షు: దయ్యాలూ భూతాలూ

అధిపతి: ముసలి మృతక వాళ్ళను, కాటికి కాళ్ళు సాచిన వాళ్ళను, వర్ణించడం శ్రేష్ఠం.

భిక్షు: ముసలి మృతక వాళ్ళకు శరీరం ఉండదూ?

అధిపతి: సౌష్ఠవం లేని శరీరం కనక చిత్రించవచ్చును. రోగుల్ని దగ్గరికి రానీయకు. అలాంటి చిత్రాలు గీయాలి.

భిక్షు: ఈ మాటలన్నీ బొమ్మలుగిస్తా. మనుషులో సన్యాసులు వొట్టి బొమ్మలు, నీకు మాకు తెలుసు ఎవరైనా కథానుగతికంగా వచ్చే బూజు పట్టిన పాతపుంతలో, వెనక పుట్టలో నడుస్తారు.

అధిపతి: అనవసరం ప్రసంగం నిలుపు.

భిక్షు: ప్రసంగం కట్టిపెడతా గాని నాకు కుంచెలు ఎప్పుడిస్తారో. ఆసి తహతహలాడి పోతున్నాను. అప్పుడే నారక్తంలో సుకుమారమయిన భావాలు పారాడుతున్నాయి. అందమయిన మంచుతెరతో ఇంద్ర ధనుర్వర్ణాలు నాకళ్ళను మోపుతుంది ప్రకృతి. నాభావనలు వింతవింత స్వప్నాలు అల్లుతున్నవి. మనస్సే తూలికగా మారి చిత్రరచన చేస్తున్నది. ఆహా!"

అధిపతి: చాలు చాలు నీ ప్రలాపన! కట్టిపెట్టు వెర్రిమొర్రి కబుర్లు! నేను చెప్పినట్టు చిత్రాలు చిత్రించడం తెలిసిందా?

భిక్షు: మానసిక భావాల్లో నడుస్తున్నారా బొమ్మలు?

అధిపతి: ఛస్! గోడలమీద వెయ్యాలి. చైత్యవందనం చేసేచోట గోడ మీద చిత్రించాలి.

భిక్షు: చిత్తం స్వామీ. (నిష్క్రమణ)

[3]

[ఉదయం చైత్యవందనం చేసేచోట, బౌద్ధ భిక్షు భిక్షుణీ గణం కిటకిటలాడుతూ ఉంటుంది. గోడమీద చిత్రాలు చూసి నివ్వెరపోతున్నారు. జనంలో కలకలం.]

ఒక బౌద్ధ భిక్షు: శాంతం పాపమ్! నమో తస్స భగవతో అరహతో సమ్మాసంబుద్ధస్స!

రెండో భిక్షు: (ధర్మపదం కళ్ళకు అడ్డుగా పెట్టుకుంటూ) అబ్బ పాడు బొమ్మలు!

అంతా: బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి (కలకలం శాంతిస్తుంది).

అధిపతి: (గంభీరంగా) భిక్షూ! ఇవేనా బొమ్మలు!

భిక్షు: చిత్తం!

అధిపతి: మహాభినిష్క్రమణ, ధర్మచక్రం, మహాబోధి, ఏవీ కనపడవే!

భిక్షు: సమస్త లావణ్య ప్రకృతినీ సృజించాను.

అధిపతి: ఘోరం! సంఘం కలుషిత మయింది! (కేకలు) ఏం మాట్లాడవేం భిక్షూ?

భిక్షు: రమణీయ ప్రకృతి!

అధిపతి: కౌటుక కన్నులనుండి వచ్చే వాలుచూపుల తోరణాలు, పండు తమలపాకుల్లాంటి పాదాలమీద జీరాడే సరిగంచులసొగసు, నీలిసరస్సు మీద చంక్రమణం చేసే చక్రవాకాలు, స్నిగ్ధధమ్మిల్లం, —అమ్మబాబోయ్

ఖండాలవు సౌందర్యం! ఇటువంటి చిత్రాలే! ఇప్పు ఎక్కడ చూసినా
త్రీం త్రీం.

తక్కినవారు: ఆమాట ఉచ్చరించవద్దు.

భిక్షు: సర్వసృష్టి కళ ఎక్కడనుంచి వస్తున్నది?

అధిపతి: వొద్దు విచారణ.

భిక్షు: మతంలో చీకట్లు పెనవేసుకొంటున్నాయి. భిక్షు లంతా సాలిపురుగులు. మీరు సృష్టించుకొన్న చీకటిగుహల్లో మూగ పక్షులవుతారు.

అధిపతి: చాలించు!

తక్కినవారు: ఈమాటని మూసను తరిమెయ్యండి. వీడు మారువడూత!

అధిపతి: అవును నిజం. నీకు శక్తి వుంటే శూన్యాన్ని సృష్టించు.

భిక్షు: శూన్యం ఎలా వుంటుందో చెప్పండి. తర్వాత బొమ్మగీస్తాను.

అధిపతి: శూన్యమా!...అది...అది...(ఆకాశం చూస్తూ)

భిక్షు: ఇక నైనా పరికృతిచిత్రాలు దూషించకండి. సౌందర్యాన్ని తిట్టకండి. ధర్మపథంలో చరిస్తున్నామని లాంఛనం అహంకారం వదిలి పెట్టండి.

అధిపతి: గోడలన్నీ పాడుచేశావు.

భిక్షు: శూన్యరాజ్యంలో మీ చీకట్లతో దొంగధర్మం పాటించండి! మీకు వెలుతురు ఎందుకు? కిటికీలు ఎందుకు?

భిక్షులు: అక్కర్లేదు వదు. నుం దిక్కణ్ణించి! (కేకలు)

భిక్షు: వదిలేస్తున్నాను సాలిగూళ్ళు! వదిలేస్తున్నాను బొమ్మరిళ్ళు

(నిష్క్రమణ)

గ్రీష్మ ఋతువు

శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావు

[పెద్ద [illegible] ఉక్కిరిబిక్కిరి పక్షి, [illegible] రాగం [illegible] సాగు తూంటుంది. గాలి [illegible] దలోనే మెల్ల మెల్లగా [illegible] సందోహం,—'అబ్బా, అబ్బా, [illegible] యి'—'దాహం దాహం దాహము,' 'తల మాడిపోతోంది,' 'ఒళ్ళు కాలిపోతోంది' అని యీ విధంగా—పాంథ జనులు—[illegible] టూ, 'ఏం గ్రీష్మం, ఏం గ్రీష్మం' 'ఏం ఎండ ఏం ఎండ! అని [illegible] గా [illegible] స్తారు]

పాటగాని ఒక జట్టు:

బృందగీతి

నడిమింట చండ రవి మండు టెండ కాచె
వడగాలులు సుడి తిరిగి హోరు మని వీచె
సడలి తరుపర్ణములు జరజర మని రాలె
వడలి సుమ ఫలాలు సొగసు చెడి పడి తూలె
కడ లంటు బ్రతుకులకు జీవరాశి రోసె
బడలి మంచెపయి తోటమాలి కను మూసె

(పాట దూరంగా పోయి సన్నగా వినబడుతూ వుంటుంది.)

చిన్నపిల్ల: బాబా, బాబా, లే. త్వరగా లే.

వృద్ధు: ఏం తల్లీ, పడుకో. చెట్టునీడ దాటి బయటికి పోకు. వొక [illegible] వడ [illegible] తూ [illegible] దింకాను. పడుకో తల్లీ!

చిన్నపిల్ల: ఈ రహదారిని వొద్దు బాబా, ఈ వేడి వెల్తుర్లో కళ్ళకి చీకటులే గాని—

వృద్ధు: నా కళ్ళ కెప్పుడూ చీకటులే గా దమ్మా. నువ్వు దూర మైతే మరీను.

పిల్ల: బాబా, బాబా, అక్క డెక్కడో తోట వుందిట. ఎంద రెందరో పాడుకుంటూ వెడుతున్నారు.

వృద్ధు: ఏరీ!

పిల్ల: ఆ మలుపులో వున్నారు, మనమూ పోదాం, లే బాబా, తోటకి.

వృద్ధు: తోటా, అమ్మో. ఎక్కడుందో! పేదవారం నిస్సత్తువాలం, పోగలమా?

పిల్ల: (వినకుండానే) తోటే బాబా. అంతా వెడుతున్నారు. తోటమాలి అని వుంటా పాట అందులో. వీ రంతా అక్కడికేట. బాబా, పోదాం, పోదాం లే, బాబా.

వృద్ధు: ఇంత యెండలో తోటమాలి, తోటమాలి—అవును. నా గురువులు చెప్పేరు—చిన్నతనంలో. నట్టనడి వేసవిలో యెప్పుడైనా ఆకలీ దాహమూ యెక్కువయి ప్రాణాలు నిలుపుకోడం కష్టమయితే తోటమాలిని కలిసికోమన్నారు. తోటమాలి — చలిది దాహా లిస్తారట. ఫలరసాలూ, పానకాలూ, అన్నీని. కనుక్కో. కనుక్కో. తోటమాలి తోటలో వున్నారో లేదో కనుక్కో తల్లీ.

పిల్ల: నడూవు మరి. (పాంధుల పాట దగ్గిరికి వస్తుంది) — అయ్యా! చూడరూ ఇలా? చెప్పరూ — తోటమాలిట — తోటలో వుంటారా?

వృద్ధు: ఎండల్లో కూడా...

పిల్ల: యెండల్లో కూడా? చెప్పరూ. వుంటారా తోటలో?

ఒక పాంధుడు: యెవరు? తోటమాలా? తోటలోనా? తోటమాలి సంగతి నీ కెందుకు?

పిల్ల: మా బాబు అడగమన్నాడు. మేం అక్కడికి వెళ్ళాలి.

పాంధుడు: మీకు దర్శన మివ్వడు పో. మేమూ ఆ సంగతే కనుక్కుందా మని వెడుతున్నాం.

మరొకడు: లాభం లేదు పో. అత నిప్పుడు మొద్దులా నిద్రిస్తూ వుంటాడు.

(జన సందోహపు ధ్వనులు వస్తూ పోతూ వుంటాయి. వుం డుండి సుడిగాలులు వీస్తూనే— జంతువులు అరుస్తూనే వుంటాయి)

పిల్ల: బాబా, (వెక్కి వెక్కి ఏడ్చే ప్రయత్నం.)

వృద్ధు: రా, అ దేవిటి? ఏదీ చెయ్యి. మనకి ఆసరా అమ్మా తోటమాలి— ఏ మన్నారు?

పిల్ల: తోటమాలి — బాబా — మొద్దుట — దర్శన మివ్వ డుట మనకి.

వృద్ధు: వట్టి దమ్మా వట్టిది. వారు చెప్పింది జ్ఞానం లేని మాటం. గురువుల వుపదేశం లేదు వారికి. నా గురువులు తప్పు చెప్పరు. నాకు విశ్వాసం వుంది, పద. నన్ను తీసుక వెళ్ళు తల్లీ.

పాంధులి రెండో జట్టు:

దరిద్రాను తాపం బుభుక్షా ప్రకోపం
సదా శుష్ప్రకోపం మహా తీవ్ర తాపం
నిరాశాత్త స్వాపం మృతోద్ధూత రూపం
చ్యుతోద్యానదీపం వృథా దీనపాపం.

వృద్ధు: (కర్ర నేలని కొడుతూ) అయ్యా, అయ్యా, వినండీ. తోటమాలిని గురించీ...

పాంధు: తోటమాలి యెవడు? యెవడు వాడు? యెక్కడు న్నాడు? ఇవేమీ అక్కర్లేదు మాకు. మేం దరిద్రపు క్లేశం, ఆకలిమంటా వేసవి గాడ్పు తీవ్రతా అధికార మత్తుల నిరంకుశత్వం — ఇవేమీ సహించలేం.

వృద్ధు: అయ్యా, తోటమాలి కూడా సహించలే డుట. మా గురువులు

చెప్పేరు. దాహం అంటీ మిక్కుటమైతే వేసంగుల్లో తోటమాలి దగ్గిరికి వెళ్ళి తీర...

పాంథు: తోటమాలీ లేడు, గీటమాలీ లేడు. ఎందుకు మాకీ సొద? చూడు, మాకు కొన్ని యుగాలనుంచీ నిరంతరమైన దాహం అంటీ దారిద్ర్యమూనూ. ఇవాళ తోటమాలిమీద పడి దానిని తీర్చుకో దలచాము. ఇన్ని యుగాలనుంచీ పాదులలో చెలాయించిన నిరంకుశత్వం ఇంతటితో సరి అనుకో...

(తప్పెట్లో ఆసేకలు, గోలగా చప్పుడూ, గుర్రపు డెక్కలూ, బండి చక్రాలు నడిచిపోతున్న శబ్దాలూ.)

బండిలో ఒక యువతి: చక్కగా వుందీ, ఈ జనమంతా మన తోట విందుకులాగే వుందే. పిల్లలంతా తోటలోకి వస్తే తోట అగుపడ రాని

బండిలో పెద్దమనిషి: ఏమనా దోగా. తోటమాలి, అదమాయిస్తానులే.

(దగ్గిరాల చప్పుడూ)

పాంథుడు: అదుగో ... , పోనివ్వకుండా వాళ్ళని లక్ష్యం చెయ్యం. ఇవాళ తోటమీద పడి తీరతాం.

పిల్ల: బాబా, తోటమాలి వున్నాడా? చెప్పకుండా ... బండిలోకి

వృద్ధు: అవును రా, తల్లీ. రా.

పాంథులు: దరిద్రాన్నతాపం బుభుక్షాభిఘాతం,
నిదాఘ పరితాపం మహా తీవ్ర తాపం
మహోత్కృష్ట ఘనం మత్తోన్మాదఘాతం
చ్యుతోద్యానదీపం వృథా దీన పాపం.

(మళ్ళీ గాలి — కొత్త జనసంబోహపు సందడి — కలకల నవ్వులూ— గాజులూ అందెలూ.)

పాంథుల మూడో జట్టు:— ఆశావాదుల

బృందగీతి

ఎండ కారు ఎండ కారు
తోటలన్నీ పండే కారు.
వన దేవత కావి కురులా మెరసి తీగెలు కెంజివురులా
విరిసినాడీ, కమ్మతావు లూరసి, మరులు చిమ్ముత్రోవ...
తరుల నీడల వనేందిర పరచుకొనిన చలిపందిర
విరి దేనెలు ఫలరసాలు కురిపి నోరు నిండే కారు...
తెర తీసిన మావి తోట సురిగి చనెడు పికము పాట
తేటలోన మేను మరచి తోటమాలి పండే కారు...
ఎండ కారు ఎండ కారు
పంటలన్నీ పండే కారు.

వృద్ధు: తల్లీ, వీరెవరో మంచి పాట పాడుతున్నారు. తోట యింకా యెంత దూరమో అడుగు...

పిల్ల: అయ్యా, తోట యింకా యెంత దూరము?

పాంథుడు: అమ్మాయీ, అదుగో చూడు — ఆ కనబడే ద్వారబంధం... అదే తోట సింహద్వారం. చూశావా — ఊఁ. ఎంతదూరంనించి వస్తున్నావమ్మా. పాపం ఈ యెండబడి? నీకూడా ఎవరూ లేరూ?

పిల్ల: లేకేం? ఇదుగో మా బాబు. చాలా దూరంనుంచి వస్తున్నాం. చెప్పండీ. తోటమాలి చాలా మంచివాడు కదండీ? అందరికీ పానకాలూ పళ్లూ అవీ పంచుతాడని చెప్పేడు మా బాబు. ఎండగాలిగా వుందని పడుకుని నిద్రపోడు కదూ?

పాంథుడు: మనం యింతమందిగా వెడుతుంటే ఆయన పడుకోడను కుంటాను. తను పడుకున్నా సరే. మనకందరికీ పానకాలూ పళ్ళూ అందే యేర్పాటు చేసి తీరతాడు. చూడు, ఇవిగో యీ పువ్వులు తీసుకుంటావా?

వాడిపోయా రేమో.........

పిల్ల: యివ్వండి - నా కెంతో యిష్టం.

ఇంకొక పాంథుడు: ఏమోయ్, అన్నీ ఇచ్చెయ్యక, కొన్ని దాచు తోటమాలికి అందమైన పిల్ల లుండొచ్చు.

పిల్ల: తోటమాలికీ నాలాంటి పిల్ల లున్నా రాండీ? నాతో ఆడుకుంటా రాండి?

పాంథుడు: ఓ. తప్పకుండా. త్వరగా నడవండి.

[పాట]

ఎండకోరు ఎండ కారు
తోటలన్నీ పండే కారు.

నిరాశావాది: ఏయ్, ఆగండి. మీరు పాడేది సర్వం అబద్ధం. మీ కెవరికి ఈ వినాశ కాలంలో ఈ ఆశ యేమిటి? ఈ ఆనందం ఏమిటి?

ఆశావాది: పాపం, మీరు ఆనందానికి నిరాశ చేసుకున్నారు కాబోలు. ఆనంద పూర్ణ మైన ఆశాపథికులం. గ్రీష్మంలో బ్రహ్మానందం లేదూ?

నిరాశావాది: అబద్ధం. గ్రీష్మ మేమిటి? బ్రహ్మానంద మేమిటి? తప్పాడు పాటలు. లోకాలు మండిపోవటం లేదూ? నీ తలపైని నిప్పు కొండలు పగులుతున్నట్లు లేదయ్యా? ఏమిటీ యీ అసందర్భపు ఆశా, ఆనంద మూనూ?

బృందగీతి

ఈ రేదు జగాలు నోలె ఈ గ్రీష్మజ్వాలాకీల
ఈ తాపము నార్చు నేత లేదు
ఈ పాపము తీర్చు త్రాత లేదు
అనల మ్మనిలమ్ము కలసి ఆకాశము నొసట పొగలు
వనరు జీవ జంతు తతుల బ్రతుకాశల కడల రగులు.

ఈ తాపము......... ఈ పాపము.........
ప్రేమ కొరకు మరిగి మండి ప్రేలిపోయినవి యెడదలు.
తేమకొరకు సురిగి మొండి చీలిపోయినవి యేరులు
ఈ తాపము......... ఈ పాపము.........
కథలను మరపించునాటి కతలు మూగమాటలోయి
వితతౌ యెండమావులే వినిపించే పాటలోయి.
ఈరేడు జగాలు సోలె ఈ గ్రీష్మజ్వాలాకీల.

పిల్ల: బాబా, బాబా, భయ్యం... బెంగ...

వృద్ధు: తల్లీ, నన్ను పట్టుకో.

ఆశావాది: భయం లేదు. వొచ్చేశాం. తమ్ముడూ, చూడు, మీ గండరగోళమూ గాభరా చూస్తే యీ గ్రీష్మంకంటే తీక్షణంగా వుంది. అమాయికులమనస్సులే కాలుస్తోంది. పైని యెన్ని నిప్పు కొండలు పగిలినా మా హృదయాల్లో ఆ తీవ్రతకు ఆగగల మంచుకొండ లున్నాయి. మా దృష్టిలో వసంతం, హేమంతం, గ్రీష్మం అన్నీ సౌందర్య మహితాలే... ఆనంద భరితాలే...

నిరాశావాది: మిమ్మల్ని చూస్తే వింతా కోపమూ కలుగుతున్నాయి. ఇంత భయంకరమైన వాస్తవాన్ని యెలాగ కప్పి పుచ్చుతారు? ఎందుకు కప్పుతారు? మోసం, ద్రోహం కాదూ యిదీ?

ఆశావాది: మిమ్మల్ని చూస్తే మాకూ జాలి కలుగుతూంది. మనస్సులో ఎగుడు దిగుడైన భావాలవల్ల క్షణక్షణం విషమంగా, విరుద్ధంగా, వివిధంగా మారే ప్రకృతిని సమన్వయించుకో లేరు. మీ తత్వచింతా, అనుకంపా స్వార్థపూరితాలు.

నిరాశావాది: మీరు మనస్సుల్లో కల్పించుకొన్న వూహాలూ, నిర్మించుకున్న స్వర్గాలూ వాస్తవాలే? ఎంతకాలం నిలుస్తాయి?

ఆశావాది: కలకాలం. మేం స్వర్గాలు నిర్మించుక పైకి లేస్తాం. మీరు

నరకాలు కల్పించుకుని బ్రతికుండగా 'పాతాళం'లోకి కుంగదీసుకుంటారు.

పిల్ల: బాబా, బాబా, గొంతు తడి ఆరిపోయింది...అబ్బ...దాహం ... చెవులు గళ్ళు...

వృద్ధు: అయ్యో పిల్లకి వడ కొడుతూంది. తోటమాలి దగ్గరికి వెళ్ళడం యెలాగ? యెప్పటికీ? వడ కొడుతూంది నా పిల్లకి. యెవరైనా వింటున్నారా బాబూ?

ఆశావాది: కొంచెం ఓర్చండి, కొన్ని క్షణాలు తోట సింహద్వారం యిది......అహా, కొలనుమీదినుంచి చల్లగాలి అప్పుడే తిరిగింది.

ఇంకొకడు: ప్రాణాలు లేచి వచ్చాయి. ఓహో, శ్రావ్య కల కంఠాలు......

(పక్షుల కలకలం. జనుల కలకలం. వృందుండి.)

వనకన్య లేమిటి చెప్తా వాళ్ళు?......

వనకన్యలు: బృందగీతి

సంధ్యారుణిమారుచిరజ్యోతుల
సకల పాంధులకు స్వాగతము!
నందనవనివారిచందన వివృతా
నందాంగణమున స్వాగతము!
ప్రసవ సుగంధిల నీహార శీతల
పాద్య జలమ్ముల స్వాగతము!
విచికిలాక్షతా దధిమధు ఫలరస
రచితార్ఘ్యాంజలి స్వాగతము!
వసంతాంత మృదు కిసలయ తోరణ
మసృణాంగుళముల స్వాగతము!
అదళిత కదళీ శ్యామ విసృమర
చ్ఛదన శయనమ్ముల స్వాగతము!

పిల్ల: బాబా, నా కింక దాహంలేదు. వాళ్ళతో కలిసి ఆడాలనీ పాడాలనీ వుంది.

వృద్ధు: ఏ జన్మంలోనో వీరంతా మన బంధువు లమ్మా! చల్లని స్వాగత గీతంతోని తనువే కాకుండా గుండె కూడా పులకరించి పోయింది. తోటమాలి వచ్చారేమో.

నిరాశావాది: ఈ తోటమాలి పిచ్చిముఖంగాడు వీళ్ళకి! ఏయ్, అమ్మాయిలూ, తోటమాలి అంటూ వొకడున్నాడా?

వనకన్యలు: (కలకల నవ్వుతారు.)

ఒకడు: తప్పకో...

బండిలో స్త్రీ: నాన్నగారూ, తోటమాలి యింకా యేర్పాటులు చేసినట్టు కనబడదేం?

భాగ్యవంతుడు: ఆ వన కన్యలు అనని పిల్లలేమో... ఏడీ మీ తండ్రీ? మేం వచ్చామని చెప్పండి.

వనకన్యలు: [కిలకిల నవ్వుతారు.]

ఆశావాది: తమ్ముడూ, అదుగో ఆ పర్ణశాలలో వున్నాడేమో పిలిచి చూడు. అందులో పడుకుని వుంటాడని మా అనుమానం. మేలుకొలుపు పాడితే గాని మేలుకోడేమో?......

బృందగీతి

తోటమాలీ, తోటమాలీ,
ఏటి కింక లేవవు, ఈపాటికీ నీ నిద్ర తెలి
తోటమాలీ, తోటమాలీ!
పాటి రేవులో కదలక పడవ లాగిపోయినదో,
ఏటినీరు రాక తోట యెండి మాడిపోయినదో
తోటమాలీ తోటమాలీ!,
మాగిన పండ్లు కొమ్మలోన, మాగిపోయెనో తోటా

తావి జాజి పూవులన్ని రాలిపోయినో యేమో
తోటమాలీ తోటమాలీ!
వడగాలులు వీచుచుండ, ఒడలు కాలి వంగిపోవ
మనసులలోని విత్తనాలు మాసిగి విసిగి యెండిపోవ
తోటమాలీ తోటమాలీ!
యేటి కింక లేవవు, ఈపాటికి నీ నిద్ర తేర్చు
తోటమాలీ, తోటమాలీ!

ఆశావాదులు: మనమూ పిలుద్దాము. తప్పకుండా వస్తాడని ఆశిస్తున్నాను.

బృందగీతి

ఓసారి లెమ్మో ఓ తోటమాలి
హాసమ్ము చిందు వదనమ్ముతోడ
ఓ తోటమాలి ఓసరిలి లెమ్మో లెమ్మో.... .
వేసంగి నలగి వేగునే ప్రాణి తతులు
ఈసారి లేచి ఈక్షింపు జీవగతులు
ఆశాళ నందుకొను మోయి లోకనతులు
ఓసారి లెమ్మో............
వేసంగి క్రాగి వీగి భువి రిత్తవోయె
వాసంత జీవనపు హాయి నెత్తువేని
బ్రదుకెల్ల మధుమయమ్మొందు మెత్తు మోయి
ఓసారి లెమ్మో............

వృద్ధు: తల్లీ, వచ్చాడా, తోటమాలి?

(జన సందోహం అంతా విడివిడిగా వొక్కొక్కరుగా తోటమాలి, తోటమాలి - పెద్దగాలి కెరటం, చల్లని సంగీతం.)

పిల్ల: బాబా, వర్షశాల తలుపులు కదుల్తున్నాయి.
వృద్ధు: తల్లీ, తల్లీ, నన్ను పట్టుకో. గట్టిగా పట్టుకో.
(జన సందోహం — విడిగా వొకొక్కరుగా మొదలుపెట్టి గోలగా కలిసిపోయి, 'తోటమాలి — తోటమాలి.' అంటారు అంతా)
కవి: (వర్షశాలలోనుండి బయలుపడి)

బృందగీతి

తోటమాలి జోలె నీ కెందుకు ?
తోటలో తేనె తేటలో తీయు పాటలో మునిగి తేలక
వనములో పక్షి జనములో సుధాసవనములో మునిగి తేలక
తోటమాలి జోలె నీ కెందుకు?
తోటమాలి నిద్రింపనూ లేడు.
తోటమాలి మేలుకోనూ లేడు
నీదు పూవ్వులో నాదు పూవ్వులో
నీ పాటల నా పాటల మాటల
పెరుగులో విరుగులో తరుగులోన
పరుగువారు కనబడని తెఱవకా
తోటమాలి జోలె నీ కెందుకు?

నిరాశావాది: ఇతను తోటమాలి కాడు.
ద్వితీయ పాంథుడు: ఇతను తోటమాలి కాడు.
అందరూ: ఇతను తోటమాలి కాడు
ఆశావాది: ఈయన కవి.
పిల్ల: బాబా, ఈయన కవిట.
అంతా: ఈయన కవి.
కవి: అవును నేను కవినే. మీ కందరికీ వినోద విలాసాల కల్ల అమే

యమైన బ్రహ్మానందం కలిగించడానికి ఈ సమావేశాన్ని పన్నింది నేనే. మన కెవ్వాడూ ఆశాభంగం లేదనుకుని క్షమించండి.

విరి చెలువలార, నవమాధవీ నికుంజ
మందు కలయంపి గా తేనియలను చిల్కు
గంధవాహు లల్కు పైడి సింగంపు పీట
లం దతిథివర్యు లెల్లరు నధివసింప
పజ్జ గొజ్జంగి చలువ వీవనలు గొనుడు.

మొదటి సఖి: అయ్యా, అతిథులారా, దయచేయండి. అదిగో మాధవీ నికుంజం లోపలే పానీయశాల.

అందరు: చలి పందిర. చలి పందిర... [జన సందోహం.]

రెండవ సఖి: [తియ్యగా] చలిపందిర. లేవండి మరి...అంతా... అందరూ...... కదలండి...... దయచేయండి పందిట్లోకి.

మూడవ సఖి: ఆ దేమిటి వెనుకంజ వెయ్యాకు స్నేహితుడా ... జంకు లేదు.

మొదటి సఖి: మొహమాటమా? మీరూనూ, రండి రండి.

రెండవ సఖి: నడవ రేం! ఆ కనుబొమల ముడత తీసెయ్యా లయ్యా మీ రింక!

అంతా: [నవ్వుతారు.]

మొదటి సఖి: ఏయ్, అబ్బాయ్. నువ్వింక నైనా నవ్వకపోతే వొప్పుకోను సుమా......

యువకుడు: (నవ్వుతాడు. అంతా నవ్వుతారు.)

వృద్ధుడు: నా తల్లీ, నా గురువులు చెప్పిన ఆ గుణాలూ ఆ వర్ణనా అన్నీ ఈ కవీశ్వరుడిలో హత్తుకున్నాయి తల్లీ! నా గురువులు తప్పు చెప్పరు. నా కెంత సత్తువ! కొత్త జన్మ. గురువుల దయ. చలిపందిర. వేసంగిలో చలిపందిర.

అంతా: చలిపందిర, చలిపందిర.

(క్రమంగా హెచ్చిన జన సందోహం—తగ్గుతూంటే నాట్యాను
గుణంగా—గాజులా అందెలా సవ్వడులు.)

బృందగీతి

సఖీజనం: బ్రతుకెండ గాసిలిన పాంథా
ముది యెండ శోషిలిన పాంథా
బరువైన చూపు విదళించు
చిరునవ్వు పెదవి గదియించు...

పాంథులు: చలిపందిర లోపల విందు
కలలూరు నవ మధువనమునందు
మలి సంజమాంచు నునుజల్లు
గాలి కమ్మ తెమ్మెరల పెల్లు.

సఖీజనం: ఎలదేటులార లే లెండు
చెలిబోటులార రా రండు
నవ స్వర్గ మధువులను తెండు
యువ స్వర్గ గంధముల నిండు.

పాంథులు: క్రొవ్విరుల తేనె జడి ముసురు
మరువంపు గంధవోడి విసురు
చలి పందిర లోపల విందు
కల లూరు మధువనము సందు.

సఖీజనం: ఫలరసాలు నవ శీధువులు
కలరవాలు యువ మాధుకులు
అజరుండవైతి విక పాంథా
అమరుండవైతి విక పాంథా.

పాంథులు, సఖీజనం: ఇదె ఆశకై సుధా పాత్ర
ఇదె ప్రేమకై సుధా పాత్ర
ఇదె స్మరణకై సుధా పాత్ర
విస్మరణకై సుధా, పాత్ర.",
(దూరంగా పోతూ పోతూ కోయిల కూత.)

కవి: సఖీ, గ్రీష్మం ముదిరిన యీ రోజునే కోయిల వసంతం కోసం మరో దేశం పోతూంది. దానికి వీడ్కోలు చెప్పు.

సఖి: తీయమావి చివుళ్ళ మత్తిల్ల మెసవి
పాడి, తెగ పాడి, కోయిలా నేడు నీవు
సంత మలరారు వేరు ద్వీపాంతరమ్ము
చనియు వీడవు మా హృదంచలము లెపుడు.

బృందగీతి

సఖులు: చివురు గుబురుల గూటిలోనె దాగితివి
చివురు రసమును చేదుగానె త్రాగితివి
తీయ తీయగ పాడి హాయి మనిపించుటే
కాని కంటికి కానరానే లేదోయీ!
రానే రావో కోయిలా, ఇక నీవు
పోనే పోదువో కోయిలా...
దెసల యంచుల పాట తేనె కరగేనో
ముసలి మాత్రికలతోట సోలి మరిగేనో
పాయకే మా హృదయ ఫలకాల చిత్రిత
మ్మాయునే నీ పాట, కాన రావే దీవె.
రానె రావో కోయిలా, ఇక నీవు
పోనె పోదువో కోయిలా.

కవి: ఇంక భరత వాక్యం.

కనవో, ప్రతి ఋతు మధురీతి
వినవో, ఈ త్రిశాగీతి
వడలో సందడిలో ప్రశాంత
వనజనసంగతి నీ ఆశ.
జడిలో అలజడిలో మనోజ్ఞ
శంపాద్యుతగతి నీ ఆశ...
చలిలో ఆకలిలో కలిత
స్వప్న సుధాస్మృతి నీ ఆశ.
పువులోన మధువులో హసంత
కవి పిక గళరుతి నీ ఆశ......

బృంధగీతి

మెరసినవి విను వీధిలోగిట వెలుగు తేనెల పైడి గిన్నెలు
కురసినవి యీ తోట ముంగిట ననుచు మల్లెల చలువ సోనలు
ఒలసినవి యీ సంజ వాకిట మధువు లొలికిన పాట తేటలు
వెలసినవి యిలసంపు బ్రదుకుల అమృత చైతన్యంపు బాటలు
ఒరగినవి పెతలడగి యెడదలు మరపుటంచుల మెరపుపాలికి
కరగినవి తరలి మలు కన్నుల విరియు మించుల తోటమాలికి.

(ఆల్ ఇండియా రేడియో వారి అనుమతిని)

౧౯౮౧

మొక్కుబడి

శ్రీ మొక్కపాటి నరసింహ శాస్త్రి

~ పాత్రలు ~

వెంకటేశ్వర్లు	...	మంగమ్మ తండ్రి
మంగమ్మ		
డాక్టరు		
సుకుమార్	...	మంగమ్మ అల్లుడు
రాజ్యలక్ష్మి	...	మంగమ్మ కూతురు
చంద్రశేఖరం	...	ఆయుర్వేద వైద్యుడు

~ ౧ ~

[హాలులో ముసలి అంధుడు వెంకటేశ్వర్లుగారు, ఆయన కూతురు వితంతువు మంగమ్మగారూ, ఉంటారు. పక్కగదిలోనుంచి మూలుగు వినబడుతూ ఉంటుంది.]

వెంకటేశ్వర్లు: అమ్మాయి! అమ్మాయి!

మంగమ్మ: (కళ్ళు వొత్తుకొంటూ) ఏం! నాన్నా!

వెంకటేశ్వర్లు: పిల్ల ఎలా ఉందమ్మా? ఊరికే అలా మూలుగుతున్నది అస్తమానమూను.

మంగమ్మ: ఎలా ఉందని చెప్పనూ! తెల్లవార్లూ, ఒక్కమాటూ కంటిమీద కునుకు లేదు, ఒళ్ళెరగదు! ఏదో బాధ పడుతోంది బిడ్డ! మొద్దులా ఏమీ చెయ్యలేక అలా చూస్తూ ఊరుకున్నాను. ఏం దారి! ఎన్నాళ్ళకీ ఏమార్పు కనబడటం లేదు. నా తల్లి నాకు దక్కేటట్టు లేదు. ఈ లోకంలో లేదు.

ఒళ్లు తెలియకుండా బాధ తప్ప ఇంకేమీ ఎరుగదు.

వెంకటేశ్వర్లు: అధైర్య పడకమ్మా అలాగ! మరేం భయం లేదు. ఇంతకీ వైద్యుడేమంటాడు?

మంగమ్మ: ఏమంటాడు? రావటం, చూడ్డం, ఏవో మందులు పొయ్యటం, ఒళ్ళంతా తూట్లు పడేటట్టు ఇంజక్షన్లు ఇవ్వడం తప్ప, ఫలానా జబ్బని కాని, ఇది అని కాని, ఇది చెయ్యాలని కాని, నోరు విప్పి మాట్లాడడు. ఇప్పుడు లోపల పరీక్ష చేస్తున్నాడు.

వెంకటేశ్వర్లు: ఏవో మరి! ఆయన శాయశక్తులా తంటాలు పడుతున్నాడు. వైద్యుడంతకంటే ఏమి చెయ్యగలడు!

మంగమ్మ: ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు! ఏమి చేసినా ఆ ఏడుకొండలవాడు చెయ్యాలి కాని—

వెంకటేశ్వర్లు: ఆభగవమా టంతే!

మంగమ్మ: అలా అని మొండితనంగా ఊరుకోలేకపోయాను. ఆడప్రాణం— బెంగతో మతి పోయి ఏమీ తోచదు. అలా కాదు ఇలా చెయ్యమని సలహా ఇచ్చేవాళ్ళేనా లేరాయెను. పోనీ పిల్లను వాళ్ళింటికేనా పంపించాను గాను. నా కళ్ళెదుటైనా ఇంటికంటే జాగ్రత్తగా చూసుకొందురేమో ననుకుంటాను మధ్యమధ్యను.

వెంకటేశ్వర్లు: విధి కాని అక్కడమట్టుకు ఇంత కంటే ఎక్కువ ఏమి చెయ్యగలరు? మన శక్తివంచన లేకుండా చేస్తున్నాం. ఆయుర్వేదంలోనూ, ఇంగ్లీషు వైద్యం లోనూ హేమాహేమీలనుకున్న వాళ్ళను డబ్బుకోసం మానుకోకుండా తీసుకొచ్చి చూపిస్తుంటిమి. మనుష్యప్రయత్నాలు ఆ స్వామి కటాక్షముండాలి. మన మేలుకోలు మాత్రం చెయ్యడం లేదు.

మంగమ్మ: ఎన్ని కబుర్లు పంపినా, ఎన్ని ఉత్తరాలు వ్రాసినా, దాని మొగుడేగా, ఊసే రాడాయెను! నిన్న టెలిగ్రాము కూడా ఇప్పించాను.

వెంకటేశ్వర్లు: వాడు [illegible] ఇంకేం— [illegible] పట్టికి దిగుతాడు.

మంగమ్మ: అతను వస్తే బాగుండునని ఉంది; వస్తే ఎలాగని భయంగానూ ఉంది.

వెంకటేశ్వర్లు: ఏమి?

మంగమ్మ: ఏమీ లేదు, అతను గట్టి వ్యక్తికరణం మనిషి. అతని కెంత తోస్తే అంతే కాని ఫలానాతను వొచ్చి చెప్పినా వినిపించుకోడు.

వెంకటేశ్వర్లు: ఈకాలం కుర్రవాళ్ళ పద్ధతే అంత. ఇంతకూ అతని పెంకితనం నిన్నేమి చేస్తుంది?

మంగమ్మ: మరేం లేదు కాని, ఒక సందేహం బాధిస్తోంది. ఎవరేమన్నా సరే కాని ఈ ముక్కు మూలం లేని జబ్బు దానంట పుట్టింది కాదని నా నమ్మకం. ఆ వడ్డికాసులవాడి ప్రభావమిదంతా అనిపిస్తున్నది. ఈ మాటంటే అతను వేళాకోళాలూ, వెక్కిరింతలూ ఆరంభిస్తాడు.

వెంకటేశ్వర్లు: పోనీ, అలాగే అనుకో! నీ నమ్మకం నీది! దాని కతని వేళాకోళా లెందుకు?

మంగమ్మ: ఎందుకా! దాని పెళ్లిముందు మొక్కుకున్నాను, పెళ్ళికాగానే వాళ్ళిద్దరినీ తీసుకొని కొండ ఎక్కి స్వామిదర్శనం చేయిస్తానని. నాటినుంచి నేటివరకూ, ఎన్నిసార్లు అతనిని బతిమాలినా నన్ను వేళాకోళం చెయ్యడమే కాని, అతనుమట్టుకు రాలేదు. అందుచేత మేము వెళ్ళడంలేదు. కార్యం ముందు ఇలాగే, చచ్చినంత జబ్బుచేస్తే అప్పుడు మళ్ళీ మొక్కుకున్నా, నిలువు దోపు ఇస్తానని. నిమ్మళించడం, కార్యం జరగడం అయిందా? ఆ మొక్కు చెల్లిద్దామని ఎన్నివిధాల ప్రయత్నం చేసినా, అతను దానివంటివిలాని వస్తువు చిన్నం బంగారమైనా కదపడానికి వల్ల కాదంటాడు. మళ్ళీ చేయిస్తానన్నాను. అయినా సరే ఇది కదపడానికి వల్లకాదంటాడు. కావలిస్తే నన్ను చేయించి ఇచ్చుకో మంటాడు. నాకనేకసార్లు ఆ స్వామి కలలో కనపడ్డాడు. ఈమధ్య మళ్ళీ తరుచు కనపడుతూన్నాడు. మొన్న కనబడి తల కూడా ఊపుతున్నాడు.

వెంకటేశ్వర్లు: ఆహా! గట్టిపేచీ వచ్చిందే! దానికత నసలే నవ్వుకోదు. స్వామి కూడా కాలాన్ని పట్టి కొంతమార్పు చేసుకొని ఇలాటికోరికలు మానుకుంటే బాగుండును.

మంగమ్మ: నీవు కూడా అలా మాట్లాడుతా వేమిటి నాన్నా!

వెంకటేశ్వర్లు: వెర్రిదానా! తరుచుగా జాగ్రదవస్థలో అవ్యక్తంగా ఉన్న మనఊహలూ సంకల్పాలే, మనస్వప్నంలో కనుపించేది. మళ్ళీ మెలుకువవచ్చిన తరువాత, ఈ స్వప్నాలు జ్ఞాపకం వచ్చి, మన సంకల్పాలను బలపరచి, ఆచరణను పురికొల్పుతాయి. దేవుడికి ఏమి కావలెనమ్మా! ఆయన కేమి లోటు—నిజంగా ఆయనకు లోటే అయిన నాడు మనం తీర్చగలమా?

మంగమ్మ: నీ వేదాంతాని కేమి లెద్దూ—

(ఇంతలో లోపలనుంచి డాక్టరు ప్రవేశం)

మంగమ్మ: (ఖంగారుగా నిలబడి) ఏం నాయనా! నా బిడ్డసంగతి ఏం చెప్పేవు!

డాక్టరు: (మాట్లాడడు.)

మంగమ్మ: ఏం నాయనా! ఆరోగ్య! ఇం కేముంది! (అని గదిలోకి వెడుతుంది)

వెంకటేశ్వర్లు: ఏమంటే డాక్టరుగారూ! పిల్ల ఎలాఉంది? మీ అభిప్రాయ మేమిటి?

డాక్టరు: (మాట్లాడడు)

వెంకటేశ్వర్లు: మీ కేమీ సందేహించక ఉన్న స్థితి ఏమిటో చెప్పాలి.

డాక్టరు: సందేహ మే ముంది? కాని ఏమి చెప్పాలో తెలియడం లేదు. నేను ప్రాక్టీసు ప్రారంభించిన తరువాత ఇటువంటి కేసు ఎప్పుడూ చూడ లేదు.

వెంకటేశ్వర్లు: అయ్యో!

డాక్టరు: ఎంతప్రయత్నం చేసినా దీనిమూకూ— మూలం తెలియడం లేదు.

ఇంతవరకూ ఇది ఫలానా వ్యాధి అని నిరూపించ లేకపోయినాను. దీనికి వేరే పేరు పెట్టవలసి వచ్చేటట్టుంది. నాకుం తెలియక అలా విడిచిపెట్టా ననుకుంటా రేమో నని, ముగ్గురు Specialists ను కూడా తీసుకొచ్చి. పరీక్ష చేయించాను కదా. వాళ్ళకు కూడా ఏమీ అంతు పట్టలేదు. ఇంక నేను చేయ తగ్గది ఏమీ కనుపించదు. రత్నంలాంటి పిల్ల. అలా విడిచిపెట్టడానికి ప్రాణం ఒప్పడం లేదు.

వెంకటేశ్వర్లు: పోనీ, మరోసాధనం ఏదైనా చేయించ మంటారా?

డాక్టరు: అంటే?

వెంకటేశ్వర్లు: ఏ ఆయుర్వేద వైద్యమో యునాని మోస్తర్నో—

డాక్టరు: మీ కేమి టూవెర్రి! శాస్త్రీయమైన వైద్యం, పెద్ద పేరు పొందిన వైద్యులూ బుర్రలు బుర్రలు బద్దలు కొట్టుకొని ఏమీ చెయ్యలేక నోరు మూసు కూరుకుంటే, ఏదో గచ్చాకూ, పిచ్చాకూ కలిపి ఇచ్చేవాళ్ళ చేతిలో పెడతా నంటా రేమిటి కేసు—

వెంకటేశ్వర్లు: గచ్చాకైనా పిచ్చాకైనా దానికి ఒక శాస్త్రీయమూ పద్ధతీ ఉంది కాదూ! దానివల్లా రోగాలు కుదురుతూనూ ఉన్నాయి. అంతే కాకుండా మీ కసాధ్యం అనిపించిన వ్యాధులు అనేకం వాళ్ళు కుదురుస్తూనూ ఉన్నారుకదా.

డాక్టరు: నేను నమ్మను. అది పట్టి గుడ్డివాడి చేతిలో రాయిలాంటిది. ఏదో ఒకరోగం కాకతాళీ న్యాయంగా కుదిరినా అంతమాత్రం చేత అదో పెద్ద శాస్త్రం ఎలా అవుతుంది.

వెంకటేశ్వర్లు: ఏమో కాని, నాబుద్ధి కతీతమైనదీ, నాదృష్టి కగోచరమైనదీ, అసత్యమని కాని, అసలు లేదని కాని అనేటంత సాహసం నాకు లేదుసుమండీ. సరే, దాని కేమికాని, మరిప్పు డేమిటి చెయ్యాతగ్గది. ఒక దణ్ణంపెట్టి ఊరుకోవలసిందేనా!

డాక్టరు: మీకు కోపం వచ్చినా సరే కాని Quacks చేతుల్లోపడి బతికే

కంటే, శాస్త్రం బాగా తెలిసిన వైద్యుడు చేతులో చావు మంచిది. క్షమించండి, ఇంత నిర్మొహమాటంగా అన్నందుకు. మీ అమ్మాయి ఏదైనా miracle వల్ల బతకవలసిందే కాని మానవ మాత్రుడేమీ చెయ్యలేడు. సెలవు.

(ఆయన బయటకు వెడుతుంటే అమ్మాయి భర్త సుకుమార రావు లోపలికి వస్తాడు. గుమ్మంలో ఒకరి నొకరు చూసుకుంటారు. డాక్టరు వెళ్ళిపోతాడు. ఇతను లోపలికి వస్తాడు.)

వెంకటేశ్వర్లు: ఎవరు వారు?

సుకుమార్: నేనండీ తాతగారూ, సుకుమార్ ని. ఎలా ఉందండీ మా మనుమరాలు?

వెంకటేశ్వర్లు: వచ్చావు నాయనా! ఇంకా రాలేదేమో అనుకుంటున్నాం. ఎలా ఉందని చెప్పను! ఇన్నాళ్ళనుంచీ పరీక్ష చేస్తున్న వైద్యుడు, ఈ వ్యాధేమిటో తన కంతు పట్టడం లేదని ఇప్పుడే చెప్పి వెళ్ళాడు.

(ఇంతలో గదిలోనుంచి మంగమ్మ ప్రవేశం.)

మంగమ్మ: వచ్చావు నాయనా! (అని కంట తడి పెట్టుకుంది.)

(ఒక క్షణం నిశ్శబ్దం.)

సుకుమార్: ఏదీ—ఎక్కడుంది?

(మంగమ్మ గదివైపు దారి తీస్తుంది. ముగ్గురూ నిశ్శబ్దంగా లోపలికి వెడతారు.)

[౨]

[గదిలో మంచంమీద అమ్మాయి ఒళ్ళు తెలియకుండా ఇటూ అటూ దొర్లుతూ మూలుగుతూ ఉంటుంది. సుకుమార్ ఒక్క అంగలో మంచం దగ్గరకు వెళ్ళి భార్యను కౌగలించుకొని ఏడుస్తాడు. మంగమ్మ

కాళ్ళకొట దిక్కున నిలబడి విచారిస్తూ ఉంటుంది. ముసలాయన ఒక కుర్చీ మీద కూర్చుంటాడు.]

వెంకటేశ్వర్లు: నాయనా! సుకుమార్! ఊరుకో బాబూ. ఏమిటి అలా అధైర్య పడతావు?

సుకుమార్: (నిశ్శబ్దం-ఎగుపులు మాత్రం విన పడుతుంటాయి.)

వెంకటేశ్వర్లు: అమ్మాయి, ఏమిటది? అతనికి కాస్త ధైర్యం చెప్పడం పోయి, ముందు నువ్వే ఇలా అయితే ఎలాగు? కంఠంలో ప్రాణం ఉన్నంత సేపూ, మనం పరమేశ్వరుడుమీద భారం వేసి ధైర్యంగా ఉండవలసినదే—

మంగమ్మ: (కళ్ళు తుడుచుకుంటూ) లే! నాయనా, లే! విచారించి ఏమి చెయ్యగలం? ఆ శ్రీ వెంకటేశ్వరులవారే ఉన్నారు అన్నింటికీని.

వెంకటేశ్వర్లు: రా! బాబూ, ఇలా రా; చూచో ముందుసంగతేమిటి?

సుకుమార్: ముందు సంగతేమిటంటే, నేను మట్టుకు ఏమి చెప్పగలను ఇప్పుడు? ఇంత ఎక్కువగా ఉన్నదనుకో లేదు. కాస్త ముందుగా తెలిస్తే, పోనీ, ఏ చెన్నపట్నం మేసుకు వెళ్ళేవామో, ఏదో చేసేవాణ్ణి. కొంప మీదికొచ్చే వరకూ నాకు సరిగా తెలియపరిచారు కారు.

వెంకటేశ్వర్లు: అలా అనడం ధర్మం కాదు. ఇక్కడ వైద్యలోపం ఏమీ జరుగలేదు. శాయశక్తులా తంటాలు పడుతున్నాం. వైద్యుడు చెప్పినమాటలను పుచ్చుకుని నీకూ మీవాళ్ళకూ కూడా వ్రాస్తూ ఉన్నాం. దూరాన్ని ఉన్నావు. నీవు అధైర్య పడతావేమో' నని, మీ అత్తగారు అంటున్నా, ఉన్న స్థితి ఎప్పటికప్పుడు నీకు తెలియపర్చమని చెప్పాను. ఇంతలో హఠాత్తుగా ఇలా ముంచుకొచ్చింది. ఏం చేస్తాం! ఇలాటివి మనతోటి చెప్పి వస్తాయా —

సుకుమార్: ఆ డాక్టరు మట్టి పిసికేవాడు అయి ఉండాలి! ఇన్నాళ్ళు ఇలా నీరబెట్టి, ఊరుకుంటాడా! తనకు అంతు పట్టకపోతే, మొదటనే చెప్పి ఉఘోరం చకలసింది!

వెంకటేశ్వర్లు: తొందర పడకు బాబూ!

సుకుమార్: తొందర లేమిటండీ! వీళ్ళదగ్గర నుండే తెగులే ఇది. చేత కాదని చెప్పడానికి వెధవ పౌరుషం! ప్రాణం అంటే దమ్మిడీ ఎత్తు లక్ష్యం లేదు.

వెంకటేశ్వర్లు: లక్ష్యం లేకేమి నాయనా! ఉన్నది. ఉన్నది కనుకనే రాత్రనక పగలనక, ఎండనక వాననక, మనం రమ్మన్నప్పుడల్లా వచ్చి నిద్రాహారాలు మానుకుని అవస్థ పడుతుంటారు. వాళ్ళు మట్టుకు సుఖపడి లేకనా! కాని మానవ విజ్ఞానం, ప్రజ్ఞా, పరిమితమని అన్నమాట మరచిపోకూడదు. వాళ్ళకు తెలిసినంత వరకూ ఏలోటూ చెయ్యరు. వాళ్ళ బుద్ధికతీతమైన దానికేం చేస్తారు. అందుకనే, ఆయన న్యాయంగా ఇప్పుడే తనకిదంతా అయోమయంగా ఉన్నదనీ, తనవల్ల కాదనీ చెప్పాడు.

సుకుమార్: ఈ స్థితికి వచ్చిన తరువాత చెప్పేం, చెప్పకేం?

వెంకటేశ్వర్లు: నాకు తోచినపని ఒకటి చేశాను. ఈ వూళ్ళో ఒక విచిత్రమైన వ్యక్తి ఉన్నాడు. అతను ఒక విధమైన ఆయుర్వేద వైద్యుడు. మామూలు పద్ధతిలో వాడు కాడు. జన సామాన్యానికి అతనిమీద విశ్వాసం తక్కువ. కాని నాకు మట్టుకు ఏదో కొంత గురి ఉండి అతనికి కబురు పంపించాను. వస్తాడనుకుంటాను. ఏమి చెపుతాడో చూద్దాం. అంతకంటె మనం చెయ్యదగ్గదేమీ కనుపించదు.

సుకుమార్: కదపడానికైనా వీలు లేదాయెను మనిషిని.

మంగమ్మ: ఎవరెన్ని చెప్పినా సరే కాని, ఇది వంట పుట్టిన జబ్బు కాదు. ఏ వైద్యుడికీ లొంగేదీ కాదు.

సుకుమార్: (కొంచెం వెటకారంగా) అలాగా — పాపం అసంగతి తెలిసుండి, ఇంత కాలం ఎందుకు వైద్యం చేయించారు?

మంగమ్మ: ఊరుకోలేక. అయినా ఆడదాన్ని, దిక్కుమాలినదాన్ని: నా మాట వినేవారెవరు? చేసేవారెవరు?

సుకుమార్: అదేమిటి, మీ ఇంట్లో మీమాట విననివారెవరుంటారు?

మంగమ్మ: అంత అదృష్టమా అని—ఎవరిదాకానో ఎందుకు నాయనా, నువ్వు విన్నావా ఏమిటి?

సుకుమార్: ఓహో! నామీదనే వచ్చిందా! ఏమి! నేనెప్పుడు వినలేదు మీ మాట? మీ అమ్మాయిని ఎప్పుడు పంపమంటే అప్పుడు పంపి, ఎన్నాళ్ళుండమంటే అన్నాళ్ళు ఉంచి, మీ ఇంటిచుట్టూ తిరుగుతున్నందుకా ఇది?

మంగమ్మ: నీ పెళ్ళాం కోసం నువ్వు తిరగడం ఎవరికి ఉద్ధరింపు! దానికేం కాని—పిల్లకి మొక్కుకుంది నాయనా! అది తీరిస్తేనే కాని దానికి సుఖంగా ఉండదని ఎన్నివిధాల మొత్తుకున్నా విన్నావా? నామాట గడ్డిపరక కింద కట్టి పారేశావు! ఇప్పుడు ముందుకొచ్చింది!

సుకుమార్: ఓహో! అదా సంగతి!

మంగమ్మ: అవును, అదే సంగతి. కుర్రదానికి రోగం లేదు, రొష్టూ లేదు. ఆ ఏడుకొండలవాడు బాకీ వసూలు చేసుకోడానికొచ్చాడు. ఇది రోగం కాదు, కనుకనే దాని ముక్కూ ముఖం ఎవ్వరికీ దొరకడం లేదు.

సుకుమార్: మీకిప్పటికి దొరికింది పాపం. అయితే దానికి తగ్గ చికిత్స ఏదో మీరే చెయ్యకపోయారూ, ఇంత డబ్బు ఖర్చుపెట్టి వైద్యం చేయించక పోతేను?

మంగమ్మ: నా చేతులో ఉన్నవనైతే అప్పుడే చేసేదాన్ని.

సుకుమార్: మీ చేతిలో కాకపోతే ఇంకెవరి చేతులో ఉంది? రోగనిదానం తెలిసినవారికి చికిత్స తెలియకపోతుందా?

వెంకటేశ్వర్లు: తెలియకేం—తెలుసును. అదే ఆవిడ చెప్తున్నది, నువ్వు వచ్చేసరికి.

సుకుమార్: అలాగా!

వెంకటేశ్వర్లు: శ్రీ వెంకటేశ్వర స్వామి మా ఇలవేల్పు. అందుకనే నా పేరు వెంకటేశ్వర్లు అని పెట్టారు మా వాళ్ళు. నీ వివాహం ముందు

ముమ్మూర్తుల సభయును వివాహం కాగానే తిరుపతి తీసుకువెడతా నని మొక్కుకున్నదట. అందుకు నీవు అంగీకరించు కారణం చేత ఆ మొక్కు చెల్ల లేదు. ఆపైన నీ కార్యంముందు పిల్లకు చాలా జబ్బుచేసిన సంగతి నీకు జ్ఞాపక ముండే ఉంటుంది. అప్పుడు మళ్ళీ మొక్కుకుంది, ఇదివరకు మొక్కు చెల్లించని అపరాధం కింద ఈ సారి పిల్ల వస్తువులు నిలువుదోపు ఇస్తా నని. దానికి నీవు అంగీకరించలే దట. ఈ రెండు మొక్కులూ చెల్లించని కారణం చేత స్వామి కిప్పుడు ఆగ్రహం వచ్చిం దనీ, ఆ కారణం చేత ఇంత జబ్బు చేసిం దనీ ఆమె నమ్మకం.

సుకుమార్: అలాగా!

వెంకటేశ్వర్లు: ఆవిడ నమ్మకమే కాదు. స్వామి ఆమెకు స్వప్నంలో కనబడి చెప్పా డట. పైగా వేడిగా ఇమ్మన్నా డట.

సుకుమార్: ఇవ్వటో మనండి. ఆవిడ ఏది ఇవ్వకుంటే మట్టుకు నా అభ్యంతర మే ముంది?

మంగమ్మ: బాగానే ఉంది. నీవేళాకోళాలూ నువ్వూను! ఈ వేళాకోళాల తోనూ వెక్కిరింపులతోనూ ఇంతవరకు తెచ్చావు. నే నిచ్చే దైతే నీ పిల ఎందుకు? ఆరోగ్యం ఈ జన్మకి ఇంక లేదు. ఏ అర్ధణా డబ్బులతోనో నా ఇబ్బంది తీరిపోతుంది.

సుకుమార్: వేళాకోళ మేమిటి? మిమ్మల్ని, అడిగా డంటే మీ దేనా ననుకున్నాను. మీది కాకపోతే నా దా ఏమిటి కొంపతీసి!

మంగమ్మ: నీది కాదు, నాది కాదు పిల్లది. పాపం, ఏమీ ఎరగదు.

సుకుమార్: ఓహో! ఇది ఒకటి నిశ్చయించారన్న మాట.

వెంకటేశ్వర్లు: ఏమీ నిశ్చయించ లేదు. ఆవిడ విశ్వాస మది.

సుకుమార్: ఇలాటి మూఢ విశ్వాసాలు పెట్టుకునే కోసం అలా ముదర పెట్టారు.

వెంకటేశ్వర్లు: నువ్వలా అనడం న్యాయం కాదు. ముందు మా పిల్ల,

తరువాత నీ భార్యకు. అందుచేత దాని ఆరోగ్య విషయంలో నీకున్నంత బాధ్యత మాకు ఉంది. దానికి నలత ప్రారంభించి నప్పటినుంచీ వైద్యం చేయిస్తూనే ఉన్నాం. ఈ మధ్యనే మీ అత్తగారికి ఈ అనుమానం కలిగింది.

మంగమ్మ: ఇలా అని పోతా డనే అప్పటికీ నోరు మూసు కూచు కున్నాను.

సుకుమార్: నే నన్నా నని కోపమే కాని ఈ కాలంలో ఇంకా తిరు పతి వెంకటేశ్వర్లూ, మొక్కులూ ఏమిటండీ!

వెంకటేశ్వర్లు: ఈ కాల మేమిటి, ఆ కాల మేమిటి? దేవుడు అన్ని కాలాల వాడూను.

సుకుమార్: నేను దేవుడు సంగతి కాదు చెప్పేది ఆ వెంకటేశ్వర్లు సంగతి.

(మంచం మీద రాజ్యం మూలుగు)

వెంకటేశ్వర్లు: మనవాళ్ళు కొందరు దేవుడుకే వెంకటేశ్వర్లని పేరు పెట్టారు.

సుకుమార్: హా-హా-హ్హా వెంకటేశ్వర్లు దేవుడే అయితే ఇలా ప్రవ ర్తించడు.

(మళ్ళీ రాజ్యం మూలుగుతుంది)

మంగమ్మ: మనం ఎంత తెలివైనవాళ్ళమైనా దైవనింద కూడదు. ఆ పరుషవాక్కులు చెవిని పడగానే బాధ ఎక్కువవుతోంది బిడ్డకు.

సుకుమార్: Rubbish.

వెంకటేశ్వర్లు: ఆయన ప్రవర్తనలో ఏమిటి లోటు కనిపెట్టావు?

సుకుమార్: అంతా లోటే! ఆయనగారు, I mean this Tirupati fellow— తాను దేవుణ్ణనీ, తన దర్శనం చేసుకొని ముడుపు చెల్లించు కుంటే రోగాలు రొష్టులూ నయం చెయ్యగల ననీ, కష్టాలూ నష్టాలూ రాకుండా చెయ్యగల ననీ ఇలా తన దగ్గరకు రాకపోతే అనేక ఇబ్బం

దులు కల్పించగల నని పంచమ దశం చేత బోలెడంత ప్రచారం చేయిస్తున్నారు. ఇంతకంటె better advertised person కాని సరుకులు కాని దేశంలో కనపడలేదు. మన మందమతులు ఆ దంతా నిజం అనుకోడం, కొస్త తలనొప్పి వచ్చేసరికి తుర్రున తిరుపతి బయులుదేరడం, ఉన్న లొడ్డు లొనుకూ అక్కడ పర్పించి మరింత దరిద్రం అనుభవించడమూను. How ridiculous! ఇటువంటి మూఢ విశ్వాసాలు పోతేనే కాని దేశం బాగుపడదు.

మంగమ్మ: ఆ వేం లేకుండా మీరు దేశాన్ని ఏమాత్రం ఉద్ధరిస్తున్నది చూస్తున్నాం కాదూ!

వెంకటేశ్వర్లు: దేవు డున్నా డనే నమ్మకం, ఆయన మీద విశ్వాసం ఉండడం మూర్ఖతంటావా?

సుకుమార్: నా ఉద్దేశం అది కాదు తాతగారూ! దేవుడిమీద నమ్మకం ఉండకూడదని కాదు. ఈ చచ్చు రాళ్ళే దేవుళ్ళనవద్దని నా గోల.

వెంకటేశ్వర్లు: నాయనా! య ద్భావం త ద్భవతి. రాయి అయితే నేం రప్పయితే నేం, ఏ దైతే నేం? నమ్మకం ఉన్నవాడికి అణువు మొదలు బ్రహ్మాండంవరకూ సమస్తం ఈశ్వర మయమే!

సుకుమార్: కావచ్చు. అది వేరేసంగతి. ఆమహత్తరమైన భావం, సర్వ సమత్వం, మరచిపోయి కనపడ్డ ప్రతి నల్లరాయి ఇటుకబొంతా దేవుళ్ళని వాట్లకు బోలె డంత డబ్బు తగలేసి దేవాలయాలు నిర్మించి, మొక్కుబళ్ళనీ, ఉత్సవాలనీ, ఊరేగింపు లనీ ఇంకా ఉన్నది ఊడ్చి, దేశం దిబ్బ చెయ్యడం ధర్మమా! ఈ డబ్బంతా ఉంటే ఎన్నెన్ని ఆస్పత్రులు కట్టవచ్చు. ఎన్నెన్ని యంత్రశాలలు నిర్మించవచ్చు; ఎంతమంది బీదసాదలను రక్షించ వచ్చు. ఈ విగ్రహాలూ ఈ దేవాలయాలతో విశాలం, విశ్వాతీతం కావలసిన మానవదృష్టి సంకుచితం చేసి,. సమస్త కార్యములూ వీటివల్లనే సిద్ధిస్త వని

నమ్మించి జనసామాన్యాన్ని మూర్ఖులనూ, క్రియా శూన్యులనూ చేస్తున్నారు మన పెద్దలు.

వెంకటేశ్వర్లు: నువ్వు చెప్పింది నిజమే, కాదనను. మీ సంఘసేవ కూడా ఈశ్వరారాధనే. ఇదో మోస్తరు విగ్రహారాధన. శరీరబాధ నివారించడానికి ఆస్పత్రులు ఎంత అవసరమో భవబాధ నివారించడానికి దేవాలయాలు అంత అవసరమూను.

సుకుమార్: అలా అని ఊరికే మనం ఊహిస్తున్నాం.

వెంకటేశ్వర్లు: ప్రతివాళ్ళూ గాలిలో ఎగరలేరు కాదూ. నేలమీద నడిచే వాళ్ళకు కేల ఆసరా లేకపోతే ఎలాగా? ఏదో ఒక ఆధారం కావలెననుకున్నంత మాత్రంచేత వాళ్ళదృష్టి సంకుచిత మవుతుందో కాదో చెప్పలేను. కాని వాళ్ళ జీవితం మట్టుకు కొంత శూన్యంగా ఉంటుంది. మీ యువకు లందరికీ దేశాన్ని ఉద్ధరిద్దా మనే ఉత్సాహమే కాని, ఆ కార్యం ఏరీతిగా చెయ్యవలెనో, ఏమి అవసరమో తెలుసుకునే ఓపిక లేదు

సుకుమార్: మమ్మన్ని వృథాగా నిందించడమే కాని మా ఆశయాలేమిటో తెలుసుకునే ఉదార హృదయాలు మీకూ లేవు.

వెంకటేశ్వర్లు: పూజా విగ్రహాలను బద్దలు కొట్టి, వాళ్ళ అర్చనలకూ ఆరాధనలకూ అవకాశం లేకుండా చెయ్యవలె ననే ఉత్సాహంలోనూ ఉద్రేకంలోనూ వాళ్ళ విశ్వాసాన్ని, ఆస్తిక్య బుద్ధిని నాశనం చేస్తున్నారు. ఇప్పు డున్న ఇల్లు బాగా లేక బద్దలు కొట్టవలెనంటే, వేరే ఇల్లు చూపించి మరీ ఇది పాడుచెయ్యాలి, కాని ముందిది నిర్మూలనం చేసి ఇంట్లో ఉన్న వాళ్ళను నిరాధారంగా వీధుల్లోకి తోలితే ఏలాగ? ఇంతకూ మీకు చేతనయింది నిర్మూలనమే కాని సృష్టి కాదు. మీకు నేర్పిన విద్య అంతటిదే. ఒక్క మాట నాకు తోచింది చెపుతాను. ఈ నిర్గుణారాధననీ, విశాలదృష్టి అనీ పెద్ద కబుర్లు చెప్పేవాళ్ళు చాలా మంది, నీకు కోపం వచ్చినా సరే,

కాదు, యదార్థంగా నాస్తికులైనా కొంత నయమే. ఏమీ కాకుండా దైవ చింత లేకుండా ఉన్నారు.

మంగమ్మ: మా బాగా అన్నావు. వాళ్ళ పోకలేమిటో వాళ్ల వేషాలేమిటో అంతేనే కాని, దేవుడూ అక్కర్లేదు దెయ్యమూ అక్కర్లేదు వాళ్ళకి.

సుకుమార్: పొరపాటు, చాలా పొరపాటు! ఒకవేళ మీ రన్నదే నిజ మనుకున్నా మీ మూఢభక్తికంటే తెలివైన నాస్తికతే మంచిది.

(మంచంమీద మూలుగు)

మంగమ్మ: ఇప్పుడీ దిక్కుమాలిన తర్కం ఏమిటి నాన్నా పిల్లసంగతి చూడక?

వెంకటేశ్వర్లు: ఎంతటి తెలివితేట లయినా, విశ్వాసంతోటి, భక్తితోటీ సమానం కావు నాయనా! ఇప్పుడు నాకూ విగ్రహారాధ నంటే ఇష్టం లేదు. మూఢభక్తి నాకూ ఇష్టం లేదు. కాని ప్రజాసామాన్యానికి ఏ రాయో, రప్పో, గుడ్డో, కుంటో, వాళ్ళ దేవుళ్ళు వాళ్ళ కుండొద్దూ? చిన్న పిల్లలు చూశావు—ఎంత దరిద్రులైనా, పగిలిపోయినదో, విరిగిపోయినదో ఆఖరుకు ఒక తాటాకు ముక్కో, పెంకుముక్కో, బొమ్మని అనుకుంటేనే కాని వాళ్ళకు కాలక్షేపం కాదు. వయస్సులోఎంత పెద్దవాళ్ళ మైనా సృష్టి పరిణామంలో మనం అంతా చంటిపిల్లలమే కాదూ!

సుకుమార్: అయితే వాళ్ళకు ఎదుగు బొదుగు ఉండవా? అక్కర్లేదా?

వెంకటేశ్వర్లు: కానూ కావాలి. ఎదగనూ ఎదుగుతారు. కాని అంత వరకూ వాళ్ళబుద్ధి వికాసం పొంది, ఈశ్వరుని నిర్గుణ, నిరాకార, నిర్వికార, సర్వాంతర్యామిత్వం పూర్తిగా అవగాహన చేసుకొని, అనుభవంలోకి తెచ్చుకో కలిగేదాకా వాళ్ళ విశ్వాసాలూ వాళ్ళ నమ్మకాలూ వాళ్ళ కుండనియ్యి. దానివల్ల వాళ్ళకు కాని, దేశానికి కాని, వచ్చిన ముప్పేమీ లేదు. భక్తి విశ్వాసాలూ క్రియా శక్తికి పూర్వరూపాలు. పరిపూర్ణ మైన

భక్తి ఇచ్ఛాశక్తిని సవ్యమైన మార్గంలో నడిపించి, క్రియాశక్తిగా పరిణమింప చేస్తుంది. అందుచేత నీ భక్తి వల్ల ప్రజలకు కలిగే కొత్త ఆనందం కూడా లేకుండా చేసి వాళ్ళ నంధకారంలో పడేస్తావనడం ధర్మమా—

సుకుమార్: అంధకారంలో ఏమీ పడెయ్యడం లేదు. వాళ్ళే శాశ్వతి మనుకుని చలనం లేకుండా ఎదుగుబొదుగులు లేకుండా చూస్తున్న వాళ్ళను కొంత పని కల్పించాలన్నమాట. వాళ్ళ తెలివితేటలు ఉపయోగించి, అసలు వస్తువును తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు.

శంకరేశ్వర్లు: నేననేది అంతవరకూను. వాళ్ళను నిరాధారంగా విడచి పెట్టడం చాలా ప్రమాదం.

సుకుమార్: ఏమీ ప్రమాదం లేదు. మనం భ్రమ పడ్డమే ప్రమాదం—

శంకరేశ్వర్లు: నాయనా! అనేక శతాబ్దాలనుంచి ప్రజలు కష్టంలోనూ, సరదాలోనూ, నిస్పృహలోనూ ఏమీ తోచక, ఏమీ చెయ్యలేక దైవ సన్నిధినే పరిపూర్ణ విశ్వాసంతో, భక్తితో, ఈ దేవాలయాలకు వచ్చి అక్కడ స్వామిసన్నిధిని, వాళ్ళ ఆశలూ, ఆకాంక్షలూ ప్రార్థనలూ వెళ్ళబోసుకుని కొంత మనశ్శాంతితో వెళ్ళిపోయారు. ఆ మనుష్యులు పోయినా; ఆ దేవాలయాలు ఆ దేవుళ్ళూ మిగిలారు. ఆ ప్రార్థనలూ ఆ మంత్రాలూ వాయు తరంగాలలో లీనమై అక్కడ శాశ్వతంగా ఉండిపోయి, తరువాతి తరాల వాళ్ళకు సహాయ పడుతున్నాయి. వాళ్ళ ఈ ఆశాలత కాస్తా ఎందుకు తెంపుతా నంటావు నాయనా! వాళ్ళకు తగిన విద్య నేర్పి బుద్ధి వికాసం కలిగించవలెనే కాని కేవలం నిర్మూలనంవల్ల ఏమీ జరగదు బాబూ!

మంగమ్మ: అరెర్రే—ముంచుకొస్తోంది. పిల్లమాటేమిటి నాన్నా?

సుకుమార్: ఇక కర్తవ్యం చేస్తున్నా? మహాదక్షంగా జరుగుతుంది. ఈ పాతవిశ్వాసాలూ నమ్మకాలూ పునాదులతో పెకలించి పారవేస్తేనే కాని పునర్నిర్మాణం పునస్సృష్టి చెయ్యడానికి వీలుండదు. ఈ తిరుపతి ఆయన ఉన్నాడే ఈలాటివాళ్ళు అంతా పోవాలి.

మంగమ్మ: ఆ ఆ హాని హాని! (అని చెవులు మూసుకుంటుంది.)

(బయట పెద్ద ఉరుముల చప్పుడు. మంచం మీద నుంచి పెరిగిపోక. అంతా మంచం దగ్గరకు పరుగెత్తారు.)

మంగమ్మ: అయ్యో, నాతల్లోయి! ఇంకేముందోయి దేవుడా! (అని రోదన)

సుకుమార్: రాజ్యం నా రాజ్యం! (అని ఏడుపు)

వెంకటేశ్వర్లు: తొందర పడకండి, భయం లేదు, ఏమిటి, హఠాత్తుగా గడుస్తా ఇలా చల్లపడి పోయిందేం—

(ఆ మాటలో ఆయుర్వేద వైద్యుడొస్తాడు)

వెంకటేశ్వర్లు: ఎవరు నాయన?

వైద్యుడు: నేను చంద్రశేఖరాన్నండి. తమరు రమ్మన్నారంటే

వెంకటేశ్వర్లు: రండి బాబు సమయానికి దేవుడులా వచ్చారు. ముందు అమ్మాయిని చూడండి.

చంద్రశేఖరం: (అమ్మాయిని పరీక్ష చేస్తాడు) అయ్యా, మీరేమీ అనుకోకుండా ఉంటే ఒక్కసంగతి మనవిచేస్తాను. ఈ అమ్మాయికి శారీరకమైన రుగ్మత ఏమీ కనుపించదు.

మంగమ్మ: ఆ, అలాగాండి—

సుకుమార్: మరైతే ఏమంటారు?

చంద్రశేఖరం: మీకు నమ్మకముండదేమోనని సందేహిస్తున్నాను.

మంగమ్మ: మాకు నమ్మకం లేకపోవడమేమిటండీ?

సుకుమార్: అయినా చెప్పండి

వెంకటేశ్వర్లు: పరవాలేదు. మీరేమీ సందేహించనక్కర లేదు చెప్పండి.

చంద్రశేఖరం: ఈపిల్ల నేదో దేవతో, దెయ్యమో ఆవహించింది. అది వదిలి పోతే పిల్ల నిక్షేపంలా ఉంటుంది.

మంగమ్మ: అదుగో విన్నారా, నీ అమ్మకడుపు చల్లగా, ఉన్నమాట చెప్పారు తండ్రి—

సుకుమార్: చెయ్యిమాస్తే ఎలా తెలిసిందండీ ఏదేదో—

(పైన పెద్ద ఉరుములూ మెరుపులూనూ)

చంద్రశేఖరం: అయ్యా, మీకు చిన్నతనం ఇప్పుడు తెలియకు లేదండీ. వారు పెద్దలు అడిగారు, గనక వారి మంచుకుండే గౌరవమయికొద్ది నా అభిప్రాయం చెప్పాను కాని మరొకళ్ళు రమ్మంటే రాను— మాట్లాడను.

వెంకటేశ్వర్లు: మా అమ్మాయి అభిప్రాయంకూడా అదే నండీ—శ్రీ వెంకటేశ్వర స్వామి ఆవహించాడని.

సుకుమార్: I don't believe it. ఇదంతా అవిడ పన్నిన పన్నాగం—

చంద్రశేఖరం: అయ్యా! తొందర పడకండి. మనం మృత్యుసన్నిధిలో ఉన్నాం. మన నమ్మకాలూ తెలివితేటలూ ఏమీ పని చెయ్యవు.

వెంకటేశ్వర్లు: ఎవరు వారు?

చంద్రశేఖరం: కొత్తవా రెవరూ రాలేదండి—

వెంకటేశ్వర్లు: అయ్యో, రాకపోవటమేమి? మరి వారంతా ఎవరు? ఎవ్వరూ రాలేదు. గదంతా జనంతో నిండిపోయినట్లుంది. హఠాత్తుగా గదంతా ఇంత చల్లబడి పోయింది. చంద్రశేఖరం గారూ, తరుణం సమీపించినట్లుంది.

చంద్రశేఖరం: చిత్తం– వ్యవధి లేదు. నిమిషాలలోకి వచ్చింది. పిల్ల దక్కవలెనంటే, మీ మొక్కుబడు లేమైనా ఉంటే వెంటనే చెల్లించుకుంటా మని మళ్ళీ మొక్కుకోండి. ఆ స్వామి అనుగ్రహ ముంటే ఈ బిడ్డ జీవించాలి, కాని మానవమాత్రుడేమీ చెయ్యలేడు. సెలవు (అని వెళ్ళిపోతాడు.)

(వెంకటేశ్వర్లుగారు తలవంచుకుని నమస్కరిస్తూ కూర్చుంటాడు. పైన పెళ ఉరుముల చప్పుడు, దుఃఖంమీద పెద్ద కేక.)

వెంకటేశ్వర్లు: అయ్యో, పిల్లరోగ్యం!

మంగమ్మ: అయ్యో, నాతల్లోయి! ఇంకేముందోయి — నాబిడ్డ గొంతుక చేతులారా కోసుకున్నానోయి! నా తండ్రీ — వెంకటాచలపతీ! ఇంత పనికీ తెచ్చావు నాయనా— ఇంకా నా గతేమిటి తండ్రీ— (అని ఏడుస్తూ గదిలోనుంచి పరుగెత్తుకెళుతుంది.)

సుకుమార్: అయ్యయ్యో రాజ్యం నన్ను విడిచి పోతావా రాజ్యం మాట్లాడవూ— ఒక్కసారి చూడవూ, రాజ్యం—రాజ్యం—నాగతేమిటి! రాజ్యం—

(అని వెక్కి వెక్కి ఏడుస్తుండగా లోపల గణ గణ గంట వినబడుతుంది.) అయ్యో, పరమేశ్వరా, దయామయా, వెంకటేశ్వరస్వామీ, నా అపరాధం మన్నించు తండ్రీ! నా రాజ్యాన్ని రక్షించు స్వామీ— నీ దివ్య దర్శనం చేసుకుని నీకు ముడుపు దోపూ, వేణీ, అర్పించుకుంటాం స్వామీ—అయ్యో, రాజ్యం—

(అని ఏడుస్తుండగా లోపలనుంచి మంగమ్మగారు తడిబట్టలతో హారతి తీసుకొచ్చి రాజ్యం కళ్ళకూ వొంటికీ అద్దుతుంది. క్షణంలో రాజ్యం పెద్ద నిట్టూర్పు విడుస్తుంది. తల్లీ మొగుడూ అమ్మాయికేసి చూస్తారు. నెమ్మదిగా కళ్లు తెరుస్తుంది. ఇటూ అటూ చూచి దాహం అని సంజ్ఞ చేస్తుంది.)

మంగమ్మ: నాతల్లి బతికింది! తండ్రీ, రక్షించావు నాయనా—

వెంకటేశ్వర్లు: ఆ— అలాగా అందుకనే గది మళ్ళీ నిర్జనమై, ఆ చల్లదనం పోయింది— వెంకటేశ్వరస్వామి అనుగ్రహం ఉంటే లోటేమిటి—

(నెమ్మదిగా కాసిని పాలు పోస్తారు. ఆమె భర్తకేసి చూచి చెయ్యి చాపి వచ్చారా! అంటుంది.)

సుకుమార్: రాజ్యం! (అని ఆమె చెయ్యి పట్టుకొని వెక్కి-వెక్కి ఏడుస్తూ చెయ్యి ముద్దు పెట్టుకుంటాడు. రాజ్యం నెమ్మదిగా అతని తల నిమురుతుంది. వెంకటేశ్వర్లుగారు వెంకటేశ్వరస్తుతి చేస్తారు.)

అత్ర్యాది సప్తఋషయస్సముపాస్య సంధ్యా
మాకాశసింధుకమలాని మనోహరాణి
ఆదాయ, పాదయుగ మర్చయితుం ప్రపన్నాః
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్!

శిల్ప నిద్ర

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి

[అరమవాటికలో ఉద్యానగృహము. రంగులదీపాలు. చంద్రోదయమయింది. వెన్నెల పర్యంకం మీద పడుతూ, జ్యోత్స్నాభిసారికలాగా ఆదర్శంగా ఆసీన అయిననిర్మలకు వన్నె పెట్టుతున్నది. కొంచెందూరాన ఆమెభర్త చిత్రకారుడు, కుంచెతో పటము చిత్రిస్తూ ఉంటాడు. పటము చాలాభాగం అయింది. ఇక మెరుగు ముఖ్యముఖ్య దిద్దుతుంటాడు]

కాంతిదేవ: ఆమనగో మళ్ళీ వంచేస్తున్నావు! కొంచెం వెనక్కు ...కుడి వైపుకు తలెత్తాలి...నీనీలకేశాలను నెరిపివేయు వద్దు. ఒక్కక్షణం సరిగా కూర్చుంటే చాలు నీయిష్టం వచ్చినట్లు వెళ్ళిపోవచ్చు.

నిర్మల: [కదలకుండా నవ్వుతూ] అబ్బా, ఎంతసేపు ఈగోల ఎరక్క పోయి ఆదర్శంగా కూర్చోటానికి ఒప్పుకొన్నాను.

కాంతిదేవ: ఆమనగో, కదిలిపోయినావు. బొమ్మ శాస్త్రా సరిగా రాదు. ఈఒక్కసారి కదలకుండా ఉన్నావంటే ఇక మళ్ళీ ఇది పూర్తయేదాకా నిన్నేమీ అడగను.

నిర్మల: అది ఇప్పుడే కానూ కాదు, నాకు స్వేచ్ఛా లేదు! ఖైదులో వేశారు. కూర్చోక తప్పుతుందీ! సరే - కానీయండి [అని కదలకుండా మెదలకుండా స్థిరత్వం వహిస్తుంది].

కాంతిదేవ: ఇప్పుడాకటి మాదిరిగానే కూర్చోవాలి. అలాగే ఆకాశానికి కొంచెం తిప్పు. కుడిచేయి వెనక్కు పోవాలి. ముఖం కుడివైపు కొరగా వరిగితే బాగుంటుంది...[ఆమె ఆవిధంగా అనుసరిస్తుంది. కాంతిదేవుడు యథాప్రకారంగా ఆమెవంక చూస్తూ, చిత్రిస్తూ మధ్య మధ్య] మేలి

ముసుగు భుజాలమీద పడిపోయింది. సవరించాలి... [ఆమె దిద్దుతుంది. రచన సాగుతుంది. తటాలున లేస్తుంది కాసేపటికి] క్షణం సరిగా కూచోవు గదా! ఇంత అల్లరిదానివంటే పెళ్ళి చేసుకొనేవాణ్ణేనా?

నిర్మల: మిమ్మల్ని చూసినప్పటినుంచీ మీపోలికే వచ్చింది నాలోకి నే నేం చేస్తాను. అది నాతప్పా?

కాంతిదేవ: ఏదో ఒకవిధంగా నామీద తప్పు కట్టేయాలని నీఆలోచన. సరేలే కాని. తప్పంతా నాదే. ఓపికపట్టి కదలకుండా రెండునిమిషాలు కూచున్నావంటే తర్వాత నీ కేం చేయమంటే అది చేస్తాను.

నిర్మల: త్వరగా గీసేయండి సరి. [యథానిర్దిష్టంగా కూర్చొని, కానీ పైనతర్వాత చాల్యవాసనతో కొంచెం కదిలి] మరి మీకు నే బాగున్నానా ఆ చిత్రమా? చెప్పండి చూదాం.

కాంతిదేవ: విషమప్రశ్నే. కాని కొంచెం ముందు చెప్తా.

నిర్మల: [కాసేపు సరిగా ఉండి, తర్వాత] మీరు ప్రేమించేది నన్నా నాచిత్రాన్నా?

కాంతిదేవ: రెంటినీ. [అని వ్రాసుకొంటూ ఉంటాడు.]

నిర్మల: అదెట్లా కుదురుతుంది? బొమ్మకు ప్రాణముందేమిటి?

కాంతిదేవ: ప్రాణముంటేనా ప్రేమించేది?

నిర్మల: ఐతే నన్ను వదిలివేయండి. బొమ్మున్నది కాదా మరి?

కాంతిదేవ: కాని బొమ్మెట్లావచ్చింది? నీవుండబట్టేనా? [మెల్లమెల్లగా చిత్రలేఖనక్రియలో మగ్నుడౌతాడు. కాలం గడుస్తూ ఉంటుంది.]

నిర్మల: [అటూ ఇటూ చూచి మళ్ళీ కదిలి] ఇది యెప్పుడు పూర్తి ఔతుంది? ఎన్నోరోజులనుంచి గీస్తున్నారు ...మీరు నాకు చేసినవాగ్దానం జ్ఞాపకమున్నదా?

కాంతిదేవ: నే నేం చేశాను?

నిర్మల: బొమ్మ నాకివ్వాలసి వస్తుం దని మరపుకూడానా? ఇలా

జరుగుతుందంటే నేను ఆదర్శంగా కూచునేదాన్నేనా? సరే, ఇదిగో నే లేచిపోతున్నా [అని లేస్తుంది.]

కాంతిదేవ: భలే బాగుందిలే! చూశావా, నీ కెలా కోపం తెప్పించానో?

నిర్మల: మీప్రజ్ఞ అడగాలి ఇంకా! [ఏమీ పట్టనట్లభినయించి, విసుగు కనపరుస్తుంది]

కాంతిదేవ: కానేపుకూడా కాలు కదపకుండా ఉండలేవు కదా. ఏదో వంక పెట్టుకొని తిరగాలని చూస్తావు నీ కిచ్చినమాట మళ్ళీ కాదని యెట్లా అంటాను? ఇది ఇవాళ్ళ పూర్తి ఔతుంది. రేపుసాయంకాలానికి నీ కలంకరణం చేసి, ఈకానుక ఇస్తా సరేనా?

నిర్మల: ఎన్ని ఇవాళ్లలు గడవలే దిప్పటికి? అందులో ఇదొకటి... ఐతే ఎంతవరకు వచ్చిందో, ఏదీ ఇట్లా ఒకసారి చూడనీయండి!

కాంతిదేవ: అంతా ఐపోయినాక ఇస్తా.

నిర్మల: అప్పుడు తప్పులున్నయ్యంటే ఎట్లా దిద్దుతారు? మళ్ళీ నన్ను వేధించుకు తింటారు! అందు కని ఇప్పుడే యిస్తే సరిగా ఉన్నదీ లేనిదీ చూసి యిచ్చేస్తాను. [అత డివ్వడు]

నిర్మల: [అతని చేతిలో చిత్రం తీసికొని పరిశీలిస్తూ] ఇ దేమిటి, ఈ వాలకం? ముఖంమీద అన్ని ముంగురులు నా కెప్పు డన్నా పడుతుండగా మీరు చూచారూ? ...ముక్కు కొక్కెంలాగా తయారైందే... కుచ్చెళ్ళు సరిగా రాలేదు చూశారా? ఇదేనా అన్నీ తెలుసు తెలుసంటూ ఇన్ని తప్పులు చేశారు?

కాంతిదేవ: చివరకన్నీ సరిగానే కనబడతైలే.

నిర్మల: ఏమో నాకుమాత్రం నమ్మకం లేదు, [క్షణం నిశ్శబ్దం. యుగాలు తిరిగినట్లనుభూయమానశైఖరిలో] ఇక నే పోవచ్చునా? ఆలోచించుకొని చెప్పండి. మళ్ళీ ఆ చిత్రమంతా ఐపోయిందనేదాకా కూచోను.

కాంతిదేవ: అంతా గీసుకొన్నాలే. నీయిష్టం వచ్చినట్లు తిరగవచ్చు...

[చిత్రాన్ని కలంకారాలు దిద్దుతూ ఉంటాడు. ఆమె కదలదు] అదుగో పోతేనేం? బొమ్మ గీస్తున్నంతసేపూ కాలు నిలవలేదు. ఐపోయిందిగా. నీకూ నిమిత మేర్పడింది. కానీ కాసే పాలాగే నిలుచో, ఇంకొక చిన్న బొమ్మ గీయాలి.

నిర్మల: ఎల్లుండి పొద్దున... [నిష్క్రమణ]

కాంతిదేవ: చిత్ర మంతా బాగానే వచ్చింది. ఇంకా పావుగంట కూచుంటే సమగ్రమై పోతుంది. కాని కూచోదుగా. [లేఖన మభినయిస్తూ] ఇంకొకబొమ్మని చెప్పి కూచోబెట్టాలి. [ఆలోచించి] ముందీచిత్రం తెమ్మంటే దొంగ బయటపడతాడు. [ఇద్దట మైపోతుంది] ఆఁ ఇంకేమీ అక్కరలేదు. అంతా ఐంది. దీని కలంకారాలు తొడిగి రేపుసాయంత్రమే ఇస్తాను. చంద్రోదయంలో జ్యోత్స్నాభిసారికా చిత్రమే బహూకృతి [దూరంగా ఉంచి వీక్షించి] శాంతి కలుగుతుందా గభీరచేతస్సుకు, [అని మోకరిల్లి చూచేసమయంలో విద్యుల్లతలాగా తటాలున ప్రవేశిస్తుంది]

నిర్మల: ఐందా, ఇంకేమన్నా కొరతుందా?

కాంతిదేవ: ఉన్నా, కూచోనన్నావుగా!

నిర్మల: ఇదెన్నాళ్ళ నుంచీ మీరు కూచోమంటే నే నెప్పుడు కాదన్నాను?

కాంతిదేవ: దివ్యాసవం తేజరిల్లుతూ, నవ్యోత్సుకత్వం పరివేష్టించే నీ విజృంభణను క్షణమైనా ఓర్వలే నట్లు ఇప్పుడే బయట పడ్డావు. మురిపించే భంగిమాలు వేస్తూ, దరహాసోన్మీలనాలలో తేలిపోయే నిన్నానాడు చూచి నా జన్మ తరించిన దనుకొన్నాను. [అని చిత్రం చూస్తాడు]

నిర్మల: ఐతే ఇప్పుడు తరించలే దన్నమాట?

కాంతిదేవ: అదుగో, కోపశాఖ నధిరోహించావు క్షణంలో.

నిర్మల: మీ రావృక్ష మైతే?

కాంతిదేవ: యౌవనశ్రీలలో ఊగే నీ చిత్రం నిర్మించటానికి. ప్రియ

ర్శించిన దంతా నీవనువల్ల ఇప్పటికి సఫల మైనది. [చిత్రవీక్షణము]

నిర్మల: మీ సదనవల్లరిలో లాలిత్యా లైనలాస్యరచనలకు ప్రతీకగా వచ్చి నట్లు భావించారు. కాని నాకోరిక యేదో మీరు గ్రహించలేదు.

కాంతిదేవ: నీలాలకలను దిద్ది అలంకార మిచ్చే నీపద్మశ్రీని చూచినది మొదలుగా ముగ్ధుడ నైపోయాను. పల్లవవేష్టిత మైనఅక్షియుగళి మాకర్షించింది. నిన్ననువదించా లని శిల్పగీతిలో పల్లవగానమాలపించాను. కళా కలాపంలో శిఖరము నిర్మింప గలిగినాను. గౌరీవిలాసమే పరిపూర్ణగా పరిణమించి చిత్రవికాసవంతికి లాలిత్యం తొడిగింది. నేత్రపర్వంగా నీవు కూర్చోటంచేత ఆకాముడనై చిత్రించాను.

నిర్మల: ఏమి టీఉపన్యాసమూ? మనం కలిసి నివసిస్తున్నా మనఆశయాలు భిన్నాలుగా ఉన్నవి కాదూ? కలరావంతో పాడి, అనురాగంతో పాలించా రని నమ్మి మీపొత్తు చేరినాను. కాని, మీకు చిత్రకళే నిజమైనప్రియురా లని ఇవాళ్ళే తెల్సుకున్నాను.

కాంతిదేవ: విలాసవీధుల్లో కోరిక లేశ మైనా నాకు లేదు. శోకసాగరంలో ఆహ్లాదము నామీద చిరకాల మాదరం చూపింది. చివరకు నిన్ను పెదికి పెట్టి, నన్నే కళగా భావించ మని ఆజ్ఞ వినిపించింది. విరాగగీతి పారలె పట్టింది. [అరమోడ్పుకంటితో చిత్రమును, ఆమెను చూస్తాడు.]

నిర్మల: ప్రసిద్ధుని అనురాగలహరిలో నాకు సగభాగము వచ్చిందే అని ఉవ్విళ్ళూరి మిమ్ముల నంగీకరించాను. జ్ఞప్తికి తెచ్చుకొనండి.

కాంతిదేవ: నీ వప్పుడు బాలికలాగా కన్పించినావు. నన్ను కోరినావు. కానిలే, అని అమాయికత్వంతో ప్రేమించాను. తర్వాత నీవు బాలవు కాదని గుర్తెరిగినాను. ఐనప్పటికీ వివాహం చేసుకొన్నాను. నీమీద పూర్తిగా ప్రేమ లే దంటా వని నాప్రథమచిత్రం నీకే అర్పిస్తా నని వాగ్దానం చేశాను [సాభిప్రాయంగా పరికిస్తాడు.]

నిర్మల: కాని, నామీద మీ కున్నది వాత్సల్యంకూడా కాదు. అంత

రంగికవృత్తిలో శూన్యత తాండవిస్తున్నప్పుడు, దానిని కప్పిపేయటానికి బాహ్యాలంకారాలెన్ని తొడిగినా ప్రయోజన మేమున్నది?

కాంతిదేవ: నాహృదయం నీకు పూర్తిగా తెలియదు. నీచిత్రాన్ని ఎక్కువగా ప్రేమిస్తున్నానో, నిన్నో చెప్పలేను. రెంటికీ సమాన మైనవేదికనే నామనస్సులో నిర్మించాను. దానిని మించిన ఉన్నతపీఠాలు, శృంగాలు లేనే లేవు.

నిర్మల: నిరవధి యైన కాల మున్నది కదా? [బయట అడుగులచప్పుడు. ఆనందోదహాం అనే ధ్వనులు అవ్యక్తంగా వినబడుతవి. నిర్మల లోపలికి వెళ్ళి పోతుంది. ఆనంద దేవులు మెల్లమెల్లగా ప్రవేశిస్తారు. కాంతిదేవుడు నమస్కరించి ఆసనం చూపిస్తాడు. అతనిచేతిలో చిత్రఫలకం గురువులు తీసికొని, సమగ్రంగా పరిశీలిస్తాడు.]

ఆనంద: ఎంతకాల మైందోయి ఇది చిత్రించి? చాలా బాగుంది... కొద్దిమార్పులు చేయా లనుకో. ఐనా యోగ్యంగా, సుందరంగా దిద్దినావు.

కాంతిదేవ: ఇప్పుడే కొంతవరకు గీచి ఉంచాను గురూ!

ఆనంద: ఇదేనా, ఇం కేమన్నా ఇదివరకు వ్రాసినవి ఉన్నవా?

కాంతిదేవ: ఇదే ప్రథమము, గురూ! [ప్రథమ మనేమాట చెప్పి నాలిక కరచుకొంటాడు. స్మృతి నభినయించి నిర్విణ్ణుడౌతాడు.]

ఆనంద: ఏమిటి, ఆవిధంగా వివర్ణమై పోయింది నీముఖం?... చిత్రకళావసిలో తిరిగే నీలో క్షణక్షణానికి మార్పు లేవీ విపరీతంగా రాకూడదు. స్థైర్యం చాలా అవసరము. కారణ మేమిటి?

కాంతిదేవ: [లేని ఉత్సాహము నారోపించుకొని] ఏమీ లేదు, గురూ! ఏదో జ్ఞప్తికి వచ్చింది. దీనితో సంబంధ మేమీ లేదు. మీ రుపదేశించిన ప్రకార మాచరణలోకి దింపి, కళాశక్తి వినియోగిస్తున్నాను. మీఆశీస్సులే నాకు ధైర్యము, ఉత్సాహమూ ఇచ్చినవి.

ఆనంద: తొలిబొమ్మైనా, చాలా చక్కగా చేశావు.

కాంతిదేవ: [వెనక కొంత అడుగు వేస్తాను. తల వంచి దీర్ఘాలోచన ఈ పశ్చాత్తాపవేదన కనపరచి] మీరు కోరినవిధంగా నేను ప్రాతఃకాలానికే ఈ చిత్రం మీ కందజేస్తాను లోపాలు సరి చూచి, చేయబోయే కృతులకు ఆదేశము, ఉపదేశము ఇవ్వాలి.

ఆనం: [స్త్రీప్రసన్నభినయించి] నే నావిషయం పూర్తిగా విస్మరించాను. బాగుంది. గురుదక్షిణగా తీసికొంటూ నన్ను సంతోషపరచిన చిత్రము. నా కళాసంపదలో అగ్రస్థానము నలంకరిస్తుందికే... కాని కుంచె తీసికొని ఈ భాగం కొంచెం సవరించాలి [చిత్రం చూపి] ముంగురులు సరిగానే వచ్చినవి గాని సీమంతము స్పష్టంగా రాలేదు. ఐనా కుంకుమాలంకరణం దాన్ని కప్పివేసే విధంగా సుందరంగా చేశావు... అంగుళులలో వైశద్యం బాగా కనిపించాలి.

కాంతిదేవ: కాని మీరు గమనించారు. జీవితంలో వ్యక్తులీవిధంగా కనబడుతూ ఉంటే వారి నెలా దిద్దటం? ప్రకృతిని అనువదించే కళాకర్త ప్రకృతివికృతులను కలిపితే ఏం బాగుంటుంది?

ఆనంద: నే చెప్పేది విని యోచించు. జీవితంలో మామూలుగా వ్యక్తులు వన్నెవెలాలు కనిపిస్తున్నా, వాటిని యథామాతృకంగా చిత్రించకూడదు. ఆదర్శత్వ మివ్వాలి.

కాంతిదేవ: సుఖవర్చస్సులో అది సాధ్యమే.

ఆనంద: తదనుగుణంగా పరిణమించే మిగిలినవి.

కాంతిదేవ: కాని ఆదర్శవ్యక్తి నశరీరంగానే ఉంటే?

ఆనంద: చిత్రకారుని కప్పుడు విశేషశ్రమ కలుగుతుంది. చైతన్యమును చిత్రించటానికి ప్రతిభావ్యుత్పత్తులు పూర్తిగా ఉండాలి. నీ కామార్గాలలో శిక్షణ ఇచ్చాను. నీ వెంతవరకు వినియోగిస్తున్నావో!

కాంతిదేవ: మీ ఉపదేశము నింతవరకూ అనుసరించకుండా మెలగలేదు. మీరు విశ్వసించవచ్చు.

ఆనంద: ఉషోదయం కాగానే చిత్రంతో వస్తా ననుకుంటాను. పొద్దు పోయింది. ఏదో పనిమీద పోతూ దారిలోనే ఉన్న నిన్నొక కేక వేసి పోదా మని వచ్చాను. [అని బయలుదేరతాడు.]

కాంతిదేవ: ధన్యుడను అనుగ్రహించాలి [కొంచెం సాగ నంపి] నే నంటాను. [గురువు నిష్క్రమణ. చిత్రం తీసుకొని కాంతిదేవుడు దుఃఖపూరిత దృక్కులతో, వణకబడే చేతులతో, రక్తస్రోతస్సులో పడవు లెత్తే ఆలోచనా వైరుధ్యంతో ఉంటాడు. కొంతసే పైనతర్వాత నిర్మల ప్రవేశిస్తుంది.]

నిర్మల: ఇంత పొద్దుపోయినాక కూడా మీ గురువుగారు శిష్యులయోగ క్షేమాలు కనుగొంటున్నా రంటే ఆశ్చర్యంగానే ఉన్నది. పైగా గురుకులం వదలినవారిని కూడా విచారించటం వేరే చెప్పవలెనా?

కాంతిదేవ: [లేని ఉత్సాహంతో] నీ వింకొక్కసారి సరిగా కూర్చోవాలి. [అని ముఖం వాల్చుతాడు.]

నిర్మల: ఏం? ఐం దన్నారుగా? మళ్ళీ యెందుకు?

కాంతిదేవ: రెండవ చిత్రం నిర్మిద్దా మని కోరిక కలిగింది.

నిర్మల: ఇ దొకటి కానీయండి. రేపు సాయంకాలం నాకీ చిత్రం బహూకరించిన తర్వాత మీ రేబొమ్మకి కూచో మంటే దానికి సిద్ధమే.

కాంతిదేవ: [అనవతశిరస్కుడై అప్రయత్నంగా అశ్రువులు వదులుతాడు. మనిషిలో తొట్రుపాటు కనిపిస్తుంది.]

నిర్మల: నే నే మన్నా నని మీ రలా ఉన్నారు? అదేమిటి... చెప్పరూ? అపరాధ మేమన్నా నే చేసిన ట్లయితే సవరించుకొంటాను.

కాంతిదేవ: నీ వేమీ చేయలేదు. ఇదంతా స్వయంకృతమే, పొరపాటున జరిగింది.

నిర్మల: [దీనంగా, అనునయంతో] ఏమి టిది? నాకు కూడా వివరా లివ్వరూ? మీ సుఖాలలో నాకు భాగ మున్నట్లే, మీ కష్టాలలో కూడా ఉండాలి

కాంతిదేవ: ఇది నీవు వినకూడదు.

నిర్మల: ఏం, నేను విశ్వసింప తగనిదాననా?

కాంతిదేవ: కాదు. నిన్ను గురించే నాకు జాలి, దుఃఖము కలుగుతున్నవి. [ముఖం పైకెత్తి రింపుతాడు.]

నిర్మల: నాకోసం మీకు కలిగేప్పుడు, నా సంగతి నే వినకూడదూ?

కాంతిదేవ: వద్దు. తర్వాత నిష్కారణంగా నా మీద కోపం వస్తుంది.

నిర్మల: ఎప్పుడన్నా ఇదివరకట్లా వచ్చిందీ? [అని జాలిగా చూస్తుంది.]

కాంతిదేవ: కాని యిక ముందు వస్తుంది.

నిర్మల: ఆ దండ వాగ్దానం చేస్తా. చెప్పరూ?

కాంతిదేవ: [క్షణం బెదరినట్లుంటాడు] పొరబాటున అన్నాను. వదిలివేయి నన్ను. నీవు చెప్పకూడదు

నిర్మల: పోనీ లెండి, దాచుకోండి. మీ చిత్రకళకోసం నన్ను పెళ్ళిచేసుకొన్నారు గాని...

కాంతిదేవ: ఇప్పటికే బాధలతో కుమిలిపోతున్నాను. ఇంకా ఆవిధమైన మాటలు కూడా పడితే ఏమౌతానో చెప్పలేను!

నిర్మల: నామీద దయ వహించి ఏమిటో చెప్పరూ? [అని ప్రాధేయపడి సమీపించి, చుబుకం చేతితో స్పృశించి, దీనంగా నిలుచుంటుంది. లేని ఓపిక తెచ్చుకుంటాడు అతడు.]

కాంతిదేవ: నీకు వాగ్దానం చేయక ముందు, గురుకులంలో నే ఉండగా..

నిర్మల: ప్రథమ చిత్రం సంగతేనా?

కాంతిదేవ: ఆఁ [దీర్ఘం నిశ్వస్య.]

నిర్మల: ఎవరికిస్తానని చెప్పినారు?

కాంతిదేవ: [అప్రియత్వంగా] గురువు గారికి.

[ఆమె నిశ్చేష్టురాలౌతుంది. నెమ్మదిగా భూమిమీదికి జారిలబడుతుంది. సమీపించి అతడు మెల్లిగా] విస్మృతివల్ల ఈ అపరాధం కలిగింది. క్షంతవ్య

డను కోకపోయినా తప్పు మన్నించాలి. [మూతలు పడినకన్నులతో] మాట్లాడవు నాతో! పొరబాటు జరిగింది, ఇక ఎన్నడూ ఈవిధంగా చేయను. నీఆశల నన్నింటినీ తుంచివేశాను. నిజమే. కాని ఏం చేయగలను? ఇందాక గురువుగారు వచ్చినతరువాత పూర్వవాగ్దానము జ్ఞప్తికి వచ్చింది. [క్షణం మాగి] ఇంకొక చిత్ర మిలాంటిదే వ్రాసి నీకు సమర్పిస్తాను. నీవు కోరినన్ని అర్పిస్తాను. ఈవిపత్తునుంచి గట్టెక్కించాలి [వెక్కరిల్లుతాడు.]

నిర్మల: తక్షణామే బయలుదేరి పోయి చిత్రం గురువుగారి కర్పించి రండి!

కాంతిదేవ: ధన్యుడ నైనాను! నీవే మనుకుంటావో అని యెంతో తహతహలాడి పోయినాను. నీవు కోరి నన్ని చిత్రాలు తీసుకోవచ్చు. నేనేమీ నీవు కోరినదాన్ని నిరాకరించ దలచుకోలేదు. అన్నివిధాలా దీనిలాగానే ఉండే చిత్రము నిర్మించి నీకు రేపటికే యిస్తాను.

నిర్మల: [అర్థరహితమై, అచేతనాలైన చూపులతో] నా కేమీ అక్కర లేదు. నాకు చిత్ర మెందుకు?

కాంతిదేవ: అట్లా అనరాదు. నీవే కోరుకొన్నావు మొదట [అని నాలుక కరచు కొంటాడు.]

నిర్మల: ఆకోరిక విఫలమైనతర్వాత, అసలుకోరికే అనేదే లేకుండా పోయింది. చిత్రఫలక లతావలయాలలో వ్రాలటానికి మనస్సులో శక్తి లేదు. చిత్రవాంఛలు పారిపోయినవి.

కాంతిదేవ: కాదు, నాప్రార్థన విని నీవు ద్వితీయ చిత్రము తప్పకుండా తీసుకోవాలి.

నిర్మల: నే నేమి చేసుకొంటాను దానితో! నా కదేమి ఉపకరిస్తుంది? మీ కళాకౌశలం చూచి ఆనందించా లంటే మీరు వ్రాసినబొమ్మలను చూచి సంతోషించవచ్చు! నాకు వేరే ఏమీ వద్దు.

కాంతిదేవ: ఇక లాభం లేదు...గురువులను సంతోషపెట్ట మన్నావు

కాని, నీసంగతి విప్పి చెప్పటం లేదు. మధ్య చిక్కున బడిపోయినాను.

నిర్మల: నాకు శిల్ప మెందుకు? నే కోరినది మిమ్మలిని, మీ ధీశక్తిని, మీ ఆత్మను! కాని మీ చిత్రకళానిపుణతను కాదు.

కాంతిదేవ: కాని చిత్రం కోరుకొన్నావు.

నిర్మల: మీ రాకళను అన్నింటికన్నా అధికంగా ప్రేమిస్తున్నారు. మిమ్మల్ని పెళ్ళిచేసుకొన్నందుకు మీరు ప్రేమించేవాటిని ప్రేమించటమే నా ధర్మము. అది నిర్వర్తించాను.

కాంతిదేవ: ఇప్పటికికూడా చిత్రకళ నధికంగా ప్రేమిస్తూనే ఉన్నాను. నీవు నీ చిత్రాన్ని స్వీకరించక తప్పదు. ఇప్పటికే నావిస్మృతివల్ల కలిగిన ఈ అపరాధానికి హృదయం విదారిత మౌతున్నది. పైగా నీకు కోపకారణం కలుగ లేదు.

నిర్మల: మీరు పొరబాటులో ఉన్నారు. నాకు కోప మేమీ లేదు. మీరు మనసార కళను సమ్పూర్ణహృదయంతో ప్రేమించినంతవరకూ, నేనూ అట్లాగే చేశాను. కాని మీలో లోపం కనబడ్డది ఇవ్వాళ్ళ.

కాంతిదేవ: ఏమా లోపం? ఇక ముందైనా జాగ్రత్తపడి దిద్దుకొంటాను.

నిర్మల: అది చాలా కాలంనుంచి వస్తున్నదే. చిత్రకళను ఉద్ధరించగా చూచుటానకే కారణంతోనే నన్ను వివాహం చేసికొన్నారు. అది నిజమే కదా?

కాంతిదేవ: గట్టిగా చెప్పలేను.

నిర్మల: కాని అందులో చాలా సత్యమున్నదని ఒప్పుకొంటారా!

కాంతిదేవ: తప్పకుండా.

నిర్మల: అక్కడే మీకూ నాకూ భేదము.

కాంతిదేవ: భేదము సమసిపోయే మాదిరిగా ఇకముందు వ్యవహరిస్తాను.

నిర్మల: లాభం లేదు. మనం రెండుభిన్నమార్గాలలో నడుగుతున్నాం.

కాని కొంతసామ్య మున్నది. దానితో సుఖంగా జీవించవచ్చని అను కొన్నాను. ఇప్పటి కీవిధంగా పరిణమించింది. మీ రనుకొనే కళాప్రపంచంలో నాకు తావు లేదు. ఈచిత్రం గురువుగారి కిచ్చివేయండి. ఇకముందు నన్ను మీకళనుగూర్చి వేధించవద్దు. [పోబోతుంది. అనునయంతో వారించి]

కాంతిదేవ: నామాట ఒక్కటి విని తర్వాత చెప్పు.

నిర్మల: మీరు ముందుగా నాకొకమాట నీయాలి. తర్వాత వింటాను. వాగ్దాన మీయబోయేముందు సరిగా ఆలోచించుకొని ప్రత్యుత్తరము చెప్పండి.

కాంతిదేవ: అలాగే. సావధానుడను.

నిర్మల: నాకోరికను మీరు మన్నించే టైతే, ఇకముం దెన్నడూ దానికి తప్ప, ఇతర వేళలలో చిత్రకళను . . [అని సాభిప్రాయంగా చూస్తుంది క్షణ మాగి వికాసంతో]

కాంతిదేవ: మున్ముందటికీ నీమాట అంగీకరించాను. చిత్రకళను నీకై త్యజించగలను. దానికి బదులుగా కొంచెం కాలం మళ్ళీ నీవు వినియోగించాలి. ఏచిత్ర మొకటి సిద్ధపరచి రేపుసాయంత్రానికి నీ కర్పిస్తాను. నా మాట తీసివేయక అంగీకరించాలి నీకోరికను మనసారా పాలిస్తాను: వ్యతిరేకించను.

[విలాస ముట్టిపడే కన్నులతో, లేడిలాగా రివ్వన గంతేసి, పర్యంకం సమీపించి]

నిర్మల: మీ చిత్రానికి ఆసీనురాలుగా ఆజ్ఞ ఇచ్చినప్పుడే సిద్ధము. మీ కళాకౌశలమును హరించినందుకు మనస్సుకు కష్టముగానే ఉన్నది! కాని...

కాంతిదేవ: లేదు లేదు సరి యైనమార్గం అందుకు కృతజ్ఞుడను...

ఏదీ ఒకసారి సరిగా కూచో. పైపైగీతలు వ్రాసుకుంటాను. సరిపోతుంది. మిగిలిన దీ చిత్రం చూచి వేసుకుంటాను.

సగ్మ్రి: ఇదిగో నే సిద్ధము! [రంగప్రారంభము మున్న అభినయభంగిమంలో ఆసీన డౌతుంది. చిత్రకారుడు కించిద్దూరములో చిత్రం ప్రారంభిస్తాడు. మెల్ల మెల్లగా తెర.]

మధుర ప్రియ

శ్రీ వావిలాల సోమయాజులు

[చిత్తూరు రాజమందిర ప్రాంగణము. గిరిధరగోపాల పూజామందిరము ముందు వితర్దిక మీద శిలావిగ్రహము. గోసాయీలు ముందు వచ్చి కూర్చుంటారు. సేవకురాలు పూజాద్రవ్యాలు పట్టుకొని వస్తుంటే వెనుక అర్ధనిమీలిత నేత్రాలతో మీరా ప్రవేశిస్తుంది ఒక వైపునుంచి. సూర్యాస్తమయానంతరము. మీరాబాయి రావటాన్ని జూచి]

గోసాయీలు: జై! చిత్తూరు మహారాణీ మీరాబాయికి జై!
జై! చిత్తూరు మహారాణీ మీరాబాయికి జై!!

మీరా: [దగ్గరకు వచ్చి] ఓహో! ఈనాడు కృష్ణాష్టమి. నా ప్రభువు జన్మదినము. అందుకనే కాబోలు పూజామందిరము కిక్కిరిసిపోతున్నది గోసాయీలతో... అబ్బ! ప్రభుతుల్యులు, ఎంతమంది గోసాయీలు... భక్తబృందానికి వందనాలు!

గోసాయీలు: జై! చిత్తూరు మహారాణీ మీరాబాయికి జై!
జై! చిత్తూరు మహారాణీ మీరాబాయికి జై

మీరా: [నాలుగు దిక్కులు కలయజూచి] మహానుభావులారా! ఎవరా చిత్తూరు మహారాణీ! ఏది? ఎక్కడ?... [నవ్వుతూ] మీరా చిత్తూరుకు మహారాణీ కాదు. ఆ మహారాణీ పుట్టలేదు... మాయారహితుడు, మహాప్రభువు గిరిధరగోపాలుడికి ఈ మీరా ఆత్మను అంకితం చేసిన ప్రేయసి. కాదు... కాదు... పాదదాసి.

గోసాయీలు: జై! మీరామాయికీ జై!
జై! మీరామాయికీ జై!

మిత్రులారా! ఆప్తులారా! నా మనోహరుని పుట్టినరోజు నాడు దేశదేశాలనుంచీ సంకీర్తనకోసం వచ్చిన మిమ్మల్ని చూస్తే నా హృదయం ఉప్పొంగిపోతున్నది! ఎందరు వైష్ణవభక్తులు.. నా కళ్ళు చూడలేక పోతున్నవి. జయ పెట్టెల నిండి నాను కొను... [విగ్రహం కేసి చూపిస్తూ, సమీపిస్తూ] అదుగో ఆ మోహనమూర్తికి.. నా మనోనివాసికి .. కాదు నా మనోహరుడికి... [దగ్గరకు చేరి మోకరిల్లి విగ్రహ పాదపద్మాలను నిమీలితలోచనాలతో దర్శిస్తూ]

జయ జయ జయ జయ గిరిధర గోపాలా!
జయ జయ జయ జయ గిరిధర గోపాలా!
అలికుల గానోద్భాతామృతరస
లలితతమాలప్రవాళాంబుజయుగళా, గోపాలా!
[తల ఎత్తి కేకిపింఛాన్ని నిరూపిస్తూ]
మకుట ఘటిత కేకిపింఛరుచి కలిత
సకలాశాపరిపూరిత దివ్యతేజ, గోపాలా!
[కన్నుల దగ్గరకు తెచ్చి కలయ జూస్తూ]
అక్షయ గోపీతరళ కటాక్షా
క్షీణ మనోహరా రాజీవాక్షా, గోపాలా
[మురళీగానాన్ని అభినయిస్తూ]
రాధాధర మధుర సుధారస ధా
రారంజిత బింబాధర వంశీరవ గోపాలా
[చక్రభ్రమణంతో]
జయ జయ జయ జయ గిరిధర గోపాలా!
జయ జయ జయ జయ గిరిధర గోపాలా!
[తన్మయురాలై గోసాయీల మధ్యకు చేరి]

అదుగో నా ప్రియుడు నవ్వుతున్నాడు. మన పిలుపు అందింది. ఓహో! ఎంత

రసికుడు... పల్లవీకన్యలమధ్య పిల్లనగ్రోవి మ్రోగ... నా కంఠాన్ని అనుకరిస్తున్నాడు. కంకరం కలిగింది కాబోలు. అడుగో ఆనీలమేఘం ఆ దేమిటి ... అబ్బా! ఏమి టామెరుపు దానికి పైగా... [అనుమానించినట్లు పరికించి మిలా మిలా కళ్ళార్పి] కాను.. ఔను తెలిసినది.. అంతే నా మనో నాధుడు గోలోకంనుంచి బయలుదేరి వస్తున్నాడు... ఆ ఆషాఢమేఘచ్ఛాయలు ఆయనదేహకాంతులు... ఇదిగో మన మంతా నీలస్నిలంగా మారి పోతున్నాము... అమ్మో! కాంచనాభరణాలను త్యజించిన నా ఒంటిమీద బంగారపురుద్రాక్షల జపమాలలు నిలుపుతూ నిముషంలో మటుమాయమై నిముషంలో జ్యోతిష్మతులను వెలిగించే ఆ కాంతు లేమిటో తెలుసునా? నా హృదయపతి కేకిపింఛసంకాశం. నెమ్మది నెమ్మదిగా... నాకోసమ.. ఔను నాకోసమే దిగి వస్తున్నాడు.. ఎందుకు రాడు, వస్తాడు... ఇద్దరమూ చిన్ననాటినుంచీ స్నేహితులము... మా అమ్మపక్కలో నేను. నాపక్కలో నాహృదయపతి... అడుగో మరీమరీ దగ్గిరికి వస్తున్నాడు... [గోసాయీల కేసి చూస్తూ] మీ రేమీ చూడటము లేదూ! అలా బిక్కమొగాలు వేసుకొని కూర్చున్నా రేమిటి? [ఒక గోసాయి దగ్గరకు వచ్చి] స్వామీ! నా మనోహరుడు మీకు కనబడటం లేదూ?

గోసాయీ: [లే దన్నట్లు తల తిప్పుతాడు.]

మీరా: [మరొక గోసాయిదగ్గరకు వచ్చి] మహాత్మా! మీకో?

గోసాయీ: ఏ డమ్మా తల్లీ, ఎక్కడ! నీది వట్టి భ్రాంతి!

మీరా: అ దేమిటి స్వామీ, కళ్ళఎదుట అలా కనిపిస్తూ ఉంటేనే!

గోసాయీ: ఇ దేమి టమ్మా! ఎన్నడూ కనీ వినని విచిత్రం... నీది వట్టిభ్రాంతి. ప్రభు వేమిటి? మనదగ్గిరికి రావడ మేమిటి? మా వగోస్వాములు ఎన్నడూ చెప్పలేదే. దేహయాత్ర చాలించి మనమే గోధామంలో ప్రభువును కలుసుకుంటాము. గాని ఇదేంమాట? ఎన్నడూ వినలేదు...

మీరా: చాలింకే మహాత్మా, చాలులే! అబ్బా! ఎక్క డేమిటయ్యా

స్వామి! [జరిగిపోతూ మరొక గోసాయితో] తేజోమూర్తులు తమకు తప్పకుండా కనిపిస్తారంటూ అనుకుంటాను.

గోసాయీ: తల్లీ! దూరంగా ఏదో లీలగా కనిపిస్తున్నది.

మీరా: కాదు కాదు మీకన్నులు ఆయన వెలుగును భరించలేక పోతున్నవి...అదుగో ఆయన వచ్చేస్తున్నాడు. నేను ఏం చేసేది స్వామీ! ఏమి చెయ్యమన్నారని? ఆయన వచ్చేదారిలో దుమ్ము అంటుకుంటుంది కాబోలు. పూవులు చల్లి రానా? వద్దు వద్దు. పమిట పరిచి వస్తాను. అర్ఘ్యానికి జలం సిద్ధం చేసుకోనా? అవసరం లేదు. హర్షాశ్రువు లున్నవి కదా! వస్తున్నాడు కదూ నామనోనాథుడు!

గోసాయీ: అవు నమ్మా! తల్లీ, ఏదో తేజోవిగ్రహం. మనవైపుకే కదలి వస్తున్నది... [తన్మయుడై] తల్లీ! [మెడలో చెయ్యి పెట్టి హారం బైటికి తీసి] ఇదిగో ఈహారం వేసి అర్పించు... [చేతికి అందిస్తాడు.]

మీరా: [చేతికి హారం తగిలేటప్పటికి స్మృతి వచ్చి] ఏమి టిది? నేను ఇందాకటినుంచీ ఏలోకంలో ఉన్నాను? ఈపూజామందిరానికి ఎలా వచ్చాను? ఇదుగో వీ రంతా గోసాయిలే... అయితే నామనోనాథుడు ఏడీ... తిరిగి వెళ్ళిపోతున్నాడు [కన్నీటిలో] వెళ్ళిపోతున్నావా నాథా! [గోసాయిని చూచి] నీవు గోస్వామివి కాదు. ప్రియునీప్రియులమధ్య అడ్డు పడేపిశాచానివి! మ్లేచ్ఛుడివి! పో! అవతలికి పో! ఇక్కడ ఉండ వద్దు!

గోసాయీ: కోపించకు తల్లి! మహానుభావులలీలలు అతిమానుషాలు. నన్ను హారం ఇవ్వమన్నట్లు సైగ చేశాడు. తాను విసుగుస్సై మొగం పట్టాడు. నాతప్పు ఏముందమ్మా?

మీరా: [తగ్గి] నిజమే! స్వామీ! నన్నే ఇల్లా అనేకమాట్లు మోసగించాను. క్షమించండి మహాత్మా! ప్రేమోన్మాదంలో ఏదో పిచ్చిగా మాట్లాడాను.

గోసాయీ: తల్లీ! నీ మనస్సు నాకు తెలుసు. చింత పడకు.

మీరా: చింతపడకుండా ఎలా ఉంటాను? [విగ్రహానికేసి చూచి] మోసగించావా నన్నిన్నాళ్ళుగా? మొలకనవ్వులతో ఈ విగ్రహం చాటున... లోపల... దాక్కుని నవ్వుతున్నావు. ఈ హారము మెడలో వేసి మళ్ళీ రమ్మని వెంట పెట్టుకుంటాను. [విగ్రహం వైపు చూస్తుంటుంది.]

[ప్రవేశము సేవకురాలు... చేతులో పూలబుట్ట... గంట కొట్టుతుంది... మీరా వెనక్కి తిరిగి] ఎవరు? గిరిజా!

గిరిజ: [వంగి నమస్కరిస్తూ] దేవీ! శ్రీ శ్రీ కుంభరాణావారు ఈనాడు గిరిధరగోపాల దేవుణ్ణి వనమాలికలతో [illegible]ట. ఈ సజ్జలో పూల మాలికలతో అలంకరించమని దేవిగారిని ప్రార్థిస్తున్నానని విన్నవించి రమ్మన్నారు.

మీరా: [ఉద్వేగంతో] గిరిజా! గిరిజా! ఏమి ఇది? సత్యమేనా? కుంభరాణా మాటలేనా ఇవి? ...ఇలా "గిరిధరగోపాల" నామం రాణా నోట ఉచ్చరించాడా... 'వనమాలికా' నీవు కల్పించినవి కావు కదా! నన్ను ఉద్దేశించి ప్రార్థిస్తున్నా నన్నాడా?

గిరిజ: [చెప్పలేక నవ్వుతూ] అ...అ...వ...ను... దే...వీ

మీరా: ఏమి టా తడబాటు?

గిరిజ: ఏమీ లేదమ్మా! అది నా సంతోషము. [సజ్జ అందిస్తుంది]

మీరా: [అందుకుంటూ] మహాత్ములారా! మీరాకవల్ల నేడు చిత్తోడు నిజంగా వైష్ణవభక్తలోకంగా మారిపోతున్నది. కుంభరాణావంటి భూతేశ శిష్యుడు గోధామదర్శనాన్ని కోరుతున్నాడు.

గోసాయీలు: జై కుంభరాణా మహారాజుకు జై!

జై కుంభరాణా మహారాజుకు జై!

మీరా: [విగ్రహాన్ని చూస్తూ] ప్రభూ! ఇదిగో వస్తున్నా. నిన్ను అలంకరిస్తా. గిరిజా! వెంటనే వెళ్ళి కుంభరాణావారిని సంకీర్తనానికి రమ్మని

దేవి పునః ప్రార్థిస్తున్నాదని చెప్పు! పో, త్వరగా పోయి విన్నవించు.

గిరిజ: చిత్తము దేవీ! [నిష్క్రమణ]

మీరా: ఈ పూలమాలికలతో అలంకరించి స్వామిని తిరిగి రమ్మని ప్రార్థిస్తాను [అని తత్తరపాటుతో గోసాయి ఇచ్చిన హారం తీసుకుంది... పెళ్లికొడుకు మూర్తి విగ్రహం కాదా అనుకొని నేలకింద పెట్టి అపురూపమైన ఉత్సాహంతో]

సమర ఎరుగనిసుమా నీకొరకే! నీకొరకే!
ఒక్క క్షణమైన యెడబాయని యుగాలలో ఓ నాథ!
విశ్వమంతా విడువ జాలిమునుగా జేసుకొని
జన్మల జన్మలలో పరమాత్మ నిలచితిని.
వెంట తోడ్పా నోయి ప్రేమలతో చిక్కుట
బాధ యుండు ఎరుగ నిక ఎలుక ప్రేమించు నుగ.
అనురాగ గాథలను ఎవరికి తెలియక చెప్పక
నిను తలచి నోచక్క చెయుగమునగా గడచితి

నాథా! ఇంతటిదైనా దయరాదా! ఈ దీనురాలి ప్రేమను గుర్తించి ఒక్కమాటు నీ ఆనందమూర్తిని చూపించరాదా! అయ్యో! ఎన్నియుగాలైనా నాథా నాథా! నా ఈ మీరా ఈ విరహవేదన భాగ్యానికి ఇంతటిమైనా గాక కృశించి కృశించి నశించిన వెనుకనా? వచ్చి ఏమి ప్రయోజనము? ఆ ఆ!

[సొమ్మసిల్లి నేలమీదికి ఒరుగుతుంది]

గోసాయీలు: [కలకలము]

ఒక గోసాయి: నిశ్శబ్దము. ఆగండాగండి... స్తుతిగాని మహాభక్తురాలు భక్తితన్మయత్వంలో మూర్ఛపోయింది... లేపవద్దు ... చప్పుడు చెయ్యవద్దు... భయపడకండి.

మరొక గోసాయి: మూర్ఛ వచ్చిందయ్యా, మూర్ఛపోయిందే.

మరొక గోసాయి: ఇస్! నిశ్శబ్దం.

మీరా: [నెమ్మదిగా తెప్పరిల్లుకొని లేస్తుంటుంది]

గోసాయీలు: జై మీరా మాయికీ జై!

జై మీరా మాయికీ జై!

మీరా: [విభ్రాంతితో] నేనా పతివ్రతా! ఎన్నాళ్ళైనా సంసారాలు లేకుండా వియోగంతో... ఇన్ [ఆలోచన అభినయించి] ఏమి తప్పు చేశాను... [దృష్టి రాణా పంపిన సజ్జమీద ఉంచి] అవును... నిజమే... తెలిసింది. తప్పు చేశాను. రాణా ప్రభుభక్తురాలైనాను... రాణా ఆజ్ఞను ధిక్కరించాను. మొదట గోసాయి ఇచ్చిన హారంతో నాథుణ్ణి అర్చించాను... అయ్యో, ఎంత తప్పిదం చేశాను... ప్రభో, క్షమించు. త్వరగా నీ ముందుకే వేసి కళ్ళార చూచి ఆనందిస్తాను. [సజ్జ దగ్గరకు తీసుకొన్ని తెరువటానికి చెయ్యి పోనిస్తుంటుంది. చివరికి నాలుగు అడుగులు ముందుకు వేసి ఆగిపోతారు]

విరజ: [గబ గబా కొడుతూ ప్రవేశించి ఆతురతతో] అమ్మా! అమ్మా! ముట్టుకోకు... ముట్టుకోకు... విషనాగు! విషనాగు! అవి పుష్పమాలికలు కావు! సర్పాగ్ని జ్వాలామాలికలు! రాణా కిరాతకుడు అన్న సంగతి మరచిపోయినావా తల్లీ!

మీరా: [ఆశ్చర్యచకితురాలై] విరజా! ఏమి తొందరగా?

విరజ: తొందర ఏమిటి తల్లీ! నిముషము ఆలస్యమైనాతే కాటులు అంటుకో పొయ్యేవి.

మీరా: ఏమిటి!

విరజ: అమ్మా! ఇందాకటినుంచీ తమ చేతుల్లో హార మేదో ఉన్నదటగా

మీరా: అదిగో! నా స్వామిని దానితో అర్చించాను... అయితే—

విరజ: దాన్ని రాణా ఎక్కడినుంచో మీ చేతులలో ఉండేటట్టు చూచాడు.

మీరా: అయితే దాంట్లో తప్పేముంది. ఈ గోసాయీ నాకిచ్చారు [అని చూస్తే గోసాయీలు కనిపించరు ఆశ్చర్య పడి] ఆఁ!

విరజ: ఆరి ఢిల్లీ చక్రవర్తి అక్బరు పాదుషాను కానుకగా ఇచ్చాడట! రాణా మిమ్మల్ని అనుమానించి... [సర్పాల పెట్టె చూపుతుంది]

మీరా: మహాగాయకుని తాన్సేనును వెంట పాదుషా ఒకనాటి సంకీర్తనలో గానామృతాన్ని పవిత్రించెయ్య మనోహరి రమ్మని పంపించాడు. నేను ఆ గిరిధరుని లీలన... పాదుషా సంకీర్తన వినడానికి గోసాయీ వేషంతో ఏ సమాదరం విడిచి వచ్చాడు... అబ్బా, ఎంత భక్తుడు... ఎక్కువ సేపు ఉండేటట్టు పడతానని కానోలు వెళ్ళిపోయినాడు... విరజ! నీమాటలు నమ్మమనా? అవి సర్పములేనా?

విరజ: తల్లీ! నీ కనుమానమైతే మొదట నన్ను తియ్యనిచ్చి చచ్చిపోని...

మీరా: ఏమైనా సరే! నా ప్రియుడు నన్ను పరీక్షిస్తున్నాడు. ఇదంతా ఏమిటో నాకు అర్థం కానటువు లేదు... ఈ విచిత్రపరపరీక్షలో నేనెందుకు వెనకపడిపోతాను? వడను ముమ్మాటికీ పడను. అవి సర్పమాలికలైనా సరే ప్రభుని అలంకరించక తప్పదు... [కొద్దిగా ఒణుకుతో చెయ్యి పెట్టెకము దగ్గిరకి పోనిస్తూ]

జయ జయ జయ జయ గిరిధర గోపాలా!

జయ జయ జయ జయ గిరిధర గోపాలా!

[అంటూ నెమ్మదిగా మూత ఎత్తుతుంది... అందులో పూలమాలికలు కిలకిలా నవ్వుతవి. మీరా విరజ మొగం చూస్తుంది. ఆమె ఖిన్నవదనంలో తల వంచుకుంటుంది. పూలహారాలతో విగ్రహాన్ని అలకరించి గోసాయీలు మీరా సంతోషాధిక్యంలో కొద్దిసేపు

జయ జయ గిరిధర గోపాలా జయ జయ గిరిధర గోపాలా

[అని సంకీర్తన చేస్తారు. తిరువాత నిశ్శబ్దము]

మీరా: ప్రభూ! పూలచెండ్లలో కులుకటమేనా? పూవోడిని మరిచి పోయినావా? ఇప్పుడైనా రావా? నాథా! నోట మాటే రాదుగదా! మూగి

పాడవా? కానీ! మురళీమోహనమూర్తివే! నాయింకష్టాలను ఎప్పటికి ఈడేరుస్తావో కదా! ఈజగత్తుతో నాకు ఏ సంబంధమూ లేదు. ఇంక అసలే వద్దు తల్లీ, తండ్రి, రాణా అందరూ నాకు కాని వాళ్లే... నిన్ను సేవిస్తే ఏమో తప్పుపనులు దని ఉద్ఘోషించారే మహాత్ములు!... ఏమి వచ్చింది నాకు...వచ్చింది...ఆఁ ఏమిటది! ఎట్టి వేదన... విస్మృతి వస్తుంది, నీరూపాన్నే స్మరిస్తూ, పలవరిస్తూ ఉన్న దాసిమీద ఇంతనిర్దయా ప్రభూ! నీనామస్మరణకు శిలలు ద్రవిస్తున్నాయే... నీహృదయ మింత పాషాణమే మరి? మెరపు మెరసినట్లు కనబడి తప్పించుకోని నాకే! నాథా! గోధామంలో నీవూ నేనూ ఒక సెజ్జమీద ఉన్నట్లు కలలు కన్నాను నాథా! అవి ఎప్పటికైనా ఫలించేనా? ఎన్నాళ్ళకైనా... ఊహాసౌందర్యామృత పానమేనా మీ అధరామృతపానం నాకు లభించదా?

రాణా: [చేతిలో పాత్రతో ప్రవేశించి వికృత కంఠంతో]: ప్రేయసీ! మీరా! నీపరిపూర్ణానురాగానికి మెచ్చుకున్నాను. ఇదిగో... అమృతపానం చెయ్యి... [విషపాత్రిక అందిస్తాడు]

మీరా: నాథా...నాథా...గోధామమునుంచి వచ్చావా... ఎటునుంచి వచ్చావు... అమృతమా ... నాకోసమా ప్రభూ... ఏది? ఏది? [విష పాత్రను అందుకోబోతూ]

దాసిమీరా పైన దయ కలిగెనా నేడు
అమృతపాత్రిక నీయ వరుదెంచినావా!
ఓ నాథ, ఓ నాథ!
నాకిదే నోయి నే నాలసింపగ నేల?
అమృతపాత్రిక నిమ్ము, ఆరగించెద నోయి!
నీవె నేనై నాథ! నేనె నీవై నాథ!
మీరాకు జన్మమిక మిథ్య కాదేనా నాథ
ఓ నాథ, ఓ నాథ!

[అని అందుకొని గుటగుటా తాగి] అబ్బ...హాఁ హాఁ... [నెమ్మదిగా నేల మీదికి ఒరుగుతుంది]

వనజ: [పరుగెత్తుకుంటూ ప్రవేశించి] అమ్మా! అమ్మా! అవ్వాయ్ తాగ కూడా! నేను పరుగెత్తుకుంటూ వచ్చేలోపలనే ఎంతపని జరిగింది! అది కాల కూటవిషము తల్లీ... [రాణా వైపు చూచి, చకితయై] ప్రభువే స్వయంగా వచ్చి ఇచ్చారా! అయ్యో! అయ్యో! [అని పక్కకు తొలగి ముఖము ఎదుటికి వచ్చి నిలబడుతుంది]

రాణా: [మీరా తల వైపుకు వచ్చి నిలువబడతాడు]

ఒక గోసాయి: [ఆగ్రహుడై] రాణా! మహాభక్తురాలికి విష మిచ్చి పాత కానికి ఒడి కట్టావు!

మీరా: [నెమ్మదిగా లేస్తూ] నా నాథుడు నేనూ ఇద్దరమూ ఇప్పుడు ఇక్కడనే మాట్లాడుతుంటిమే! ఆయన ఏమైనాడు? ఎక్కడికి పోయినాడు? బృందకు పోవాలన్నాడు వెళ్ళాడా!
[పరికించి] ఎవరిది? గోస్వామి! ఇ దెవరు? రాణా!

రాణా: [గద్గదకంఠంతో] దే...వీ!

మీరా: [నిశ్చేష్టురాలై] రాణా!

రాణా: దేవీ! నీభక్తి ఇంత మహత్తర మైన దని ఎరుగక అనుమానించి బాధపెట్టిన వాణ్ణి.

మీరా: కాదు, కాదు. పరమాత్మస్వరూపుని మనోనాథుని చూపించిన పుణ్యాత్ముడవు.

రాణా: క్షమాపణ అర్థిస్తున్నాను దేవీ! నిన్ను ఎన్నో బాధలు పెట్టాను [మోకరిల్ల బోతాడు]

మీరా: కాదు, కాదు. [అని వారిస్తూ తానే మరీ వంగి నమస్కరించి] పొరబాటు, రాణా! నీమూలకంగా ప్రభువు నన్ను పరీక్ష చేశాడు నీలోపము ఇక్కడ ఏమీ లేదు.

రాణా: దేవీ! మహారాజునన్నే భ్రాంతిలో ముత్తెక్కి-ననా కేదైనా తరణోపాయం చూపించి అనుగ్రహించమని ప్రార్థన!

మీరా: గురుజ్ఞానము తప్ప వేరే మార్గము ఏమీ లేదు. వెళ్ళి వస్తాను నాకు సెలవివ్వండి.

రాణా: దేవీ! ఎక్కడికి?

మీరా: ఎక్కడి కేమిటి? బృందకు. నా ప్రభువు బృందలో ఉంటాడు. పోయి ఆయన్ను కలుసుకోవాలి ఇక నాకు అమృతత్వం తప్ప వేరే లోక యాత్ర లేదు.

రాణా: [నిశ్చేష్టుడై నిలబడతాడు.]

మీరా: బృంద బృంద బృంద భక్తలోక మందారమా బృంద
బృంద బృంద బృంద సాధులోక చంద్రికయే బృంద

[గోపాయీలు ఆమెను పాటలో అనుసరిస్తారు. రాణా కనుచూపుమేర వరకూ వంగి నిలుస్తాడు.]